సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 217

శనివారం 28-10-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'బీడుబడిన తెలంగాణ భూముల్లో జలయజ్ఞంతో ఆనందపు సిరులు పండాలి'



ఉత్కంఠను దాటి...

పాకిస్తాన్‌పై ఒక వికెట్ తేడాతో గెలిచిన దక్షిణాఫ్రికా. -15లో



ముకేశ్ వారసులకు గ్రీన్‌సిగ్నల్

ఆర్ఐఎల్‌లో పదవులు చేపట్టేందుకు వాటాదారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు -15లో



కాలం చెల్లిన ఫోన్.. కాంగ్రెస్

2014 అనేది కేవలం ఒక తేదీ కాదని, దేశంలో అదొక పెనుమార్పు అని మోదీ అన్నారు. కాంగ్రెస్‌ను కాలం చెల్లిన ఫోన్‌గా అభివర్ణించారు.

- వివరాలు 6లో



పశ్చిమబెంగాల్ మంత్రి అరెస్టు

రేషన్ సరుకుల కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో మంత్రి, టీఎంసీ నేత జ్యోతిప్రియో మల్లిక్‌ను ఈడీ అరెస్టు చేసింది.

- వివరాలు 6లో



భారత దళాలు వైదొలగాలి

మాల్దీవుల నుంచి భారత సైనిక దళాలు వైదొలగాలని ఆ దేశాధ్యక్షునిగా ఎన్నికైన మహమ్మద్ ముయిజ్జు స్పష్టం చేశారు.

- వివరాలు 6లో



గాజాలో నరకయాతన

ఉత్తర గాజాపై ఇజ్రాయెల్ సైన్యం భూతల దాడులు రెండో రోజూ కొనసాగాయి. హమాస్ స్థావరాలు ధ్వంసం అయ్యాయి.

- వివరాలు 6లో

కాంగ్రెస్ రెండో జాబితా

45 క్లియర్

- సుదీర్ఘ కసరత్తు తర్వాత ఏఐసీసీ ప్రకటన
- పాలేరు నుంచి పొంగులేటి, ఖమ్మం నుంచి తుమ్మల, మునుగోడు బరిలో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి
- కంటోన్మెంట్‌లో గద్దర్ కుమార్తె వెన్నెల
- సీపీఐకి 2 సీట్లు..! సీపీఎంకు ఇచ్చే 2 సీట్లపైనా స్పష్టత
- మిగతా స్థానాలపై ఖర్గేదే తుది నిర్ణయం
- ఈ నెలాఖరుకు చివరి జాబితా!



సాక్షి, న్యూఢిల్లీ: విస్తృత సమాలోచనలు..ఎడతెగని సంప్రదింపులు..తర్జనభర్జన అనంతరం తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల రెండో జాబితాను కాంగ్రెస్ శుక్రవారం రాత్రి విడుదల చేసింది. 45 మందికి టికెట్లు కేటాయించింది. అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్న పాలేరు నియోజకవర్గం నుంచి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఖమ్మం నుంచి తుమ్మల నాగేశ్వర్‌రావు, మునుగోడు నియోజకవర్గం నుంచి గురువారం నాడే కాంగ్రెస్‌లో చేరిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అభ్యర్థిత్వాలను ఖరారు చేసింది. కంటోన్మెంట్‌లో గద్దర్ కుమార్తె వెన్నెలకు

మిగతా 3వ పేజీలో ▶

నమ్మితే అమ్మేస్తరు..

పొరపాటున కాంగ్రెస్ గెలిస్తే ఆగమాగమే

పాలేరు, మహబూబాబాద్, వర్ధన్నపేట ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్

- ఉత్తమ్, రేవంత్‌రెడ్డిల మాటలు చూస్తే అంతా అర్థమవుతోంది..
- రైతుబంధుకు రాంరాం.. దళితబంధుకు జైభీం అంటరు
- ఎన్నికల తర్వాత సాదాబైనామాల రిజిస్ట్రేషన్లకు అనుమతిస్తాం
- గత పదేళ్ల అభివృద్ధిపై ఇంటింటా చర్చ జరగాలి
- పార్టీలు మారేవారిని, డబ్బు మదంతో వచ్చేవారిని ఓడించాలి.. ఆలోచించి ఓటు వేయాలని పిలుపు



పాలేరు సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

> మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మిత్రుడని చేరదీస్తే ఖమ్మం జిల్లాలో ఒక్క సీటు రాకుండా చేశారు. ఇంట్లో కూర్చున్న వ్యక్తిని మంత్రిని చేశాం. కానీ మోసం చేశారు. కొందరు అనేక రకాలుగా పార్టీలు మారుతారు. వారి పదవుల కోసం, అవకాశాల కోసం పార్టీలు మారి.. మాట మార్చేవారు మన మధ్యలో ఉన్నారు. అందుకే ఏ పార్టీ, ఏ ప్రభుత్వం ఏం చేసింది? ప్రజల కోసం ఏం ఆలోచించింది అని ఆలోచించి ఓటు వేయాలి.

సాక్షి ప్రతినిధి, ఖమ్మం/సాక్షి ప్రతినిధి, వరంగల్/సాక్షి, మహబూబాబాద్: ఇరవై నాలుగేళ్ల కింద తెలంగాణ కోసం బయలుదేరినప్పుడు ఎన్నో అవమానాలు, అవహేళనలను ఎదుర్కొన్నామని.. కాంగ్రెస్ పార్టీ 14 ఏళ్ల పాత్తు పెట్టుకుని మోసం చేసిందని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. చావునోట్లో తలపెట్టి పోరాడితే, దేశ రాజకీయ వ్యవస్థ మొత్తం తలొంచి తెలంగాణ ఇవ్వకుండా ఉండలేని పరిస్థితి సృష్టిస్తే తెలంగాణ వచ్చిందని చెప్పారు. కాంగ్రెస్ వాళ్లు మళ్లీ మోసం చేయడానికి వస్తున్నారని, వారిని నమ్మితే అమ్మేస్తారని ఆరోపించారు. పొరపాటున కాంగ్రెస్ గెలిస్తే.. అంతా ఆగమాగం అవుతుందని, రైతుబంధుకు రాంరాం చెప్పి, ధరణిని దళారుల చేతిలో పెడతారని ఆరోపించారు. గత పదేళ్ల అభివృద్ధిని చూసి, ఆలోచించి ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఖమ్మంజిల్లా జీళ్లచెరువులో పాలేరు నియోజకవర్గ సభ, మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో, వరంగల్ నగరం భట్టుపల్లిలో వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''24 గంటల కరెంటు అవసరం లేదని, మూడు గంటలు చాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, రైతుబంధు వృథా అని మాజీ అధ్యక్షుడు ఉత్తమ్ అర్థంపర్థం లేకుండా మాట్లాడుతున్నారు. రైతుబంధు దుబారానా? రైతుబంధు వద్దా? మూడు గంటలు కరెంటు ఇస్తే ఎన్ని ఎకరాలు పారుతుంది? రైతులు మళ్లీ టార్చిలైట్లు పట్టుకుని పొలం దగ్గర పడుకోవాలా? రైతుబీమా వేస్ట్, కరెంట్ 24 గంటలు ఇవ్వొద్దు.. మనం మాత్రం హైదరాబాద్‌లో ఏసీలలో ఉండాలి. ఇది కాంగ్రెస్ వాళ్ల నీతి. ప్రజలకు రైతుబంధు ఇవ్వొద్దు. మనమే పంచుకు తినాలన్నట్టు వాళ్ల తీరు ఉంది. పొరపాటున కాంగ్రెస్ గెలిస్తే.. రైతుబంధుకు రాంరాం, దళితబంధుకు జైభీం అన్నట్టే. కరెంట్ కాటగలుస్తది. ప్రజల అభివృద్ధి, సంక్షేమం పట్టని వారికి

మిగతా 2వ పేజీలో ▶

మేమొస్తే బీసీ సీఎం

సూర్యాపేట జనగర్జన సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటన

బీఆర్ఎస్ గెలిస్తే ఈసారైనా దళితుడిని సీఎం చేస్తావా? అని కేసీఆర్‌కు సవాల్

- బీసీల కోసం ఏటా రూ.10 వేల కోట్లతో చేపడతామన్న ప్రత్యేక కార్యక్రమాలేవి?
- బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ బీసీ, దళిత వ్యతిరేక పార్టీలే.. కుటుంబ పాలనను ప్రోత్సహిస్తున్నవే..
- కేంద్రం తెలంగాణ అభివృద్ధి కోసం లక్షల కోట్లు కేటాయించింది..
- బీఆర్ఎస్‌ను గద్దె దింపి, బీజేపీని గెలిపించాలని పిలుపు

> జనవరి 22న ప్రధాని మోదీ రాముడు జన్మించిన అయోధ్య రామ మందిరంలో తొలిపూజ చేయనున్నారు. ఈ బృహత్తర కార్యానికి సూర్యాపేట జిల్లా ప్రజలంతా రావాలి.. జిల్లా పరిధిలో బీజేపీ తరఫున సూర్యాపేటలో సంకినేని వెంకటేశ్వర్ రావు, తుంగతుర్తిలో కడియం రామచంద్రయ్య, భువనగిరిలో గూడూరు నారాయణరెడ్డి, నాగార్జునసాగర్‌లో నివేదితారెడ్డిలను గెలిపించాలి.



సూర్యాపేట సభలో ప్రసంగిస్తున్న అమిత్ షా

సాక్షి ప్రతినిధి, నల్లగొండ/ సూర్యాపేట: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. బీఆర్ఎస్‌ను గద్దె దించి, బీజేపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఏర్పడితే దళితుడిని సీఎం చేస్తానని చెప్పిన కేసీఆర్ అధికారంలోకి వచ్చాక మోసం చేశారని మండిపడ్డారు. ఒకవేళ ఈసారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే ఈసారైనా దళితుడిని సీఎం చేస్తావా చెప్పాలని కేసీఆర్‌ను సవాల్ చేశారు. కేసీఆర్‌కు తన కొడుకు కేటీఆర్‌ను సీఎం చేయడం లక్ష్యమైతే.. కాంగ్రెస్ లక్ష్యం రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమని.. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ బీసీ, దళిత వ్యతిరేక పార్టీలేనని విమర్శించారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన జనగర్జన సభలో అమిత్‌షా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రసంగం వివరాలు ఆయన మాటల్లోనే..

''బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలు కూడా కుటుంబ సంక్షేమం కోసం పనిచేస్తుంటే ప్రధాని మోదీ నాయకత్వంలోని బీజేపీ దేశంలో, రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పాటుపడుతోంది. సీఎం కేసీఆర్ దళితులకు ఇస్తామన్న మూడెకరాల భూమి హామీ ఎక్కడికి పోయింది? దళితుల ప్రత్యేక అభివృద్ధి, సంక్షేమం కోసం రూ.50 వేల కోట్లతో పెడతానన్న ప్రత్యేక బడ్జెట్ హామీ ఏమైంది? బీసీల సంక్షేమం కోసం రూ.10వేల కోట్లతో ఏటా ప్రత్యేక కార్యక్రమాలు చేపడతానని చెప్పిన కేసీఆర్ ఏం చేశారు?

రాష్ట్రానికి అండగా కేంద్ర సర్కారు

ప్రధాని మోదీ దేశంలో మొదటిసారిగా బీసీ కమిషన్ ఏర్పాటు చేయడమే గాక అన్ని అధికారాలూ ఇచ్చారు. గిరిజనుల సంక్షేమానికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇందులో భాగంగానే తెలంగాణలో కేంద్ర ప్రభుత్వం గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసింది. దానికి సమ్మక్క, సారక్క యూనివర్సిటీగా

మిగతా 2వ పేజీలో ▶

'ఒకే ఒక్కడు'తో బీజేపీ రెండో జాబితా

మహబూబ్‌నగర్ అభ్యర్థిగా ఏపీ మిథున్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: ఒకే ఒక్క అభ్యర్థి పేరుతో బీజేపీ శుక్రవారం రెండో జాబితా విడుదల చేసింది. మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి కుమారుడు ఏపీ మిథున్ రెడ్డి పేరును ఆ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ ఖరారు చేసింది. ఈ మేరకు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు మిథున్‌రెడ్డితో కలిపి ఇప్పటివరకు 53 మంది అభ్యర్థులను బీజేపీ ప్రకటించింది. ఈ నెల 22న 52 మందితో తొలి జాబితా విడుదల చేసిన సంగతి తెలిసిందే. కాగా నవంబర్ 1 వ తేదీన ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో భేటీ కానున్న బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ, మిగతా స్థానాలకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయనున్నట్టు సమాచారం.

గ్రేటర్ రిజల్ట్స్.. ఓటర్ ఇస్తారా?

ఆటా.. పాట.. అండాదండ

'మిజో జాతీయవాదం' గట్టెక్కించేనా?

- వివరాలు 7,8లో

తల ఎత్తుకునేలా పనిచేశా: కేటీఆర్

- మంత్రిగా, ఎమ్మెల్యేగా అభివృద్ధి కోసం పాటుపడ్డా..
- సిరిసిల్ల యువ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి
- 55 ఏళ్లు అధికారంలో ఉన్నా ఏమీ చేయని సన్నాసులు కాంగ్రెస్ వాళ్లు
- ప్రతిపక్షాల్లో విజన్ ఉన్న నాయకుడు ఒక్కరూ లేరు

- వివరాలు 5లో

అధికార బీఆర్ఎస్‌పై అన్నిచోట్లా వ్యతిరేకత

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి
- మాఫియా చేతిలో తెలంగాణ బందీ
- రాజకీయాలపై రాహుల్‌కు అవగాహన లేదు
- బీజేపీలో చేరిన కేఎస్ రత్నం, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

- వివరాలు 2లో

క్లుప్తంగా...

రాష్ట్రానికి అవినీతి చీడ పట్టింది

ఓటర్ల చైతన్యయాత్ర ప్రారంభ కార్యక్రమంలో జస్టిస్ చంద్రకుమార్



పంజగుట్ట: తెలంగాణకు అవినీతి చీడపురుగు పట్టిందని, దానిని మట్టుపెడితేనే ప్రజల సొమ్ము పేదలకు సక్రమంగా అందుతుందని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. జాగో తెలంగాణ, తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామ్య వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన ఓటర్ల చైతన్య బస్సుయాత్ర శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ వద్ద మొదలైంది. కార్యక్రమానికి జస్టిస్ చంద్రకుమార్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, ప్రొఫెసర్ వినాయక్‌రెడ్డి, ప్రొఫెసర్ పద్మజా షా, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ హాజరై జెండా ఊపి ప్రారంభించారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ హిందూ, ముస్లిం, క్రైస్తవ సోదరుల మధ్య ఐక్యతను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్న రాజకీయపార్టీలను భూస్థాపితం చెయ్యాలని పిలుపునిచ్చారు. ఆకునూరి మురళి మాట్లాడుతూ బస్సుయాత్ర 42 నియోజకవర్గాల గుండా నవంబర్ 28 వరకు కొనసాగుతుందన్నారు.

బీజేపీకి నిర్మల్ జిల్లా అధ్యక్షురాలు రాజీనామా

బీఆర్ఎస్‌లో చేరిక



భైంసాటౌన్: నిర్మల్ జిల్లా బీజేపీ అధ్యక్షురాలు పి.రమాదేవి ఆ పార్టీకి రాజీనామా చేశారు. పదేళ్లుగా పార్టీ బలోపేతం కోసం కృషి చేసిన తనను కాదని, గత ఎన్నికల్లో మూడోస్థానంలో నిలిచిన రామారావుపటేల్‌కు టికెట్ కేటాయించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. భైంసాలోని తన నివాసంలో శుక్రవారం పార్టీ మండలాధ్యక్షులు, కార్యకర్తలతో సమావేశమై ఆమె రాజీనామాను ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ... అభ్యర్థుల జాబితా ప్రకటనకు గంట ముందు వరకు ఉన్న పేరును తొలగించి, వేరేవారికి ఇవ్వడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ముధోల్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పురాణం సతీష్‌కుమార్, ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ శుక్రవారం రాత్రి రమాదేవిని ఆమె నివాసంలో కలిశారు. పార్టీలోకి రావాలని ఆహ్వానించగా ఆమె అందుకు అంగీకరించారు.

'పోటీ ఉంటుందో.. లేదో తేల్చండి'

సాక్షి, హైదరాబాద్: వచ్చే తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పోటీ చేస్తుందో, లేదో త్వరగా తేల్చాలని టీటీడీపీ నేతలు కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం మంగళగిరిలో జాతీయ నాయకత్వాన్ని కలిశారు. పార్టీ జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు నేతృత్వంలోని ప్రతినిధుల బృందం మంగళగిరికి వెళ్లి ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, ఏపీ టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్సీ అశోక్‌బాబులను కలిసింది. తమ విజ్ఞప్తిని పార్టీ అధినేత చంద్రబాబు నాయుడి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారని తెలంగాణ టీడీపీ నేతలు వెల్లడించారు.

రూ.4.55 కోట్ల బంగారం పట్టివేత

హైదరాబాద్‌లో రూ.2.56 కోట్ల నగదు సీజ్

జహీరాబాద్/సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సరిహద్దులో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న బంగారాన్ని పట్టుకున్నట్లు చిరాగ్‌పల్లి ఎస్ఐ నరేష్ తెలిపారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం మాడ్గి గ్రామ శివారులో 65వ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సరిహద్దు చెక్ పోస్టు వద్ద కేంద్ర బలగాలతో కలిసి పోలీసులు తనిఖీలు చేపట్టారు. గుజరాత్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న స్కార్పియో వాహనంలో 6,986 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.4.55 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. మరోవైపు, హైదరాబాద్‌లో శుక్రవారం చేసిన తనిఖీల్లో రూ. 2,56,84,671 నగదును సీజ్ చేసినట్లు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ ఒక ప్రకటనలో తెలిపారు.





మహబూబాబాద్‌లో శుక్రవారం జరిగిన బహిరంగసభకు హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు



వరంగల్‌లో శుక్రవారం జరిగిన సభకు భారీగా హాజరైన ప్రజలు

నమ్మితే అమ్మేస్తరు..

▶ మొదటి పేజీ తరువాయి

ఓట్లేస్తే మన పరిస్థితి వైకుంఠపాళి ఆటలో పెద్ద పాము మింగినట్టే. మళ్లీ కథ మొదటికి వస్తది. ఏ గతి కావాలో ప్రజలు ఆలోచించి నిర్ణయించుకోవాలి. ధరణిని రద్దు చేసి మళ్లీ దళారులను తేవాలని చూస్తున్న కాంగ్రెస్ పార్టీని, ఆ పార్టీ నాయకులను వచ్చే ఎన్నికల్లో బంగాళాఖాతంలో కలపాలి.

దేశం హర్షించేలా తెలంగాణ పథకాలు

ఒక రైతుగా నాకు వ్యవసాయం బాధలు తెలుసు కాబట్టే రైతుల సమస్యలు తొలగించే పనులు చేస్తున్నా. దేశ ప్రధాని మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో కూడా 24 గంటల ఉచిత కరెంట్ ఇవ్వడం లేదు. కాంగ్రెస్ పాలించే కర్ణాటకలో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా కాక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ధర్నాలు చేస్తున్నారు. అదే రాష్ట్రంలో రైతులు బాగుండటం వల్ల దేశంలోనే అత్యధికంగా వరి పండించే పంజాబ్ తర్వాత నంబర్ 2 స్థానానికి వెళ్లింది. నిండుగా పంటలు పండి తండాలు, గిరిజన గూడేలు ధనలక్ష్మి, ధాన్యలక్ష్మితో కళకళలాడుతున్నాయి.

ప్రజల సొత్తు ప్రజలకే పంచుతాం

నీతి నిజాయతీతో, చిత్తశుద్ధితో ప్రజల కోసం కుల మత భేదాలు చూపకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. గతంలో రూ.70, రూ.200గా ఉన్న పెన్షన్లను రూ.2 వేలకు పెంచుకున్నాం. మళ్లీ గెలిచాక రూ.3 వేలు చేసి.. తర్వాత దశలవారీగా రూ.5వేలకు తీసుకెళ్తాం. తెలంగాణ సంపద పెరిగినకొద్దీ, ఆర్థికంగా బలోపేతం అవుతున్న కొద్దీ.. ప్రజల సొత్తును ప్రజలకే పంచుతాం. రైతుబంధు సొమ్మును పెంచుతాం. రైతుబీమా తరహాలోనే 93 లక్షల పేద కుటుంబాలకు కేసీఆర్ బీమాను అమలు చేస్తాం. వచ్చే మార్చి నుంచి రేషన్‌పై సన్నబియ్యం సరఫరా చేస్తాం. అర్హులైన పేద మహిళలకు నెలకు రూ.3వేలు అందిస్తాం. ప్రజలపై భారం పడకూడదని రూ.400కే గ్యాస్ సిలిండర్ అందించాలని నిర్ణయించాం. ఎన్నికల తర్వాత సాదాబైనామాల రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇస్తాం. ఇవన్నీ జరగాలంటే బీఆర్ఎస్ కచ్చితంగా గెలవాలి. తెలంగాణ రాక ముందు పరిస్థితి ఏమిటి? వచ్చాక ఏమిటన్న చర్చ ప్రతీ ఇంటిలో జరగాలి. పదేళ్లలో చేసిన అభివృద్ధిని చూడాలి.

గిరిజనులంటే కాంగ్రెస్‌కు చులకన

బెల్లయ్యనాయక్‌కు టికెట్ రావాలని లంబాడీ హక్కుల పోరాట సమితి వాళ్లు పోరాటం చేస్తే.. 'వాళ్లదేముందయ్యా.. రూ.వెయ్యి చేతిలో పెట్టి, ఇంత గుడుంబా పోస్తే వాళ్లే ఓట్లు వేస్తార'ంటూ పీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతున్నారు. ఇదేనా గిరిజనులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చే మర్యాద? ఇంత అహంకారంతో మాట్లాడే పార్టీ. రేపు ఎవరికి న్యాయం చేస్తుంది?" అని కేసీఆర్ నిలదీశారు. ఈ సభల్లో ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, పసునూరి దయాకర్, మాలోత్ కవిత, ఎమ్మెల్సీలు బండా ప్రకాశ్, మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్, కడియం శ్రీహరి, బస్వరాజు సారయ్య, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, తాతా మధు, ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, నరేందర్, రెడ్యానాయక్, కందాల ఉపేందర్‌రెడ్డి, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధును యూఎన్‌ఓ కూడా మెచ్చుకుంది

తెలంగాణ పథకాలు ఇవాళ దేశానికి ఆదర్శంగా నిలిచాయి. ఎక్కడెక్కడి నుంచో మన రాష్ట్రానికి వచ్చి చూసి వెళ్తున్నారు. రైతుబంధు పదాన్ని పుట్టించిందే కేసీఆర్. అంతకు ముందు రైతులను పట్టించుకున్న వారే లేరు. ఈ పథకాన్ని ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ ప్రశంసించారు. శభాష్ చంద్రశేఖర్ బాగా చేశారంటూ కితాబిచ్చారు. ఐక్యరాజ్యసమితి (యూఎన్ఓ) కూడా రైతుబంధు వంటి ప్రపంచంలో ఎక్కడా లేదు. తెలంగాణ ప్రభుత్వం బాగా చేసిందని కితాబిచ్చింది.

చెక్‌పోస్టు వద్ద ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలి

- అధికారులు నిష్పక్షపాతంగా పని చేయాలి
- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ నిర్దేశం
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్ష



సమావేశంలో వికాస్ రాజ్ తదితరులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఎన్నికల విధుల్లో అధికారులు నిష్పక్షపాతంగా పని చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ నిర్దేశించారు. ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్, వీడియో సర్వైలెన్స్, అకౌంటింగ్ టీమ్ అధికారులు జాగ్రత్తగా పర్యవేక్షించాలని చెప్పారు. శుక్రవారం ఆయన అడిషనల్ డీజీపీ సంజయ్‌కుమార్‌జైన్‌తో కలసి మంచిర్యాల జిల్లా కలెక్టరేట్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, అదనపు కలెక్టర్లు, పది నియోజకవర్గాల ఆర్వోలు, నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ చెక్‌పోస్టుల వద్ద నగదు, మద్యం తరలించకుండా ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని ఆదేశించారు. సరైన ఆధారాలు లేకపోతే సీజ్ చేసి అధికారులకు అప్పగించాలని ఆదేశించారు. అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియలో రిటర్నింగ్ ఆఫీసర్లు జాగ్రత్తగా ఉండాలని, నామినేషన్లు సరిగా దాఖలు చేయకపోతే అభ్యర్థులకు రాతపూర్వకంగా సమాచారం ఇవ్వాలని సూచించారు. కంప్యూటరైజేషన్, సైబర్ సెక్యూరిటీ, వెబ్ కాస్టింగ్, శాంతి భద్రతల నిర్వహణ, మోడల్ కోడ్ అమలు, ఖర్చుల పర్యవేక్షణ.. ఇలా ప్రతీ దాన్ని నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ పని చేయాలని, పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మూత్రశాలల సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో కమ్యూనికేషన్ సెంటర్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ నెల 30 వరకు 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరు కార్డు పొందేలా చూడాలన్నారు. అంతకుముందు 'నేను కచ్చితంగా ఓటేస్తాను'లో భాగంగా అధికారులతో కలసి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఈ సమీక్షలో ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీం, మంచిర్యాల జిల్లాల కలెక్టర్లు రాహుల్‌రాజ్, ఆశిష్ సంగ్వాన్, హేమంత్ బోర్కడే, బి.సంతోష్, రామగుండం సీపీ రెమా రాజేశ్వరీ పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలుకు 181 కేంద్రాలు

- మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు
- మద్దతు ధరకు మొక్కజొన్న కొంటామని రైతులకు భరోసా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వానాకాలంలో పండిన మొక్కజొన్నను కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మార్క్‌ఫెడ్ ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. దీంతో మొక్కజొన్నను రైతుల నుంచి సేకరించేందుకు 181 కొనుగోలు కేంద్రాలు తెరవనుంది. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే 20 కేంద్రాలను మార్క్‌ఫెడ్ ఏర్పాటు చేసింది. రైతులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) అందజేయడమే లక్ష్యంగా క్వింటాకు రూ. 2,090కు మొక్కజొన్నను మార్క్‌ఫెడ్ కొనుగోలు చేస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో ఎంఎస్‌పీ కంటే అధికంగానే ధర పలుకుతోందని అధికారులు చెబుతున్నారు. అధికారుల అంచనా ప్రకారం నాణ్యతను బట్టి రూ. 2 వేల నుంచి రూ. 2,200 వరకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఎంఎస్పీ కంటే తక్కువ ధర మార్కెట్లో ఉంటే రైతులు తమ కేంద్రాలకు వచ్చి అమ్ముకుంటారని అధికారులు చెబుతున్నారు. తాము మాత్రం మద్దతు ధరకు మొక్కజొన్న కొనుగోలు చేస్తామని రైతులకు భరోసా ఇస్తున్నారు.

బీజేపీకి బీసీ బూస్ట్!

- అమిత్‌షా పర్యటన, బీసీ సీఎం ప్రకటనతో పార్టీ శ్రేణుల్లో కొత్త జోష్
- సీఎం అభ్యర్థి ఎవరనేది ప్రధాని మోదీ ప్రకటించవచ్చనే అంచనాలు
- రాష్ట్ర పర్యటన సందర్భంగా అమిత్‌షాతో ముఖ్య నేతల భేటీలు

సాక్షి, హైదరాబాద్: బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాష్ట్ర పర్యటన ఓవైపు.. బీజేపీని గెలిపిస్తే బీసీని సీఎం చేస్తామని ఆయన చేసిన ప్రకటన మరోవైపు ఆ పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నింపాయి. బీసీలకు రాజ్యాధికారంలో ప్రాధాన్యత, చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం కల్పిస్తామని కొంత కాలం నుంచి చెప్తున్న బీజేపీ అధిష్టానం.. అధికారికంగా బీసీ ఎజెండాను ప్రకటించడంపై హర్షం వ్యక్తమవుతోంది. ఎన్నికల్లో ఆ వర్గాలు ఎంతమేర ప్రభావితం అవుతాయి, ఏ మేర ఓట్లుగా మారుతాయని పార్టీ శ్రేణుల్లో చర్చ సాగుతోంది. ఎన్నికలకు ముందే బీసీని సీఎం చేస్తామని ఇలా ప్రకటించడం సాహసోపేతమైన నిర్ణయమేనని నేతలు అంటున్నారు. అంతేకాదు ఆ బీసీ అభ్యర్థి ఎవరనేది కూడా ప్రధాని మోదీ ప్రకటించే అవకాశాలు ఉన్నాయని పేర్కొంటున్నారు.

బీజేపీ చిత్తశుద్ధిని చాటేలా..

2014లోనే ఓబీసీ వర్గానికి చెందిన మోదీని ప్రధాని చేయడం, 2019లోనూ ఆయననే కొనసాగించడం, మోదీ కేబినెట్లో గతంలో ఎన్నడూ లేనట్టుగా 27 మంది బీసీ, ఓబీసీ మంత్రులు, ఎస్సీ,ఎస్టీలకూ సముచిత సంఖ్యలో మంత్రి పదవులను బీజేపీ ఇచ్చిందని ఆ పార్టీ వర్గాలు చెప్తున్నాయి. తాజాగా తెలంగాణలో బీసీ సీఎం ప్రకటన పార్టీ చిత్తశుద్ధిని చాటేలా ఉందని అంటున్నాయి.

పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం

రాష్ట్ర పర్యటన సందర్భంగా అమిత్‌షా పలువురు ముఖ్యనేతలతో విడివిడిగా భేటీ అయ్యారు. గురువారం రాత్రి అమిత్‌షాతో కిషన్‌రెడ్డి, కె.లక్ష్మణ్, బండి సంజయ్, ఈటల రాజేందర్ వేర్వేరుగా సమావేశమైనట్టు తెలిసింది. ఈ సందర్భంగా పకడ్బందీ వ్యూహాలతో ముందుకెళ్లాలని దిశానిర్దేశం చేసినట్టు సమాచారం. పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, రాష్ట్ర మేనిఫెస్టో కమిటీ చైర్మన్ వివేక్ వెంకటస్వామి శుక్రవారం ఢిల్లీ వెళ్లే ముందు బేగంపేట విమానాశ్రయంలో అమిత్‌షాను కలసి 'ఎన్నికల మేనిఫెస్టో డ్రాఫ్ట్'ప్రతిని అందజేశారు. దానిని జాతీయ నాయకత్వం పరిశీలించి ఖరారు చేయనుంది.

మేమొస్తే బీసీ సీఎం



శుక్రవారం సూర్యాపేటలో జరిగిన బీజేపీ బహిరంగ సభకు హాజరైన జనం

▶ మొదటి పేజీ తరువాయి

పేరు పెట్టింది. పసుపు బోర్డు కోసం ఎన్నో ఏళ్ల నుంచి పసుపు రైతులు ఉద్యమాలు చేస్తున్నా పాలకులు పట్టించుకోలేదు. రైతుల కష్టాలను గుర్తించిన బీజేపీ పసుపుబోర్డు ఏర్పాటు చేసింది. తెలంగాణ ప్రజలు కృష్ణా జలాల హక్కుల కోసం పోరాటం చేస్తుంటే.. వారి హక్కులను సమకూర్చేందుకు ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి అండగా నిలిచింది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే.

లక్షల కోట్లు కేటాయించాం..: తెలంగాణలో 40లక్షల మంది రైతులకు రూ.6 వేల చొప్పున రూ.9 వేల కోట్లను కిసాన్ సమ్మాన్ నిధి కింద అందజేస్తున్నాం. జల్ జీవన్ మిషన్ కింద గ్రామీణ ప్రాంతాల తాగునీటికి నిధులను విడుదల చేస్తున్నాం. మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ప్రతి ఇంటిలో మరుగుదొడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. గత నాలుగేళ్లుగా ఒక్కొక్కరికి 5 కిలోల చొప్పున రాష్ట్రంలోని 1.90 లక్షల కుటుంబాలకు ఉచిత బియ్యాన్ని అందిస్తున్నాం. తెలంగాణ అభివృద్ధి కోసం లక్షల కోట్ల రూపాయలను కేటాయించాం. తెలంగాణ సమగ్రాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం. అందుకోసం రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను గద్దె దింపి, బీజేపీ అభ్యర్థులను గెలిపించి అధికారంలో తీసుకురావాలి.

బీఆర్ఎస్ అవినీతిని నిర్మూలిస్తాం: కిషన్‌రెడ్డి

తెలంగాణ రాష్ట్రంలో అవినీతి వ్యతిరేక పోరాటం కోసం ప్రజలంతా బీజేపీకి మద్దతివ్వాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి కోరారు. రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన ఘనత సూర్యాపేట ప్రజలకు ఉందని, అవినీతి బీఆర్ఎస్‌పై పోరాటంలోనూ ముందుండాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో జరిగిన రోడ్లు, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల అభివృద్ధి అంతా కేంద్ర ప్రభుత్వ నిధులతోనని చెప్పారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక తెలంగాణలో 2,500 కిలోమీటర్ల కొత్త జాతీయ రహదారులను ఏర్పాటు చేశామని.. రాష్ట్రంలోనూ అధికారంలోకి వస్తే విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిని ఆరు లేన్లుగా మార్చడంతోపాటు ఇండస్ట్రియల్ కారిడార్‌గా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఉచిత వైద్యం, విద్య, పంటల బీమా పథకం వంటివి అమలు చేస్తామన్నారు. గ్రామ స్థాయి నుంచి సీఎం కార్యాలయం వరకు అవినీతి సమూలంగా నిర్మూలిస్తామన్నారు.

బీజేపీ డకౌట్, కాంగ్రెస్ రనౌట్

- రాష్ట్రంలో కరువు లేదు.. కర్ఫ్యూ లేదు: మంత్రి హరీశ్‌రావు
- ఎన్నికల్లో కేసీఆర్ సెంచరీ ఖాయమని వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీకి అధికారాన్ని ఇస్తే రాష్ట్రాన్ని అమ్మేస్తుందని ఆర్థిక మంత్రి తన్నీరు హరీశ్‌రావు మండిపడ్డారు. ఎవరు ఎన్ని ట్రిక్కులు చేసినా బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బలమైన నాయకత్వం అవసరమని, రాష్ట్రంలో కేసీఆర్‌కు సరితూగే బలమైన నాయకుడు ఎవరూ లేరన్నారు. కాంగ్రెస్ మాజీ రాష్ట్ర కార్యదర్శి సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, ఏఎస్‌రావు నగర్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషతో కలసి శుక్రవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్‌లో చేరారు. సోమశేఖర్‌రెడ్డి, ఆయన అనుచరులకు కండువాలు కప్పి హరీశ్‌రావు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో అన్ని రంగాలు అభివృద్ధి చెందాయని, తెలంగాణలో కరువు, కర్ఫ్యూ లేదన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంగ్రెస్ ఖాతా తెరవదని సర్వేలు చెబుతున్నాయని, బీజేపీ డక్ అవుట్, కాంగ్రెస్ రన్ అవుట్ అయితే కేసీఆర్ మాత్రం సెంచరీ కొడతారన్నారు. చేరికల కార్యక్రమంలో బీఆర్ఎస్ ఉప్పల్ నియోజకవర్గం అభ్యర్థి బండారు లక్ష్మారెడ్డి, పార్టీ ఇన్‌చార్జి రావుల శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, తాను బీఆర్ఎస్‌తో కలిసి పనిచేస్తానని చేవెళ్ల రవికుమార్ ముదిరాజ్ అలియాస్ బిత్తిరి సత్తి అన్నారు. మంత్రి హరీశ్‌రావు సమక్షంలో జరిగిన చేరికల కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఆగం కావద్దనే ఉద్దేశంతోనే తాను సీఎం కేసీఆర్ సూచన మేరకు బీఆర్ఎస్‌తో కలిసి పనిచేస్తున్నట్లు చెప్పారు.

ఒక్క సీటుకు జాబితా.. దేనికి సంకేతం?

- పార్టీలో జితేందర్ రెడ్డి పంతం నెగ్గించుకున్నారనే చర్చ
- మరో 45 స్థానాలపై ముఖ్య నేతల కసరత్తు
- 1న మలి జాబితా ప్రకటించే అవకాశం

సాక్షి, హైదరాబాద్: కేవలం ఒకే ఒక సీటుకు అభ్యర్థిని ప్రకటించి... అదీ రెండో జాబితా అంటూ పేర్కొనడం దేనికి సంకేతమనే చర్చ బీజేపీ వర్గాల్లో సాగుతోంది. మొదటి జాబితాను 55 మందితో విడుదల చేయాలని భావించినా 52 మందితో ఈనెల 22న తొలి జాబితాను ప్రకటించిన విషయం తెలిసిందే. అందులో మిగిలిపోయిన మూడింటిలో ఒకటైన మహబూబ్‌నగర్‌కు పార్టీ జాతీయ కార్యవర్గసభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి కుమారుడు ఏపీ మిథున్‌కుమార్ రెడ్డి పేరును ఖరారు చేస్తూ ఢిల్లీ నుంచి ఒకే పేరుతో జాబితా వెలువడింది. పార్టీ టికెట్ కోసం మహబూబ్‌నగర్ నుంచి జితేందర్‌రెడ్డి, షాద్‌నగర్ నుంచి ఆయన కుమారుడు మిథున్‌రెడ్డి దరఖాస్తు చేసుకోగా, ఒకే కుటుంబానికి రెండు సీట్లు కేటాయించే అవకాశాలు లేవని స్పష్టమైంది. తొలి జాబితా ఖరారుకు ముందే తాను లోక్‌సభకే పోటీచేస్తానని, మహబూబ్‌నగర్ సీటును తన కుమారుడికి కేటాయించాలని జితేందర్ కోరడాన్ని జాతీయ నాయకత్వం పరిగణనలోకి తీసుకుందనే చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. ఐతే ఈ ఒక్క సీటుకోసం జాబితా ఇవ్వకుండా మిథున్‌కు టికెట్‌పై భరోసా ఇచ్చి మరికొన్ని స్థానాల్లో అభ్యర్థులను ప్రకటిస్తే సరిపోయేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈవిధంగా జితేందర్‌రెడ్డి తన పంతం నెగ్గించుకోవడంతో మరికొందరు కూడా ఇలాగే తాము అసెంబ్లీకి కాకుండా లోక్‌సభకే పోటీ చేస్తామనే డిమాండ్‌ను ప్రోత్సహించినట్లవుతుందని అంటున్నారు.

రెండో సీట్లో పోటీకి సంజయ్ సై?

హుజూరాబాద్, గజ్వేల్ నుంచి పోటీకి ఈటలకు అవకాశమిచ్చినందున తనకూ కరీంనగర్‌తోపాటు వేములవాడలోనూ పోటీకి అవకాశం ఇవ్వాలని బండి సంజయ్ కోరుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇదేకాకుండా సంగారెడ్డి సీటును దేశ్‌పాండేకు ఇవ్వాలని సంజయ్ కోరుతుండగా, పులిమామిడి రాజుకు ఇవ్వాలని ఈటల పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీకి పోటీ చేయడానికి కిషన్‌రెడ్డి విముఖత వ్యక్తం చేస్తుండటంతో అంబర్‌పేట నుంచి ఎవరిని బరిలో నిలుపుతారనేది ఆసక్తికరంగా మారింది. ఇక్కడి నుంచి నగర సెంట్రల్ పార్టీ అధ్యక్షుడు డా.ఎన్.గౌతంరావును బరిలో దింపుతారా లేక బీసీకి ఇవ్వాలనే యోచనతో మాజీ ఎమ్మెల్యే సి.కృష్ణాయాదవ్‌కు అవకాశం కల్పిస్తారా అన్న చర్చ పార్టీ వర్గాల్లో సాగుతోంది.

మిగిలిన సీట్లపై కసరత్తు

మరో 45 స్థానాల్లో అభ్యర్థుల ఖరారుపై ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్, సహఇన్‌చార్జి సునీల్ బన్సల్, రాష్ట్ర ముఖ్య నేతలు కిషన్‌రెడ్డి, డా.కె.లక్ష్మణ్, ఈటల రాజేందర్ శుక్రవారం కసరత్తు చేసినట్లు తెలిసింది. మలి జాబితాను నవంబర్ 1న ప్రకటిస్తారని అంటున్నారు. జనసేనకు ఆరుదాకా సీట్లు కేటాయించే అవకాశం ఉండటంతో వాటిని మినహాయించి... మిగిలిన సీట్లలో జాబితా ప్రకటించేందుకు ఏర్పాట్లుచేస్తున్నారు.

బీసీ సీఎం ప్రకటన పట్ల లక్ష్మణ్ హర్షం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే సీఎంగా బలహీన వర్గాలకు చెందిన వ్యక్తిని చేస్తామని సూర్యాపేట సభలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించడం పట్ల పార్టీ పార్లమెంట్ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ, అమిత్ షా, జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రాజ్యాధికారంలో బీసీలకు భాగస్వామ్యం కల్పించేందుకు ముందుకు వచ్చారన్నారు. దీనిని తెలంగాణ సమాజం స్వాగతిస్తూ బీజేపీని అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించాల్సిందిగా శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. తెలంగాణలో మొదటిసారిగా ఓ ఎన్నికల బహిరంగసభలో బీసీని సీఎంని చేస్తామంటూ బీజేపీ చిత్తశుద్ధిని చాటిందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌పార్టీలు బీసీలకు తగిన అవకాశాలు కల్పించకుండా వారిని రాజకీయంగా ఎదగనీయడం లేదని విమర్శించారు. దీనిపై రాష్ట్రంలోని మేధావులు, వివిధ సంఘాల నాయకులు ఆలోచించి బీజేపీకి మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

అధికార బీఆర్ఎస్‌పై అన్నిచోట్లా వ్యతిరేకత

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి
- మాఫియా చేతిలో తెలంగాణ బందీ
- రాజకీయాలపై రాహుల్‌కు అవగాహన లేదు
- బీజేపీలో చేరిన కేఎస్ రత్నం, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు



కేఎస్ రత్నంకు కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కిషన్‌రెడ్డి. చిత్రంలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్/చేవెళ్ల: రాష్ట్రంలో ఏ అసెంబ్లీ నియోజకవర్గానికి వెళ్లినా అధికార బీఆర్ఎస్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమౌతోందని కేంద్ర మంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి చెప్పారు. సకలజనులు పోరాటం చేసి తెచ్చుకున్న తెలంగాణ..నేడు అవినీతిపరులు, మాఫియా చేతిలో బందీ అయ్యిందని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబ, అవినీతి, నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు స్పందిస్తున్నారని పేర్కొన్నారు. కుటుంబ పాలన, అవినీతి రాజకీయాలకు వ్యతిరేకంగా బీజేపీ పోరాటం చేస్తుందన్నారు. ఎవరెన్ని తప్పుడు ప్రచారాలు చేసినా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ స్థానాలు గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, ఆయన అనుచరులు, పలువురు ప్రస్తుత, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు 60 మంది బీజేపీలో చేరారు. వీరిలో చేవెళ్ల, నవాబుపేట, మొయినాబాద్, షాబాద్, శంకర్‌పల్లి మండలాలకు చెందిన పలువురు బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు, రైతు నాయకులు, దళిత సామాజిక వర్గ యువకులు ఉన్నారు. వారికి కిషన్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెలంగాణలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న దళిత నాయకుల్లో రత్నం ఒకరని పేర్కొన్నారు.

రాహుల్ తప్పుడు ప్రచారం

'బీఆర్ఎస్, బీజేపీ ఒకటేనంటూ రాహుల్ గాంధీ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. రాజకీయాలు, ప్రజల ఆకాంక్షలపై ఆయనకు ఎలాంటి అవగాహన లేదు. తెలంగాణ పోరాట చరిత్ర గురించి తెలియని రాజకీయ అజ్ఞాని. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ ఆధారంగా బీజేపీకి వ్యతిరేకంగా ఉపన్యాసాలు ఇస్తున్నారు..'అని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. 'బీఆర్ఎస్‌కు కాంగ్రెస్ బీ–టీమ్.అమ్ముడు పోయే పార్టీ కాంగ్రెస్.. కొనే పార్టీ బీఆర్ఎస్. 2018లో 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌కు అమ్ముడుపోయారు. వారిలో కొందరిని మంత్రులుగా కొనసాగిస్తున్న దరిద్రపు పార్టీ బీఆర్ఎస్. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పంటలకు కనీసం 5 గంటల కరెంట్ కూడా ఇవ్వలేకపోతోంది. ఎన్నికల్లో అక్కడ మహిళలు, విద్యార్థులకు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక నిండా మోసం చేసింది..'అని విమర్శించారు. 'మేము ప్రజల టీమ్ తప్ప.. ఏ పార్టీకి టీమ్ కాదు..'అని స్పష్టం చేశారు. మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి విఠల్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చేవెళ్లకే జీవితం అంకితం: రత్నం

తనకు రాజకీయ జీవితం అందించిన చేవెళ్ల ప్రజలకు అధికారంతో సంబంధం లేకుండా జీవితాంతం సేవ చేస్తానని కేఎస్ రత్నం అన్నారు. చేవెళ్ల ప్రాంత అభివృద్ధి కోసమే తాను బీజేపీలో చేరానని తెలిపారు. తనకు అవకాశం ఇస్తే నియోజకవర్గంలో మండలానికో ఇంటర్నేషనల్ స్కూల్, ఆస్పత్రి ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. పార్టీ కార్యాలయానికి వెళ్లే ముందు స్థానిక లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో రత్నం పూజలు చేశారు.

క్లుప్తంగా...

తెలంగాణ 'ప్రశ్నిస్తోంది'

- 30 రోజుల్లో బీఆర్‌ఎస్‌కు 30 ప్రశ్నలు వేయనున్న కాంగ్రెస్
- ఏఐసీసీ మీడియా ఇన్‌చార్జి అజయ్ కుమార్



సాక్షి, హైదరాబాద్: త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొనేందుకుగాను కాంగ్రెస్ పార్టీ మరో కొత్త కార్యక్రమాన్ని చేపట్టింది. 'తెలంగాణ ప్రశ్నిస్తోంది'పేరిట ఎన్నికలు జరిగే వరకు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రతీరోజు ప్రశ్నించాలని నిర్ణయించింది. ఈ మేరకు రోజూ ప్రెస్‌మీట్లు పెట్టి 30 రోజులపాటు 30 అంశాలపై బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నిలదీయనుంది. బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రశ్నలు సంధించడంతోపాటు తాము ప్రకటించిన ఆరు గ్యారంటీలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ నిర్ణయించింది. ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ పట్ల తెలంగాణ ప్రజల్లో సానుకూల వాతావరణం కనిపిస్తోందని ఏఐసీసీ మీడియా ఇన్‌చార్జి అజయ్‌కుమార్ వెల్లడించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వార్‌రూం ఇన్‌చార్జి రోహన్ గుప్తా, ఏఐసీసీ మీడియా కోఆర్డినేటర్ రమణి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. రోజూ ఒక్కో అంశంపై బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని చెప్పారు. తెలంగాణలో ఎవరిని అడిగినా 'సారు, కారు, మళ్లీ రారు' అని చెప్తున్నారని అజయ్‌కుమార్ ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా 'తెలంగాణ ప్రశ్నిస్తోంది'కార్యక్రమ పోస్టర్‌ను విడుదల చేశారు.

రైతుబంధు ఆపాలనలేదు



సాక్షి, హైదరాబాద్: రైతుబంధు పథకాన్ని ఆపేయాలని తాను వ్యాఖ్యానించినట్టు సీఎం కేసీఆర్ చెప్పడం దారుణమని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వానికి నిజంగా రైతులపై చిత్తశుద్ధి ఉంటే నవంబర్ 3వ తేదీలోపు వారి ఖాతాల్లో రైతుబంధు నిధులు జమ చేయాలని మాత్రమే కోరానని శుక్రవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. కేసీఆర్‌కు రైతులపై ప్రేమ ఉంటే రైతుబంధు నిధులు విడుదల చేయడంతో పాటు రూ.లక్ష రైతు రుణమాఫీ కార్యక్రమాన్ని కూడా పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా కింద ఎకరాకు ఏటా రూ.15 వేలు ఇస్తామని ఆ ప్రకటనలో ఉత్తమ్ హామీ ఇచ్చారు.

రైతుబంధుపై అబద్ధపు ప్రచారాలు: కోదండరెడ్డి



సాక్షి, హైదరాబాద్: రైతుబంధు విషయంలో బీఆర్ఎస్ నేతల మాటలు హద్దులు మీరుతున్నాయని కాంగ్రెస్ పార్టీ ఆక్షేపించింది. ఈ పథకం అమలు చేసే విషయంలో తమ చిత్తశుద్ధిని శంకిస్తూ ఆరోపణలు చేస్తున్నారని, రైతుబంధుపై అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి ఆరోపించారు. శుక్రవారం గాంధీ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఏఐసీసీ అధికార ప్రతినిధి రమణి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అధికార ప్రతినిధులు అయోధ్యరెడ్డి, కమలాకర్, నిజాముద్దీన్, రియాజ్‌లతో కలిసి కోదండరెడ్డి మాట్లాడారు. రైతుబంధు పథకాన్ని మరో పేరుతో 2014 ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ పెట్టిందని చెప్పారు. తమ హయాంలోనే రైతులకు ఉచిత కరెంటు ఇచ్చామని, రైతు రుణమాఫీ చేశామని, బీఆర్ఎస్‌తో పొత్తులో ఉన్నప్పుడే ఈ పథకాలను అమలు చేశామని గుర్తుచేశారు.

డబ్బు కాదు దమ్మున్న వాళ్లకు టికెట్ ఇవ్వాలి



సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ టికెట్ల కేటాయింపుపై ఆ పార్టీ నాయకురాలు, మాజీ కేంద్రమంత్రి రేణుకా చౌదరి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. టికెట్ల కేటాయింపులో సామాజిక న్యాయం ఎక్కడా అంటూ సొంత పార్టీ నేతలను ఆమె ప్రశ్నించారు. కమ్మ సామాజిక, బీసీలకు టికెట్ల కేటాయింపులో ప్రాధాన్యత, న్యాయం దక్కడం లేదని మండిపడ్డారు. మొదటి జాబితాలో బయట నుంచి వచ్చిన వారికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని..డబ్బున్న వాళ్లకు కాదు, దమ్మున్నవారికి టికెట్లు ఇవ్వాలని సూచించారు. శుక్రవారం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ... బీసీలకు కూడా మొదటి జాబితాలో అనుకున్నంత అవకాశాలు కల్పించలేదన్నారు. కమ్మ సామాజిక వర్గానికి టికెట్లు ఇవ్వని పరిస్థితుల్లో..తర్వాత జరిగే పరిణామాలకు తాము బాధ్యులం కాదన్నారు.

పది నియోజకవర్గాల్లో కమ్మలకు ఇవ్వాలి

పది టికెట్లను కమ్మ సామాజిక వర్గానికి ఇవ్వాలని తెలంగాణ కమ్మ రాజకీయ ఐక్యవేదిక అధిష్టానాన్ని కోరింది. ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయం వద్దకు వచ్చిన ఐక్యవేదిక సభ్యులు మీడియాతో మాట్లాడారు. ఖమ్మం, బాన్సువాడ, సిర్పూర్ ఖాగజ్‌నగర్, కోదాడ, ఎల్బీనగర్, జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్‌లతో పాటు మరో నియోజకవర్గాన్ని కూడా ఇవ్వాలంటూ ఐక్యవేదిక కన్వీనర్ విద్యాసాగర్ డిమాండ్ చేశారు.

అగ్రవర్ణాలకు పెద్దపీట

- కాంగ్రెస్ రెండో జాబితాలో ఓసీలకు 27 సీట్లు
- బీసీలకు 8, ఎస్టీలకు 6, ఎస్సీలకు 3, మైనార్టీలకు 1
- 20 మంది ప్యారాచూట్లకు అవకాశం

సాక్షి, హైదరాబాద్: ఈనెల 15న ప్రకటించిన 55 స్థానాలకు తోడు కాంగ్రెస్ పార్టీ శుక్రవారం మరో 45 స్థానాలను క్లియర్ చేయడంతో ఇప్పటివరకు మొత్తం 100 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించినట్టయింది. రెండో విడత జాబితాలో అగ్రవర్ణాలకు చెందిన నేతలకు పెద్ద పీట వేయగా, బీసీలకు 8 స్థానాలను, ఎస్సీ, ఎస్టీలకు 8, మైనార్టీలకు ఒక స్థానాన్ని కేటాయించింది. ఇక ఓసీల్లో రెడ్డి సామాజిక వర్గానికి 21, వెలమలకు 2, బ్రాహ్మణులకు 1, కమ్మ సామాజిక వర్గానికి మూడు టికెట్లను కేటాయించింది. ప్యారాచూట్లకు ఎక్కువగా ప్రాధాన్యమిచ్చినట్లు సీట్ల కేటాయింపు స్పష్టం చేస్తోంది. గతంలో చాలా కాలం కాంగ్రెస్ పార్టీలో పనిచేసి, వివిధ కారణాలతో వేరే పార్టీల్లోకి వెళ్లి ఇటీవలే తిరిగి సొంతగూటికి వచ్చిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి (మునుగోడు), కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి (భువనగిరి)లకు టికెట్లు కేటాయించారు. అలాగే ఇటీవలే పార్టీలోకి వచ్చిన బి.మనోహర్‌రెడ్డి (తాండూరు), శ్యాంనాయక్ (ఖానాపూర్), కంది శ్రీనివాస్‌రెడ్డి (ఆదిలాబాద్), యశస్విని రెడ్డి (పాలకుర్తి), రేవూరి ప్రకాశ్‌రెడ్డి (పరకాల), తుమ్మల నాగేశ్వరరావు (ఖమ్మం), పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి (పాలేరు), కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి (మునుగోడు), బండి రమేష్ (కూకట్‌పల్లి), జగదీశ్వర్‌గౌడ్ (శేరిలింగంపల్లి), నారాయణరావు పాటిల్(బోథ్), వొడితల ప్రణవ్ (హుజూరాబాద్), కస్తూరి నరేందర్ (రాజేంద్రనగర్), విజయారెడ్డి (ఖైరతాబాద్), యెన్నం శ్రీనివాస్‌రెడ్డి (మహబూబ్‌నగర్), మురళీ నాయక్ (మహబూబాబాద్), పాయం వెంకటేశ్వర్లు (పినపాక), కె.ఆర్.నాగరాజు (వర్ధన్నపేట)లకు అవకాశమిచ్చారు.

సామాజిక వర్గాల వారీగా ఇలా..

- ఎస్సీలు–15 (మాదిగ–9, మాల–6)
- ఎస్టీలు–8 (ఆదివాసీలు–5, లంబాడీ–3)
- బీసీలు–20, మైనార్టీలు–4, ఓసీలు–53 (రెడ్డి–38, వెలమ–9, బ్రాహ్మణ–3, కమ్మ–3)

బల్మూరి, విష్ణుకు మొండిచేయి

అనుబంధ సంఘాల అధ్యక్షులు శివసేనారెడ్డి (వనపర్తి), బల్మూరి వెంకట్ (హుజూరాబాద్)లకు పార్టీ అధిష్టానం మొండిచేయి చూపింది. మాజీ మంత్రి పీజేఆర్ కుటుంబానికి ఒక టికెట్‌తోనే సరిపెట్టింది. జూబ్లీహిల్స్ టికెట్‌ను పీజేఆర్ తనయుడు విష్ణు ఆశించినా అక్కడ మాజీ క్రికెటర్ మహ్మద్ అజారుద్దీన్‌ను ఎంపిక చేసింది. ఖైరతాబాద్‌లో పీజేఆర్ కుమార్తె విజయారెడ్డికి అవకాశమిచ్చింది. వరంగల్ జిల్లాలో కొండా దంపతులిద్దరికీ టికెట్ వస్తుందని భావించినా వరంగల్ తూర్పులో సురేఖకే అవకాశం ఇచ్చింది. బీఆర్ఎస్ టికెట్ నిరాకరించడంతో పార్టీలో చేరిన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే రేఖానాయక్ భర్త శ్యాంనాయక్‌కు ఆసిఫాబాద్ టికెట్ ఖరారు చేసింది. ఇక ఖానాపూర్‌లో కొమురం భీం మనుమడు ఎడ్మ బొజ్జుకు, నారాయణపేటలో చిట్టెం కుటుంబానికి చెందిన డాక్టర్ పర్ణికారెడ్డి, పాలకుర్తిలో ప్రవాసాంధ్రురాలు హనుమాండ్ల ఝాన్సీ కోడలు యశస్విని రెడ్డి (ఇప్పటివరకు ప్రకటించిన అభ్యర్థుల్లో పిన్నవయస్కురాలు (26))లకు అవకాశం కల్పించింది.

బీసీలకు 20 సీట్లే

కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన రెండు జాబితాల్లో కలిపి మొత్తం 20 స్థానాలే వెనుకబడిన వర్గాలకు చెందిన నేతలకు దక్కాయి. మొదటి జాబితాలో 12 మందికి ఇవ్వగా, ఈసారి 8 మందికి అవకాశం కల్పించారు. తాజాగా ప్రకటించిన లిస్టులో 3 గౌడ, 2 ముదిరాజ్, పద్మశాలి, ఆరె మరాఠి, మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన ఒక్కొక్కరు ఉన్నారు. మధుయాష్కీ, పొన్నం ప్రభాకర్, జగదీశ్వర్ (గౌడ) కస్తూరి నరేందర్, వాకిటి శ్రీహరి (ముదిరాజ్), కొండా సురేఖ (పద్మశాలి, భర్త మున్నూరు కాపు), నారాయణరావు పాటిల్ (ఆరె మరాఠి), పూజల హరికృష్ణ (మున్నూరు కాపు)లకు టికెట్లు ఖరారయ్యాయి. కాగా ప్రకటించిన 100 సీట్లలో 20 శాతమే బీసీలకు కేటాయించి 53 శాతం ఓసీ వర్గాలకు కేటాయించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బీసీలకు కేటాయించిన 20 సీట్లలో యాదవ–4, గౌడ –3, మున్నూరుకాపు–3, ముదిరాజ్–3, పద్మశాలి, ఆరె మరాఠి, వాల్మీకి, మేరు, వంజర, చాకలి, బొందిలి కులాలకు ఒక్కొక్కటి దక్కాయి.

పెండింగ్‌లో ఉన్న స్థానాలివే..

మిర్యాలగూడ, వైరా (సీపీఎంకు కేటాయించే అవకాశం), చెన్నూరు, కొత్తగూడెం (సీపీఐకి కేటాయించినట్లు సమాచారం), పటాన్‌చెరు, అశ్వారావుపేట, తుంగతుర్తి, సూర్యాపేట, నిజామాబాద్ అర్బన్, కామారెడ్డి, సిరిసిల్ల, చార్మినార్, బాన్సువాడ, జుక్కల్, కరీంనగర్, ఇల్లందు, డోర్నకల్, సత్తుపల్లి, నారాయణ్ ఖేడ్ నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది.



ఖర్గే, కేసీ వేణుగోపాల్, ఠాక్రే, కోమటిరెడ్డి, భట్టి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నీలం మధు తదితరులు

ఖర్గేతో రాజగోపాల్‌రెడ్డి భేటీ

- పార్టీ అభ్యున్నతి కోసం పని చేయాలంటూ నిర్దేశించిన ఖర్గే
- కాంగ్రెస్‌లో చేరిన మోత్కుపల్లి, నేతి విద్యాసాగర్, ఆకుల లలిత, నీలం మధు

సాక్షి, న్యూఢిల్లీ/యాదాద్రి/పటాన్‌చెరు టౌన్: గురువారం రాత్రి ఢిల్లీలో కాంగ్రెస్‌లో చేరిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి.. శుక్రవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మరికొందరు ఇతర పార్టీల నేతలు కాంగ్రెస్‌లో చేరారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, ఎమ్మెల్సీ ఆకుల లలిత, మాజీ ఎమ్మెల్సీలు టి.సంతోష్‌కుమార్, కపిలవాయి దిలీప్, ఎన్‌ఎంఆర్ యువసేన వ్యవస్థాపకుడు నీలం మధు ముదిరాజ్, నకిరేకల్ ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి, ఆమె భర్త గంగాధర్ రావుకు ఖర్గే పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఏనుగు రవీందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మునుగోడు స్థానాన్ని రాజగోపాల్‌రెడ్డికి ఖర్గే ఖరారు చేశారు. పార్టీ అభ్యున్నతికి, గెలుపు లక్ష్యంగా చేయాలంటూ ఖర్గే సూచించారు.

కేసీఆర్‌ను గద్దె దించడమే లక్ష్యంగా...

కేసీఆర్‌ను గద్దె దించడమే లక్ష్యంగా పని చేస్తానని రాజగోపాల్‌రెడ్డి చెప్పారు. కేసీఆర్ అవినీతి, అక్రమాలపై బీజేపీ ఆయన్ని జైలుకు పంపుతుందనే ఆలోచనతోనే తాను బీజేపీలో చేరినా ఆ పరిస్థితులు కనిపించలేదన్నారు. అందుకే మళ్లీ సొంతగూటికి వచ్చినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఒకవేళ హంగ్ ఏర్పడితే బీఆర్ఎస్‌కు బీజేపీ మద్దతు ఇస్తుందని ఆరోపించారు. అవినీతితో సంపాదించిన కోట్ల రూపాయలను ఇండియా కూటమికి ఫండ్ ఇస్తానని.. తనను ప్రధానిని చేయాలంటూ కేసీఆర్ కూటమిని కోరిన విషయం నిజం కాదా అంటూ ప్రశ్నించారు. ప్రజల మద్దతుతో తాను మునుగోడులో గెలుస్తానని, ఇంకా కొంచెం ముందుగా తాను కాంగ్రెస్‌లో చేరి ఉంటే కేసీఆర్ మైండ్ బ్లాంక్ అయ్యేదన్నారు.

కాంగ్రెస్ రెండో జాబితా | 45 క్లియర్

▶ మొదటి పేజీ తరువాయి

అవకాశం కల్పించింది. ప్రకటించని మిగతా స్థానాలపై నేతలందరి అభిప్రాయం తెలుసుకున్నాక ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిర్ణయాన్ని బట్టి తుది జాబితా విడుదల కానుంది.

విస్తృత కసరత్తుతో..

ఈ నెల 15న 55 మందితో తొలి జాబితా విడుదల చేసిన కాంగ్రెస్ పార్టీ రెండో జాబితా విడుదలకు విస్తృత కసరత్తు చేసింది. అనేకచోట్ల ఇద్దరు, ముగ్గురేసి అభ్యర్థులు బరిలో ఉండటం, సర్వేల్లోనూ వారికి సమాన గెలుపు అవకాశాలు ఉండటం, అభ్యర్థుల విషయంలో స్క్రీనింగ్ కమిటీలోని సభ్యుల మధ్య తీవ్ర భేదాభిప్రాయాలు ఉండటంతో స్క్రీనింగ్ కమిటీ భేటీ మూడు నాలుగుసార్లు కావాల్సి వచ్చింది. ఈ క్రమంలో మరోసారి ఫ్లాష్ సర్వేలు సైతం నిర్వహించి, అందులో ముందంజలో ఉన్న అభ్యర్థుల పేర్లను కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ)కి నివేదించింది. ఈ నెల 25న ఖర్గే అధ్యక్షతన ఒకమారు భేటీ అయిన సీఈసీ.. శుక్రవారం మరోమారు సమావేశమైంది. ఈ భేటీకి ఖర్గేతో పాటు అగ్రనేతలు సోనియాగాంధీ, కేసీ వేణుగోపాల్, మురళీధరన్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు హాజరై 45 మంది అభ్యర్థుల జాబితా సిద్ధం చేశారు. సీపీఐకి కొత్తగూడెం, చెన్నూరు నియోజకవర్గాలు కేటాయించినట్లు సమాచారం కాగా సీపీఎంకు కేటాయించే అవకాశమున్న స్థానాలపై (మిర్యాలగూడ, వైరా) కూడా స్పష్టత వచ్చినట్లు తెలిసింది.మరో 15 స్థానాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతుండటంతో వీటిపై తుది నిర్ణయం చేసే అధికారం ఖర్గేకు కట్టబెట్టారు. ఈ స్థానాల్లో నెలాఖరులోగా టిక్కెట్ల కేటాయింపు పూర్తి చేయాలని నిర్ణయించారు. టికెట్ దక్కని నేతలను ముందుగానే ఢిల్లీ పిలిపించి ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేశాక వారికి పదవులు కట్టబెడతామని హామీ ఇచ్చారు.

సస్పెన్స్‌లో కామారెడ్డి..

ప్రస్తుతం అందరి దృష్టి కామారెడ్డి నియోజకవర్గంపైనే ఉంది. ఇక్కడ రేవంత్‌రెడ్డిని బరిలో నిలపాలని పార్టీ అధిష్టానం యోచిస్తున్న నేపథ్యంలో దీన్ని పెండింగ్‌లో పెట్టినట్లు తెలుస్తోంది. ఇక్కడి సీనియర్ నేత షబ్బీర్ అలీని నిజామాబాద్ అర్బన్ నుంచి పోటీ చేయించే ఆలోచన నేపథ్యంలో ఆ స్థానాన్నీ ప్రకటించలేదు. కామారెడ్డి జిల్లాలోనే ఉన్న బాన్సువాడ నియోజకవర్గం నుంచి సీనియర్ నేత వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి, పార్టీలో చేరిన ఏనుగు రవీందర్‌రెడ్డి పోటీలో ఉండటం, జుక్కల్ నుంచి సీనియర్ నేత గంగారాంతో పాటు తోట లక్ష్మీకాంతరావులు పోటీ పడుతుండటంతో ఆ స్థానాలపై ఇంకా నిర్ణయం చేయలేదు. పటాన్‌చెరు నియోజకవర్గాన్ని పార్టీలో చేరిన నీలం మధు కోరుతుండటం, అక్కడి నుంచి కాటా శ్రీనివాస్‌గౌడ్ పేరు ఇప్పటికే పరిశీలనలో ఉండటంతో దీన్నీ పెండింగ్‌లో పెట్టారు. ఇక నారాయణఖేడ్ నుంచి సీనియర్లు సురేశ్ షెట్కార్‌తో పాటు సంజీవ్‌రెడ్డిలు పోటీ పడుతుండగా నిర్ణయం తీసుకోలేదు. షెట్కార్ పేరును రేవంత్ ప్రస్తావిస్తుండగా, మిగతా సీనియర్లు సంజీవ్‌రెడ్డికి మద్దతుగా ఉన్నారు. తుంగతుర్తి టిక్కెట్ ఆశించి మోత్కుపల్లి నర్సింహులు, కరీంనగర్ సీటు ఆశిస్తూ మాజీ ఎమ్మెల్సీ సంతోష్‌కుమార్‌లు పార్టీలో చేరడంతో వాటినీ పెండింగ్‌లోనే ఉంచారు.

45 టికెట్లు ఇలా..

1.	సిర్పూర్	-	రావి శ్రీనివాస్
2.	ఆసిఫాబాద్ (ఎస్టీ)	-	అజ్మీర శ్యాం
3.	ఖానాపూర్ (ఎస్టీ)	-	ఎడ్మ బొజ్జు
4.	ఆదిలాబాద్	-	కంది శ్రీనివాస్ రెడ్డి
5.	బోథ్ (ఎస్టీ)	-	వన్నెల అశోక్
6.	ముధోల్	-	భోస్లే నారాయణరావు పాటిల్
7.	ఎల్లారెడ్డి	-	కె.మదన్‌మోహన్ రావు
8.	నిజామాబాద్ రూరల్	-	డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి
9.	కోరుట్ల	-	జువ్వాడి నర్సింగరావు
10.	చొప్పదండి (ఎస్సీ)	-	మేడిపల్లి సత్యం
11.	హుజూరాబాద్	-	వొడితల ప్రణవ్
12.	హుస్నాబాద్	-	పొన్నం ప్రభాకర్
13.	సిద్దిపేట	-	పూజల హరికృష్ణ
14.	నర్సాపూర్	-	ఆవుల రాజిరెడ్డి
15.	దుబ్బాక	-	చెరుకు శ్రీనివాస్ రెడ్డి
16.	కూకట్‌పల్లి	-	బండి రమేష్
17.	ఇబ్రహీంపట్నం	-	మల్‌రెడ్డి రంగారెడ్డి
18.	ఎల్బీనగర్	-	మధుయాష్కీ గౌడ్
19.	మహేశ్వరం	-	కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి
20.	రాజేంద్రనగర్	-	కస్తూరి నరేందర్
21.	శేరిలింగంపల్లి	-	వి.జగదీశ్వర్ గౌడ్
22.	తాండూరు	-	బుయ్యని మనోహర్ రెడ్డి
23.	అంబర్‌పేట	-	రోహిన్‌రెడ్డి
24.	ఖైరతాబాద్	-	పి.విజయారెడ్డి
25.	జూబ్లీహిల్స్	-	మహమ్మద్ అజారుద్దీన్
26.	కంటోన్మెంట్	-	డాక్టర్ జి.వి.వెన్నెల
27.	నారాయణ్‌పేట్	-	డాక్టర్ పర్ణిక చిట్టెంరెడ్డి
28.	మహబూబ్‌నగర్	-	యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
29.	జడ్చర్ల	-	జె.అనిరుధ్‌రెడ్డి
30.	దేవరకద్ర	-	గవినోళ్ల మధుసూదన్‌రెడ్డి
31.	మక్తల్	-	వాకిటి శ్రీహరి
32.	వనపర్తి	-	డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి
33.	దేవరకొండ (ఎస్టీ)	-	నేనావత్ బాలునాయక్
34.	మునుగోడు	-	కె.రాజగోపాల్‌రెడ్డి
35.	భువనగిరి	-	కుంభం అనిల్‌కుమార్ రెడ్డి
36.	జనగాం	-	కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి
37.	పాలకుర్తి	-	యశస్విని మామిడాల
38.	మహబూబాబాద్ (ఎస్టీ)	-	డాక్టర్ మురళీనాయక్
39.	పరకాల	-	రేవూరి ప్రకాశ్‌రెడ్డి
40.	వరంగల్ వెస్ట్	-	నాయిని రాజేందర్‌రెడ్డి
41.	వరంగల్ ఈస్ట్	-	కొండా సురేఖ
42.	వర్ధన్నపేట(ఎస్సీ)	-	కె.ఆర్.నాగరాజు
43.	పినపాక (ఎస్టీ)	-	పాయం వెంకటేశ్వర్లు
44.	ఖమ్మం	-	తుమ్మల నాగేశ్వరరావు
45.	పాలేరు	-	పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నేటి నుంచి కాంగ్రెస్ రెండోవిడత బస్సుయాత్ర

- రోజుకు మూడు నియోజకవర్గాల చొప్పున ఆరురోజుల షెడ్యూల్
- తాండూరు, పరిగి, చేవెళ్లలో డీకే శివకుమార్.. సంగారెడ్డి, నర్సాపూర్, మెదక్‌లలో ఖర్గే..
- సాగర్, కొల్లాపూర్‌లో ప్రియాంక.. చివరి రెండురోజులు రాహుల్ పాల్గొనే అవకాశం

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ రెండోవిడత బస్సుయాత్ర షెడ్యూల్ ప్రకటించింది. ఈ నెల 28 నుంచి ఆరు రోజులపాటు నవంబర్ 2 వరకు కొనసాగేలా రూట్ మ్యాప్ తయారుచేశారు. రోజుకు మూడు చొప్పున మొత్తం 18 నియోజకవర్గాల్లో రెండోవిడత బస్సుయాత్ర జరగనుంది. తొలిరోజు యాత్రలో కర్ణాటక ఉపముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ పాల్గొననున్నారు. శనివారం మధ్యాహ్నం తాండూరు కార్నర్ మీటింగ్‌కు హాజరుకానున్న ఆయన పరిగి, చేవెళ్ల నియోజకవర్గాల ప్రచారాల్లోనూ పాల్గొంటారు. రెండోరోజున సంగారెడ్డి, నర్సాపూర్‌లలో కార్నర్ మీటింగ్‌లు, మెదక్‌లో పాదయాత్రకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరుకానున్నారు. ఈ నెల 30, 31 తేదీల్లో ఏఐసీసీ ప్రధానకార్యదర్శి ప్రియాంకాగాంధీ పర్యటన ఉంటుందని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నా 31వ తేదీ మాత్రమే ఇప్పటి వరకు ఖరారైంది. ఆ రోజున జరిగే నాగార్జున సాగర్, కొల్లాపూర్ మీటింగ్‌లలో ప్రియాంక పాల్గొననున్నారు. వచ్చే నెల 1, 2 తేదీల్లో ఏఐసీసీ అగ్ర నేత రాహుల్‌గాంధీ కూడా పాల్గొంటారని చెబుతున్నా ఆయన పర్యటన ఇంకా ఖరారు కావాల్సి ఉంది. ఒకవేళ రాహుల్ పర్యటన ఖరారైతే ఉమ్మడి మహబూబ్‌నగర్‌తోపాటు మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో జరిగే బస్సుయాత్రలో ఆయన పాల్గొనే అవకాశాలున్నాయి.

సీపీఎంకు మిర్యాలగూడ, వైరా

వామపక్షాలకు 4 స్థానాలపై కాంగ్రెస్ స్పష్టత

సాక్షి, హైదరాబాద్: వామపక్షాలకు కేటాయించే నాలుగు స్థానాల విషయంలో కాంగ్రెస్ అధిష్టానం ఆ పార్టీలకు స్పష్టత ఇచ్చింది. వామపక్షాలు అడిగిన నాలుగు స్థానాల్లో రెండు వారు కోరినట్లు ఇవ్వగా, మరో రెండు తన వెసులుబాటు ప్రకారం ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. సీపీఐ కొత్తగూడెం, మునుగోడు స్థానాలు కోరగా.. కొత్తగూడెం, చెన్నూరు కేటాయించింది. సీపీఎం మిర్యాలగూడతో పాటు పాలేరు లేదా భద్రాచలం కావాలని కోరింది. అయితే మిర్యాలగూడకు అంగీకరించిన కాంగ్రెస్, భద్రాచలం, పాలేరుల్లో తమ పార్టీ నేతలకే అవకాశం ఇచ్చింది. రెండో సీటు కింద వైరా కేటాయిస్తామని కాంగ్రెస్ పార్టీ చెప్పినట్లు సీపీఎం వర్గాలు వెల్లడించాయి. దీంతో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గం శుక్రవారం రాత్రి వరకు దీనిపై చర్చించింది. చివరకు వైరా సీటుకు ఓకే చెప్పింది. కాగా ఈ నాలుగు స్థానాలను వామపక్షాలకు కేటాయిస్తున్నట్లు కాంగ్రెస్ అధికారికంగా ప్రకటించాల్సి ఉందని సీపీఐ, సీపీఎం వర్గాలు తెలిపాయి.

వైరా బరిలో భూక్యా వీరభద్రం: కాంగ్రెస్ పాలేరు సీటు ఇస్తే ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం బరిలో ఉంటారని ప్రచారం జరిగింది. ఇప్పుడు వైరా సీటును కేటాయించడంతో తమ్మినేని ఆశలు అడియాశలయ్యాయి. కాగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాత్రం ఎలాగోలా తనకు కొత్తగూడెం సీటును దక్కించుకోగలిగారు. తాము కోరని వైరా సీటు ఇవ్వడంపై సీపీఎం కొంత అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. అయినా బీజేపీ, బీఆర్ఎస్‌ను ఓడించడమే లక్ష్యంగా ముందుకు సాగాలి కాబట్టి సర్దుకుపోవాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. సీపీఎం తరఫున వైరాలో భూక్యా వీరభద్రం, మిర్యాలగూడ నుంచి జూలకంటి రంగారెడ్డి పోటీచేస్తారని ఆ పార్టీ వర్గాలు చెప్పాయి.

కరీంనగర్ కలెక్టర్, పోలీసు కమిషనర్ బదిలీ

- వేటు వేసిన కేంద్ర ఎన్నికల సంఘం

సాక్షి, హైదరాబాద్/కరీంనగర్: రాష్ట్రంలోని మరో ఇద్దరు పోలీసు ఉన్నతాధికారులపై కేంద్ర ఎన్నికల సంఘం వేటు వేసింది. కరీంనగర్ జిల్లా కలెక్టర్ గోపి, పోలీసు కమిషనర్ సుబ్బారాయుడును బదిలీ చేసింది. తక్షణమేవారు తమ విధులను తదుపరి అధికారులకు అప్పగించాలని ఆదేశించింది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎ.శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. పక్షం రోజుల కిందట 20 మంది ఐపీఎస్, ఐఏఎస్ అధికారులపై వేటు వేసిన కమిషన్ తాజాగా మరో ఇద్దరు అధికారులను బదిలీ చేస్తూ చర్యలు తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ బదిలీలు రాజకీయపరంగా జరుగుతున్నాయన్న అనుమానాలను అఖిల భారత సర్వీసు అధికారులు వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజుల క్రితమే బాధ్యతలు తీసుకున్న తనను బదిలీ చేయడం ఏమిటని వాణిజ్య పన్నుల కమిషనర్ టీకే శ్రీదేవి ఏకంగా ఎక్స్(ట్విట్టర్)లో ఇదివరకు ప్రశ్నించిన సంగతి తెలిసింది. ఎన్నికల నోటిఫికేషన్ జారీ తరువాత మరికొంత మంది అధికారులపై వేటు పడే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాగా, కలెక్టర్ స్థానంలో అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) ప్రఫుల్ దేశాయ్‌కి, సీపీ స్థానంలో అడిషనల్ డీసీపీకి బాధ్యతలు అప్పగించనున్నారు. రాష్ట్రంలో డీజీపీ స్థాయి అధికారి నుంచి హోంగార్డు వరకు మొత్తం పోలీసు వ్యవస్థ నవంబర్ 3 నుంచి డిసెంబర్ 5 వరకు లేదా ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు ఎన్నికల సంఘం పరిధిలో డిప్యుటేషన్‌పై పనిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

బాబుకు 'నిజాం షుగర్స్' పాపమే కొట్టింది

ఫ్యాక్టరీని ప్రైవేటీకరించి శిక్ష అనుభవిస్తున్నారు

- అలాంటి పరిస్థితి మీకొద్దు
- ఎన్డీఎస్ఎల్ కార్మికుల ఆగ్రహావేశాలు



కార్మికులతో చర్చలు జరుపుతున్న ఫ్యాక్టరీ సీఈవో సుబ్బరాజు, పర్సనల్ ఆఫీసర్ శ్రీధర్‌రాజు, అధికారి రమేష్

బోధన్: "లాభాల్లో నడిచే నిజాం షుగర్స్‌ను ప్రైవేటీకరించి ఇప్పుడు ఏపీలో చంద్రబాబు శిక్ష అనుభవిస్తున్నాడు, అలాంటి పరిస్థితి మీకు (ఎన్డీఎస్ఎల్ ప్రైవేట్ యాజమాన్యం) రావాలని కోరుకోవడం లేదు.. ఎన్డీఎస్ఎల్(నిజాం డెక్కన్ షుగర్స్ లిమిటెడ్) లేఆఫ్ నుంచి రావాల్సిన బకాయి వేతనాలు పూర్తిగా చెల్లించండి" అని కార్మికులు డిమాండ్ చేశారు. ఒక్కసారిగా బాబు ప్రస్తావన విని ఎన్డీఎస్ఎల్ సీఈవో సుబ్బరాజు, పర్సనల్ ఆఫీసర్ శ్రీధర్‌రాజు, స్థానిక అధికారి రమేష్ అవాక్కయ్యారు. ఫ్యాక్టరీ మూసివేత వల్ల తమ జీవితాలు అన్యాయమయ్యాయని, కుటుంబాలు రోడ్డున పడ్డాయని, బిచ్చమెత్తుకుని బతకాల్సిన దుస్థితి వచ్చిందని కార్మికులు కన్నీటి పర్యంతమయ్యారు. కార్మికుల వేతన, ఇతర బకాయిల చెల్లింపునకు సంబంధించి సెటిల్‌మెంట్ చేసేందుకు ఎన్డీఎస్ఎల్ అధికారులు శుక్రవారం నిజామాబాద్ జిల్లా బోధన్ ఫ్యాక్టరీలో సమావేశం నిర్వహించారు. బోధన్, ముత్యంపేట, ముంబోజిపల్లి ఫ్యాక్టరీల కార్మికులు హాజరయ్యారు. 2015 డిసెంబర్ 23న ప్రైవేట్ యాజమాన్యం బోధన్, ముత్యంపేట(జగిత్యాల), ముంబోజిపల్లి (మెదక్) యూనిట్లను మూసివేసిన విషయం తెలిసిందే.

రాతపూర్వక ఒప్పందం మేరకు ఇవ్వండి

ఎన్డీఎస్ఎల్ సీఈవో సుబ్బరాజు చర్చను ప్రారంభిస్తూ 2021లో లేబర్ కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం 2015 డిసెంబర్ 23 కట్ డేట్ (లేఆఫ్ ప్రకటించిన తేదీ) నిర్ధారించి ఏడాదికి 15 రోజుల చొప్పున కార్మికుడి సర్వీసు మేరకు వేతనంతో కూడిన బకాయిలు చెల్లిస్తామని తెలిపారు. ఈ ప్రతిపాదన అసంబద్ధమైందని కార్మికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ మూసివేతకు గురైతే ఏడాదికి 45 రోజుల చొప్పున వేతనం చెల్లించాలని యాజమాన్యం రాతపూర్వకంగా హామీ ఉందని, దీంతో పాటు, లేబర్ కోర్టు తీర్పు ప్రకారం 15 రోజులు కలుపుకుని 60 రోజుల చొప్పున వేతన బకాయిలు ఇవ్వాలని కార్మిక నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం వాటా 49 శాతం ప్రైవేట్ కంపెనీ వాటా 51 శాతంతో జాయింట్ వెంచర్‌లో నడుస్తున్నందున చర్చల్లో ప్రభుత్వ భాగస్వామ్యం ఉందా? అన్ని ప్రశ్నించారు. చర్చల అనంతరం కార్మికుల డిమాండ్‌ను ఎండీ దృష్టికి తీసుకెళ్తామని అధికారులు తెలిపారు.

చర్చల వెనుక ఏదో కుట్ర ఉంది..

చర్చల వెనుక ప్రైవేట్ యాజమాన్యం ఏదో కుట్ర పన్నుతోందని కార్మిక నాయకులు రవి శంకర్‌గౌడ్, ఉపేందర్, కుమార స్వామిలు ఆరోపించారు. ఫ్యాక్టరీలో భాగస్వామ్యం ఉన్న ప్రభుత్వాన్ని పక్కన బెట్టి ఎన్నికల సమయంలో దొంగ చాటు చర్చలెందుకని ప్రశ్నించారు. మూడు ఫ్యాక్టరీలకు సంబంధించి రూ. 2వేల కోట్ల ఆస్తులు కబళించేందుకే ప్రయత్నాలు జరుగుతున్నాయేమోనని అనుమానం వ్యక్తం చేశారు.

ఎన్డీఎస్ఎల్‌ను రీ ఓపెనింగ్ చేయలేం..

తెలంగాణ ప్రభుత్వం ఫ్యాక్టరీ టేకోవర్ చేస్తుందని స్పష్టత ఇచ్చినందున రీ ఓపెనింగ్ చేయలేమని ఎన్డీఎస్ఎల్ సీఈవో సుబ్బారావు ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

అసత్యానికి శక్తి లేదు. సత్యానికి శక్తి లేకపోవడం అంటూ లేదు. ఈ రెండింటి అసలు స్వరూపాన్ని తత్వజ్ఞానులు దర్శించారు.

– హిందూ ధర్మం

సాక్షి

శనివారం, 28 అక్టోబర్ 2023

ఖతార్ 'మరణ' మృదంగం!

గల్ఫ్ దేశాల్లో పనిచేయటం కత్తిమీది సాము. అక్కడ అమలయ్యే చట్టాలు, న్యాయవ్యవస్థ తీరు తెన్నులు భిన్నమైనవి. కనుక ఉపాధి కోసం వెళ్లినవారు ఎంతో జాగురూకతతో వుంటారు. అందువల్లే ఆ దేశాల్లో ఒకటైన ఖతార్‌లో అల్ దహ్రా గ్లోబల్ అనే ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న మన నావికాదళ మాజీ అధికారులు ఎనిమిది మంది గూఢచర్యం ఆరోపణల సాలెగూటిలో చిక్కుకోవటం, అక్కడి న్యాయస్థానం గురువారం వారికి మరణదండన విధించటం అందరినీ కలవరపెట్టింది. వాస్తవానికి గూఢచర్యం ఆరోపణలున్నాయని మీడియాలో కథనాలు రావటం మినహా అధికారికంగా ఖతార్ ఎలాంటి వివరణా ఇవ్వలేదు. ఖతార్‌తో నిరుడు ఆగస్టు నుంచి సంప్రదింపులు జరుపుతూ, వారి విడుదలకు కృషి చేస్తున్న మన విదేశాంగ శాఖ కూడా ఏమీ చెప్పలేదు. న్యాయస్థానంలో విచారణ సరేసరి. అంతా గోప్యంగా ముగిసిపోయింది. మరణశిక్ష పడినవారు సాధారణ వ్యక్తులు కాదు. మన నావికాదళంలో పనిచేసినన్నాళ్లూ తమ సత్తా చాటినవారు. వీరిలో తెలుగువారైన సుగుణాకర్ పాకాల కమాండర్ స్థాయిలో పనిచేసి రిటైరయ్యారు. తన సర్వీసు కాలంలో రెండుసార్లు నావికాదళ నౌక ఐఎన్ఎస్ తరంగిణిపై ఒంటరిగా వెళ్లి భూమధ్య రేఖప్రాంతంలో అట్లాంటిక్, పసిఫిక్ మహా సముద్రాలను దాటివచ్చినవారు. ఇతరులు కూడా నావికాదళ విభాగాల్లో నిపుణులు, లబ్ధ ప్రతిష్టులు. ఒక సందర్భంలో అందరినీ స్వదేశం వెళ్లేందుకు సిద్ధంగా వుండమని చెప్పిన ఖతార్ అధికారులు అంతలోనే నిర్ణయం మార్చుకున్నారని అంటున్నారు. వీరు పని చేసిన అల్ దహ్రా గ్లోబల్ సంస్థ నిర్వాహకులను కూడా అరెస్టు చేసిన ఖతార్ అధికారులు రెండు నెలలకే వారిపై ఎలాంటి విచారణ లేకుండా విడుదల చేశారు. మరి భారతీయుల విషయంలో ఈ వివక్ష ఎందుకో అర్థం కాని విషయం. ఇటలీ నుంచి ఖతార్ సమకూర్చుకున్న యు 212 జలాంతర్గామిపై ఆ దేశ నావికాదళ సిబ్బందికి శిక్షణ ఇచ్చే పనిలో ఉన్నప్పుడు హఠాత్తుగా వీరిని అరెస్టు చేశారంటున్నారు. ఆ జలాంతర్గామి సాంకేతిక వివరాలను ఇజ్రాయెల్‌కు చేరేశారన్నది ప్రధాన అభియోగమని చెబుతున్నారు.

నేరారోపణలు ఎదుర్కొన్నవారికి న్యాయసహాయం లభించిందా... అసలు వారిపై వున్న ఆరోపణలు ఏమిటన్నది వెల్లడి కాలేదు. కనీసం కుటుంబ సభ్యులకైనా ఆ వివరాలు అందించారా లేదా అన్నది అనుమానమే. సాధారణంగా గూఢచర్యం కేసుల్లో ప్రభుత్వాలు ఎక్కడలేని గోప్యతా పాటిస్తాయి. ఇందువల్ల అటు ముద్దాయిలకు అన్యాయం జరగటంతోపాటు ఆ దేశానికి కూడా అంతర్జాతీయంగా చెడ్డపేరొస్తుంది. ఖతార్‌కు ఈ విషయాలు తెలిసేవుండాలి. ఖతార్‌తో వున్న ద్వైపాక్షిక సంబంధాలను వినియోగించుకుని వీరందరి విడుదలకూ మన దేశం చేసిన ప్రయత్నాలను ఆ దేశం వమ్ముచేసింది. అక్కడి మీడియా సంస్థలో పనిచేస్తున్న మహిళా జర్నలిస్టు ఈ కేసు లొసుగులను ఎత్తిచూపుతూ రాసిన కథనం తమ జాతీయ ప్రయోజనాలను దెబ్బతీసేలా ఉన్నదని ఆగ్రహించి ఆమెను సైతం అరెస్టు చేయటానికి ఖతార్ అధికారులు ప్రయత్నించారని ఒక ఆంగ్ల దినపత్రికలో ఇటీవలే కథనం వెలువడింది. దీనిపై ముందుగా ఉప్పందటంతో ఆ జర్నలిస్టు, అక్కడ వేరే ఉద్యోగం చేస్తున్న ఆమె భర్త హుటాహుటీన ఆ దేశం విడిచి భారత్ వచ్చారని ఆ కథనం తెలిపింది. ఈ కేసుపై మొత్తంగా ఏడు వాయిదాల్లో విచారణ జరిగిందని చెబుతున్నారుగానీ, దాని తీరుతెన్నులెలా వున్నాయో జర్నలిస్టుకు ఎదురైన చేదు అనుభవమే తేటతెల్లం చేస్తోంది.

ఆరోపణలొచ్చినంత మాత్రాన అన్నీ నిజమైపోవని ఖతార్‌కు తెలియదనుకోలేం. ఎందుకంటే ఆ దేశానికి ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్నాయంటూ ఆరేళ్ల క్రితం గల్ఫ్ సహకార మండలి (జీసీసీ) నుంచి దాన్ని సౌదీ అరేబియా సాగనంపింది. కానీ చివరికి మళ్లీ ఖతార్‌తో సంధి కుదుర్చుకోక తప్పలేదు. ఉగ్రవాదులుగా ముద్రపడిన తాలిబన్‌లకు ఆశ్రయం ఇచ్చి, వారితో అమెరికా చర్చలు జరిపేలా చేయటంలో ఖతార్ విజయం సాధించింది. ఇప్పుడు ఇజ్రాయెల్‌లో చొరబడి ఆ దేశ పౌరులను కాల్చిచంపి, అనేకమందిని బందీలుగా పట్టుకున్న హమాస్‌కు సైతం ఖతార్‌లో కార్యాలయం వుంది. ఖతార్ మధ్యవర్తిత్వంతోనే హమాస్ తీవ్రవాదులు బందీల్లో ఇద్దరు అమెరికన్ పౌరులను విడుదల చేశారు కూడా. వీటన్నిటినీ చూపి ఖతార్‌ను ఉగ్రవాద దేశంగా పరిగణించాల్సిన అవసరం లేదు. గల్ఫ్ దేశాల్లో ఖతార్ చూడటానికి చిన్న దేశమే కావొచ్చుగానీ, దానికుండే సహజ వనరులు అపారమైనవి. దాని తలసరి ఆదాయం చాలా ఎక్కువ. ఖతర్‌కూ, ఇరాన్‌కూ మధ్య సముద్ర జలాల్లో అపారమైన సహజవాయు నిక్షేపాలున్నాయి. అందుకే ఆ దేశంతో ఖతార్‌కు స్నేహ సంబంధాలున్నాయి. ఇతర గల్ఫ్ దేశాల తీరు ఇందుకు భిన్నం.

ఇప్పుడున్న పరిస్థితుల్లో మరణశిక్ష పడినవారికి 2015లో భారత్–ఖతార్‌ల మధ్య కుదిరిన ఒప్పందం ఒక ఆశాకిరణం. దాని ప్రకారం యావజ్జీవ శిక్ష పడినవారిని స్వదేశంలో శిక్ష అనుభవించటానికి వీలుగా వెనక్కిపంపే వీలుంటుంది. ప్రస్తుతం మరణశిక్ష పడిన ఎనిమిదిమందీ ఉన్నత న్యాయస్థానానికి అప్పీల్ చేసుకుంటే వారిని నిర్దోషులుగా విడుదల చేయొచ్చు. కనీసం దాన్ని యావజ్జీవ శిక్షగా మార్చే అవకాశం వుంటుంది. అదే గనుక జరిగితే 2015 ఒప్పందం కింద వీరిని భారత్ పంపే వీలుంటుంది. ఏదేమైనా ఈ వ్యవహారం మన దౌత్య నైపుణ్యానికి పెద్ద పరీక్ష. గత తొమ్మిది నెలలుగా తెరవెనక సాగించిన యత్నాలు పెద్దగా ఫలించలేదు. కనీసం ఇకముందైనా ఖతార్‌ను ఒప్పించటంలో, అది సహేతుకంగా వ్యవహరించేలా చేయటంలో మన ప్రభుత్వం విజయం సాధించాలని ఆశించాలి.

మద్దతు పెరగాల్సిన రంగం

విశ్లేషణ



దేవీందర్ శర్మ

రబీ పంటల పెంపు ధరలు 2 నుంచి 7 శాతం పరిధిలో ఉన్నాయి. 2022–23 సంవత్సరంలో సగటు ద్రవ్యోల్బణం పెరుగుదల దాదాపు 7.6 శాతం. అంటే కనీస మద్దతు ధరలో పెంపుదల, ద్రవ్యోల్బణం రేటును కూడా సమీపించడం లేదు. పైగా ధాన్య సేకరణ ఎక్కువగా గోధుమలు, వరికే పరిమితం అయినందున, కనీస మద్దతు ధర ప్రయోజనాన్ని పొందే రైతుల శాతం సంవత్సరాలుగా 6 శాతం నుండి 14 శాతానికి మాత్రమే పెరిగింది. 86 శాతం మంది రైతులు ఇప్పటికీ తక్కువ ధరలకే తమ ఉత్పత్తులను అమ్ముకోవలసి వస్తోంది. పైగా, కనీస మద్దతు ధరలో పెంపుదల ఇంకా ఉత్పత్తి వ్యయం కంటే తక్కువగానే ఉంటోంది. అందుకే ధరలకు సంబంధించి వ్యవసాయ రంగంలో నిర్మాణాత్మక సంస్కరణలు అవసరం.

2018లో 'కౌన్ బనేగా కరోడ్‌పతి' ఒక ఎపిసోడ్‌లో, నాలుగు ఎకరాల్లో సాగు చేస్తున్న మహారాష్ట్రకు చెందిన ఒక చిన్న రైతు తన దుఃస్థితి గురించి చెప్పినప్పుడు మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ తన చెవులను తానే నమ్మలేకపోయారు. వ్యవసాయం ద్వారా ఎంత సంపాదిస్తున్నారని అమితాబ్ అడిగిన ప్రశ్నకు ఆ రైతు, ''సంవత్సరానికి రూ. 60,000 కంటే ఎక్కువ సంపాదించడం లేదు. దానిలో సగం డబ్బు విత్తనాలు కొనడానికే పోతోంది. నేను నా కుటుంబానికి రాత్రి భోజనం మాత్రమే అందించగలుగుతున్నాను'' అని బదులిచ్చారు. ఆ రైతు సమాధానం విని అమితాబ్ నివ్వెరపోయారు. దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, దేశ రైతులను ఆదుకోవాలని ఆయన ప్రజలను కోరారు.

అప్పటి నుండి గ్రామీణ మహారాష్ట్రలో నిరాశ మరింతగా పెరిగిందే తప్ప తగ్గలేదు. ఈ ఏడాది జనవరి, ఆగస్టు మధ్య కాలంలో 1,809 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని వార్తా కథనాలు చెబుతున్నాయి. గత సంవత్సరం గణాంకాలతో పోలిస్తే ఇది కాస్త తక్కువే అయినప్పటికీ సగటున రోజుకు ఏడుగురు రైతులు తమ జీవితాలను ముగించుకుంటున్నారు. ఈ ఆత్మహత్యల్లో యాభై శాతం పత్తి పండించే ప్రాంతంలోనే నమోదయ్యాయి.

రైతులకు జాక్‌పాటేనా?

శీతాకాలపు పంటల కనీస మద్దతు ధర (ఎమ్ఎస్‌పీ)ల్లో ఇటీవలి పెంపుపై మీడియాలో వస్తున్న వార్తల్లోని ఉత్సాహం నన్ను ఆ దిశగా ఆలోచించేలా చేసింది. ఇది రైతులకు 'జాక్‌పాట్' లేదా 'అదనపు వరం' అని ప్రశంసిస్తున్నారు. కానీ ఇది కష్టాల్లో ఉన్న రైతులకు ఏదైనా సహాయం అందజేస్తుందా అనేది ప్రశ్న. ధరల పెంపుదల పెరుగుతున్న నిరాశను ఆశాజనకంగా మార్చే అవకాశమైతే కనిపించడం లేదు.

ముందుగా, ప్రకటించిన కనీస మద్దతు ధర పెరుగుదల పరిమాణాన్ని చూద్దాం. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఇతర రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నాయి. పైగా 2024 లోక్‌సభ ఎన్నికల సమయానికి రబీ పంటల కోతలు జరగనున్నాయి. రబీ పంటల ధరల పెంపు 2 నుంచి 7 శాతం పరిధిలో ఉన్నాయి. 2022–23 సంవత్సరంలో సగటు ద్రవ్యోల్బణం పెరుగుదల దాదాపు 7.6 శాతం. అంటే, కనీస మద్దతు ధరలో పెంపుదల అనేది, ద్రవ్యోల్బణం రేటును కూడా సమీపించడం లేదు.

పైగా, రైతులకు 'జాక్‌పాట్' లేదా 'అదనపు వరం' అంటూ చేస్తున్న వర్ణన వాస్తవానికి క్షేత్ర వాస్తవాన్ని నిర్లక్ష్యం చేయడం పైనే ఆధారపడి ఉంది. ప్రతి పంట సీజన్‌లోనూ, ప్రభుత్వానికి ధరలను సిఫార్సు చేసే 'కమిషన్ ఫర్ అగ్రికల్చరల్ కాస్ట్స్ అండ్ ప్రైసెస్' (సీఏసీపీ– వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్)... ఉత్పత్తి ధరల సూచిలో వచ్చే మార్పుల శాతాన్ని, గణనలను కూడా అందజేస్తుంది.



2022–23తో పోలిస్తే, ఈ ఏడాది మిశ్రమ ఉత్పత్తి ధరల సూచీ 8.9 శాతం పెరిగింది. అంటే ఉత్పత్తి వ్యయం ఎక్కువగా ఉండగా, కనీస మద్దతు ధరల పెరుగుదల దానికి అనుగుణంగా లేదు. ఇది రైతులు హర్షించడానికి కారణం కాదు.

ఒక సంవత్సరం క్రితం, ఇది మరింత దారుణంగా ఉండేది. మిశ్రమ ఉత్పత్తి ధరల సూచీ 8.5 శాతం పెరుగుదలకు ప్రతిగా, గోధుమ కనీస మద్దతు ధర కేవలం 2 శాతం మాత్రమే పెరిగింది.

యాదృచ్ఛికంగా, ఈ ఏడాది క్వింటాల్‌కు రూ. 150 పెరగడంతో గోధుమల కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 2,275కి చేరుకుంది. 2006–07, 2007–08 తర్వాత, దేశీయ ఉత్పత్తిదారులకు ధరలను పెంచడం మినహా యూపీఏ ప్రభుత్వానికి పెద్దగా అవకాశం లేకుండా పోయిన తర్వాత, ఇది గోధుమ ధరలో అత్యధిక పెరుగుదలగానే చెప్పాలి.

ఎన్నికల సంవత్సరాల్లోనే!

రైతుల నుండి నేరుగా గోధుమలను కొనుగోలు చేయడానికి ప్రైవేట్ కంపెనీలను అనుమతించాలనే లోపభూయిష్ట నిర్ణయం జరిగిన తర్వాత, ఇది ప్రభుత్వ నిల్వల్లో భారీ అంతరానికి కారణమైంది. ఆ కొరతను తీర్చడానికి ప్రభుత్వం దాదాపు రెట్టింపు ధరలకు (స్వదేశీ రైతులకు ఇచ్చే) గోధుమలను దిగుమతి చేసుకోవలసి వచ్చింది. ప్రతిపక్ష పార్టీలు, రైతు సంఘాల నుండి వచ్చిన విమర్శల తరువాత, ముఖ్యంగా ధర సమానత్వం తీసుకురావడానికి, గోధుమలకు కనీస మద్దతు ధరను పెంచారు.

ఈ ఏడాది ధరలు మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణల్లోని ప్రధాన రబీ పంటలపై ప్రభావం చూపుతాయని పరిగణనలోకి తీసుకుంటే, ధరల పెరుగుదల ఎన్నికల ఫలితాలను ఎలా ప్రభావితం చేస్తుందనే దానిపై ఊహాగానాలు ఉన్నాయి. గోధుమలు అత్యంత ముఖ్యమైన రబీ పంట. బార్లీ(యవలు), పెసర, రేప్‌సీడ్–ఆవాలు, పప్పు (మసూర్)... ఇతర శీతాకాలపు పంటలు కావడంతో, ధరల పెరుగుదల కచ్చితంగా రాజకీయ కోణాన్ని కలిగి ఉంది.

ఆర్థికవేత్తలు సుఖ్‌పాల్ సింగ్, శ్రుతి భోగల్ 2004, 2009, 2014, 2019కి ముందు సంవత్సరాల్లో గోధుమలు, వరి కనీస మద్దతు ధర ఎంత ఎక్కువగా ఉందనే అంశాన్ని 2021 జనవరిలో స్పష్టంగా చూపించారు. ఇవన్నీ ఎన్నికలు జరిగిన సంవత్సరాలు. 2023–24 రబీ ధరల పెంపు కూడా ఇదే తరహాలో ఉంది. ఎన్నికలకు ముందు మాత్రమే రైతులకు సాపేక్షంగా అధిక కనీస మద్దతు ధరలను ప్రకటించాల్సిన అవసరాన్ని పాలకులు గుర్తించారు. దీనివల్ల కొన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రయోజనాలను పొందివుండొచ్చు. కానీ భవిష్యత్తులో పంటల ధరలను రాజకీయాలు నిర్ణయించకుండా దూరంగా ఉండేలా చూసుకోవాల్సిన సమయం ఇది.

స్వామినాథన్ ఫార్ములా అమలు కావాలి

వ్యవసాయం దానధర్మం కాదు. పంటల ధరలను రాజకీయ నాయకత్వం ఇష్టారాజ్యానికి వదిలేయలేం. వ్యవసాయానికి నిర్మాణాత్మక సంస్కరణలు అవసరం. ఎన్నికలు జరిగిన సంవత్సరంతో నిమిత్తం లేకుండా, స్వామినాథన్ ఫార్ములా ప్రకారం, 'వెయిటెడ్ యావరేజ్'కు 50 శాతం లాభం కలిపి రూపొందించిన కనీస మద్దతు ధరలు రైతులకు అందేలా ఈ సంస్కరణలు ఉండాలి.

ఏది ఏమైనప్పటికీ, ధాన్య సేకరణ ఎక్కువగా గోధుమలు, వరికే పరిమితం అయినందున, కనీస మద్దతు ధర ప్రయోజనాన్ని పొందే రైతుల శాతం సంవత్సరాలుగా 6 శాతం నుండి దాదాపు 14 శాతానికి మాత్రమే పెరిగింది. దీనివల్ల అర్థం చేసుకోవలసిన విషయమేమిటంటే, కనీస మద్దతు ధర పెంపు ఇంకా చాలావరకూ ఉత్పత్తి వ్యయం కంటే తక్కువగా ఉంది. మార్కెట్‌లు మిగిలిన 86 శాతం మంది రైతులకు నష్టాలతో కూడిన ధరలు చెల్లించడం వల్ల వ్యవసాయ కష్టాలు తీవ్ర మవుతున్నాయి. రుణభారం, ఆత్మహత్యలు పెరుగుతున్నాయి.

అంతేకాకుండా, రైతులకు సరైన ఆదాయాన్ని శాశ్వతంగా నిరాకరించిన స్థూల ఆర్థిక విధానాలపై పునరాలోచన చేయాల్సిన సమయం ఇది. ద్రవ్యోల్బణాన్ని 4 శాతం (ప్లస్ లేదా మైనస్ 2 శాతం) బ్రాకెట్‌లో ఉంచడం వ్యవసాయాన్ని దెబ్బతీసింది. వినియోగదారుల ధరల సూచిక బుట్టలో ఆహారం, పానీయాల వాటా 45.9 శాతం ఉన్నప్పటికీ, విధాన రూపకర్తలు అతిపెద్ద ద్రవ్యోల్బణ చోదకశక్తిగా ఉన్న గృహనిర్మాణంపై మాత్రం కళ్లు మూసుకున్నారు. గృహనిర్మాణాన్ని పెట్టుబడిగా పరిగణిస్తుండగా, కనీస మద్దతు ధరలో ఏదైనా పెంపుదలను మాత్రం ఆహార ద్రవ్యోల్బణం పెరుగుదలకు కారణమని నిందిస్తుంటారు. ఇది మారాల్సి ఉంది.

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ నిపుణులు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మనవాళ్ల కోసం...



తన పౌరులను వెనక్కి తెచ్చుకునే మార్గం గురించి ఇండియా ఆలోచించాలి. అది పెద్ద దౌత్యపరమైన నిర్ణయం అయినప్పటికీ ప్రతి ఉన్నత కార్యాలయాల్లోనూ ఇది ఒక అజెండాగా ఉండాలి. (గూఢచర్య ఆరోపణల మీద ఎనమండుగురు మాజీ నేవీ అధికారులకు ఖతార్ మరణశిక్ష విధించింది.)

– అజిత్ సింగ్, ప్రొడక్ట్ మేనేజర్

ఎలాంటి పని?



నీ కోసమే అయితే వారానికి 70 గంటలు పనిచేసుకోవచ్చు. అది క్రమంగా ఫలితమిస్తుంది. నీ శ్రమ ఫలాలు నీకే ఉంటాయి. నువ్వు ధనవంతుడివి అవుతావు. కానీ ఇంకెవరి మరో బిలియన్ కోసమో మనం 70 గంటలు పనిచేయడం మూర్ఖత్వం; ముఖ్యంగా జీతం చిల్లర పెంకులు అయినప్పుడు.(వారానికి 70 గంటలు పని చేయాలన్న 'ఇన్ఫోసిస్' నారాయణమూర్తి వ్యాఖ్య నేపథ్యంలో.)

– కార్తీక్ బాలచంద్రన్, వైద్యుడు

ఏనుగుల కోసం...



డా॥ వి. కృష్ణమూర్తి తన యావజ్జీవితాన్ని ఏనుగుల సంరక్షణ కోసం కేటాయించారు. జనాలు నిర్లక్ష్యంగా విసిరేసే గాజు సీసాలు వన్యప్రాణులకు ఎంత ప్రమాదకరం కాగలవో ఎప్పుడూ హెచ్చరిస్తుండేవారు. క్లిష్ట ప్రాంతాల్లో పగిలిన గ్లాసు ముక్కలను ఏరడానికి పూనుకున్న కన్యాకుమారి వైల్డ్‌లైఫ్ సాంక్చువరీ, కన్యాకుమారి నేచర్ ఫౌండేషన్, ఇంకా కళాశాల విద్యార్థులకు అభినందనలు.

– సుప్రియా సాహు, తమిళనాడు ఉన్నతాధికారి

దీర్ఘం – శీఘ్రం



పథకాలకు దశాబ్దాలు ప్రమాణం, ఆచరణకు వారాలు ప్రమాణం. మనకు రెండూ కావాలి.

– సామ్ ఆల్ట్‌మన్, ప్రోగ్రామర్

నా విన్నపం...



హింసను ఆపి వాళ్లను వదిలెయ్యమని హమాస్‌కు చెబుతున్నాను. ఆక్రమణను ఆపి వాళ్లను బతకనియ్యమని ఇజ్రాయిల్‌కు చెబుతున్నాను.

– సయీదా వార్సీ, యూకే ఎగువ సభ సభ్యురాలు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఎలక్ట్రానిక్స్‌లో దూసుకెళ్తున్న భారత్

ఒకప్పుడు మొబైల్ ఫోన్ అనగానే చైనాయే గుర్తొచ్చేది. డ్రాగన్ దేశం నుంచే వివిధ దేశాలకు లక్షలాదిగా మొబైళ్లు ఎగుమతి అయ్యేవి. పైగా స్మార్ట్ ఫోన్ కంపెనీలన్నీ దాదాపు చైనాలోనే ఉన్నాయి. అయితే ప్రస్తుతం భారత్ ఫోన్ల తయారీలో సరికొత్త రికార్డు సృష్టించింది. 2014–2023 మధ్య కాలంలో మొబైల్ ఫోన్‌ల ఉత్పత్తిలో 23 శాతం వార్షిక వృద్ధిరేటు సాధించుకుంటూ ప్రపంచంలో రెండవ అతి పెద్ద మొబైల్ ఉత్పత్తి దేశంగా అవతరించింది. ఈ మేరకు గ్లోబల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ 'కౌంటర్ పాయింట్' నివేదించింది. భారత్ దిగుమతి చేసుకొనే స్థాయి నుంచి ఎగుమతి చేసే స్థాయికి ఎదిగింది. కేంద్రం ఇటీవల తీసుకొచ్చిన ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ (పీఎల్ఐ) పథకం విజయవంతం కావడంతో దేశంలో ఫోన్ల ఉత్పత్తి భారీగా పెరిగింది.

ఇండియాలో ఎలక్ట్రానిక్ రంగాన్ని బలోపేతం చేసేందుకు, ఫోన్ల ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు కేంద్రం 2021 ఏప్రిల్లో పీఎల్ఐ పథకాన్ని ప్రవేశపెట్టింది. స్థానికంగా ఎలక్ట్రానిక్ వస్తువులను ఉత్పత్తి చేయడంలో ఆయా సంస్థలకు రూ. 40,995 కోట్ల రాయితీలు ఈ పథకం కింద ఇచ్చింది. దీంతో స్మార్ట్ ఫోన్ తయారీ దిగ్గజాలైన యాపిల్, శాంసంగ్‌లతో పాటు పలు కంపెనీలు ఫోన్‌ల ఉత్పత్తిని విపరీతంగా పెంచాయి. దేశీయ మార్కెట్‌లో విక్రయించడంతో పాటు పలు దేశాలకు ఎగుమతులు పెరిగాయి. ఈ అనూహ్య పెరుగుదలకు యాపిల్ ఐఫోన్ల ఒప్పంద తయారీ కంపెనీలైన ఫాక్స్‌కాన్, పెగట్రాన్, విస్ట్రన్‌లతో పాటు శాంసంగ్ ప్రధాన కారణం. భవిష్యత్‌లో మరింత అభివృద్ధి సాధించేందుకు 'ఇండియా సెల్యులర్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్' (ఐసీఈఏ) సుంకాలు తగ్గించి, మార్కెట్‌లో పోటీతత్వాన్ని పెంచాలని చూస్తోంది. ఉత్పత్తులను మెరుగుపరచడం, కార్మిక సంస్కరణలు చేయడం, ఎలక్ట్రానిక్స్ రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడం వంటి అంశాలపై దృష్టి సారించింది. 2025–26 నాటికి 600 బిలియన్ డాలర్ల విలువైన ఫోన్లు ఎగుమతి అవుతాయని భారత్ అంచనా వేస్తోంది. ఒకప్పుడు మన దేశం నుంచి మధ్యప్రాచ్య, ఆఫ్రికా దేశాలకు ఫోన్లు ఎగుమతి అవ్వగా... ప్రస్తుతం అమెరికా, నెదర్లాండ్, ఆస్ట్రియా, ఇటలీ వంటి యూరప్ దేశాలకు సైతం ఎగుమతి అవుతున్నాయి.




'మేక్ ఇన్ ఇండియా', 'ఫేస్డ్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రోగ్రామ్' (పీఎంపీ), 'ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్' (పీఎల్ఐ), 'ఆత్మనిర్భర్ భారత్' వంటి కార్యక్రమాలను కేంద్రం ప్రారంభించి స్థానిక తయారీ సంస్థలను ప్రోత్సహించింది. 2014లో దేశీయంగా మొబైల్ ఫోన్ల ఉత్పత్తి 19 శాతం మాత్రమే ఉండేది. 2022 నాటికి 98 శాతం స్థానికంగా తయారు చేసిన ఫోన్‌లను భారత్ ఎగుమతి చేసింది. ఇప్పటికే ఇండియాలో 5జీ సేవలు అందుబాటులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సెల్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు, కంప్యూటర్ మదర్ బోర్డులతో పాటు ఇతర ఎలక్ట్రానిక్స్ పరికరాల్లో వినియోగించే మైక్రో ప్రాసెసర్లు, చిప్‌సెట్స్ కూడా మన దేశంలోనే తయారు చేసే దిశగా భారత్ అడుగులు వేస్తోంది. ఇదే తరహాలో భారత్ ముందుకెళ్తే ఎలక్ట్రానిక్స్ రంగంలో మరింత వృద్ధి సాధించేందుకు అవకాశం ఉంది.

– తాడేపల్లి విజయ్ । 78424 85865

మనవాళ్ళకి ఎందుకంత ఆందోళన?

అభిప్రాయం



ఉల్లి బాల రంగయ్య

ప్రస్తుతం ఇజ్రాయెల్– పాలస్తీనియన్ల మధ్య నెలకొన్న ఘర్షణాత్మక వాతావరణం స్వయం ప్రకటిత మేధావులమని చెప్పుకునే మనదేశంలోని కొందరికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ప్రింట్ మీడియాలో, ఎలక్ట్రానిక్ మీడియాలో, సోషల్ మీడియాలో ఒకటే గోల! హమాస్ చర్యలను ప్రామాణీకరిస్తూ సంఘీభావ ర్యాలీలు తీయడం, హమాస్ దాడుల తరహాలో భారతదేశంలో కూడా దాడులు చేయాలంటూ దేశ సమగ్రతకు సవాలు విసిరే విధంగా వీడియోల పోస్టింగులు!!

భారతదేశం భద్రతను దృష్టిలో ఉంచుకున్న భారత ప్రభుత్వం హమాస్ తీవ్రవాద చర్యలను నిర్ద్వంద్వంగా ఖండించింది. అదే సమయంలో ఇజ్రాయెల్‌కు తన సంఘీభావాన్ని కూడా ప్రకటించింది. ఈ ఘర్షణల్లో ఇరువైపులా బలి అవుతున్న సామాన్య ప్రజల మృత్యుఘోషకు తీవ్ర సంతాపం కూడా తెలియజేసింది. శరణార్థి శిబిరాల్లో తలదాచుకుంటున్న పాలస్తీనా ప్రజలకు మానవతా సహాయాన్ని కూడా అందిస్తోంది. మన దేశాన్ని పట్టి పీడిస్తున్న జిహాదీ ఉగ్రవాదాన్నీ, రక్షణ పరంగా ఇజ్రాయెల్‌కు మనకు ఉండే ఒప్పందాలను దృష్టిలో ఉంచుకొని, మన ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దేశ హితాన్ని కోరే వాళ్ళందరూ స్వాగతించారు. కానీ కొందరు వ్యతిరేకిస్తున్నారు. కాగా కాంగ్రెస్ పార్టీ హమాస్ చర్యలను సమర్థిస్తోంది. దీని వెనుక ఈ దేశంలోని ముస్లింలను సంతుష్టీకరించే ప్రయోజనం ఉంది.

ఇక అసలు విషయానికి వస్తే 1948కు ముందు ఇజ్రాయెల్ అనే పేరుతో ఒక భూభాగమే లేదనేది అక్షర సత్యం. 1947 ముందు పాకిస్తాన్, బంగ్లాదేశ్ లు ప్రపంచ పటంలో లేవు అనేది కూడా సత్యమే కదా? వాటి మనుగడను భారతదేశం కాదంటుందా? ఇజ్రాయెల్ మనుగడను ప్రశ్నించే వారికి ఈ సమాధానం సరిపోదా? పెట్టుబడిదారీ పశ్చిమ దేశాలు మధ్య ఆసియాలో తమ రాజకీయ అవసరాల కోసమే ఈజిప్ట్, జోర్డాన్, సిరియా, లెబనాన్ దేశాల మధ్యలో ఇజ్రాయెల్‌ను సృష్టించాయి.



'జెరూసలేం' ప్రాంతం తమ ఆధ్యాత్మిక, మత, సాంస్కృతిక భావాలకు కేంద్రం అని రెండువేల ఏళ్లుగా యూదు జాతీయులు చెప్పుకొంటున్నారు. యూదులపై దయతో పశ్చిమ దేశాలు వారికి ఒక భూభాగాన్ని కేటాయించాయని చెప్పే సత్య దూరమవుతుంది. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో పశ్చిమ దేశాలు 60 లక్షల మంది యూదులను నిర్దాక్షిణ్యంగా, అమానుషంగా మట్టుబెట్టాయనేది చరిత్ర చెప్పే చెరప లేని సాక్ష్యం.

ఇక పాలస్తీనా ఒక స్వతంత్ర భూభాగమనీ, దానిని దురహంకార పూరితమైన ఇజ్రాయెల్ దేశం ఆక్రమించిందనీ మన దేశంలోని చారిత్రిక పరిజ్ఞానం లేని కొంతమంది మూర్ఖపు వాదనలు చేస్తూ, దేశ ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారు. ప్రస్తుతం పాలస్తీనా భూభాగాలుగా చెప్పుకొనే గాజా స్ట్రిప్, వెస్ట్ బ్యాంక్ ప్రాంతాలు 1967 వరకు వరుసగా ఈజిప్టు, జోర్డాన్ దేశాలలో భాగాలు. జోర్డాన్ నదికి పడమర వైపున ఉండే ప్రాంతాన్ని వెస్ట్ బ్యాంక్ అని పిలుస్తున్నారనేది గమనార్హం. ఇస్లాం మతస్థులకు 'జెరూసలేం' పవిత్ర స్థలం కూడా. అందుకే ఇజ్రాయెల్ ఏర్పాటును ముస్లిం దేశాలన్నీ వ్యతిరేకించాయి.

ఇక క్రైస్తవులకు 'జెరూసలేం', 'బెత్లెహేము' పవిత్ర స్థలాలు. క్రైస్తవుల ప్రాబల్యం నిలుపుకోవాలంటే అక్కడ పశ్చిమ దేశాలకు తమకు అనుకూలమైన దేశం ఒకటి ఉండాలి. ఇజ్రాయెల్ ఏర్పాటు వెనుక ఉన్న సూత్రం ఇదే! అరబ్ – ఇజ్రాయెల్ ఐదు యుద్ధాల్లో ముస్లిం దేశాలను ఇజ్రాయెల్ మట్టి కరిపించడం వెనక దాగి ఉన్న రహస్యం కూడా ఇదే! పశ్చిమ దేశాలన్నీ కూడా ఇజ్రాయెలీలకు ఇతోధిక సహాయ సహకారాలు అందిస్తున్నాయనేది వాస్తవం.

ఇక హమాస్ చర్యలు పాలస్తీనియన్ల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను హరించి వేస్తాయనేది కాదనలేని సత్యం. గాజా స్ట్రిప్‌లోని ఇంటర్నల్ బంకర్లను ధ్వంసం చేసేంతవరకూ ఇజ్రాయెల్ ఆగదు. ఇదే జరిగితే అనేకమంది సామాన్య ప్రజలు బలి అవుతారు. అంతర్జాతీయ సమాజం ఈ విషయంపై దృష్టిని సారించి, హమాస్ తీవ్రవాదుల చెరలో బందీలుగా ఉన్న యూదులను విడిపించే ఏర్పాట్లు చేయాలి. అదే విధంగా ఇజ్రాయెల్ దుందుడుకు చర్యలకు అడ్డుకట్ట కూడా వేయాలి.

వ్యాసకర్త సామాజిక, రాజకీయ విశ్లేషకులు

అర్థంచేసుకొని ఆచరించాలి

టామ్, డొరోతి హాప్కిన్సన్ అనే ఇద్దరు 'మచ్ సైలెన్స్' అనే పేరుతో ఇంగ్లీష్‌లో రచించిన మెహెర్ బాబా జీవిత చరిత్ర గ్రంథం ఆరంభంలో మానవాళి మనుగడకు సంబంధించిన కొన్ని ముఖ్యమైన ప్రశ్నలు లేవనెత్తారు.

భూమ్మీద మనిషి ఆవిర్భావం ఎలా జరిగింది? ఏ పరమార్థం ఆశించి మనిషి జీవిస్తున్నాడు? చనిపోయాక అతడు ఏమవుతాడు? ఇది మంచి, ఇది చెడు అని నిర్ణయించేది ఎవరు? నీతి నియమాలు అన్నీ దేశ కాలాలకు లోబడి, వాటికి తగ్గట్టుగా మార్పు చెందే సాంఘిక కట్టుబాట్లేనా? వెయ్యి లేక పదివేల ఏండ్ల కిందటి మానవుడి కన్నా నేటి మానవుడు ఎక్కువ ప్రశాంతంగా, ఆనందంగా జీవించ గలుగుతున్నాడా? జ్ఞానవంతంగా, అర్థవంతంగా జీవించే బదులు, కేవలం మేధావిగా, సంక్లిష్టంగా తయారైనాడా? అతడి జీవిత లక్ష్యం, సంతోషమే అయినప్పుడు, దాన్ని అతడు ఎందుకు అందుకోలేకపోతున్నాడు? ప్రతి తరంలోనూ ఆలోచించగల ప్రతి మనిషినీ వేధిస్తున్న ప్రశ్నలే ఇవి.



వీటికి సమాధానాల కొరకు ముందుగా మనం రాజకీయాల వైపు, సైన్సు వైపు చూస్తాము. రాజకీయ వ్యవస్థలు కొంత వరకు బాహ్య పరిస్థితుల్లో మార్పు తీసుకు రాగలవేమోగానీ, మనిషి ఆంతరంగిక స్థితిని సరిదిద్దలేవు. ఆ విషయంలో సైన్సు ఏమైనా పరిష్కారం చూపగలదా అంటే, సైన్సు మానవాళికి ఎంత మేలు చేయగలదో అంతకు అంత కీడు చేయగలదనే సంగతి అణు బాంబుల వంటి వాటి ద్వారా నిరూపితమైంది.

ఇక మిగిలింది మతం. ఏ ప్రశ్నకైనా సమాధానం చెబుతాను, ఏ సమస్యకైనా పరిష్కారం చూపుతాను అంటుంది మతం. వేరు వేరు మతాలు వేరు వేరు సమాధానాలు, పరిష్కారాలు ఇస్తాయని జనం సాధారణంగా అనుకొంటారు గానీ అది నిజం కాదు. అన్ని మతాల ముఖ్య సందేశం, మౌలిక సూత్రం ఒక్కటే. జీవిత ధ్యేయం భగవంతుణ్ణి ప్రేమించు, తోటి మానవుణ్ణి ప్రేమించు, సహాయపడు అనే.

బోధించటం వేరు, ఆచరించటం వేరు. బీదరికాన్ని ప్రబోధించే మత సంస్థలు అంతులేని సంపదను పోగేసుకోవటం, సాధుత్వాన్ని ప్రబోధించే మత సంస్థలు ఆధిపత్యానికి అర్రులు జాచటం చూస్తున్నాము. ఏ మతం వాడైనా, అతడు తన మతం చెప్పే మౌలిక సిద్ధాంతాల్ని సరిగా అర్థం చేసుకొని, వాటిని నిజాయితీగా ఆచరణలో పెట్టి నట్లయితే, అతడు తన తోటి మానవుణ్ణి చంపటానికి సిద్ధపడుతూ వాడి అజ్ఞానాన్ని తన స్వార్థానికి వాడుకొని లాభపడాలని కోరుకోడు.


– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** పౌర్ణమి రా.1.57 వరకు, తదుపరి బహుళ పాడ్యమి, **నక్షత్రం:** రేవతి ఉ.7.56 వరకు, తదుపరి అశ్విని, **వర్జ్యం:** రా.3.04 నుండి 4.36 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.01 నుండి 7.32 వరకు, **అమృతఘడియలు:** రా.12.01 నుండి 1.34 వరకు, పాక్షిక చంద్ర గ్రహణం. ; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 6.00, **సూర్యాస్తమయం:** 5.28.

బెయిల్ కోసం బాబు అడ్డదారులు.. ‘నెవర్ బిఫోర్’

- హైకోర్టులో తన ట్రేడ్‌మార్క్ అస్త్రం ‘నాట్ బిఫోర్’ ప్రయోగం
- తన బెయిల్ పిటిషన్‌పై జస్టిస్ జ్యోతిర్మయి విచారణ చేయకుండా అడ్డుకునే ఎత్తుగడ
- ఆమె నైతిక విలువలే అవకాశంగా మలుచుకున్న చంద్రబాబు
- ఆమె తప్పుకుంటే ఆయన వ్యాజ్యాలు జస్టిస్ నిమ్మగడ్డ, జస్టిస్ అడుసుమిల్లి ముందుకు..
- అయితే ఊహించని విధంగా ఉత్తర్వులు జారీ చేసిన జస్టిస్ జ్యోతిర్మయి



సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచేసి జైలుపాలైన చంద్రబాబు ఇప్పుడు దాని నుంచి ఎలాగైనా బయటపడాలని బెయిల్ కోసం అన్ని అడ్డదారులు తొక్కుతున్నారు. ఇందుకోసం గతం నుంచి తాను అనుసరిస్తున్న తన ట్రేడ్‌మార్క్ అస్త్రం ‘నాట్ బిఫోర్’ను ఆయన మరోసారి బయటకు తీశారు. తమ పార్టీకి, తమ లీగల్ సెల్‌కు ఏ సంబంధం లేని జీవీఎల్ మూర్తి అనే న్యాయవాదిని తెరపైకి తెచ్చారు. ఆయనతో తన తరఫున చంద్రబాబు కన్సెంట్ వకాలత్ (అప్పటికే దాఖలు చేసిన కేసులో వకాలత్ వేసిన న్యాయవాది అనుమతితో మరో న్యాయవాది కూడా వకాలత్ దాఖలు చేయడం) దాఖలు చేయించారు. చంద్రబాబు తరఫు న్యాయవాది జి.బసవేశ్వరరావు వకాలత్ వేసి ఉండగానే.. మూర్తితో వకాలత్ దాఖలు చేయించడం గమనార్హం. సాధారణం ఇలా వకాలత్ దాఖలు చేసిన కేసులో ఏ మాత్రం సంబంధం లేని మరో న్యాయవాది వకాలత్ దాఖలు చేసేందుకు ఏ న్యాయవాది ఒప్పుకోడు. కాగా చంద్రబాబు తరఫున వకాలత్‌లు దాఖలు చేసిన బసవేశ్వరరావు గానీ, మూర్తి గానీ వాదనలు వినిపించకపోవడం ఇందులో అసలు ట్విస్టు. శుక్రవారం జరిగిన విచారణకు మూర్తి రాలేదు కూడా. దీన్ని బట్టి చంద్రబాబు ఇక్కడ మూర్తిని ఓ నిర్దిష్ట ప్రయోజనం నిమిత్తం వాడుకోవాలని నిర్ణయించి, ఆయనతో వకాలత్ దాఖలు చేయించారనే ఇట్టే అర్థమైపోతోంది.

మూర్తి వెనుక ఉంది వారే..

జీవీఎల్ మూర్తితో వకాలత్ దాఖలు చేయించడం ద్వారా నిబంధనలకు అనుగుణంగా, ముక్కుసూటిగా నడుచుకుంటారనే పేరున్న న్యాయమూర్తి జస్టిస్ ప్రతాప వెంకట జ్యోతిర్మయి ముందు తన బెయిల్ పిటిషన్‌ను రాకుండా చేసేందుకు చంద్రబాబు కుట్ర పన్నారు. జస్టిస్ జ్యోతిర్మయి ముందు ఎవరు ‘నాట్ బిఫోర్’న్యాయవాదులు ఉన్నారో ముందుగానే తెలుసుకుని, అందుకనుగుణంగా మూర్తితో వకాలత్ దాఖలు చేయించారు. వాస్తవానికి ఈ మూర్తిది కూడా చంద్రబాబు సామాజికవర్గమే. పెద్దగా ప్రాక్టీస్ ఉన్న న్యాయవాది కాదు. చిన్న చిన్న కేసులు, ఉద్యోగ వివాదాలకు సంబంధించిన కేసులను వాదిస్తుంటారు. ఎప్పుడూ టీడీపీ కేసులను కూడా వాదించింది లేదు. కాగా ఎల్లో మీడియాకు చెందిన ఓ న్యూస్ చానెల్ యజమానికి మూర్తి అత్యంత సన్నిహితుడు. జస్టిస్ జ్యోతిర్మయి ముందు మొత్తం నలుగురు న్యాయవాదులు ‘నాట్ బిఫోర్’గా ఉన్నారు. ఈ నలుగురిలో ముగ్గురు న్యాయవాదులు తమ ఉచ్చులోకి వచ్చే పరిస్థితి లేకపోవడంతో తమవాడే అయిన మూర్తిని చంద్రబాబు అండ్ కో విజయవంతంగా తమవైపు తిప్పుకుంది. ఎల్లో మీడియా న్యూస్ చానెల్ యజమాని, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి.. ఈ విషయంలో మూర్తిని ఒప్పించారు. అంతేకాకుండా చంద్రబాబు అండ్ కో ఆయనకు భారీ మొత్తంలో ఫీజును ఆశగా చూపింది.

నైతిక విలువలకు కట్టుబడ్డ జస్టిస్ జ్యోతిర్మయి

కాగా మూర్తి సతీమణి ఇందిరా ప్రియదర్శిని కింది కోర్టులో జడ్జిగా పనిచేస్తున్నారు. న్యాయాధికారి కావడంతో ఎంతో కాలంగా ఆమె జస్టిస్ జ్యోతిర్మయికి తెలుసు. తనకు మూర్తి సతీమణితో పరిచయం ఉన్న నేపథ్యంలో హైకోర్టులో మూర్తి తన ముందు దాఖలు చేసే కేసులను విచారించకూడదని నైతిక విలువలకు కట్టుబడి జస్టిస్ జ్యోతిర్మయి నిర్ణయం తీసుకున్నారు. అందుకనుగుణంగా మూర్తిని తన నాట్ బిఫోర్ జాబితాలో చేర్చారు. అయితే ఆమె నైతిక విలువలనే చంద్రబాబు ఓ అవకాశంగా మలుచుకున్నారు. ఆమె ముందు తన బెయిల్ పిటిషన్ రాకుండా చేసేందుకు మూర్తితో చంద్రబాబు విజయవంతంగా వకాలత్ దాఖలు చేయించారు. నిబంధనల ప్రకారం వెళితే చంద్రబాబుకు బెయిల్ దొరకడం కష్టమని ఆయన తరఫు న్యాయవాదులకు బాగా తెలుసు. అందుకే తమకే సొంతమైన ‘నాట్ బిఫోర్’అస్త్రాన్ని బయటకు తీశారు. మూర్తి దాఖలు చేసిన కేసును విచారించనని జస్టిస్ జ్యోతిర్మయి ఓపెన్ కోర్టులో చెప్పడంతో చంద్రబాబు అండ్ కో తమ పాచిక పారిందని సంతోషించారు. అయితే ఇంతలోనే సీజే అనుమతి తీసుకుని చంద్రబాబు బెయిల్, మధ్యంతర బెయిల్ పిటిషన్లలో విచారణను సోమవారానికి వాయిదా వేయాలని రిజిస్ట్రీని ఆదేశిస్తూ జస్టిస్ జ్యోతిర్మయి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో చంద్రబాబు అండ్ కో బిత్తరపోయింది.

జస్టిస్ నిమ్మగడ్డ లేదా జస్టిస్ అడుసుమిల్లి..

ప్రస్తుతం హైకోర్టుకు దసరా సెలవులు. ఈ నేపథ్యంలో అత్యవసర కేసులను విచారించేందుకు న్యాయమూర్తులు జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జస్టిస్ అడుసుమిల్లి వెంకట రవీంద్రబాబు, జస్టిస్ జ్యోతిర్మయిలు వెకేషన్ జడ్జీలుగా వ్యవహరిస్తున్నారు. జస్టిస్ జ్యోతిర్మయి విచారణ నుంచి తప్పుకుంటే చంద్రబాబు బెయిల్ పిటిషన్, మధ్యంతర బెయిల్ పిటిషన్లు జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు లేదా జస్టిస్ అడుసుమిల్లి రవీంద్ర బాబు ముందుకు వస్తాయి. చంద్రబాబు అండ్ కో కూడా ఇదే ఉద్దేశంతో మూర్తితో వకాలత్ దాఖలు చేయించి తమ ప్లాన్‌ను పక్కాగా అమలు చేసింది. అయితే జస్టిస్ నిమ్మగడ్డ లేదా జస్టిస్ అడుసుమిల్లిల్లో ఎవరికి చంద్రబాబు కేసును అప్పగించాలన్నది పూర్తిగా ప్రధాన న్యాయమూర్తి విచక్షణాధికారంపై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం సెలవులు కావడంతో సీజే అందుబాటులో లేరు. సోమవారం నుంచే హైకోర్టు తిరిగి తన కార్యకలాపాలను ప్రారంభించనుంది. ఎప్పుడైతే జస్టిస్ జ్యోతిర్మయి ఈ వ్యాజ్యాలను సోమవారం నాడు విచారణకు వచ్చేందుకు వీలుగా ప్రధాన న్యాయమూర్తి ముందుంచాలని తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారో అప్పుడే చంద్రబాబు అండ్ కో గతుక్కుమంది. అప్పటికే ఆన్‌లైన్‌లో ఉన్న చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, కోర్టు హాలులో ఉన్న మరో సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్‌లు వెంటనే జోక్యం చేసుకున్నారు. సోమవారం అనే పదాన్ని ఉత్తర్వుల నుంచి తొలగించాలని జస్టిస్ జ్యోతిర్మయిని కోరారు. కేసును తగిన బెంచ్ ముందు ఉంచేందుకు వీలుగా ఫైల్‌ను సీజే ముందు ఉంచాలని మాత్రమే ఉత్తర్వుల్లో పేర్కొనాలన్నారు. లేకపోతే రిజిస్ట్రీ ముందు తాము సీజే అనుమతి కోసం అభ్యర్థించలేమన్నారు. అయితే వారి అభ్యర్థన పట్ల న్యాయమూర్తి జోతిర్మయి సుముఖత వ్యక్తం చేయలేదు. రిజిస్ట్రీ ముందు అత్యవసర విచారణ నిమిత్తం అభ్యర్థించేందుకు ‘సోమవారానికి విచారణ వాయిదా’అనేది ఎంత మాత్రం అడ్డంకి కాదని తేల్చిచెప్పారు. చట్ట ప్రకారం ఉన్న ప్రత్యామ్నాయాలను ఉపయోగించుకోవచ్చునని తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో చంద్రబాబు న్యాయవాదులు రిజిస్ట్రార్ వద్దకు వచ్చారు. చంద్రబాబు బెయిల్‌ను మరో న్యాయమూర్తికి నివేదించేందుకు వీలుగా సీజే అనుమతి తీసుకోవాలని రిజిస్ట్రార్‌పై తీవ్ర ఒత్తిడి తెచ్చినా వారు పప్పులు ఉడకలేదు.

19 నుంచే వ్యూహానికి పదును..

కాగా వాస్తవానికి చంద్రబాబు అండ్ కో ‘నాట్ బిఫోర్’అస్త్రాన్ని తన బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా ప్రయోగించాలని గతంలోనే నిర్ణయించింది. అయితే దానిని ఈ నెల 19న నుంచే అమలు చేయడం ప్రారంభించింది. 19న చంద్రబాబు బెయిల్ పిటిషన్, మధ్యంతర బెయిల్ కోసం వేసిన అనుబంధ పిటిషన్ జస్టిస్ సురేష్‌రెడ్డి ముందుకు వచ్చాయి. చంద్రబాబు అనారోగ్య కారణాలను సాకుగా చూపుతూ ఆయనకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలంటూ ఆయన తరఫు సీనియర్ న్యాయవాదులు లూథ్రా, దమ్మాలపాటి వాదనలు వినిపించారు. ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి జోక్యం చేసుకుని, సుప్రీంకోర్టు చంద్రబాబు చేసిన మధ్యంతర బెయిల్ అభ్యర్థన పట్ల సానుకూలంగా స్పందించలేదని జస్టిస్ సురేష్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో తాను కూడా మధ్యంతర బెయిల్ ఇవ్వలేనని జస్టిస్ సురేష్‌రెడ్డి స్పష్టంగా చెప్పేశారు. దీంతో భోజన విరామం తర్వాత వ్యూహాన్ని మార్చేసిన చంద్రబాబు న్యాయవాదులు బెయిల్ పిటిషన్, మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను వెకేషన్ కోర్టు ముందు పోస్ట్ చేయాలని న్యాయమూర్తిని కోరారు. ఇందుకు జస్టిస్ సురేష్‌రెడ్డి అంగీకరించి ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

పలుకుబడితో ముందే తెలుసుకుని..

చంద్రబాబు న్యాయవాదులు తమ వ్యూహం ఎందుకు మార్చుకున్నారంటే వెకేషన్ కోర్టుల్లో ఎవరెవరు జడ్జీలు ఉండబోతున్నారో తమ పలుకుబడిని ఉపయోగించి ముందుగానే తెలుసుకోగలిగారు. ఆ వెకేషన్ కోర్టులో జస్టిస్ జ్యోతిర్మయి కూడా ఉన్నారని నిర్ధారించుకున్నారు. వాస్తవానికి వెకేషన్ కోర్టులో ఏ న్యాయమూర్తులు ఉండబోతున్నారన్నది చివరి నిమిషం వరకు బయటకు వచ్చే అవకాశం ఉండదు. అయితే వ్యవస్థలను మేనేజ్ చేయగలిగిన చంద్రబాబు అండ్ కో వెకేషన్ కోర్టులో ఎవరెవరు ఉండబోతున్నారో ముందుగానే తెలుసుకుంది. జస్టిస్ జ్యోతిర్మయి ముందు ఎవరెవరు నాట్ బిఫోర్‌గా ఉన్నారో తెలుసుకోగలిగింది. నలుగురు న్యాయవాదులు ఉన్నట్లు తెలుసుకుని, అందులో తమ సామాజిక వర్గానికే చెందిన జీఎల్ఎస్ మూర్తితో ఆట మొదలుపెట్టింది. అయితే ఆటలో చివరకు ఓటమే ఎదురైంది.



శుక్రవారం తిరుపతిలో నిర్వహించిన సామాజిక సాధికార యాత్ర సభకు హాజరైన అశేష జనసందోహం

ప్రతిధ్వనించిన సామాజిక సాధికారత

వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార యాత్రకు రెండో రోజు బ్రహ్మరథం పట్టిన జనం

తిరుపతి, నరసాపురం, గజపతినగరం నియోజకవర్గాల్లో యాత్ర గ్రాండ్ సక్సెస్

సాక్షి, అమరావతి/సాక్షి, తిరుపతి/సాక్షి, నరసాపురం/సాక్షి, విజయనగరం: సామాజిక సాధికారత రాష్ట్రమంతటా ప్రతిధ్వనిస్తోంది. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ఫలితాలను ప్రజల స్పందన ప్రతిబింబిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర, సభలకు పేదలు వెల్లువెత్తుతున్నారు. శుక్రవారం రెండో రోజు యాత్రలోనూ ఇదే చైతన్యం వెల్లువెత్తింది. రాష్ట్రంలో గత 53 నెలలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలు, అగ్రవర్ణ పేదలకు సీఎం వైఎస్ జగన్ చేసిన మంచిని వివరించి.. పేదలందరినీ ఏకం చేయాలనే లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ చేపట్టిన ఈ యాత్ర శుక్రవారం తిరుపతి, పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం, విజయనగరం జిల్లా గజపతినగరం నియోజకవర్గాల్లో జరిగింది. మూడు నియోజకవర్గాల్లోనూ యాత్ర సాగిన రహదారులు జనంతో కిటకిటలాడాయి. సామాజిక సాధికార యాత్ర మూడో రోజున రాయలసీమలో వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు, కోస్తాలో బాపట్ల జిల్లా బాపట్లలో, ఉత్తరాంధ్రలో విశాఖపట్నం జిల్లా భీమిలి నియోజకవర్గాల్లో జరుగుతుంది.

మంత్రి అంబటిపై దాడికి యత్నం

- ఖమ్మంలో ఒక ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన అంబటి రాంబాబు
- కర్రలతో దాడికి ప్రయత్నించిన టీడీపీ నేతలు

ఖమ్మం క్రైం: ఏపీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుపై ఖమ్మంలో శుక్రవారం దాడి యత్నం జరిగింది. ఒక ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన నగరంలోని హోటల్‌లో బస చేశారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు పలువురు హోటల్ వద్దకు చేరుకుని కార్యక్రమానికి బయలుదేరుతున్న మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కర్రలు చేతబూని దాడికి యత్నించారు. జై తెలుగుదేశం.. జై చంద్రబాబు అంటూ నినాదాలు చేస్తూ దుర్భాషలకు దిగారు. ఈ ఘటనతో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ సమాచారం అందుకున్న ఖమ్మం వన్‌టౌన్ సీఐ స్వామి అక్కడకు చేరుకుని టీడీపీ నేతలు కేతినేని హరీశ్, కాంపాటి విజయ్‌కుమార్, రామాంజనేయ, జయ, సర్వనేని శంకర్, నాగండ్ల లక్ష్మణరావును అదుపులోకి తీసుకున్నారు.

నన్ను చంపడానికి చంద్రబాబు కులోన్మాదుల కుట్ర: అంబటి



సాక్షి, అమరావతి: తనను చంపాలన్న పక్కా ప్రణాళికతోనే చంద్రబాబు కులోన్మాదులు తనపై ఖమ్మంలో దాడికి తెగబడ్డారని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. గతంలో ఆ సామాజికవర్గం నిర్వహించిన కార్తీక వనభోజనాల్లో ఈ మేరకు ఒక కులోన్మాదుడు తనను చంపినవారికి రూ.50 లక్షలు బహుమానం ఇస్తానని ప్రకటించాడని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ఖమ్మంలో పక్కా ప్రణాళికతో తనను చంపాలని దాడికి తెగబడ్డారన్నారు. వంగవీటి రంగాను చంపడంతోపాటు ముద్రగడ పద్మనాభం కుటుంబాన్ని చిత్రహింసలకు గురిచేసిన చంద్రబాబు కులోన్మాదులు ఇప్పుడు తనను హత్య చేయడానికి ప్రయత్నిస్తున్నారని తీవ్ర విమర్శలు చేశారు. కులం మీకే కాదు.. మాకూ ఉందని.. దాడులు చేస్తే చేతులు కట్టుకుని కూర్చోబోమని హెచ్చరించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం మంత్రి అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడారు. తన సమీప బంధువు కుమారుడి వివాహ నిశ్చితార్థంలో పాల్గొనేందుకు గురువారం రాత్రి తాను ఖమ్మంకు వెళ్లానన్నారు. ఈ క్రమంలో తాను వెళ్తున్న వాహనంపై రెండు గోధుమ బస్తాలు పడటం వల్ల ప్రమాదం చోటుచేసుకుందని తెలిపారు. దీంతో వాహనం దెబ్బతిందని.. అయితే తాను సురక్షితంగా బయటపడ్డానన్నారు. శుక్రవారం ఉదయం ఖమ్మంలో తాను బస చేసిన హోటల్ నుంచి వివాహ నిశ్చితార్థానికి వెళ్తుండగా పది మంది టీడీపీ కులోన్మాదులు చంపేస్తామంటూ కర్రలతో దాడి చేయడానికి ప్రయత్నించారని తెలిపారు. తనపై దాడికి.. తన వాహనం ప్రమాదానికి మధ్య లింక్ ఉందన్నారు. ఈ కుట్రపై సమగ్ర విచారణ జరిపి.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఖమ్మం పోలీసులను కోరామన్నారు.

చంద్రబాబుకు జైల్లో పూర్తి భద్రత

జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్, ఎస్పీ జగదీష్ స్పష్టీకరణ

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): చంద్రబాబుకు సెంట్రల్ జైల్లో పూర్తి భద్రత ఉందని, దీనిపై అవాస్తవ వార్తలను నమ్మొద్దని జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్, ఎస్పీ జగదీష్‌లు స్పష్టం చేశారు. చంద్రబాబు ఆరోగ్యం, ఆయనను చంపేస్తామంటూ మావోల పేరుతో వచ్చిన లేఖ, జైల్లో పెన్ కెమెరాలున్నాయంటూ వస్తున్న వార్తలపై సెంట్రల్ జైల్లో శుక్రవారం రాత్రి వారు మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు సెక్యూరిటీపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉన్నామని, 24 గంటలూ సెక్యూరిటీతో పాటు అడిషనల్ సీసీ కెమేరాల ద్వారా మానిటరింగ్ చేస్తున్నామన్నారు. జైలు వాటర్ ట్యాంక్ వైపు డ్రోన్ తిరిగినట్టు నార్త్ ఈస్ట్ వాచ్‌టవర్ గార్డు నుంచి సమాచారం వచ్చిందని, అయితే ఆ డ్రోన్ క్లోజ్‌డ్ జైలు వైపు రాలేదని, దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని చెప్పారు.

మావోల పేరుతో వచ్చిన లేఖ నకిలీది..

చంద్రబాబును చంపేస్తామంటూ మావోల పేరుతో వచ్చిన లేఖ నకిలీదిగా గుర్తించినట్టు తెలిపారు. జైలు నుంచి చంద్రబాబు రాశారంటూ బయటకొచ్చిన లెటర్‌కు జైలు ముద్ర, సూపరింటెండెంట్ సంతకం లేదన్నారు. చంద్రబాబు ఫ్రింటెండ్ సంతకాన్ని తీసి దానిపై వేసి వైరల్ చేస్తున్నారని తెలిపారు. అలాగే జైల్లోకి వచ్చే ప్రతి ఖైదీని పూర్తిగా తనిఖీ చేశాకే లోపలికి అనుమతిస్తామన్నారు. శ్రీనివాస్ అనే ఖైదీ రిమాండ్‌కు వచ్చినప్పుడు అతని వద్ద ఒక బటన్ కెమెరా ఉన్నట్టు గుర్తించామన్నారు. జైలు లోపలికి అనుమతించే ముందు అతని దుస్తులు తనిఖీ చేస్తుంటే అది లభించిందని తెలిపారు. అందులో ఎలాంటి జైలు ఫుటేజీ లేదని, ఆ కెమేరాను స్వాధీనం చేసుకుని.. పోలీసులకు అప్పగించామని, ఆ కెమెరాను ఎందుకు తెచ్చారనే విషయంపై దర్యాప్తు జరుగుతోందన్నారు. చంద్రబాబు వచ్చిన దగ్గర్నుంచీ ఇప్పటివరకు గంజాయి ప్యాకెట్లు జైల్లోకి విసిరారన్నది పూర్తి అవాస్తవమన్నారు. చంద్రబాబు ఆరోగ్యంపై తప్పుడు రిపోర్టులు విడుదల చేయడంలేదని, వాటిని ఎప్పటికప్పుడు కోర్టుకు నివేదిస్తున్నట్టు తెలిపారు. సెంట్రల్ జైలు బయట సైతం 24 గంటలూ డీఎస్పీ స్థాయి అధికారి నేతృత్వంలో పకడ్బందీగా గస్తీ ఏర్పాటు చేసినట్టు జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్, ఎస్పీ జగదీష్‌లు వివరించారు.

రాష్ట్రీయం

‘బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు ఓట్లడిగే నైతిక హక్కులేదు’



జాజుల శ్రీనివాస్‌గౌడ్

కవాడిగూడ (హైదరాబాద్): బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు బీసీలను ఓట్లు అడిగే నైతిక హక్కులేదని, ఈ రెండు పార్టీలను రాబోయే ఎన్నికల్లో బీసీలు రాజకీయంగా సమాధి చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. టికెట్ల కేటాయింపులో ఈ రెండు పార్టీలు బీసీలకు తీరని అన్యాయం చేశాయని మండిపడ్డారు. శుక్రవారం దోమలగూడ బీసీ భవన్‌లో జరిగిన బీసీ కులసంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రకటించిన 119 మంది అభ్యర్థుల్లో రెడ్లకు 40 సీట్లు, వెలమలకు 12 సీట్లు కేటాయించి, జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు కేవలం 23 టికెట్లే ఇచ్చి బీసీ వ్యతిరేక పార్టీగా ప్రకటించుకుందని జాజుల విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో చేసిన ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌కే గ్యారంటీ లేదని, కాంగ్రెస్ ప్రచారం చేస్తున్న ఆరు గ్యారంటీలను ప్రజలు విశ్వసించరని తెలిపారు. బీసీ సంక్షేమ సంఘానికి పార్టీలు, ఎజెండాలు ఏమీ లేవని, బీసీలకు జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించి రాజకీయంగా ప్రాతినిధ్యం కల్పించిన పార్టీలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని జాజుల ప్రకటించారు. కాగా, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీని సీఎం చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నామని జాజుల పేర్కొన్నారు.

తల ఎత్తుకునేలా పనిచేశా!

- మంత్రిగా, ఎమ్మెల్యేగా అభివృద్ధి కోసం పాటుపడ్డా..
- సిరిసిల్ల యువ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి కేటీఆర్
- 55 ఏళ్ల అధికారంలో ఉన్నా ఏమీ చేయని సన్నాసులు కాంగ్రెస్ వాళ్లు
- ప్రతిపక్షాల్లో విజన్ ఉన్న నాయకుడు ఒక్కరూ లేరు
- బీజేపీ వాళ్లు రెచ్చగొట్టడమే తప్ప చేసేదేమీ లేదు
- ఎవరు మంచి చేస్తారో ప్రజలు ఆలోచించి గెలిపించాలని పిలుపు



మంత్రి కేటీఆర్‌కు గదను బహూకరిస్తున్న యువకులు

సిరిసిల్ల: 55 ఏళ్లలో ఏమీ చేయని కాంగ్రెస్ సన్నాసులు ఇప్పుడు ఒక్క చాన్స్ ఇవ్వాలని అడుగుతున్నారని.. ప్రజలు ఇప్పటికే 11 సార్లు చాన్స్ ఇచ్చినప్పుడు ఏం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె.తారక రామారావు ప్రశ్నించారు. చావు నోట్లో తలపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ లాగా విజన్ ఉన్న నాయకులు ప్రతిపక్షాల్లో ఒక్కరూ లేరని.. ఎవరు మంచి చేస్తారో ప్రజలు ఆలోచించాలని కోరారు. సిరిసిల్ల ఎమ్మెల్యేగా, 2014 నుంచి రాష్ట్ర మంత్రిగా తాను ఏనాడూ తలదించుకునే పనులు చేయలేదని, తల ఎత్తుకునేలా పనిచేశానని చెప్పారు. తన నియోజకవర్గంతోపాటు రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేశానని పేర్కొన్నారు. శుక్రవారం సిరిసిల్లలో నిర్వహించిన యువ ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

‘‘1956లో తెలంగాణను ఆంధ్రాలో బలవంతంగా కలిపింది కాంగ్రెస్ పార్టీయే. 1969లో 370 మంది చావులకు కారణం కాంగ్రెసే. 1971లో తెలంగాణ ప్రజాసమితి పేరుతో 11 మంది ఎంపీలు గెలిస్తే.. అప్పుడు ప్రజల తెలంగాణ ఆకాంక్షను బొందపెట్టింది కాంగ్రెసే. కేసీఆర్ తెలంగాణ కోసం ఉద్యమం మొదలుపెడితే.. రాష్ట్రం ఇవ్వకుండా జాప్యం చేసి పిల్లల చావులకు కారణమైనది కాంగ్రెస్ పార్టీయే. 55 ఏళ్ల అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు కరెంట్ ఇవ్వాలని, నీళ్లు ఇవ్వాలని, నిధులు ఇవ్వాలని, మెడికల్ కాలేజీలు, కొత్త జిల్లాలు ఇవ్వాలనే సోయి లేదు. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు ‘ఓటుకు కోట్లు’కేసులో అడ్డంగా దొరికిన దొంగ. ఎప్పుడు జైలుకు పోతాడో గ్యారంటీ లేని ఆయన.. మనకు ఆరు గ్యారంటీలు ఇస్తున్నారు. ఎన్నికల ముందు కులం, మతం పేరుతో రాజకీయాలు చేసేందుకు వస్తున్నారు. కులం కూడుపెట్టదు. మతంతో మనుగడ ఉండదు. ఎవరు మంచి చేస్తారో ప్రజలు ఆలోచించాలి.

జన్‌ధన్ ఖాతాల్లో రూ.15 లక్షలేవి?


2014లో బీజేపీ అధికారంలోకి వస్తే జన్‌ధన్ ఖాతాల్లో రూ.15 లక్షల చొప్పున వేస్తామని నరేంద్ర మోదీ అన్నారు. ఆ రూ.15 లక్షలు ఏవి? విదేశాల నుంచి నల్లధనాన్ని తెస్తామన్నారు, ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నారు. మాట తప్పారు. పైగా పెట్రోల్, డీజిల్ ధరలు అడ్డగోలుగా పెంచారు. కరీంనగర్ ఎంపీ వారాల అబ్బాయి. ఈరోజు ఏ వారం, ఏ దేవుడు అంటూ రెచ్చగొట్టే ప్రసంగాలే తప్ప ఒక్క మంచి పని చేయలేదు. సిరిసిల్లకు మెగా పవర్‌లూమ్ క్లస్టర్ అడిగితే ఇవ్వలేదు.

తల ఎత్తుకునేలా పనిచేశాను

సిరిసిల్ల ఎమ్మెల్యేగా, 2014 నుంచి రాష్ట్ర మంత్రిగా నేను ఏనాడూ తలదించుకునే పనులు చేయలేదు. తల ఎత్తుకునేలా పనిచేశా. నేతన్నల ఆత్మహత్యలకు నిలయంగా ఉన్న సిరిసిల్లలో మార్పు తెచ్చా. రూ.400 కోట్లతో వర్కర్‌ను ఓనర్‌గా మార్చే వర్క్‌షెడ్లు నిర్మాణంలో ఉన్నాయి. 370 ఎకరాల్లో ఆక్వాహబ్ మధ్యమానేరులో నిర్మాణంలో ఉంది. సిరిసిల్లలో మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, వ్యవసాయ కాలేజీ, కేజీ టు పీజీ క్యాంపస్ నిర్మించాం. నా కంటే బాగా పని చేసే వారు ఎవరైనా ఉంటే వాళ్లకు ఓట్లు వేయండి. ఏదైనా ఒక్కసారి ఆలోచించండి..’’అని కేటీఆర్ పేర్కొన్నారు. సమ్మేళనం సందర్భంగా బీఆర్ఎస్ యువ నాయకులు గద, తల్వార్ (కత్తి)లను కేటీఆర్ చేతికి అందించి సన్మానించారు. అంతకుముందు కేటీఆర్ వేదికపైకి వస్తుంటే సీఎం..సీఎం అంటూ నినాదాలు చేశారు.

మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో లోపాల్లేవు

- డిజైన్‌లో లోపం ఉంటే బ్యారేజీ కొట్టుకుపోయేది
- గతంలో ఫరక్కా, ధవళేశ్వరం బ్యారేజీల్లోనూ సమస్యలు
- కుంగుబాటుకు గల కారణాలు గుర్తించాకే మరమ్మతులు
- నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: ఇసుకపై పునాదులు వేసి కట్టే బ్యారేజీల్లో సమస్యలు సహజమేనని, మేడిగడ్డ బ్యారేజీ డిజైన్, నిర్మాణంలో సమస్యల్లేవని నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ రజత్‌కుమార్ స్పష్టం చేశారు. బ్యారేజీ డిజైన్‌లో లోపాలుంటే ఎప్పుడో కొట్టుకుపోయేదన్నారు. మేడిగడ్డ బ్యారేజీ ఘటనపై ఆయన శుక్రవారం జలసౌధలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. గతంలో ఫరక్కా, ధవళేశ్వరం బ్యారేజీల్లోనూ సమస్యలు వచ్చాయని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. మోనోలిథిక్ డిజైన్‌తో బ్యారేజీ నిర్మించారని, గతేడాది భారీ వరదలను కూడా బ్యారేజీ తట్టుకుందని రజత్‌కుమార్ చెప్పారు. బ్యారేజీ మొత్తం ఎనిమిది బ్లాకులతో నిర్మిస్తే అందులో 7వ బ్లాకులోని పియర్ నంబర్ 16, 17, 18, 19, 20, 21లలో సమస్యలు ఉత్పన్నం అయ్యాయన్నారు. తొలుత కాఫర్ డ్యామ్ నిర్మించి ఎగువ ప్రాంతాల నుంచి వరదను మళ్లిస్తామని... ఆ తర్వాత చుట్టూ రింగ్ మెయిన్ నిర్మించి పియర్ల కుంగుబాటుకు గల కారణాలను గుర్తించాకే మరమ్మతు పనులు ప్రారంభిస్తామని ఆయన వివరించారు. బ్యారేజీ నిర్మాణం రివర్‌బెడ్‌పై జరగడం, ఇసుకపైనే పునాదులు ఉండటం వల్ల సమస్యలు వస్తాయన్నారు. పియర్ల కింద ఇసుక కదలడం వల్లే కుంగినట్లు చెప్పారు. మరమ్మతులకు సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ అనుమతించాలని తెలిపారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ కోరిన వివరాలను సమర్పించినట్లు చెప్పారు. సమావేశంలో ఈఎన్‌సీ (సాధారణ) మురళీధర్, ఈఎన్‌సీ (పరిపాలన) అనిల్‌కుమార్, ఈఎన్‌సీ (ఓఅండ్ఎం) నాగేంద్రరావు, ఈఎన్‌సీ (రామగుండం) నల్లా వెంకటేశ్వర్లు, ఈఎన్‌సీ (కరీంనగర్) శంకర్, నీటిపారుదల అదనపు కార్యదర్శి భీం ప్రసాద్, సీడీవో సీఈ మోహన్‌కుమార్, సీఎం ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే, ఎల్అండ్‌టీ ప్రతినిధులు పాల్గొన్నారు. కాగా, డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానల్ ఏబీ పాండ్యా నేతృత్వంలో శనివారం బ్యారేజీని పరిశీలించనున్నట్లు రజత్‌కుమార్ చెప్పారు.

నేడు 52 దేశాల బీఆర్ఎస్ ఎన్నారై శాఖలతో వీడియో కాన్ఫరెన్స్

సాక్షి, హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా 52 దేశాల్లో ఉన్న బీఆర్ఎస్ ఎన్నారై శాఖల ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ శనివారం నిర్వహించనున్నారు. ఈ కాన్ఫరెన్స్‌కు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హాజరవుతారని ఆ పార్టీ ఎన్నారై శాఖల సమన్వయకర్త మహేశ్ బిగాల శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నారైలను ఉద్దేశించి కేటీఆర్ మాట్లాడతారని, ఎన్నికల ప్రచారంలో ఎన్నారైల పాత్ర ఎలా ఉండాలో దిశా నిర్దేశం చేస్తారన్నారు. ఈ ఎన్నికల్లో సోషల్‌మీడియా కాంపెయిన్‌తో పేరుతో ప్రత్యక్షంగా కొన్ని నియోజకవర్గాలలో ఎన్నారైలు పర్యటించి కేసీఆర్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు వివరిస్తారని తెలిపారు.

29న బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

ఈనెల 29న తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్వీ కార్యవర్గ సమావేశం ఉంటుందని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారని ఓ ప్రకటనలో వెల్లడించారు.

క్లుప్తంగా...

పాక్ కాల్పులతో పెళ్లిళ్లకు చిక్కులు

శ్రీనగర్: అంతర్జాతీయ సరిహద్దు వెంబడి పాక్ సైన్యం జరుపుతున్న విచక్షణారహిత కాల్పులతో జమ్మూలోని పలు గ్రామాల్లో పెళ్లిళ్లకు చిక్కులొచ్చి పడ్డాయి. దాంతో చివరి నిమిషంలో పలు పెళ్లిళ్లకు వేదికను మార్చుకోవాల్సి రావడంతో జనం ఇబ్బంది పడుతున్నారు. భారీ కాల్పుల దెబ్బకు అతిథులు పెళ్లి విందు మధ్య నుంచే అర్ధంతరంగా నిష్క్రమిస్తున్న ఉదంతాలూ చోటుచేసుకుంటున్నాయి. పాక్ రేంజర్లు ఇలా కాల్పులకు తెగబడటం 2021 కాల్పుల విరమణ ఒప్పందం అనంతరం ఇదే తొలిసారి. గురువారం రాత్రి నుంచీ అర్నియా తదితర ప్రాంతాలపై కాల్పులు ఏడు గంటలకు పైగా కొనసాగాయి. మరోవైపు వరి కోతల వేళ కాల్పులకు భయపడి కూలీలెవరూ పొలాలకు కూడా వెళ్లడం లేదు.

బంకర్లోనే పాఠాలు!

కాల్పుల భయంతో జమ్మూ జిల్లాలో పలు స్థానిక స్కూళ్లు మూతబడ్డాయి. అయితే సరిహద్దుకు సమీపంలోని షోగ్‌పూర్‌లో ఉన్న సర్కారీ పాఠశాల మాత్రం శుక్రవారం భూగర్భ బంకర్లలో నడిచింది! తమ ఇంట్లోవాళ్లు భయపడ్డా తాను మాత్రం స్కూలుకు హాజరయ్యానని సునీతా కుమారి అనే విద్యార్థిని చెప్పింది. ఆమెతో పాటు దాదాపు 20 మంది విద్యార్థులు స్కూల్‌లోని బంకర్లో పాఠాలు విన్నారు.

ఎథిక్స్ కమిటీని వాయిదా కోరిన ఎంపీ మొయిత్రా

కోల్‌కతా: డబ్బులు తీసుకుని పార్లమెంట్‌లో ప్రశ్నలు అడిగినట్లు వచ్చిన ఆరోపణలపై ఎథిక్స్ కమిటీ ఎదుట విచారణకు నవంబర్ 5వ తేదీన తనకు వీలవుతుందని టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా చెప్పారు. ఆమెపై ఆరోపణలు చేసిన బీజేపీ ఎంపీ నిశికాంత్ దుబే ఇప్పటికే ఎథిక్స్ కమిటీ ఎదుట హాజరయ్యారు. ఈ నెల 31వ తేదీన తమ ముందు హాజరు కావాలంటూ ఎంపీ మొయిత్రాకు నోటీసు పంపించింది. అయితే, నవంబర్ 4వ తేదీ వరకు అధికారిక, పార్టీ సంబంధ విజయదశమి అనంతర వేడుకల్లో పాల్గొనాల్సి ఉన్నందున అక్టోబర్ 31న ఢిల్లీకి రావడం వీలుకాదంటూ ఎథిక్స్ కమిటీ చైర్ పర్సన్ వినోద్ కుమార్ సొంకార్‌కు రాసిన లేఖలో వివరించారు. నవంబర్ 5వ తేదీన విచారణకు వస్తానని తెలిపారు. అంతేకాకుండా, తనకున్న హక్కును వినియోగించుకుంటూ వ్యాపారవేత్త దర్శన్ హీరానందానిని కమిటీ సమక్షంలోనే క్రాస్ ఎగ్జామిన్ చేయడానికి అనుమతివ్వాల్సిందిగా కోరారు. ఈ మేరకు రాసిన లేఖను శుక్రవారం ఆమె 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

దుబాయ్ దీదీ..

ఎథిక్స్ కమిటీకి రాసిన లేఖలో తన పేరును దుబే బదులుగా దుబాయ్ అని రాయడాన్ని ఎంపీ నిశికాంత్ దుబే తప్పుపట్టారు. ఎంపీ మొయిత్రాను ఆమె 'దుబాయ్ దీదీ' అంటూ వ్యాఖ్యానించారు. దుబాయ్‌ని ఆమె మర్చిపోలేకున్నారంటూ ఎద్దేవా చేశారు.

రూ. 25కు కిలో ఉల్లి

న్యూఢిల్లీ: నానాటికీ పెరుగుతున్న ఉల్లి ధరలకు కళ్లెం వేసి వినియోగదారులకు ఊరట కల్పించేందుకు కేంద్రం రంగంలోకి దిగింది. శుక్రవారం ఉల్లి ధరలు దేశవ్యాప్తంగా కిలో ఏకంగా 47 రూపాయలకు చేరాయి. దాంతో గోదాముల్లోని అదనపు నిల్వలను కిలో రూ.25కే విక్రయించాలని కేంద్రం నిర్ణయించింది. ముఖ్యంగా ఉల్లి ధర ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో అదనపు నిల్వలను 25 రూపాయల సబ్సిడీ ధరకే టోకు, రిటైల్ మార్కెట్లలోకి విడుదల చేస్తున్నట్టు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి రోహిత్‌కుమార్ సింగ్ తెలిపారు. ఇలా ఆగస్టు నుంచి ఇప్పటిదాకా 22 రాష్ట్రాల్లో ఏకంగా 1.7 లక్షల టన్నుల ఉల్లిని విడుదల చేసినట్టు వివరించారు. ఎన్‌సీసీఎఫ్, నాఫెడ్ ఆధ్వర్యంలో దుకాణాలు, వాహనాల ద్వారా సబ్సిడీ ధరకు ఉల్లిని అందుబాటులో ఉంచుతున్నారు.

మానవత్వం మేల్కొనేదెప్పుడు?

న్యూఢిల్లీ: పాలస్తీనాలోని గాజాలో కొనసాగుతున్న రక్తపాతం, తీవ్ర హింసాత్మక ఘటనలపై కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వాద్రా ఆందోళన వ్యక్తం చేశారు. ఉల్లంఘనకు గురికాని అంతర్జాతీయ చట్టం కానీ, నిబంధన కానీ ఒక్కటీ లేదన్న విషయం ప్రస్తుతం అక్కడ జరుగుతున్న పరిణామాలను బట్టి తేటతెల్లమవుతోందన్నారు. 'ఎందరు చిన్నారులు ప్రాణత్యాగం చేయాలి? ఇంకెందరు మరణించాలి? మానవత్వం అనేది ఉందా? మానవత్వం మేల్కొనేది ఇంకెప్పుడు?అని ఆమె శుక్రవారం 'ఎక్స్'లో ప్రశ్నించారు. గాజాలో మూడు వేల మంది అమాయక చిన్నారులు సహా మొత్తం ఏడు వేల మందికిపై ప్రాణాలు కోల్పోయినప్పటికీ రక్తపాతం, హింసకు ఫుల్‌స్టాప్ పడకపోవడంపై ప్రియాంకా గాంధీ తీవ్ర ఆవేదన వెలిబుచ్చారు.

పశ్చిమ బెంగాల్ మంత్రి జ్యోతిప్రియో మల్లిక్ అరెస్టు

కోల్‌కతా: రేషన్ సరుకుల కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో పశ్చిమ బెంగాల్ అటవీ మంత్రి, టీఎంసీ నేత జ్యోతి ప్రియో మల్లిక్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు అరెస్టు చేశారు. దాదాపు 18 గంటలపాటు ప్రశ్నించిన అనంతరం శుక్రవారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. మల్లిక్‌ను వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తరలించారు. మల్లిక్‌ను కోర్టులో ప్రవేశపెట్టి, తదుపరి విచారణ కోసం కస్టడీ కోరుతామని చెప్పారు. 18 గంటలపాటు ప్రశ్నించినా నోరువిప్పలేదని, విచారణకు సహకరించలేదని అన్నారు. కాగా, మంత్రి మల్లిక్‌ను అధికారులు కోర్టులో ప్రవేశపెట్టిన సమయంలో ఆయన హఠాత్తుగా అస్వస్థతకు గురై కుప్పకూలినట్లు తెలిసింది. ఆయనను వెంటనే ఆసుపత్రికి తరలించారు. న్యాయస్థానం ఆయనను 10 రోజులపాటు ఈడీ కస్టడీకి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది.



ఇజ్రాయెల్ హెచ్చరికలతో ఉత్తర గాజాను వీడి మరో ప్రాంతంలో వంట చేసుకుంటున్న పాలస్తీనా మహిళలు



దాడుల భయంతో ఖాన్ యూనిస్‌లోని ఆస్పత్రిలో చిన్నారులతో ఆశ్రయం పొందిన మహిళలు

గాజాలో నరకయాతన

రెండో రోజూ ఇజ్రాయెల్ సైన్యం భూతల దాడులు | పదుల సంఖ్యలో హమాస్ స్థావరాలు నేలమట్టం

- మిలిటెంట్లపై త్వరలో పూర్తిస్థాయి యుద్ధం తప్పదంటున్న ఇజ్రాయెల్
- ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో 7,300 మందికిపైగా మృతి

రఫా/టెల్ అవీవ్: ఉత్తర గాజాపై ఇజ్రాయెల్ సైన్యం భూతల దాడులు రెండో రోజు శుక్రవారం కూడా కొనసాగాయి. ప్రధానంగా గాజా సిటీ శివారు ప్రాంతాల్లో ఈ దాడులు జరిగాయి. పదుల సంఖ్యలో హమాస్ మిలిటెంట్ల స్థావరాలను ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ అధికారులు ప్రకటించారు. పూర్తిస్థాయి భూతల యుద్ధం త్వరలో ప్రారంభమవుతుందని భావిస్తున్నామని, అది సుదీర్ఘకాలం, సంక్లిష్టంగా ఉండబోతోందని ఇజ్రాయెల్ రక్షణ శాఖ మంత్రి యోవ్ గల్లాంట్ చెప్పారు. గాజాలో హమాస్ మిలిటెంట్లు నిర్మించుకున్న సొరంగాల వ్యవస్థను పూర్తిగా నాశనం చేయడమే తమ లక్ష్యమని అన్నారు. గల్లాంట్ శుక్రవారం విదేశీ జర్నలిస్టులతో మాట్లాడారు. భారీ స్థాయిలో సైనిక బలగాలతో భూతల యుద్ధం ప్రారంభిస్తామని అన్నారు. వారికి వెన్నుదన్నుగా వైమానిక దళం కూడా ఉంటుందని చెప్పారు. తమ జవాన్లు గురువారం ఉత్తర గాజాపై భూతల దాడి చేసి, క్షేమంగా తిరిగి వచ్చారని వెల్లడించారు. శుక్రవారం కూడా ఆపరేషన్ విజయవంతంగా పూర్తయ్యిందన్నారు.

9 వేలు దాటిన మృతుల సంఖ్య

మూడు వారాల క్రితం ప్రారంభమైన ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంలో మృతుల సంఖ్య 9 వేలు దాటింది. ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో 7,300 మందికిపైగా పాలస్తీనియన్లు మరణించారు. వీరిలో 3,000 మంది మైనర్లు, 1,500 మందికిపైగా మహిళలు ఉన్నారు. ఇజ్రాయెల్–హమాస్ మధ్య గతంలో జరిగిన నాలుగు యుద్ధాల్లో దాదాపు 4,000 మంది మృతిచెందారు. ఈ నెల 7న మొదలైన యుద్ధంలో మృతుల సంఖ్య ఇప్పటికే 7,300 దాటింది. ఇజ్రాయెల్ దాడుల్లో వెస్ట్‌బ్యాంక్‌లో మృతిచెందినవారి సంఖ్య 110కు చేరుకుంది. హమాస్ మిలిటెంట్ల దాడుల్లో ఇజ్రాయెల్ భూభాగంలో 1,400 మందికిపైగా మృత్యువాతపడ్డారు. హమాస్ వద్ద 229 మంది బందీలు ఉన్నట్లు తెలుస్తోంది. వారిని విడిపించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటిదాకా నలుగురు బందీలను మిలిటెంట్లు విడుదల చేశారు. ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో గాజాలో ఇప్పటిదకా 200కిపైగా పాఠశాలలు ధ్వంసమయ్యాయని 'యునెస్కో' ప్రకటించింది. అంటే గాజాలోని మొత్తం స్కూళ్లలో 40 శాతం స్కూళ్లు ధ్వంసమైనట్లు తెలియజేసింది.

ఇంధనాన్ని అనుమతించేది లేదు

సరిపడా ఆహారం, నీరు, నిత్యావసరాలు, ఔషధాలు లేక గాజాలో ప్రజల కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. జనం నరకయాతన అనుభవిస్తున్నారు. ఆసుపత్రుల్లో రోగులు, క్షతగాత్రులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇంక్యుబేటర్లు పనిచేయక శిశువులు కన్నుమూస్తున్నారు. ఈజిప్టు ప్రభుత్వం పరిమితంగా ఆహారం, నిత్యావసరాలను ఈజిప్టు నుంచి గాజాలోకి అనుమతిస్తోంది. మరోవైపు గాజాకు పెట్రోల్, డీజిల్ సరఫరాను అనుమతించబోమని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి గల్లాంట్ మరోసారి తేల్చిచెప్పారు. ఇంధనం మిలిటెంట్ల చేతుల్లోకి చేరితే దుర్వినియోగమయ్యే అవకాశం ఉందన్నారు. మిలిటెంట్లు జనరేటర్లతో సొరంగాల్లోకి గాలిని పంపిస్తుంటారని, ఇందు కోసం ఇంధనం వాడాల్సి ఉంటుందన్నారు. ''హమాస్ మిలిటెంట్లకు గాలి కావాలంటే ఇంధనం కావాలి, ఇంధనం కావాలంటే మేము కావాలి'' అని గల్లాంట్ వ్యాఖ్యానించారు.

బందీల్లో 30 మంది పిల్లలు!

ఈ నెల 7న ఇజ్రాయెల్‌పై హఠాత్తుగా దాడి చేసిన హమాస్ మిలిటెంట్లు దొరికినవారిని దొరికినట్లు ఊచకోత కోశారు. చాలామందిని నిలబెట్టి కాల్చేశారు. వెనక్కి వెళ్లిపోతూ 229 మందిని బందీలుగా బలవంతంగా లాక్కెళ్లారు. వీరిలో ఇజ్రాయెల్ పౌరులతోపాటు విదేశీయులు కూడా ఉన్నారు. బందీలను గాజాలోని గుర్తుతెలియని ప్రాంతంలో దాచినట్లు తెలుస్తోంది. బందీల్లో 30 మంది చిన్నపిల్లలు ఉన్నారని ఇజ్రాయెల్ ప్రభుత్వం నిర్ధారణకు వచ్చింది. తమ పిల్లలను విడిపించాలంటూ వారి తల్లిదండ్రులు ప్రభుత్వానికి మొర పెట్టుకుంటున్నారు. మూడేళ్ల, నాలుగేళ్ల వయసున్న చిన్నారులను కూడా మిలిటెంట్లు అపహరించడం గమనార్హం. వారి క్షేమ సమాచారాలు తెలియక కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోతున్నారు. జెనీవా తీర్మానం ప్రకారం.. సాధారణ పౌరులను బందీలుగా మార్చడం ముమ్మాటికీ యుద్ధ నేరమే అవుతుంది.



గాజాలో దాడుల్లో ధ్వంసమైన భవనం నుంచి చెలరేగిన మంటలు

సిరియాలో అమెరికా దాడులు

వాషింగ్టన్: తూర్పు సిరియాలో ఇరాన్‌కు చెందిన రివల్యూషనరీ గార్డ్ సేనల స్థావరాలే లక్ష్యంగా అమెరికా ఫైటర్ జెట్లు శుక్రవారం ఉదయం నిప్పుల వర్షం కురిపించాయి. రెండు ప్రాంతాల్లో ఈ దాడులు నిర్వహించినట్లు అమెరికా రక్షణ శాఖ కార్యాలయం పెంటగాన్ ప్రకటించింది. గతవారం సిరియాలోని తమ సైనిక స్థావరాలపై ఇరాన్ అనుకూల మిలిటెంట్లు క్షిపణులు, డ్రోన్లతో దాడి చేశారని, వాటికి ప్రతిస్పందనగానే తాము వైమానిక దాడులు చేసినట్లు వెల్లడించింది. ఒకవైపు ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం కొనసాగుతుండగా, మరోవైపు అమెరికా సైన్యం సిరియాలో ఇరాన్ అనుకూల శక్తులపై విరుచుకుపడడం ఆందోళన కలిగిస్తోంది. అయితే, సిరియాలో దాడికి ఇజ్రాయెల్–హమాస్ ఘర్షణతో ఏమాత్రం సంబంధం లేదని అమెరికా తేల్చిచెప్పింది. తమ అధ్యక్షుడు జో బైడెన్ ఆదేశాలతోనే తూర్పు సిరియాలో ఇరాన్ సాయుధ దళాలపై దాడి చేశామని అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ పేర్కొన్నారు. అమెరికా దళాలపై దాడులను సహించబోమని పేర్కొన్నారు. అక్టోబర్ 17 నుంచి ఇరాక్, సిరియాలోని తమ సైనిక స్థావరాలపై, జవాన్లపై కనీసం 19 దాడులు జరిగాయని పెంటగాన్ ఆరోపించింది. ఈ దాడులకు బాధ్యులైనవారిపై ప్రతీకారం తప్పదని హెచ్చరించింది. తాజా పరిణామాల నేపథ్యంలో అమెరికా రక్షణ శాఖ పశ్చిమాసియాలో భారీ సంఖ్యలో సైనిక బలగాలను మోహరిస్తోంది.

క్రిమినల్ బిల్లుల పరిశీలనకు మరింత సమయం

న్యూఢిల్లీ: ప్రస్తుత క్రిమినల్ చట్టాల స్థానంలో ప్రతిపాదించిన మూడు కొత్త బిల్లులపై హోం శాఖ కార్యకలాపాల పార్లమెంటరీ కమిటీ భేటీ శుక్రవారం అసంపూర్తిగా ముగిసింది. బిల్లుల డ్రాఫ్టుల అధ్యయనానికి మరింత సమయం కావాలని కమిటీలోని విపక్ష సభ్యులు కోరారు. స్వల్పకాలిక ఎన్నికల లబ్ధి కోసం వాటిని హడావుడిగా ఆమోదించొద్దని కమిటీ చైర్‌పర్సన్ బ్రిజ్ లాల్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో కమిటీ నవంబర్ 6న భేటీ అయ్యే అవకాశముందని చెబుతున్నారు. విపక్ష సభ్యుల నుంచి వ్యతిరేకత ఎదురైనా ఆ రోజు వాటిని కమిటీ ఆమోదిస్తుందని సమాచారం. బ్రిటిష్ కాలం నాటి నేర న్యాయ చట్టాలను పూర్తిగా ప్రక్షాళన చేసేందుకు మూడు కొత్త బిల్లులను పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రవేశపెట్టడం తెలిసిందే. అనంతరం వాటిని పరిశీలన కమిటీకి పంపారు. వాటిపై పరిశీలనకు మరింత కావాలంటూ కమిటీలోని విపక్ష సభ్యులు పి.చిదంబరం (కాంగ్రెస్), డెరిక్ ఒబ్రియాన్ (టీఎంసీ) చైర్మన్‌కు లేఖ రాసినట్టు సమాచారం. ముఖ్యంగా ప్రతిపాదిత చట్టాలకు హిందీ పేర్లు పెట్టడాన్ని డీఎంకే వంటి విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. వాటిని పట్టించుకోరాదని కేంద్రం నిర్ణయించినట్టు చెబుతున్నారు.

భారత దళాలు వైదొలగాలి


మాలె: మాల్దీవుల నుంచి భారత సైనిక దళాలు వైదొలగాలని ఆ దేశాధ్యక్షునిగా ఎన్నికైన మహమ్మద్ ముయిజ్జు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కొత్త అధ్యక్షుని వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అయితే చైనా దళాలను కూడా తమ భూభాగంపైకి అనుమతించేది లేదని ఆయన స్పష్టం చేశారు. భారత దళాలను వెనక్కు పంపుతానని ఎన్నికల సందర్భంగా ఆయన వాగ్దానం చేశారు. మాల్దీవుల్లో 70 మంది భారతసైనిక సిబ్బంది ఉన్నారు. భారత్ అందజేసిన రాడార్ స్టేషన్లు, నిఘా విమానాల పర్యవేక్షణ బాధ్యతలు చూస్తుంటారు. ఆ ప్రాంతంలో సైనికంగా ప్రభావం చూపేందుకు, ముఖ్యంగా మాల్దీవులపై పట్టు కోసం భారత్, చైనా దశాబ్దాలుగా పోటాపోటీగా ప్రయత్నిస్తూ వస్తున్నాయి.

'దుమ్ము' రేపిన విక్రమ్!

బెంగళూరు: చంద్రయాన్–3లో భాగంగా పంపిన విక్రమ్ ల్యాండర్ చంద్రునిపై దిగిన సందర్భంగా భారీ పరిమాణంలో దుమ్మును వెదజల్లింది. ఫలితంగా అక్కడ చిన్న గుంతలాంటి ప్రదేశం ఏర్పడినట్టు ఇస్రో శుక్రవారం వెల్లడించింది. 'ఉపరితలంలోని ఏకంగా 2.09 టన్నులకు పైగా దుమ్ము, ధూళి, ఖనిజ శకలాల వంటివి 108 మీటర్ల పరిధిలో చెల్లాచెదురయ్యాయి. దాంతో విక్రమ్ చుట్టూ భారీ వలయాకార పరిధి (గుంత వంటిది) ఏర్పడింది'' అని వివరించింది. ల్యాండింగ్‌కు ముందు, జరిగిన వెంటనే తీసిన ఫొటోలను ఉపగ్రహ ఆర్బిటార్‌లోని హై రిజల్యూషన్ కెమెరా సాయంతో హైదరాబాద్ జాతీయ రిమోట్ సెన్సింగ్ కేంద్రం సైంటిస్టులు ఈ మేరకు వెల్లడించారు.

కాంగ్రెస్.. కాలం చెల్లిన ఫోన్

- ప్రజలు ఎప్పుడో దాన్ని వదిలించుకున్నారు
- 2014లోనే పెనుమార్పు జరిగింది
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడి
- ఢిల్లీలో 'ఇండియా మొబైల్ కాంగ్రెస్' ప్రారంభం



మాట్లాడుతున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: 2014 అనేది కేవలం ఒక తేదీ కాదని, దేశంలో అదొక పెనుమార్పు అని ప్రధానమంతి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీని కాలం చెల్లిన ఫోన్‌గా అభివర్ణించారు. 2014లో దేశ ప్రజలు ఆ ఔట్‌డేటెడ్ ఫోన్‌ను వదిలించుకున్నారని, ఇండియా దశ దిశ మార్చే ప్రభుత్వాన్ని ఎంచుకున్నారని తెలిపారు. కాలం తీరిన ఫోన్లలో ఎన్నిసార్లు బటన్లు నొక్కినా, స్తంభించిన స్క్రీన్‌ను ఎన్నిసార్లు తట్టినా ఎలాంటి ఫలితం ఉండదని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. రీస్టార్ట్ చేసినా, చార్జింగ్ పెట్టినా, బ్యాటరీ మార్చినా ఆ ఫోన్ పనిచేయదని పరోక్షంగా కాంగ్రెస్ పార్టీని ఎద్దేవా చేశారు. పనికిరాని ఫోన్ తరహాలోనే కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ హయాంలో దేశ ఆర్థిక వ్యవస్థ, పరిపాలన స్తంభించిపోయిందని అన్నారు. అలాంటి సమయంలో దేశానికి సేవ చేసే అవకాశాన్ని ప్రజలు తమకు ఇచ్చారని గుర్తుచేశారు. శుక్రవారం ఢిల్లీలో 'ఇండియా మొబైల్ కాంగ్రెస్'ను ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత తొమ్మిదేళ్లలో తమ ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన సంస్కరణలతో దేశం ప్రగతి పథంలో పరుగులు తీస్తోందని అన్నారు. గతంలో మొబైల్ ఫోన్లు దిగుమతి చేసుకున్న మన దేశం ఇప్పుడు ఎగుమతిదారుగా మారిందని హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు మన దేశంలోనే ఫోన్లను ఉత్పత్తి చేస్తున్నాయని వెల్లడించారు. భారత్‌లో 5జీ మొబైల్ సేవలు అత్యంత వేగంగా విస్తరిస్తున్నాయని, ఇక 6జీ సర్వీసులకు శ్రీకారం చుట్టబోతున్నామని తెలిపారు. గతేడాది అక్టోబర్ 1న 5జీ టెక్నాలజీని ప్రారంభించామని, దేశవ్యాప్తంగా ఏడాదిలోనే 5 లక్షల 5జీ బేస్ స్టేషన్లు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. 2జీ సేవల విషయంలో ఏం జరిగిందో అందరికీ తెలుసని చెప్పారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న టెలికాం స్పెక్ట్రం కుంభకోణాన్ని నరేంద్ర మోదీ ప్రస్తావించారు. 4జీ సేవలను తీసుకొచ్చిన తమపై ఎలాంటి అవినీతి ఆరోపణలు రాలేదన్నారు. 6జీ టెక్నాలజీలో ప్రపంచాన్ని మనమే ముందుకు నడిపిస్తామన్న విశ్వాసం తనకు ఉందన్నారు.

దేశవ్యాప్తంగా 100 '5జీ ల్యాబ్‌లు'

యూపీఏ సర్కారు పాలనలో మొబైల్ ఫోన్ల తయారీ రంగాన్ని విస్మరించారని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. ప్రస్తుతం మన దేశం ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్‌ఫోన్ల తయారీదారుగా మారిందని అన్నారు. అలాగే ఏటా రూ.2 లక్షల కోట్ల విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలను ఎగుమతి చేస్తున్నామని తెలియజేశారు. ఇండియాలో తయారైన ఫోన్లను ప్రపంచమంతటా ఉపయోగిస్తుండడం మనకు గర్వకారణమని పేర్కొన్నారు. బ్రాడ్‌బ్యాండ్ వేగంలో మన దేశం ఏడాది వ్యవధిలోనే 118వ స్థానం నుంచి 43వ స్థానానికి చేరిందని వివరించారు. ఇంటర్నెట్ అనుసంధానం, వేగంతో ప్రజల జీవనం సులభతరం అవుతోందన్నారు. విద్య, వైద్యం, టూరిజం, వ్యవసాయం వంటి రంగాల్లో మెరుగైన ఫలితాలు లభిస్తున్నాయని తెలిపారు. ఆధునిక సాంకేతికత వల్ల కలిగే ప్రయోజనాలు ప్రతి సమాజంలో ఒక్కరికీ చేరాలని, ఆ దిశగా కృషి చేస్తున్నామని వెల్లడించారు. పెట్టుబడి, వనరులు, సాంకేతికతను ప్రజలకు చేరువ చేయడానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. విద్యార్థులు, స్టార్టప్ కంపెనీల కోసం దేశవ్యాప్తంగా త్వరలో 100 '5జీ ల్యాబ్‌లు' అందుబాటులోకి రాబోతున్నాయని తెలిపారు. విద్యాసంస్థల్లో వీటిని ఏర్పాటు చేస్తామన్నారు.

జమిలి ఎన్నికలకు 30 లక్షల ఈవీఎంలు కావాలి

- ఏర్పాట్లకు ఏడాదిన్నర సమయం అవసరం
- లా కమిషన్‌కు ఎన్నికల సంఘం సమాచారం



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా లోక్‌సభతోపాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి నిర్వహించాలంటే 30 లక్షల ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎంలు) అవసరమని అధికార వర్గాలు వెల్లడించాయి. అలాగే జమిలి ఎన్నికలకు సన్నాహాలు పూర్తిచేయడానికి దాదాపు ఏడాదిన్నర సమయం కావాలని పేర్కొన్నాయి. జమిలి ఎన్నికల సాధ్యాసాధ్యాలపై దేశంలో చర్చ జరుగుతోంది. లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడానికి కేంద్ర ప్రభుత్వం మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం సాగుతోంది. కేంద్ర లా కమిషన్ ప్రస్తుతం జమిలి ఎన్నికల అంశంపై కసరత్తు చేస్తోంది. జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే ఈవీఎంలు ఎన్నికావాలి? ఎంత సమయం అవసరం? అన్నదానిపై ఎన్నికల సంఘం అధికారులు లా కమిషన్‌కు కొన్ని నెలల క్రితం సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఒక్కో ఈవీఎంలో భాగంగా ఒక కంట్రోల్ యూనిట్, ఒక బ్యాలెట్ యూనిట్, ఒక వీవీప్యాట్ ఉంటాయి. జమిలి ఎన్నికలకు 30 లక్షల కంట్రోల్ యూనిట్లు, 43 లక్షల బ్యాలెట్ యూనిట్లు, 32 లక్షల వీవీప్యాట్లు కావాలని చెబుతున్నారు. కొన్ని బ్యాలెట్ యూనిట్లు, వీవీప్యాట్లను రిజర్వ్‌లో ఉంచాల్సి ఉంటుంది కాబట్టి అదనంగా అవసరమని పేర్కొంటున్నారు. ఒకవేళ జమిలి ఎన్నికలు నిర్వహిస్తే కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీప్యాట్లు కలిపి దాదాపు 35 లక్షల ఓటింగ్ యూనిట్లను కొత్తగా సమకూర్చుకోవాల్సి ఉంటుందని సమాచారం.

12.50 లక్షల పోలింగ్ కేంద్రాలు

లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరిగినప్పటికీ రెండు ఓట్లు వేర్వేరుగా వేయాల్సి ఉంటుంది. అందుకు రెండు ఈవీఎంలు కావాలి. జమిలి ఎన్నికల్లో ఓటింగ్ పూర్తయిన తర్వాత ఈవీఎంలను భద్రపర్చడానికి తగిన వసతులు ఉండాలని ఎన్నికల సంఘం పేర్కొంది. గత లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 12.50 లక్షల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో 15 లక్షల కంట్రోల్ యూనిట్లు, 15 లక్షల వీవీప్యాట్లు, 18 లక్షల బ్యాలెట్ యూనిట్లు ఉపయోగించారు. అన్నీ కలిపి కోటి యూనిట్లు కొనుగోలు చేయాలంటే రూ.15,000 కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉంటుందని అంచనా. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలతోపాటు మున్సిపాల్టీలు, పంచాయతీల ఎన్నికలు నిర్వహించడంపై(ఒక దేశం, ఒకే ఎన్నిక) మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ అధ్యయనం కొనసాగిస్తోంది.


చైనా మాజీ ప్రధాని లీ మృతి

బీజింగ్: చైనా మాజీ ప్రధాని, ప్రఖ్యాత ఆర్థికవేత్త లీ కీ కియాంగ్ శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. 68 ఏళ్ల లీ ఒకానొక సమయంలో అధ్యక్షుడు జీ షిన్‌పింగ్‌కు గట్టి పోటీదారుగా నిలిచారు. ఆయన గురువారం గుండెపోటు బారిన పడ్డారని, అత్యవసర చికిత్స అందించినా ఫలితం లేకపోయిందని అధికార వార్తా సంస్థ జిన్ హువా పేర్కొంది. క్రియాశీల రాజకీయాల నుంచి గత మార్చిలో రిటైరయ్యాక ఆయన షాంఘైలో ప్రశాంత జీవనం గడుపుతున్నారు. 2013లో చైనా కమ్యూనిస్టు పార్టీ అధ్యక్ష పదవి కోసం జిన్‌పింగ్‌తో లీ హోరాహోరీ తలపడ్డారు. తర్వాత నంబర్ 2 స్థానంతో సంతృప్తి పడి 2013 నుంచి 2023 దాకా పదేళ్ల పాటు ప్రధానిగా పని చేశారు. ఆయన అద్భుతమైన కమ్యూనిస్టు కార్యకర్త అని, అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం పాటుపడ్డారని సీపీసీ, పార్లమెంటు, కేబినెట్ కొనియాడాయి. పెకింగ్ యూనివర్సిటీలో లా పట్టభద్రుడైన అనంతరం 1976లో లీ కమ్యూనిస్టు పార్టీలో చేరారు. ముక్కుసూటి వ్యాఖ్యలకు పెట్టింది పేరుగా నిలిచారు. చైనాలో ఏకంగా 60 కోట్ల మంది నెలసరి ఆదాయం కేవలం 140 డాలర్లు మాత్రమేనని ప్రధాని హోదాలో ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రపంచవ్యాప్తంగా పతాక శీర్షికలుగా మారి చైనా నాయకత్వాన్ని ఇరుకున పెట్టాయి. జిన్‌పింగ్‌తో ఆయన బంధం ఎప్పుడూ సజావుగా సాగలేదు. జిన్‌పింగ్‌తో పోలిస్తే లీ అతి సామాన్య జీవనం గడుపుతూ వచ్చారు. మాజీ అధ్యక్షుడు హూ జింటావో దన్నుతో లీ అంచెలంచెలుగా రాజకీయంగా ఎదిగారు. కానీ ఆయన్ను కాదని దేశ ఉపాధ్యక్షునిగా ఉన్న జిన్‌పింగ్‌ను తన వారసునిగా 2012లో జింటావో ప్రకటించడం అందరినీ ఆశ్చర్యపరిచింది.

ముక్తార్ అన్సారీకి పదేళ్ల జైలు

లక్నో: మాఫియా నేత, రాజకీయ నాయకుడు ముక్తార్ అన్సారీకి ఘాజీపూర్‌లోని ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించింది. మరో రూ.5 లక్షల జరిమానా కూడా విధించింది. 2010లో కరండాలో కపిల్‌దేవ్ సింగ్ అనే టీచర్ హత్య, 2009లో మీర్ హసన్ అనే వ్యాపారిపై హత్యాయత్నంపై గ్యాంగ్‌స్టర్ చట్టం కింద అన్సారీపై కేసులున్నాయి. అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు జడ్జి అరవింద్ కుమార్ కేసు విచారణ జరిపారు.

కరోనాతో మంచాన పడ్డవారికి... లాంగ్ కోవిడ్ ముప్పు!



న్యూఢిల్లీ: కరోనా రోగుల్లో వారం పాటు, ఆపై మంచానికి పరిమితమైన వారిలో లాంగ్ కోవిడ్ లక్షణాలు ప్రస్ఫుటంగా కన్పిస్తున్నట్టు తాజా పరిశోధనలో తేలింది. వారిలో చాలామంది కనీసం రెండేళ్లపాటు విపరీతమైన ఒంటి నొప్పులు తదితర లక్షణాలతో బాధపడుతున్నారట. లాన్సెట్ రీజనల్ హెల్త్ యూరప్ జర్నల్ అధ్యయనం ఈ మేరకు తేల్చింది. లింగ, వయో తదితర భేదాలకు అతీతంగా అందరిలోనూ ఇది సమానంగా కనిపించినట్టు వివరించింది. కరోనాతో రెండు నెలలకు, అంతకుమించి ఆస్పత్రిపాలైన వారిలో ఈ సమస్యలు, లక్షణాలు మరింత ఎక్కువగా తలెత్తినట్టు పేర్కొంది...

ఇలా చేశారు...

- అధ్యయనం కోసం స్వీడన్, నార్వే, డెన్మార్క్, ఐస్‌లాండ్‌ల్లో 64,880 మంది వయోజనులను ఎంచుకున్నారు.
- వీరంతా 2020 ఏప్రిల్ నుంచి 2022 ఆగస్టు మధ్య నానారకాల కొవిడ్ తరహా శారీరక సమస్యలను ఎదుర్కొన్నవారే.
- అందరూ పూర్తిగా, లేదా పాక్షికంగా కరోనా టీకాలు వేయించుకున్నవారే.
- వీరిలో 22 వేల మందికి పైగా కరోనా కాలంలో ఆ వ్యాధితో బాధపడ్డారు.
- వీరిలోనూ 10 శాతం మంది కనీసం ఏడు రోజులు, అంతకంటే ఎక్కువ సమయం పాటు మంచాన పడ్డారు.

ఇలా మంచాన పడ్డవారిలో చాలామంది ఇతరులతో పోలిస్తే 37 శాతం ఎక్కువ లాంగ్ కోవిడ్ లక్షణాలతో సతమతమయ్యారు. అవేమిటంటే...

- శ్వాస ఆడకపోవడం
- ఛాతీ నొప్పి
- తల తిప్పడం
- తలనొప్పి

లాంగ్ కోవిడ్ అంటే...

ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వచనం ప్రకారం కోవిడ్ సోకిన మూడు నెలల తర్వాత దాని తాలూకు లక్షణాలు తిరగబెట్టి కనీసం రెండు నెలలు, ఆ పైనకొనసాగితే దాన్ని లాంగ్ కోవిడ్‌గా పేర్కొంటారు.

- కోవిడ్ బారిన పడ్డ వారిలో కనీసం 10 నుంచి 20 శాతం మందిలో లాంగ్ కోవిడ్ తలెత్తినట్టు పలు అధ్యయనాల్లో తేలింది. ''లాంగ్ కోవిడ్ ప్రజారోగ్యానికి పెద్ద సమస్యగా మారింది. అంతర్జాతీయంగా ఎంతోమంది దీని బారిన పడ్డారు''అని కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్ డాక్టోరల్ స్టూడెంట్ ఎమిలీ జోయ్స్ వివరించారు. 'అందుకే కోవిడ్ తాలూకు దీర్ఘకాలిక ఆరోగ్య ప్రభావంపై ఓ కన్నేసి ఉంచాలి. కనీసం రెండేళ్ల దాకా శారీరక మార్పులు, సమస్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకుంటూ ఉండాలి'అని సూచించారు.

- మంచాన పడ్డ వారితో పోలిస్తే ఇతరుల్లోనూ ఇలాంటి లక్షణాలు తలెత్తినా వాటి తీవ్రత మాత్రం అంత ఎక్కువగా లేదు.

మీకు తెలుసా ?

చివరి ఏకగ్రీవ ఎన్నిక 2002లో..

ఈ రోజుల్లో ఏకగ్రీవ ఎన్నికలు అంటే ఆశ్చర్యం కలగవచ్చు. ఒకప్పుడు కొందరు నేతలు శాసనసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నది అతిశయోక్తికాదు. తెలంగాణకు సంబంధించినంత వరకు చివరి ఏకగ్రీవ ఎన్నిక 2002 సంవత్సరంలో జరిగింది. నల్లగొండ జిల్లాలోని దేవరకొండ ఎస్టీ నియోజకవర్గం నుంచి 1999 ఎన్నికలలో గెలుపొందిన కాంగ్రెస్ నేత ధీరావత్ రాగ్యానాయక్ నక్సల్స్ కాల్పులలో మరణించారు. తత్ఫలితంగా జరిగిన ఉపఎన్నికలో ఆయన భార్య భారతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మరణించిన రాగ్యానాయక్ గౌరవార్థం పోటీ చేయకుండా ఏకగ్రీవానికి సహకరించాలని అప్పట్లో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీతోపాటు ఇతర రాజకీయ పార్టీలు నిర్ణయించాయి.



భారతీరాగ్యానాయక్

అంతకుముందు కూడా పలు ఏకగ్రీవ ఎన్నికలు జరిగాయి. సుమారు ఇరవై మంది ఇలా ఎన్నికయ్యారు. మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి అంజయ్య కూడా ఒకసారి ఉపఎన్నికలో పోటీ లేకుండా శాసనసభకు వెళ్లారు. 1972లో ఇందిరాగాంధీ ప్రభంజనంలో ఎక్కువ మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉమ్మడి జిల్లాలవారీగా అలా ఎన్నికైనవారిలో కోదాటి రాజమల్లు(చెన్నూరు-ఆదిలాబాద్ జిల్లా), పి.నర్సారెడ్డి(నిర్మల్-ఆదిలాబాద్ జిల్లా), జి.గడ్డెన్న(ముధోల్-ఆదిలాబాద్ జిల్లా), ఎస్.భూపాల్(అమరచింత-మహబూబ్‌నగర్ జిల్లా), ఎస్.రామచంద్రారెడ్డి(డోర్నకల్-వరంగల్ జిల్లా), కళ్యాణి రామచంద్రరావు(మక్తల్-మహబూబ్‌నగర్ జిల్లా), ఎం.మాణిక్‌రావు(తాండూరు-రంగారెడ్డి) ఉన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైనవారిలో మరికొందరు ప్రముఖులు ఉన్నారు. టి.రంగారెడ్డి(ఆర్మూరు-1962), జి.రాజారామ్ (బాల్కొండ-1967), సీతాకుమారి(బాన్సువాడ-1957), కె.లక్ష్మీనరసింహారావు (జగిత్యాల-1967), టి.అంజయ్య (రామాయంపేట-1981), వీరాస్వామి(కొడంగల్ ద్విసభ్య-1952), పద్మనాభరెడ్డి(వనపర్తి-1957), ఆర్.సురేందర్‌రెడ్డి(డోర్నకల్ -1974), కె.రాంభూపాల్ (గద్వాల- 1962), పి.మహేంద్రనాథ్(నాగర్‌కర్నూల్ -1957), ఎస్.యతిరాజారావు(చెన్నూరు-1975), కె.రామయ్య(బూర్గంపాడు-1968) మొదలైనవారు ఉన్నారు. ఒకరిద్దరు తప్ప ఇలా ఏకగ్రీవంగా ఎన్నికైవారంతా కాంగ్రెస్‌కు చెందినవారే కావడం విశేషం. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఒక్క ఏకగ్రీవ ఎన్నిక కూడా జరగలేదు.



ఓటు అమ్ముకుంటే అంధకారమే..

నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాల మైదానంలో తెలంగాణ బ్లాక్ వాయిస్, సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎన్జీ కాలేజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జలసాధన సమితి జాతీయ అధ్యక్షుడు దుశ్చర్ల సత్యనారాయణ మాట్లాడుతూ.. ఓటును అమ్ముకుంటే బిడ్డల భవిష్యత్ అంధకారమే అవుతుందన్నారు.

- రామగిరి (నల్లగొండ)

గాసిప్ టైమ్

పారాచూట్ నేతలతో విలవిల

పారాచూట్ నేతలతో పార్టీలో ముందు నుంచీ ఉన్న నాయకులు విలవిలలాడుతున్నారు. గడిచిన ఐదేళ్లుగా పార్టీ కోసం అహర్నిశలు పనిచేస్తున్న తమను కాదని అంగబలం, అర్థబలం ఉన్న నేతలను ఎక్కడ నుంచో దిగుమతి చేసుకొని మాపై రుద్దడమేమిటని ప్రధాన జాతీయ పార్టీలకు చెందిన స్థానిక నేతలు మండిపడుతున్నారు. పోటీ చేసే అభ్యర్థుల జాబితా ప్రకటనలో జాప్యం అందుకేనని వారు అనుమానిస్తున్నారట. ఒక జిల్లా నేతను మరో జిల్లాకు పంపించి పోటీ చేయించాలని చెబుతుండటం కూడా ఇంతకాలం పార్టీని అంటిపెట్టుకుని పనిచేస్తున్న వారికి మింగుడుపడని వ్యవహారంగా మారింది. గతంలో నగర శివార్లలో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా పనిచేసిన నేత అదే నియోజకవర్గం నుంచి కాకుండా నగర శివారు జిల్లాలోని స్థానం నుంచి పోటీ చేయాలనుకున్నారు. అక్కడ అంతా రంగం సిద్ధం చేసుకున్నారు. టికెట్ రావడమే తరువాయి అనుకున్నాడు. తానొకటి తలిస్తే విధి మరొకటి తలిచినట్లు.. అప్పటివరకు అధికారపార్టీలో ఉన్న ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న వ్యక్తి సడెన్‌గా పార్టీ రాష్ట్ర ముఖ్యుని ఆశీస్సులతో పార్టీలో చేరిపోయారు. తీరా అక్కడ పోటీకి సిద్ధమైన ఆ నేతను అక్కడ నుంచి తరలించేశారు. ఓ మంత్రిపై పోటీ చేయండి.. లేదంటే లేదని ఆయనకు కరాకండిగా చెప్పేశారట. అలాగే ఉత్తర తెలంగాణ జిల్లాలో జాతీయ పార్టీకి చెందిన మహిళా నేతలు టికెట్లు ఆశించారు. కానీ అప్పటివరకు ప్రత్యర్థి పార్టీలో ఉన్నవారు పార్టీలో చేరేసరికి వారికి టికెట్‌లు కన్ఫర్మ్ అవడంతో వారికి ఏడుపు ఒక్కటే తక్కువైందట.



గ్రేటర్ రిజల్ట్స్... ఓటర్ ఇస్తారా?

48 డివిజన్లలో గెలుపుతో బీజేపీలో నూతనోత్సాహం

కె. రాహుల్

రాష్ట్రంలో ఏ పార్టీతో పొత్తు లేకుండా 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో ఏకంగా నాలుగు ఎంపీ సీట్లు గెలుపొందిన బీజేపీ...మళ్లీ ఇప్పుడు 2023 నవంబర్ 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అదే మ్యాజిక్‌ను రిపీట్ చేయగలుగుతుందా ? లేదా అన్న చర్చ ఇప్పుడు సాగుతోంది. బీఆర్‌ఎస్‌కు దీటైన ప్రత్యామ్నాయంగా బీజేపీనే ఎదుగుతోందనే వాదనలకు బలం చేకూర్చే విధంగా గత మూడున్నరేళ్లలో ఆ పార్టీ సాధించిన రాజకీయ విజయాలు స్పష్టం చేశాయని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. బీఆర్‌ఎస్-బీజేపీల మధ్యనే అనేక సందర్భాల్లో ప్రధాన పోటీ జరగడంతో...కాంగ్రెస్ పార్టీ అనేది 'పూర్ థర్డ్ పొజిషన్'కు చేరుకున్న విషయాన్ని గుర్తుచేస్తున్నారు. అయితే కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో అక్కడ బీజేపీ ఓడిపోయి కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఇక్కడా కాంగ్రెస్ పార్టీలో నూతనోత్సాహం వెల్లివిరిసింది. దానికి తగ్గట్టుగానే రాష్ట్ర రాజకీయాల్లో తమదే పైచేయి అంటూ హైప్ ఇచ్చేలా ఆ పార్టీ చేపట్టిన ప్రచార కార్యక్రమాలు కూడా అందుకు దోహదపడ్డాయి. అదే సమయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ మార్పు పార్టీ వర్గాల్లో చర్చకు తెరలేపింది. సంజయ్ మార్పుపై చర్చ జరగడం, పార్టీపరంగా కార్యకలాపాలు పుంజుకోకపోవడం, సంస్థాగతంగా పార్టీ బలోపేతానికి సంబంధించి దాదాపు 35 వేల పోలింగ్‌బూత్‌లలో పూర్తిస్థాయిలో బూత్ కమిటీల అధ్యక్షులు, సభ్యుల నియామకం జరగకపోవడం తదితర కారణాలతో బీజేపీ నాయకులు, కేడర్‌లో ఒకింత నిస్తేజం ఏర్పడిందనే చెప్పాలి.

2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఒకేచోట కమలం పాగా..
2019లో ఒంటరిగా పోటీచేసి 4 ఎంపీ సీట్లలో గెలుపు..
ఆ తర్వాత 2 ఉప ఎన్నికల్లో విజయం
సంజయ్ మార్పు చర్చతో స్తబ్దత..
క్రమంగా తగ్గి మళ్లీ పుంజుకుంటున్న కమలం

కొత్త అధ్యక్షుడిగా కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి (గతంలోనే మూడుసార్లు ఆ బాధ్యతలు నిర్వహించిన వ్యక్తి-గతంలో రెండుపర్యాయాలు ఏపీ అధ్యక్షుడిగా, ఒకసారి తెలంగాణ అధ్యక్షుడిగా ఉన్నారు) నియామకం తర్వాత పార్టీలో అన్నీ కుదురుకోడానికి కొంత సమయం పట్టింది. ఆ లోగానే ముఖ్య నేతలు, జాతీయకార్యవర్గసభ్యుల స్థాయి నాయకుల అసంతృప్త స్వరాలు కూడా ఒక్కసారిగా పెరిగాయి. ఢిల్లీ లిక్కర్‌స్కాంలో ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాను అరెస్ట్ చేసి, ఇంతవరకు బెయిల్ రాకుండా జైల్లో పెట్టగా, ఇదే కేసులో ప్రమేయముందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితను ఈడీ విచారించినా తదుపరి చర్యలు ఎందుకు తీసుకోలేదు ? కాళేశ్వరం, ఇతర ప్రాజెక్ట్‌ల్లో అవినీతి, అక్రమాలు జరిగాయని స్వయంగా ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా బహిరంగసభల్లోనే ప్రస్తావించినా కేసీఆర్ సర్కార్‌పై తదుపరి చర్యలెందుకు తీసుకోలేదు ?.. దీంతో బీఆర్‌ఎస్‌తో బీజేపీకి లోపాయికారి అవగాహన ఉందనే అనుమానాలను పార్టీపెద్దలు ఏ విధంగా దూరం చేస్తారనే ప్రశ్నలు సంధించారు. అసంతృప్త నేతల సమావేశాలు, బీఆర్‌ఎస్-బీజేపీ దోస్తీపై చర్చ కూడా బీజేపీకి నష్టం చేసిందనే చెప్పాలి.

పెరిగిన అసంతృప్త స్వరాలతో నష్టం?

మోదీ మాటలతో మళ్లీ ఊపు



ఈ నెల 1న మహబూబ్‌నగర్, 3న నిజామాబాద్ సభల ద్వారా ప్రధాని మోదీ బీఆర్‌ఎస్ వంటి అవినీతి పార్టీతో బీజేపీకి పొత్తు ఉండదని స్పష్టం చేశారు. దీంతో పాటు తమను ఎన్డీఏలో చేర్చుకోవాలని, జీహెచ్‌ఎంసీ పాలకమండలిలో బీఆర్‌ఎస్-బీజేపీ కలిసి పనిచేద్దామంటూ సీఎం కేసీఆర్ తన వద్దకు వచ్చి చేసిన విజ్ఞప్తిని తిరస్కరించానని స్పష్టం చేశారు. అదేవిధంగా కేటీఆర్‌ను సీఎం చేసేందుకు సహకరించాలని కోరితే ఇది ప్రజాస్వామ్యమని రాచరికం కాదని చెప్పానని మోదీ పేర్కొన్న తర్వాత ఈ పరిస్థితిలో కొంత మార్పు వచ్చిందని, పార్టీలో మళ్లీ ఊపు వచ్చిందని నేతలు చెబుతున్నారు.

అప్పుడు 40 సీట్లలో మెజారిటీ..

2019 లోక్‌సభ ఎన్నికలపుడు బీజేపీకి వివిధ ఎంపీ సీట్ల పరిధిలో దాదాపు 40 అసెంబ్లీ స్థానాల్లో మెజారిటీ లభించడంతో... అప్పటి నుంచి పార్టీ మరింతగా పుంజుకున్నందున 60-70 సీట్లలోనైనా గెలుస్తామనే విశ్వాసాన్ని ముఖ్య నేతలు వ్యక్తం చేస్తున్నారు. గత లోక్‌సభ ఎన్నికల తర్వాత వరసగా బీజేపీ బలం పుంజుకోవడంతో పాటు... అధికార బీఆర్‌ఎస్‌తో పోటాపోటీగా నువ్వా నేనా అన్నట్టుగా దుబ్బాక, హుజురాబాద్ ఉప ఎన్నికల్లో తలపడి బీజేపీ అభ్యర్థులు ఎం.రఘునందన్‌రావు, ఈటల రాజేందర్ గెలుపొందారు. మునుగోడు ఉప ఎన్నికల్లో విజయం దగ్గర దాకా చేరుకుని దాదాపు 12 వేల ఓట్ల తేడాతో బీజేపీ అభ్యర్థి కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి ఓటమి పాలయ్యారు. ఐనా అది కూడా తమ నైతిక విజయమేనని, గత ఎన్నికల్లో మునుగోడులో సాధించిన 12వేల ఓట్ల నుంచి 87 వేల ఓట్లకు చేరుకోవడమంటే మామూలు విషయం కాదని బీజేపీ నాయకులు గట్టిగా వాదిస్తున్నారు. గత లోక్‌సభ ఎన్నికల తర్వాత 2020 డిసెంబర్ లో జరిగిన జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో 48 మంది కార్పొరేటర్లు గెలుపొందడం ద్వారా బీజేపీ సంచలనం సృష్టించింది. అంతకు ముందు ఆ పార్టీకి నలుగురు మాత్రమే కార్పొరేటర్లు ఉండగా ఏకంగా వారి సంఖ్య 48కు చేరుకోవడం ద్వారా బీజేపీ పట్ల ప్రజల్లో ముఖ్యంగా పట్టణ ప్రాంతం ...అర్బన్‌ఓటర్లలో ప్రభావం పెరుగుతోందని, హిందుత్వ నినాదంతో ఓటర్ల పోలరైజేషన్ దిశగా హైదరాబాద్ ప్రజలు అడుగులు వేస్తున్నారనే చర్చ కూడా అప్పట్లో బలంగానే సాగింది. అంతకు ముందు 2018 డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 105 స్థానాల్లో డిపాజిట్లు కోల్పోయింది. కేవలం 7 శాతం ఓట్లే పార్టీ ఖాతాలో పడ్డాయి. మళ్లీ మరో నాలుగు నెలల్లోనే అంటే 2019 ఏప్రిల్‌లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో సొంతంగా పోటీచేసి ఉత్తర తెలంగాణలోని కీలకమైన కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్‌తోపాటు సికింద్రాబాద్ ఎంపీ సీట్లు గెలుచుకుని సత్తా చాటింది. గత ఎన్నికల్లో ఏ పార్టీతో పొత్తు లేకుండా ఒంటరిగా పోటీ చేసి 20 శాతం ఓట్లను సాధించి అందరి అంచనాలను తలకిందులు చేయడం రాజకీయ పరిశీలకులను సైతం ఆశ్చర్యానికి గురిచేసింది. మళ్లీ అలాంటి ప్రదర్శనే కనబరిచి గణనీయమైన సంఖ్యలో ఎమ్మెల్యే సీట్లు గెలువగలుగుతుందా ? అనే నమ్మకాన్నే, ధీమానే బీజేపీ శ్రేణులు వ్యక్తం చేస్తున్నాయి.

అప్పు చేసి.. ఆస్తి అమ్మి..

ఎన్నికల బరిలో నిలిచి గెలిచేందుకు అభ్యర్థుల తంటాలు

ఎన్నికల ఖర్చు కోసం దొరికిన చోటల్లా అప్పు చేసేవారు కొందరైతే... భూములు, ఆస్తులు అమ్ముతున్నవారు మరికొందరు ఉన్నారు. ఎలాగైనా గెలవాలనే భావనతో ఖర్చు ఎంత అయినా సరే అంటూ బరిలో ఉంటున్నారు.

గాటే దేవేందర్

ఆయన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఓ నియోజకవర్గానికి చెందిన ప్రధాన పార్టీ అభ్యర్థి.. చాలా ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నా ఏం వెనకేసుకున్నాడో ఎవరికీ పెద్దగా తెలియదు. కానీ ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుంచి తెలిసినవారిని, పరిచయం ఉన్నవారిని కలుస్తూ.. కాస్త డబ్బులు సర్దాలంటూ కోరుతున్నారు. చేబదులుగానే కాదు భూమిని తాకట్టు పెట్టి, అప్పులు చేసి మరీ ఎన్నికల ఖర్చు కోసం వీలైనంత సొమ్మును రెడీ చేసుకుంటున్నారు. ''నా దగ్గర ఉన్న దబ్బుకు తోడు అక్కడా ఇక్కడా మరింత సర్దుబాటు చేసుకుంటున్నాను. అవసరం మనది. నానా రకాల పత్రాల మీద సంతకాలు చేయించుకోనిదే ఎవరూ దబ్బులు ఇవ్వట్లేదు..'' అని సదరు అభ్యర్థి పేర్కొన్నారు.



గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యే ఆయన.. ఎన్నికల ఖర్చు కోసం ఇటీవలే తన భూమిని అమ్మేశారు. గతంలో ఇతరులకు అప్పుగా, చేబదులుగా ఇచ్చిన సొమ్మును తిరిగి వసూలు చేసుకునే పనిలో ఉన్నారు. ''ఎన్నికల్లో పోటీ ఎక్కువై, ఖర్చు తడిసిమోపెడు అవుతోంది. భూమిపోతే మళ్లీ కొనుక్కోవచ్చు. కానీ ఇప్పుడు ఎమ్మెల్యేగా గెలవకపోతే.. ఐదేళ్ల దాకా ఆగాల్సిందే. అప్పటికి పరిస్థితి ఎలా ఉంటుందో తెలియదు. దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకోవాలి అన్నట్టు.. దొరికిన చోటల్లా డబ్బు సిద్ధం చేసుకుని అయినా ఈసారి గట్టెక్కాల్సిందే..'' అని సదరు ఎమ్మెల్యే అంటున్నారు.

... ఇలా ఈ ఇద్దరే కాదు, ఎన్నికల బరిలోకి దిగుతున్న అభ్యర్థులందరిదీ ఇదే మాట. ఇప్పటికే ఎమ్మెల్యేలుగా ఉన్నవారి నుంచి కొత్తగా బరిలోకి దిగుతున్న వారి వరకు ఇదే వరుస. ముందు జాగ్రత్తగా ఇప్పటికే సొమ్ము రెడీ చేసుకుంటున్నవారు కొందరు.. పార్టీల నుంచి టికెట్ ఖరారుకాగానే బరిలోకి దూకేందుకు ప్రయత్నిస్తున్నవారు మరి కొందరు. స్వతంత్రులుగానో, ఏదైనా చిన్న పార్టీ నుంచో పోటీ చేయడానికి సిద్ధమైనవారు ఇంకొందరు.. ఎవరిని కదిలించినా ఆఫ్ ది రికార్డుగా 'ఖర్చు' కష్టాలను ఏకరవు పెడుతున్నారు.

సమయం దగ్గరపడుతుండటంతో..: బీఆర్‌ఎస్ తరపున మెజారిటీ ఎమ్మెల్యేలే మళ్లీ బరిలోకి దిగుతున్నారు. బీ-ఫారాలు కూడా అందుకుని ప్రచారమూ ముమ్మరం చేశారు. మరో వైపు కాంగ్రెస్ పార్టీ కూడా రెండు జాబితాలు విడుదల చేసింది. బీజేపీ కూడా 53 మంది అభ్యర్థులను ప్రకటించింది. మిగతా సీట్లపై కసరత్తు చేస్తోంది. ఎన్నికల సమయం దగ్గరపడుతుండటంతో.. ఇప్పటికే టికెట్లు ఖరారైనవారు దూకుడుగా ముందుకు వెళ్తుండగా.. టికెట్ కచ్చితంగా దక్కుతుందన్న భరోసా ఉన్నవారూ 'ఖర్చు' మొదలు పెట్టేశారు. ఇక టికెట్ ఆశిస్తున్నవారూ అస్త్రశస్త్రాలను సిద్ధంగా పెట్టుకుంటున్నారు. అంతా డబ్బు సమీకరణ ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. ఎంత ఖర్చవుతుంది, ఎంత సమకూరింది, ఇంకా ఎంత అవసరమనే లెక్కలు వేస్తున్నారు. ఎన్నికల కోడ్, తనిఖీల నేపథ్యంలో ఎక్కడికక్కడే నమ్మకస్తులు, అనుచరుల వద్ద డబ్బును సిద్ధంగా పెట్టి.. ఏయే సమయంలో, ఏ ఖర్చులకు వాడాలో సూచిస్తున్నారు.

జంగ్ తెలంగాణ

సిద్దిపేటలో 200 నామినేషన్లు వేస్తాం



అమరవీరుల కుటుంబాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రఘుమారెడ్డి

సిద్దిపేట కమాన్: తెలంగాణ అమరవీరుల కుటుంబాలు, ఉద్యమకారుల ఐక్యవేదిక, దళిత సంఘాల జేఏసీ, ప్రజా సంఘాలతో కలిసి సిద్దిపేట నియోజకవర్గంలో 200 నామినేషన్లు వేస్తామని అమరవీరుల కుటుంబాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రఘుమారెడ్డి ప్రకటించారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం అమరవీరుల కుటుంబ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం ఏర్పాటు కోసం సుమారు 1,386 మంది ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమకారుల త్యాగాలను గుర్తించడానికి ప్రభుత్వానికి సమయం దొరకడం లేదా? అని ప్రశ్నించారు.

ఆటా.. పాట.. అండాదండ


కల్వల మల్లికార్జున్ రెడ్డి

''నడువు నడువు నడువవే రామక్కో..
కలిసి నడుము కట్టవే రామక్కా..
గులాబీల జెండలే రామక్కా..''

భారత్ రాష్ట్ర సమితి ఎన్నికల ప్రచార రథాలు, బహిరంగ సభా వేదికలపై నుంచి మార్మోగుతున్న పాట ఇది. కల్వకుర్తి రైతుకూలీ కొమ్ము లక్ష్మమ్మ గళం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారి లక్షలాది 'వ్యూ'లతో దుమ్ము రేపుతోంది. ఈ తరహా పాటలు, లక్ష్మమ్మ లాంటి వందలాది గొంతులను ఎన్నికల ప్రచార సభలో పదునైన ఆయుధంగా వాడుతున్నారు బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్. వాస్తవానికి రాష్ట్ర సాధన ఉద్యమంలోనూ 'పాట'ను ముందు భాగంలో నిలిపి తన ఎజెండాను జనసామాన్యంలోకి తీసుకెళ్లేందుకు కేసీఆర్ అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. ఇప్పుడు కూడా అదే పరంపరను కొనసాగిస్తూ ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలోనూ 'గళబలం'తో బీఆర్‌ఎస్ ముందుకు సాగుతోంది.

ఉద్యమంలో అగ్రస్థానం..: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ కాలంలో స్థానిక చరిత్ర, సంస్కృతి, అమరుల త్యాగాలు, కరువు దుఃఖాన్ని ప్రతిబింబించే పాటలతో ప్రజల్లో భావవ్యాప్తి ద్వారా చైతన్యం నింపేందుకు కేసీఆర్ అధిక ప్రాధాన్యతనిచ్చారు. కొన్నిసార్లు తానే స్వయంగా కలం చేతబూని కొత్త పాటలు సృష్టించిన సందర్భాలు కూడా అనేకం ఉన్నాయి. ఇక 'ధూం ధాం' వంటి వేదికల ద్వారా వందలాది మంది తెలంగాణ కవి గాయకులు తమ ఆట పాటలతో రాష్ట్ర సాధన ఉద్యమాన్ని శిఖరాగ్రానికి చేర్చారు.

ఎన్నికల ప్రచారంలోనూ..: తెలంగాణ ఆవిర్భావం నేపథ్యంలో జరిగిన 2014 ఎన్నికలతో పాటు 2018 అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్ పాటను ఆలంబనగా చేసుకుని జనసామాన్యానికి చేరువైంది. ఉద్యమ కాలం నాటి 'ఎనకముందు జూసుడేంది రాజన్న.. ఓ రాజన్న .. ఎత్తుర తెలంగాణ జెండా రాజన్న ఓ రాజన్న', 'మన ఓటు మన తెలంగాణకే అన్నో రామన్నా.. మన ఓటు మన కారు గుర్తుకే అక్కో సీతక్కా...' అంటూ తెలంగాణ తెగువను, చైతన్యాన్ని గుర్తు చేస్తూ 2014 ఎన్నికల ప్రచారంలో జనంలోకి వెళ్లిన బీఆర్‌ఎస్ తొలిసారిగా అధికారాన్ని చేపట్టింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 'మానవతకు మారు పేరు కేసీఆర్ సారూ.. మళ్లీ గెలిచి రావాలె.. మనసుగల్ల సర్కారు' అంటూ బీఆర్‌ఎస్‌కు మద్దతుగా పాటలు కట్టిన కవులు, గాయకులు పార్టీ విజయంలో తమ వంతు పాత్ర పోషించారు. ఇక ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభల్లోనూ పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వ విజయాలను గుర్తు చేస్తూ, ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను జనం భాషలో వివరిస్తూ కళా బృందాలు ఆడి పాడుతున్నాయి.



తమ కలాలు, గళాలతో తెలంగాణ ఉద్యమానికి ఊపు తెచ్చిన కవి గాయకులు పలువురిని.. రాష్ట్రం సాధించి అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ తగిన విధంగా అందలమెక్కించారు. 580 మంది కవులు, కళాకారులకు 'సాంస్కృతిక సారథి' ద్వారా ఉద్యోగాలు ఇవ్వడం ద్వారా ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారంలో మమేకం చేశారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో సాంస్కృతిక విభాగాన్ని ముందుండి నడిపిన రసమయి బాలకిషన్ ఇప్పటికే రెండుమార్లు ఎమ్మెల్యేగా గెలిచి, ప్రస్తుతం మూడోసారి ఎన్నికల బరిలో నిలిచారు. తెలంగాణ వాగ్గేయకారుడిగా పేరొందిన గోరటి వెంకన్న గవర్నర్ కోటాలో, ఉద్యమాన్ని తన పాట, మాటతో ఉర్రూతలూగించిన కవి గాయకుడు దేశపతి శ్రీనివాస్ ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా పనిచేస్తున్నారు. అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత బీఆర్‌ఎస్ ప్రచార వేదికలపై అంతా తానై వ్యవహరించిన గాయకుడు వేద సాయిచంద్‌కు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా కేసీఆర్ బాధ్యతలు అప్పగించారు. ఆయన ఆకస్మిక మరణానంతరం భార్య రజనికి కార్పొరేషన్ పదవి ఇవ్వడం, ఆర్థికంగా ఆదుకోవడం వంటివి కళాకారుల్లో సరికొత్త ఆత్మ విశ్వాసాన్ని, భరోసాను నింపాయి. సాయిచంద్ మరణం తర్వాత జరుగుతున్న ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో మిట్టపల్లి సురేందర్, పెద్దింటి మధుప్రియ, ఏపూరి సోమన్న తదితరులు బీఆర్‌ఎస్ ఆటపాటల బాధ్యతను తలకెత్తుకున్నారు.

పాటకు పదవులు

అధికారంలోనూ భాగస్వామ్యం కల్పించారు



ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన రాష్ట్ర సాధన ఉద్యమంలో వందలాది కళాలు, గలాలు పుట్టుకొచ్చి తెలంగాణ కరువు, దుఃఖాన్ని కళ్లకు కట్టాయి. ఓ వైపు తెలంగాణ సంస్కృతిని చాటుతూనే మరోవైపు రాష్ట్ర సాధన వైపుగా జనసామాన్యాన్ని చైతన్యవంతులను చేశాయి. కవులు, కళాకారులను కరివేపాకులా తీసేయకుండా వారికి అధికారంలోనూ భాగస్వామ్యం కల్పించిన ఘనత కేసీఆర్‌దే. – దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్సీ

పాట బలం తెలిసిన వ్యక్తి కేసీఆర్



పాట బలాన్ని తెలుసుకున్న ఏకైక నాయకుడు కేసీఆర్. ఎన్నికల ప్రచారసభల్లో తెలంగాణ తెచ్చిన వారిని, అభివృద్ధి బాటను చూపిన వారిని గుర్తుంచుకోండి అని ఆట పాటలతో ప్రజలకు చెబుతున్నాం. – పెద్దింటి మధుప్రియ

పాటకు గొడుగు పట్టిందే కేసీఆర్



రాజకీయం పాటను ఎప్పుడూ స్వార్థానికే వాడుకుంది. కానీ పాటను మరిచిపోకుండా అక్కున చేర్చుకుని గౌరవించిన ఏకైక నాయకుడు కేసీఆర్ మాత్రమే. ఉద్యమ కాలం నాటి కలాలు, గళాలను రాజకీయ అందలం ఎక్కించిన ఘనత కేసీఆర్‌దే. – మిట్టపల్లి సురేందర్, కవి, గాయకుడు

గళ బలంతో దూసుకుపోతున్న బీఆర్‌ఎస్
ఎన్నికల ప్రచార అస్త్రాల్లో పాటకు పెద్ద పీట
మార్మోగుతున్న 'నడువు నడువు నడువవే రామక్కో..' లాంటి పాటలు

రాజ్యాంగం చదివిన నాయకులెందరు?



వనం దుర్గాప్రసాద్

- ఐదేళ్లకోసారి జనంతో కాంట్రాక్ట్.... టోటల్‌గా మార్చేసిన గ్లోబలైజేషన్
- పాత్ర కోల్పోయిన బ్యూరోక్రసీ
- భూమి పెట్టుబడి వస్తువైంది.. ధరలు పెరిగింది అందుకే
- పల్లె వాకిట వసతులున్నా... ప్రజలు పట్నం బాట

రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్ నాగిరెడ్డి

Interview

ప్రజల కోసం కాకుండా, పవర్ కోసమే పథకాలు పుట్టుకొస్తున్నాయనేది రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్, ఆర్థిక శాఖ మాజీ ముఖ్యకార్యదర్శి వి.నాగిరెడ్డి ఆవేదన. ఎన్నికల ప్రక్రియను ఐదేళ్ల కాంట్రాక్టుగానే పార్టీలు చూస్తున్నాయన్నది ఆయన మాటల్లోని అంతరార్థం. కార్పొరేట్ విధాన రాజకీయాలనే అన్ని పార్టీలూ అనుసరిస్తున్నాయన్నది ఆ పెద్దాయన నిశిత పరిశీలన.

సీనియర్ ఐఏఎస్‌గా ఉమ్మడి రాష్ట్రంలో వివిధ హోదాల్లో పనిచేసిన నాగిరెడ్డి తెలంగాణలో ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శిగా..రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. తాజా ఎన్నికల నేపథ్యంలో పార్టీలూ, వారిచ్చే జనాకర్షణ పథకాల హామీలు..మారుతున్న రాజకీయ ముఖచిత్రంపై 'సాక్షి'తో నిర్మొహమాటంగా తన భావాలను పంచుకున్నారు. ఆయన మాటల్లోనే.

రాజకీయమే తప్పు.. రాజ్యాంగం గురించి తెలుసా?

ప్రపంచీకరణ ప్రభావం కావొచ్చు. రాజకీయాలు పూర్తిగా మారిపోయాయి. ఎంతమంది నాయకులు రాజ్యాంగం చదివారు? ఎంతమందికి చట్టాల గురించి తెలుసు? వారు చెప్పిందే చట్టం అనుకుంటున్నారు. ప్రజలకు ఇష్టమొచ్చినట్టుగా వాగ్దానాలిస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తమకెందుకు అంటున్నారు. ఏదైనా పథకం తేవాలంటే అధికారులు అన్ని కోణాల్లో పరిశీలించేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ఐదు గంటల్లో పథకం రూపురేఖలు వెల్లడించాలనే ఒత్తిడి తెస్తున్నారు. డాక్టర్ వైఎస్.రాజశేఖర రెడ్డి హయాంలో మినహా... తెలంగాణలో ప్రభుత్వ పథకాలు ప్రకటించిన విధంగా అమలవ్వలేదు. ఉప ఎన్నికలొస్తే ఆ ప్రాంతానికి మాత్రమే హడావిడిగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. ఇంకేదైనా రాజకీయ అవసరం అనుకుంటే ముందుకెళ్తారు. ఇదెక్కడి గవర్నెన్స్. కార్పొరేట్ స్టైల్‌లో ఉందే!

పునాదుల్లేని పథకాలు

తెలంగాణ ఏర్పడ్డ తర్వాత పొలిటికల్ తప్పు... ప్రొసీజర్ కన్పించడం లేదు. బ్యూరోక్రాట్స్ వాస్తవ పరిస్థితిని వివరించే అవకాశం ఉండటం లేదు. సంక్షేమ పథకాలకు పురిట్లోనే పునాది వేయాలి. మనకుండే అవకాశాలు, ప్రజల డిమాండ్, వనరులు... ఇవన్నీ పరిశీలించాకే పథకాన్ని అమలు చేయాలి. కానీ తెలంగాణలో అలాంటి కసరత్తు లేదు. పాలించే నేత కలలో వచ్చిందే పథకమైతే... దానికి పునాదులెక్కడుంటాయి. అందుకే రాష్ట్రంలో ఏ పథకమైనా పూర్తిస్థాయిలో ముందుకెళ్లడం లేదు. ఇది ప్రజలకు నిరాశ కల్గించే అంశమే కాదు... రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపైనా ప్రభావం చూపుతుంది.

స్థానిక సంస్థలకే బాధ్యతలిస్తే...?

సంక్షేమ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపికలో స్థానిక సంస్థలను భాగస్వాములను చేయాలి. అప్పుడే మంచి ఫలితాలొస్తాయి. జవాబుదారీతనం పెరుగుతుంది. అధికారులకు ఈ బాధ్యత ఇవ్వడం వల్ల రకరకాల ఒత్తిడులు ఉంటాయి. స్థానిక గ్రామ సర్పంచ్ నేతృత్వంలో లబ్ధిదారుల ఎంపిక జరిగితే... ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంటుంది. ఇక పథకాల రూపకల్పన, వాటి విధివిధానాలు పల్లె ప్రజల మనోభావాల్లోంచి పుట్టుకురావాలి. దురదృష్టమేంటంటే ... మన నాయకులు ప్రజలకు దగ్గరగా ఉండటం లేదు. వారి అభిరుచి ఏంటో తెలుసుకోవడం లేదు.

రైతుకు ఇస్తున్నదేంటి?

ఓట్ల రాజకీయంలో రైతు పాత్ర ముఖ్యమైంది. అందుకే రైతుకు పోటీపడి పథకాలు ఇస్తామంటున్నాయి పార్టీలు. నిజాన్ని ఒక్కసారి పరిశీలించండి. మనం రైతుకు ఇస్తున్నదెంత? ఇచ్చేవన్నీ ఉచితాలేనా? కానే కాదు. రైతు ముక్కుపిండి పన్నులు వసూలు చేస్తున్నాయి ప్రభుత్వాలు. కొన్నేళ్లు వెనక్కి వెళ్దాం. విత్తనం రైతే తన పంటలోంచి వాడేవాడు. పశు సంపద ద్వారా వచ్చే ఎరువే వాడుకునే వాడు. అరకతో దున్నేవాడు. పురుగుమందుల ముచ్చటే లేదు. ఇక రైతు ట్యాక్స్ చెల్లించాల్సిన పరిస్థితి ఎక్కడ? కానీ ఇప్పుడు విత్తనం. పురుగుమందు, ఎరువులు, ట్రాక్టర్లు అన్నీ మార్కెట్లో కొనాల్సిందే. ప్రతీ చోట రైతు ట్యాక్స్ కట్టాల్సిందే. అంటే ప్రభుత్వానికి చెల్లించే పన్నుల్లో రైతు వాటా సున్నా నుంచి ఎన్నో రెట్లు పెరిగింది? ఇంకా ఉచితాలు ఇచ్చామంటారేంటి? గిట్టుబాటు ధర ఇస్తే సరిపోతుంది.

భూముల విలువలు పెరగడం అభివృద్ధా?

గ్లోబలైజేషన్ తర్వాత భూమి కూడా ఓ పెట్టుబడి వస్తువైంది. ఇప్పుడు రియల్ ఎస్టేట్ రంగాన్ని కార్పొరేట్ శక్తులు ఎంచుకున్నాయి. అందుకే వాటి విలువ పెరిగింది. ఎకరం రూ. కోటికి అమ్మిన రైతు రూ. 50 లక్షలతో వేరొక చోట కొంటున్నాడు. అక్కడి రైతు వేరే చోటుకు ఇలా భూముల అమ్మకాలు సాగుతున్నాయి. అంతే తప్ప అభివృద్ధి వల్లే భూములు పెరిగాయని చెప్పలేం.


పల్లెలెందుకు ఖాళీ అవుతున్నాయి?

ప్రతీ పల్లెకూ రోడ్లున్నాయి. నీళ్లున్నాయి. కరెంట్ ఉంది. నెట్... డిష్ అన్నీ ఉన్నాయి. పట్టణాలకు సరిసమానంగానే ఉన్నాయి. కానీ పల్లె జనం పట్నం బాట పడుతున్నారు. చదువులు, ఉద్యోగాలు, వ్యాపారాలు అన్నీ పట్టణంతో ముడిపడి ఉన్నాయి. అందుకే అన్నీ ఉన్నా... జనం లేని పల్లెలను మనం చూస్తున్నాం. ఇలా అయితే, మన గ్రామీణ వ్యవస్థ ఏమవుతుంది? దీన్ని పార్టీలూ ఆలోచించాలి.

ఇదేం ఎన్నికల నిఘా!

ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన నిఘా వ్యవస్థ పనితీరు ఆశ్చర్యం కలిగిస్తోంది. రోజు రూ. లక్షల్లో నగదు, నగలు పట్టుకుంటున్నట్టు వార్తలొస్తున్నాయి. ఇదంతా ఎన్నికలకు తరలిస్తున్నదా? ఓ వ్యాపారి నగదు తీసుకెళ్తుంటే పట్టుకోవడం, సాధారణ పౌరుడి వద్ద డబ్బు దొరికిందని చెప్పడం విడ్డూరంగా ఉంది. వీళ్లకు ఎన్నికల్లో డబ్బు పంపిణీకి ఏమైనా సంబంధం ఉందా? ఈ నిఘా వ్యవస్థ ప్రజలను పీడించేలా ఉంది. నేను ఎన్నికల కమిషనర్‌గా ఉన్నప్పుడు దీన్ని ఎంత మాత్రం ఒప్పుకోలేదు. అనుమానం ఉంటే పేరు రాసుకుని అతనికి రాజకీయాలకు సంబంధం ఉందా? అనేది విచారణ చేయమన్నాం. ఇంతమందిని పట్టుకున్నారు సరే. ఇందులో ఏ ఒక్క రాజకీయ నాయకుడైనా ఉన్నాడా? అసలు పంచాల్సిన డబ్బు ఎప్పుడో పల్లెలకు చేరిందనేది నా అనుమానం. అక్కడ వెదకాల్సింది పోయి... అడుగడుగునా సాధారణ పౌరులకు ఇబ్బంది కలిగించడం మంచిది కాదు.

నేతలూ, గీతాలూ – పార్టీలూ, పాటలు!



షుగర్ & పెప్పర్
..:: యాసీన్

ఎన్నికల పనుల ఒత్తిడి తగ్గించుకోడానికి నేతలంతా పాటలు వినడం మొదలుపెట్టారు. ఎఫ్ఎమ్ రేడియో ఆన్ చేయగానే.. ఎందుకోగానీ, వాళ్ల మూడుకు తగ్గట్టు పాటలు రావడమో లేదా వాళ్ల ఆలోచనల ధోరణికి తగ్గట్టుగా పాటల్లోని లిరిక్సు మారడమో జరగడం మొదలైంది. అదెలాగంటే..

మీరు కోరిన పాటల్లో మొదట కేసీఆర్ వింటున్న సాంగు...

కారులో షికారుకెళ్లే పాలబుగ్గల పసిడీదానా..
బుగ్గ మీద గులాబిరంగు...

పాతపాటల కోసం రేడియో పెట్టీపెట్టగానే..'కారు'తో మొదలై..' గులాబిరంగు' దాకా సాగిన పాటను కమ్మగా వింటుండంగానే.. కళ్లు ''ఎర్ర''గా చేసుకుని మరీ ఆకస్మికంగా ఎంట్రీ ఇచ్చారు కమ్యూనిస్టాగరిష్ఠులు.

ఏయ్! ఇది మా పాట..కావాలంటే మిగతాది వినండి..
నిన్ను మించిన కన్నెలెందరో మండుటెండలో మాడిపోతే
వారి బుగ్గల నిగ్గు నీకూ... వచ్చి చేరెను తెలుసుకో...''
స్టేషన్ మార్చారు కేసీఆర్
దండాలయ్యా.. దండాలయ్య మాతోనే నువ్వుండాలయ్యా...

అంటూ వినిపించగానే ఆయన మనసులో ఎంతో ఆనందం. జనాలంతా తనను వాళ్లతోనే ఉండిపోవాలని కోరుతున్నారనీ, తానే పాలించాలని బతిమాలుతున్నారని సంతోషం.

ఇంతలో రేవంత్‌రెడ్డి తాలూకు రీమిక్సు లిరిక్సు...

ఎన్నాళ్లో వేచిన ఉదయం..ఎన్నికల్లో ఎదురవుతుంటే
ఇన్నినాళ్ల ఆశల హృదయం ఎగిసిఎగిసి పడుతుంటే
ఇంకా ఓటెయ్యరేమీ..చెయ్యిని గెలిపించరేమీ
ఇంకా ఓటెయ్యరేమీ..చెయ్యిని గెలిపించరేమీ...
టింగ్ టింగ్ టింగ్ టింగ్ టింగ్ టింగ్ టియ్యో...
టింగ్ టింగ్ టింగ్ టింగ్ టింగ్ టింగ్ కుయ్యో...

రేవంత్ పాట వింటుండగానే ఎందుకో సందేహం వచ్చింది.
అలా డౌటు వచ్చీరాగానే మరో పాట మారిపోయి..
ఇలా వినిపించడం మొదలైంది.

'చేతి'లో చెయ్యేసీ చెప్పు ఓటరూ...
చేసుకున్న బాసలూ చెరిగీ పోవనీ, మాసీ పోవనీ, ఓటూ ఏస్తననీ..

బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కోల్పోయిన బండి సంజయ్ సాంగు..

ఇంతే ఈ జీవితమూ..చివరికి అంతా శూన్యము
అధ్యక్షతనూ ఆశించానూ..ఆశాభంగమె పొందేను
భలే భలే పదవులూ ఇప్పించావు..ఇలా మురిపించావు
అదే అనురాగం..అదే వైభోగం..ప్రభో మళ్లీ నాకేలా ఇయ్యవు?

తన పార్టీ గుర్తును గుర్తు చేస్తూ ఎంఐఎం ఒవైసీకి వినిపించిన పాట...

పదపదవె వయ్యారి గాలిపటమా...
పైన పక్షిలాగ ఎగురుకుంటూ
ఎన్నికల్లో ఏడు మందిని
ఎప్పట్లాగే గెలుచుకుంటూ
కారూ గుర్తూ, పువ్వు గుర్తుల
పక్కచూపులు చూసుకుంటూ...

ఈలోపు రాజగోపాల్‌రెడ్డికి వినిపిస్తున్న పాట ఇలా సాగింది...

నన్ను వీడి నువ్వు పోలేవులే..ఇది నిజములే
చెయ్యి వీడి బీజేపీల ఉండలేవులే..లేవులే..

మామూలు ఓటర్లకు వినిపిస్తున్న పాటలివి...

పార్టీల నేతలంతా...
మొదట..ఊ అంటారూ..వాళ్లూ ఊహూ అంటారు
ముందుగ ఊ అంటారు..తర్వాత ఊహూ అంటారూ
దాంతో ఓటరుకు మిగిలేది...
అంతా భ్రాంతియేనా జీవితానా వెలుగింతేనా...
ఆశా నిరాశేనా..మిగిలేదీ చింతేనా..

హ్యాండిచ్చిన డజన్ మంది జంప్ జిలానీలు





సాక్షి, హైదరాబాద్: ఆ డజను మంది జంప్ జిలానీలు కాంగ్రెస్ పార్టీకి దూరమయ్యారు. అదేంటి...కాంగ్రెస్ పార్టీకి ఇప్పటివరకు వందల డజన్ల మంది నేతలు దూరమై ఉంటారు కదా...ఆ డజను మంది గురించి ఎందుకని అనుకుంటున్నారా..? అక్కడే ఉంది వీరందరిమధ్యా ఓ సారూప్యత. అదేంటి అంటారా...ఆ డజను మంది గత రెండు ఎన్నికల్లో పోటీ చేశారు. కొందరు గెలిచారు...మరికొందరు ఓడిపోయారు. రాష్ట్రం ఏర్పాటైన తర్వాత జరిగిన రెండు ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ వారిపై నమ్మకంతోనే టికెట్లు ఇచ్చింది. ఆ జాబితాలో ఆత్రం సక్కు (ఆసిఫాబాద్), ఏలేటి మహేశ్వర్ రెడ్డి (నిర్మల్), జాజుల సురేందర్(ఎల్లారెడ్డి), ఆరేపల్లి మోహన్ (మానకొండూరు), వాకిటి సునీతా లక్ష్మారెడ్డి (నర్సాపూర్), కూన శ్రీశైలంగౌడ్ (కుత్బుల్లాపూర్), దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి (ఎల్బీనగర్), డి.కె.అరుణ (గద్వాల), సి.ప్రతాపరెడ్డి (షాద్‌నగర్), బీరం హర్షవర్ధన్‌రెడ్డి (కొల్లాపూర్), చిరుమర్తి లింగయ్య (నకిరేకల్), గండ్ర వెంకటరమణారెడ్డి (భూపాలపల్లి) ఉన్నారు. వీరంతా 2014, 2018లో జరిగిన ఎన్నికల్లో ఆయా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ పక్షాన పోటీ చేశారు. కానీ, ఇప్పుడు పోటీ చేసేందుకు మాత్రం కాంగ్రెస్‌లో మాత్రం లేరు. ఈ 12 మందిలో కొందరు రెండుసార్లూ ఓడిపోయారు కానీ, ఏ ఒక్కరూ కూడా వరుసగా రెండుసార్లు గెలవలేదు. కారణాలేవైనా...వీరంతా బీఆర్ఎస్, బీజేపీల్లో చేరిపోయారు. వీరిలో ఒకరిద్దరు మినహా ఇప్పుడు ఆయా పార్టీల నుంచి బరిలో ఉంటున్నారు.

కాలేజీ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు.. పాత పింఛను అమలు

మరికొన్ని ఎన్నికల హామీలను ప్రకటించిన రాజస్తాన్ సీఎం గెహ్లోత్



జైపూర్: రాజస్తాన్ సీఎం అశోక్ గెహ్లోత్ అయిదు గ్యారెంటీలను ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగులకు పాత పింఛను విధానం అమలు, గోధన పథకం కింద ఆవుపేడను కిలో రెండు రూపాయల చొప్పున కొనుగోలు, కాలేజీ విద్యార్థులకు ల్యాప్‌టాప్ లేదా టాబ్లెట్ పీసీ పంపిణీ ఇందులో ఉన్నాయి. నవంబర్ 25వ తేదీన అసెంబ్లీకి జరిగే ఎన్నికల్లో తమ పార్టీని మళ్లీ గెలిపిస్తే వీటిని నెరవేరుస్తామని ఆయన శుక్రవారం మీడియా సమావేశంలో హామీ ఇచ్చారు. త్వరలోనే పార్టీ మేనిఫెస్టోను విడుదల చేస్తామన్నారు. స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెడతామని, ప్రకృతి వైపరీత్యాల్లో నష్టపోయిన వారికి రూ.15 లక్షల బీమా కల్పిస్తామని చెప్పారు. పాత పింఛను విధానాన్ని భవిష్యత్తులో కూడా కొనసాగించేలా చట్టం చేస్తామన్నారు. ప్రభుత్వ కాలేజీల్లో చేరే విద్యార్థులకు మొదటి ఏడాదిలోనే ల్యాప్‌టాప్ లేదా టాబ్ ఇస్తామన్నారు. ఇవి కాకుండా, వంటగ్యాస్ సిలిండర్‌ను రూ.500కే అందజేయడం, రాష్ట్రంలోని 1.05 కోట్ల కుటుంబాల్లోని ఒక్కో మహిళకు ఏడాదికి విడతలుగా రూ.10 వేల చొప్పున అందజేస్తామని ఇప్పటికే ఆ పార్టీ నేత ప్రియాంకా గాంధీ వాద్రా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సీఎం గెహ్లోత్ కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)ని దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. 'దేశంలో ఈడీ వీధి కుక్కల కంటే ఎక్కువగా హడావుడి చేస్తోందని ఒక సీఎం(భూపేష్ బఘేల్) అనాల్సి వచ్చింది. ఇంతకంటే దౌర్భాగ్యం ఇంకేముంటుంది?'అని వ్యాఖ్యానించారు. అంత మాట అన్నారంటే ఆయన ఎంతగా బాధపడ్డారో అర్థం చేసుకోవాలని పేర్కొన్నారు. 'దర్యాప్తు విభాగాలు మీకు రాజకీయ ఆయుధాలుగా మారాయి. మోదీజీ, మీకు అర్థం కావడం లేదు. మీకు కౌంట్‌డౌన్ మొదలయ్యింది'అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ గోవింద్ సింగ్ దోతాస్రా ఇంటిపై గురువారం ఈడీ దాడులు జరిగిన విషయం తెలిసిందే.

'మిజో జాతీయవాదం' గట్టెక్కించేనా!?

సీఎం జోరాం ఆశలన్నీ దానిమీదే • భయపెడుతున్న ప్రభుత్వ వ్యతిరేకత, అవినీతి ఆరోపణలు


అసెంబ్లీ ఎన్నికలు మరో పది రోజుల్లోకి వచ్చిన తరుణంలో మిజోరం సీఎం, మిజో నేషనల్ ఫ్రంట్ సారథి జోరాం తంగా మరోసారి మిజో జాతీయవాదాన్ని నెత్తికెత్తుకున్నారు. బీజేపీకి మిత్రపక్షం అయ్యుండి కూడా పలు విషయాల్లో కేంద్రంతో విభేదిస్తూ వస్తున్నారు. తద్వారా తనను తాను మిజోల ప్రయోజనాల పరిరక్షకునిగా చిత్రించుకునే ప్రయత్నం చేస్తున్నారు. అందుకోసం తనలోని ఒకప్పటి వేర్పాటువాద నాయకుడు, గెరిల్లా యోధున్ని బయటకు తెస్తున్నారు. ఇది ఆయనకు ఏ మేరకు లాభిస్తుందో చూడాలి...

మిజోరంలో అధికార ఎంఎన్ఎఫ్ నిజానికి ఎన్డీఏ కూటమిలో భాగస్వామే. కానీ అసెంబ్లీ ఎన్నికల వేళ మాత్రం ఎవరి దారి వారిదే నన్నట్టుగా సీఎం తంగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల ప్రచారం నిమిత్తం ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రానికి వచ్చినా ఆయనతో కలిసి వేదిక పంచుకునేది లేదని కూడా ఇటీవలే ఆయన బాహాటంగా ప్రకటించారు. తద్వారా రాష్ట్ర ఓటర్ల మనసు గెలుచుకునే ప్రయత్నం చేస్తున్నారు. పొరుగు రాష్ట్రం మణిపూర్‌లో మెయితీలతో చెలరేగుతున్న హింసాకాండలో కుకీ తెగకు పూర్తి మద్దతిస్తున్నారు. కేంద్రం సూచనను తోసిరాజని మరీ 12 వేల మందికి పైగా కుకీ శరణార్థులకు రాష్ట్రంలో ఇప్పటికే ఆశ్రయమిచ్చారు. వారితో పాటు మయన్మార్‌కు చెందిన కుకీలకు కూడా ఆశ్రయమిస్తున్నారు! క్రైస్తవ మెజారిటీ రాష్ట్రమైన మిజోరంలో ఈ చర్య కచ్చితంగా ఓటర్లపై సానుకూల ప్రభావం చూపుతుందని ఆయన నమ్ముతున్నారు. ''మన మంతా క్రైస్తవులమే. మణిపూర్‌లో మెయితీలు చర్చిలను తగలబెట్టడం వంటి అనాగరిక చర్యలకు అక్కడి బీజేపీ సర్కారు పరోక్షంగా మద్దతిస్తోంది. అలాంటి పార్టీకి మన రాష్ట్రంలో సహకరించడం కల్ల''అని ఇటీవల ఒక ఎన్నికల సభలో, బీబీసీ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారాయన. అటువంటి పార్టీలకు ఓటేయొద్దని ఆయనతో పాటు మంత్రివర్గ సహచరులు కూడా జోరుగా ప్రచారం చేస్తున్నారు. అయితే కేవలం మిజో నేషనలిజం మాత్రమే పని చేస్తుందా అన్నది ప్రశ్న.

ప్రతికూలతలెన్నో...

ప్రజల్లో స్పష్టంగా కనిపిస్తున్న ప్రభుత్వ వ్యతిరేకత ఎంఎన్ఎఫ్‌కు గుబులు రేపుతోంది. తీవ్ర అవినీతి ఆరోపణలు దానికి తోడవుతున్నాయి. ఇవేగాక కరోనా కల్లోలాన్ని ఎదుర్కోవడంలో తంగా సర్కారు విఫలమైందన్న ఆగ్రహం ప్రజల్లో ఇంకా బలంగా ఉంది. ఆర్థిక అవ్యవస్థ కారణంగా రాష్ట్రం రుణ భారంలో పీకల్లోతు కూరుకుపోయింది. చివరికి ప్రభుత్వోద్యోగులకు సకాలంలో వేతనాలు, పెన్షన్లు కూడా ఇవ్వలేని పరిస్థితి! ఇవన్నీ ఎంఎన్ఎఫ్‌కు ప్రతికూలమేనని చెబుతున్నారు. పైగా సీఎం తంగాపై వెల్లువెత్తిన అవినీతి ఆరోపణలు మరో ఎత్తు. ఆయనపై అప్పట్లో అవినీతి వ్యతిరేక విభాగం చార్జిషీట్ కూడా దాఖలు చేయడాన్ని విపక్షాలు తెరపైకి తీసుకొస్తున్నాయి. తంగా ఆశ్రిత పక్షపాతానికి పాల్పడ్డారని, మేనల్లునికి పలు కాంట్రాక్టులు కట్టబెట్టారని మిజోరం ఫస్ట్ స్వచ్ఛంద సంస్థ చేసిన ఆరోపణలు కూడా బాగానే ప్రభావం చూపుతున్నాయి. సెర్చిప్ జిల్లాకు చెందిన వన్లాల్‌సంగ అనే 27 ఏళ్ల సివిల్స్ అభ్యర్థి అదే చెప్పాడు. ''కుకీ శరణార్థులకు దన్నుగా నిలుస్తుండటం మెచ్చదగిందే. కానీ యువతకు రాష్ట్రంలో ఉపాధి అవకాశాలే లేవు. దానికి తోడు అవినీతి పెచ్చరిల్లుతోంది''అంటూ ఆగ్రహం వెలిబుచ్చడం తంగా సర్కారుకు ప్రమాద ఘంటికే. పైగా బంగ్లాదేశీ శరణార్థులకు ఆశ్రయమివ్వడంపై ప్రజల్లో భిన్నాభిప్రాయాలున్నాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్



మిజోరం సీఎం జోరాం



మిజోరంలో గత రెండు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు

పార్టీ	2018	2013
ఎంఎన్ఎఫ్	26	5
కాంగ్రెస్	5	34
జెడ్‌పీఎం	8	-
బీజేపీ	1	0
ఇతరులు	0	1


బీజేపీ బహిష్కృత అభ్యర్థినికి కాంగ్రెస్ టికెట్



జైపూర్: రాజస్తాన్ బీజేపీ బహిష్కరించిన సిట్టింగ్ ఎమ్మెల్యే శోభా రాణి కుష్వాహాకు కాంగ్రెస్ పార్టీ టికెట్టిచ్చింది. మాజీ సీఎం వసుంధరా రాజేకు సన్నిహితురాలిగా పేరున్న శోభా రాణి కుష్వాహ 2018 ఎన్నికల్లో ధోల్‌పూర్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. రాజ్యసభ ఎన్నికల సమయంలో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినట్లు ఆమెపై ఆరోపణలు రావడంతో బీజేపీ గత ఏడాది జూన్‌లో పార్టీ నుంచి బహిష్కరించింది. రాష్ట్రంలో పర్యటిస్తున్న కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా సమక్షంలో బుధవారం ఆమె కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన మూడో జాబితాలో ఆమెకు చోటుదక్కింది. మళ్లీ ధోల్‌పూర్ టికెట్‌ను ఆ పార్టీ ఆమెకు కేటాయించింది. శోభారాణి భర్త బీఎస్‌పీ నేత, ధోల్‌పూర్ మాజీ ఎమ్మెల్యే అయిన బీఎల్ కుష్వాహా. 2012లో జరిగిన హత్య కేసులో నిందితుడిగా తేలడంతో ఎమ్మెల్యే పదవిపై అనర్హత వేటుపడింది. అసెంబ్లీలోని 200 సీట్లకు గాను గురువారం ప్రకటించిన మూడో జాబితాలోని 19 మందితో కలిపి కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు 95 పేర్లను ప్రకటించినట్లయింది. రాష్ట్రంలో నవంబర్ 25న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే.

మహిళలకు ఉద్యోగాల్లో 33% కోటా

మిజోరం ఎన్నికల మేనిఫెస్టోలో బీజేపీ వాగ్దానం



ఐజ్వాల్: నవంబర్ 7న మిజోరం అసెంబ్లీ జరగనున్న ఎన్నికలకు శుక్రవారం దార్శనిక పత్రం పేరుతో బీజేపీ చీఫ్ జేపీ నడ్డా మేనిఫెస్టో విడుదల చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు, ప్రస్తుత ఎంఎన్ఎఫ్ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో అవినీతిపై దర్యాప్తు వంటి హామీలు ఇందులో ఉన్నాయి. వాస్తవాలకు అనుగుణంగా పూర్తిస్థాయి అధ్యయనం అనంతరమే ఈ మేనిఫెస్టోను రూపొందించినట్లు ఆయన తెలిపారు. చాలా రాజకీయ పార్టీలు ఆచరణ సాధ్యంకాని, ఆచరణకు నోచుకోని చిత్తశుద్ధి లేని ఎన్నో హామీలిస్తున్నాయని పేర్కొన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే వ్యవసాయ మౌలిక వసతుల అభివృద్ధి కోసం వెయ్యి కోట్ల రూపాయలను ఖర్చు చేస్తుందని చెప్పారు. పూర్తిగా మహిళలతో కూడిన పోలీస్ బెటాలియన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న మిజోరం–అస్సాం సరిహద్దు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆరోగ్య, విద్యారంగాలను బలోపేతం చేస్తామని జేపీ నడ్డా ప్రకటించారు.

మధ్యప్రదేశ్‌లో బీజేపీ స్టార్ క్యాంపెయినర్లు వీరే..

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్ అసెంబ్లీకి నవంబర్ 17వ తేదీన జరగనున్న ఎన్నికలకు గాను శుక్రవారం బీజేపీ స్టార్ క్యాంపెయినర్ల జాబితాను ప్రకటించింది. ఇందులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా సహా 40 మంది పేర్లున్నాయి. యూపీ సీఎం యోగి



ఆదిత్యనాథ్, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, అస్సాం సీఎం హిమాంత బిశ్వ శర్మ, మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, స్మృతి ఇరానీ కూడా స్టార్ క్యాంపెయినర్లుగా ఉన్నారు. వీరితోపాటు మధ్యప్రదేశ్ హోం మంత్రి నరోత్తమ్ మిశ్రా, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, యూపీ డిప్యూటీ సీఎంలు కేశవ్ ప్రసాద్ మౌర్య, బ్రిజేశ్ పాఠక్ తదితరులు కూడా స్టార్ క్యాంపెయినర్లుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు.

సాక్షి కరీంనగర్

శనివారం । 28 । అక్టోబర్ । 2023

ఆర్టీసీకి దసరా ధమాకా

ఆర్టీసీకి కాసుల వర్షం కురిసింది. బతుకమ్మ, దసరా పండుగలు కలిసొచ్చాయి. ఈ నెల 12 నుంచి 26వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడుపగా గతంలో ఎన్నడూ లేని విధంగా 15 రోజుల్లోనే రూ.22.06 కోట్ల ఆదాయం వచ్చింది. కరీంనగర్ రీజియన్ పరిధిలో 11 డిపోలు ఉన్నాయి. బస్సులు 50.47 లక్షల కిలోమీటర్లు తిరిగాయి.

– వివరాలు 10లో..



న్యూస్‌రీల్

ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

- సీపీ ఎల్.సుబ్బారాయుడు



హుజూరాబాద్: ప్రశాంత వాతావరణంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగేందుకు పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్లు సీపీ ఎల్.సుబ్బారాయుడు తెలిపారు. శుక్రవారం హుజూరాబాద్ పట్టణంలో ఎన్నికల బందోబస్తుకు వచ్చిన కేంద్ర, రాష్ట్ర బలగాలతో కవాతు నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తాలో సీపీ విలేకరులతో మాట్లాడారు. ఎటువంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. 250 మంది బృందంతో కూడిన కేంద్ర బలగాలు వచ్చాయని, త్వరలో మరిన్ని వస్తాయన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించినా, గొడవలు సష్టించాలని చూసినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏసీపీ జీవన్ రెడ్డి, ఆర్డీవో రాజు, తహసీల్దార్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతలకు ఓటమి భయం

- అందుకే దాడులకు దిగుతున్నారు
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకష్ణారావు



తిమ్మాపూర్(మానకొండూర్): జిల్లాలో కాంగ్రెస్ నేతలకు ఓటమి భయం పట్టుకుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకష్ణారావు ఆరోపించారు. అందుకే బీఆర్ఎస్ నేతలపై దాడులకు దిగుతున్నారని అన్నారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. గురువారం రాత్రి కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌పై దాడికి యత్నించడాన్ని ఖండించారు. అర్ధరాత్రి సమయంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చొరబడటం ఏంటని ప్రశ్నించారు. దమ్ముంటే ఎన్నికల్లో నిలబడి గెలవాలన్నారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి బాలకిషన్‌దే విజయమని, పిచ్చి పనులు మానుకోకుంటే బీఆర్ఎస్ నాయకులు కూడా ఎదురు తిరుగుతారని హెచ్చరించారు. పార్టీ తిమ్మాపూర్, గన్నేరువరం మండలాల అధ్యక్షులు రావుల రమేశ్, గంప వెంకన్న, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, సొసైటీ చైర్మన్ అనభేరి రాధాకిషన్‌రావు, జెడ్పీటీసీ సభ్యుడు మాడుగుల రవీందర్, కార్యాలయ ఇన్‌చార్జి నాయిని వెంకటరెడ్డి, నాయకులున్నారు.

పోలింగ్ విధుల నుంచి మినహాయింపు ఇవ్వండి



కరీంనగర్: అనారోగ్య సమస్యలు ఉన్న ఉపాధ్యాయులకు పోలింగ్ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముస్కు తిరుపతిరెడ్డి, మర్రి జైపాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ బి.గోపికి వినతిపత్రం అందించారు. నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ విధుల్లో పాల్గొనే టీచర్లలో అనారోగ్య సమస్యలు ఉన్నవారు, గర్భిణులు, ఫీడింగ్ మదర్స్, గుండె శస్త్ర చికిత్స, దివ్యాంగులు, మెటర్నిటీ లీవ్‌లో, లాంగ్ లీవ్‌లో, ఉద్యోగ విరమణకు ఆరు నెలలలోపు సమయం ఉన్నవారు ఉన్నారని తెలిపారు. వీరికి పీవో, ఏపీవో, ఓపీవోల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని విన్నవించారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, సీపీవోకు సిఫార్సు చేస్తూ మినహాయింపు ఇస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

బీహెచ్ఎంసీటీ సెమిస్టర్ల పరీక్ష ఫీజు చెల్లించాలి

కరీంనగర్ సిటీ: శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని బీహెచ్ఎంసీటీ 1వ, 3వ, 5వ సెమిస్టర్ల పరీక్షల ఫీజు చెల్లించాలని వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1వ సెమిస్టర్‌కు రూ.1,600, 3వ సెమిస్టర్‌కు రూ.1,500, 5వ సెమిస్టర్‌కు రూ.1,400 వచ్చే నెల 7వ తేదీలోపు, రూ.300 అపరాధ రుసుముతో 10వ తేదీ వరకు చెల్లించాలని సూచించారు.


అనూహ్య బదిలీ!

- మూడు నెలలకే కలెక్టర్ గోపి..
- తొమ్మిది నెలలకు సీపీ సుబ్బారాయుడు..
- కేంద్ర ఎన్నికల సంఘం ఆకస్మిక నిర్ణయం
- తర్వాతి ర్యాంకు అధికారులకు బాధ్యతలు

సాక్షిప్రతినిధి,కరీంనగర్



డాక్టర్ బి. గోపి



ఎల్. సుబ్బారాయుడు



కరీంనగర్ కలెక్టర్ బి.గోపి, పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బారాయుడు బదిలీ జిల్లా యంత్రాంగాన్ని కుదిపేసింది. కేంద్రఎన్నికల సంఘం తీసుకున్న ఆకస్మిక, అనూహ్య నిర్ణయం జిల్లా రాజకీయ వర్గాల్లో తీవ్రచర్చకు దారితీసింది. ఇటీవల జరిగిన ఐఏఎస్, ఐపీఎస్ బదిలీల్లో జిల్లాకు చెందిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు బదిలీ అయ్యారు. వారంతా సుదీర్ఘకాలం జిల్లాలో సేవలు అందించారు. వారిబదిలీలను సర్వసాధారణంగానే అందరూ భావించారు. కానీ, ఈ ఇద్దరు అధికారులు ఈ ఏడాది జరిగిన బదిలీల్లోనే జిల్లాకు వచ్చారు. తక్కువ సమయంలోనే మళ్లీ బదిలీ కావడం, వారితర్వాత ర్యాంకుల్లో ఉన్న వారికి విధులు అప్పగించాలని ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొనడం ఇటు కమిషనరేట్, అటు కలెక్టరేట్‌లో కలకలం రేపింది. కలెక్టర్ బి.గోపి స్థానంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్‌కి, సీపీ సుబ్బారాయుడు స్థానంలో అడిషనల్ డీసీపీకి బాధ్యతలు అప్పగించనున్నారు.

కుదురుకునేలోపే ట్రాన్స్‌ఫర్

ఈ ఇద్దరు అధికారులు జిల్లాకు కొత్తవారే. ఈ ఏడాది జూలైలో అప్పటి కలెక్టర్ కర్ణన్ బదిలీ అవగా ఆయన స్థానంలో బి.గోపి అదే నెల 26న బాధ్యతలు చేపట్టారు. సరిగ్గా మూడు నెలలకే బదిలీ అయ్యారు. వాస్తవానికి విధి నిర్వహణలో చాలాసూటిగా ఉండే అధికారిగా ఆయన పేరొందారు. పరిపాలనలో రాజకీయ నాయకుల జోక్యాన్ని ఏమాత్రం సహించేవారు కాదు. ఇటీవల ఓ విషయంలో ఓ ముఖ్య ప్రజాప్రతినిధితో విభేదించడం అధికారవర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. గతంలో వరంగల్ కలెక్టర్‌గా, సీసీఎల్ఏలో సెక్రటరీగా పనిచేసి సమర్థుడైన అధికారిగా గుర్తింపు తెచ్చుకున్నారు. కానీ, జిల్లా పరిపాలనపై పట్టు చిక్కుతున్న సమయంలో ఆకస్మికంగా బదిలీ కావడం ఆయనతోటి అధికారుల్లో నిరుత్సాహం నింపింది.

పోస్టింగుల్లో రాజకీయ జోక్యానికి నో

ఈ ఏడాది జనవరి 26న జరిగిన బదిలీల్లో అప్పటి సీపీగా ఉన్న డీఐజీ సత్యనారాయణ రాచకొండకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎల్.సుబ్బారాయుడు బాధ్యతలు చేపట్టారు. ఈయనకు గతంలో ఉమ్మడి కరీంనగర్‌లో ఓఎస్డీగా పనిచేసిన అనుభవం ఉంది. అడ్మినిస్ట్రేషన్, నేర పరిశోధనలో మంచి ఆఫీసర్‌గా గుర్తింపు పొందారు. గతంలో ఉమ్మడి రాష్ట్రానికి గవర్నర్‌గా పని చేసిన నరసింహన్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా, రాష్ట్ర విభజన అనంతరం ఏపీ సీఎం చంద్రబాబు వద్ద సెక్యూరిటీ ఆఫీసర్‌గా పనిచేశారు. అనంతరం ఐపీఎస్‌ల విభజనలో భాగంగా తెలంగాణకు వచ్చారు. నాన్ కేడర్ ఎస్పీగా ఉన్న సమయంలో 2021 డిసెంబర్‌లో ఐపీఎస్‌గా పదోన్నతి పొందారు. కొంతకాలం డీజీపీ కార్యాలయంలో సీఐడీ విభాగంలో ఎస్పీగా విధులు నిర్వహించారు. అనంతరం సీపీగా కరీంనగర్‌లో బాధ్యతలు తీసుకున్నారు. డిపార్ట్‌మెంట్ విషయంలో ఇతరుల జోక్యాన్ని సున్నితంగా తిరస్కరించారు. ముఖ్యంగా ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైల పోస్టింగుల విషయంలో అనేకమార్లు జిల్లా నాయకులతో విభేదించారు. ప్రతిభావంతులకు పోస్టింగులు దక్కేలా తనవంతుగా కిందిస్థాయి అధికారులకు సహకరించారు. అనేక మావోయిస్టు ఆపరేషన్లు నిర్వహించిన అనుభవంతో టెన్త్ పేపర్ లీకేజీ, ఎంపీ బండి సంజయ్ ముందస్తు అరెస్టు సమయాల్లో ఎలాంటి అలజడి లేకుండా జాగ్రత్తగా వ్యవహరించారు. ఈయన వచ్చాక కమిషనరేట్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్‌లు, రాత్రిపూట పెట్రోలింగ్ పెంచారు. భూ దందాలపై ప్రత్యేక నిఘా పెట్టి, అలాంటి నేరగాళ్ల విషయంలో కఠినంగా వ్యవహరించారు. అనతికాలంలోనే ఈ ఇద్దరు అధికారులు విధి నిర్వహణలో నిక్కచ్చిగా వ్యవహరించారన్న పేరు సంపాదించుకున్నారు. శుక్రవారం కరీంనగర్ కలెక్టర్, సీపీ మాత్రమే బదిలీ కావడం చర్చకు దారితీసింది.

ఓ నేత ఫిర్యాదుల ఆధారంగానే?

ఈ ఇద్దరు అధికారులపై ఓ జాతీయ పార్టీకి చెందిన నేత ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. వీరు ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించే అవకాశముందని ఆరోపించినట్లు సమాచారం. సాంకేతిక సమస్యలు కూడా వీరి బదిలీకి కారణమని తెలుస్తోంది.

నలుగురి 'చేతి'కి టికెట్లు

- రెండో విడత అభ్యర్థులను ఖరారు చేసిన కాంగ్రెస్
- వెలమ, కరణం, గౌడ, దళిత నేతలకు చాన్స్
- సిరిసిల్ల, కరీంనగర్‌పై కొనసాగుతున్న ఉత్కంఠ

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కాంగ్రెస్ పార్టీ 45 అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేస్తూ రెండో జాబితాను శుక్రవారం సాయంత్రం విడుదల చేసింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని హుజూరాబాద్‌కు వొడితెల ప్రణవ్‌బాబు, హుస్నాబాద్‌కు పొన్నం ప్రభాకర్, చొప్పదండికి మేడిపల్లి సత్యం, కోరుట్లకు జువ్వాడి నర్సింగరావుల పేర్లు ప్రకటించింది. మొదటి జాబితాలో రామగుండం, మంథని, పెద్దపల్లి, జగిత్యాల, ధర్మపురి, వేములవాడ, మానకొండూర్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన విషయం విదితమే. ఉమ్మడి జిల్లాలోని 13 నియోజకవర్గాల నుంచి మొత్తం 85 మంది ఆశావహులు దరఖాస్తు చేసుకోగా.. ఇప్పటి వరకు 11 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. హుజూరాబాద్ నుంచి టికెట్ పొందిన ప్రణవ్ ఈ నెల 6న పార్టీలో చేరారు. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం కావడంతో అప్పటికే అక్కడ పని చేస్తున్న బల్మూరి వెంకట్‌ను తప్పించి మరీ యువ నేతకు అవకాశం ఇవ్వడం గమనార్హం.

రెండు స్థానాలపై సస్పెన్స్

కరీంనగర్, సిరిసిల్ల విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం వెల్లడించలేదు. కరీంనగర్‌కు 15 మంది ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. ముఖ్యంగా కొత్త జైపాల్ రెడ్డి, పురమళ్ల శ్రీనివాస్, రోహిత్‌రావు తదితరులు టికెట్ కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఆఖరు నిమిషంలో పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్సీ సంతోష్‌కుమార్ కూడా ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అనుకున్నట్లుగానే కరీంనగర్ స్థానం మూడో జాబితాలోనే రానుంది. ఇక, సిరిసిల్ల టికెట్ ఎప్పటిలాగే కేకే మహేందర్‌రెడ్డికి వస్తుందనుకున్నా.. అధిష్ఠానం ఈ స్థానంలో ఎవరికీ అవకాశం ఇవ్వకపోవడం చర్చనీయాంశంగా మారింది. మొత్తానికి ఈ రెండు స్థానాలు మూడో జాబితాలోనే రానున్నాయి.

జువ్వాడి నర్సింగరావు



పుట్టిన తేదీ: 04-04-1962
విద్యార్హతలు: ఎంబీఏ (ఓయూ)
సామాజిక వర్గం: ఓసీ (వెలమ)
స్వగ్రామం: తిమ్మాపూర్, ధర్మపురి, జగిత్యాల
అనుభవం: 2014, 2018లో ఎమ్మెల్యేగా పోటీ, ఓటమి.

వొడితెల ప్రణవ్‌బాబు



పుట్టిన తేదీ: 15-08-1988
విద్యార్హతలు: ఎంఈ, యూఎస్ఏ
సామాజికవర్గం: బ్రాహ్మణ (కరణం)
స్వగ్రామం: సింగాపూర్, హుజూరాబాద్
అనుభవం: పలు గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక కార్యక్రమాలు.

పొన్నం ప్రభాకర్



పుట్టిన తేదీ: 08-05-1967
విద్యార్హతలు: ఎంఏ ఎల్ఎల్‌బీ
సామాజికవర్గం: బీసీ (గౌడ)
స్వగ్రామం: కరీంనగర్
అనుభవం: 2005-09 మార్క్‌ఫెడ్ చైర్మన్, 2009లో ఎంపీగా విజయం, 2004, 2014, 2018లో అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి.

మేడిపల్లి సత్యం



పుట్టిన తేదీ: 25-08-1980
విద్యార్హతలు: ఎంఏ,పీహెచ్‌డీ
సామాజికవర్గం: ఎస్సీ(మాల)
స్వగ్రామం: కోరుట్లపేట, ఎల్లారెడ్డిపేట(మం)
అనుభవం: టీపీసీసీ అధికార ప్రతినిధి, 2014, 2018 అసెంబ్లీ బరిలో పరాజయం.



మౌలిక సిద్ధాంతాలు ఫణంగా పెట్టి చేసుకునే రాజకీయ సర్దుబాట్లు వ్యవస్థనే విచ్ఛిన్నం చేస్తాయి.
– పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ

మీకు తెలుసా?

ఎన్నికల సిరా ఎక్కడ తయారవుతుంది..?


నకిలీ ఓట్లను నిరోధించేందుకు ఎడమ చూపుడు వేలుకు పోలింగ్ బూత్‌లలో నేరేడు రంగులో ఉన్న సిరా పూస్తారు. దీనిని భారత ఎన్నికల సంఘం పోలింగ్ కేంద్రాలకు పంపిణీ చేస్తుంది. ఎన్నికల సమయంలో వాడే సిరాను కర్ణాటకలోని మైసూర్‌కు చెందిన మైసూర్ పెయింట్స్ అండ్ వార్నిష్ కంపెనీ తయారు చేస్తుంది. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగితే అక్కడ అదే కంపెనీ నుంచి సిరా పంపిణీ చేస్తారు. ఇదే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా 29 దేశాలకు దీనిని ఎగుమతి చేస్తుంటారు. ఈ కంపెనీని మైసూర్ మహారాజు నాల్మడి కృష్ణరాజ వడయారు స్థాపించారు. స్వాతంత్ర్యానికి పూర్వం మైసూర్ రాజవంశం ఆధీనంలోనే ఉండేది. తరువాత కంపెనీనీ కర్ణాటక ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఓటర్లు పలుమార్లు ఓటు వేయకుండా, బోగస్ ఓటర్ల నియంత్రణకు కేంద్ర ఎన్నికల సంఘం చెరిగిపోని గుర్తుని వేలిపై వేయాలని నిర్ణయించింది. 1962లో చెరిగిపోని సిరాను ఉత్పత్తి చేయాలని కేంద్రం నిర్ణయించింది. నేషనల్ ఫిజికల్ ల్యాబొరేటరీస్ ఫార్ములాతో సిరా ఉత్పత్తి బాధ్యతను ఈ కర్మాగారానికి అప్పగించారు. నేరేడు రంగులో ఉండే సిరాలో 7.25 శాతం సిల్వర్ నైట్రేట్ ఉన్నందున వెంటనే చెరిగిపోదు. మొదట్లో ఎడమ చేతి వేలిపై సిరా చుక్కను పెట్టేవారు. 2006 ఫిబ్రవరి నుంచి ఓటర్ల ఎడమ చేతి వేలు–గోరుపై సిరాను గీతగా పెడుతున్నారు. ఈ సారి తెలంగాణ రాష్ట్రానికి రెండు లక్షల సిరా సీసలను సరఫరా చేస్తున్నారు. ఒక్కో సీసా సిరాను గరిష్ఠంగా 700 మందికి వేయొచ్చు.

ఉద్యమ గడ్డ.. విలక్షణ తీర్పు

జంగ్ తెలంగాణ

జగిత్యాల రాజకీయం.. ప్రత్యేకం

- తొమ్మిదిసార్లు కాంగ్రెస్, నాలుగుసార్లు టీడీపీ గెలుపు
- ఎన్టీఆర్, వైఎస్సార్‌ల కేబినెట్‌లో మంత్రిగా జీవన్‌రెడ్డి
- చంద్రబాబు హయాంలో మంత్రిగా రమణకు అవకాశం
- గత ఎన్నికల్లో పాగా వేసిన టీఆర్ఎస్



జగిత్యాల: జగిత్యాల నియోజకవర్గం 1952లో ఆవిర్భవించింది. చారిత్రకంగా, వాణిజ్యపరంగా ఎంతో అభివృద్ధి చెందింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత డివిజన్ కేంద్రం కాస్తా 2016లో జిల్లా కేంద్రంగా మారడంతో జగిత్యాల రూపురేఖలు మారిపోయాయి. ఇక్కడ సుమారు రూ.26 కోట్లతో సమీకృత కలెక్టరేట్ భవనం నిర్మించారు. ఎస్పీ కార్యాలయం, వైద్య, నర్సింగ్, వ్యవసాయ కళాశాలలు, మాతాశిశు సంరక్షణ, డయాగ్నోస్టిక్ కేంద్రాలు, 50 బెడ్లతో క్రిటికల్ కేర్ యూనిట్, న్యాక్ సెంటర్ ఏర్పాటయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి 330 బెడ్స్‌గా అప్‌గ్రేడ్ అయ్యింది. జగిత్యాల మున్సిపాలిటీతోపాటు, జగిత్యాల అర్బన్, రూరల్, రాయికల్, సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలున్నాయి.

ఉమ్మడి జిల్లాలోనే గుర్తింపు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జగిత్యాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ నియోజకవర్గం ఏర్పడిన తర్వాత కాంగ్రెస్ పార్టీయే ఎక్కువగా తొమ్మిదిసార్లు విజయం సాధించింది. 1982లో ఎన్టీ రామారావు టీడీపీని ప్రారంభించగా ప్రస్తుత ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆ పార్టీ తరఫున పోటీ చేసి, గెలిచారు. కానీ, ఎన్టీఆర్ ప్రభుత్వం కూలిపోవడంతో 1985లో బై ఎలక్షన్ వచ్చింది. అప్పుడు తెలుగుదేశం తరఫున ఫైనాన్స్ కమిషన్ మాజీ చైర్మన్ రాజేశంగౌడ్ గెలుపొందారు. జీవన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరి, 1989లో విజయం సాధించారు.

జీవన్ రెడ్డి గెలుపునకు బ్రేక్ వేసిన రమణ

జీవన్‌రెడ్డి గెలుపునకు ఎల్.రమణ బ్రేక్ వేశారు. 1994లో అనూహ్యంగా తెలుగుదేశం టికెట్ దక్కడంతో జీవన్‌రెడ్డిని ఓడించారు. దీంతో రమణకు చంద్రబాబు మంత్రివర్గంలో మంత్రి పదవి సైతం దక్కింది. కానీ, సంవత్సరానికే ఎంపీ ఎన్నికలు రావడంతో కరీంనగర్ నుంచి పోటీ చేసి, చొక్కారావును ఓడించి జాయింట్ కిల్లర్‌గా పేరుగాంచారు. 1996లో జరిగిన బై ఎలక్షన్‌లో జీవన్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలుపొందారు. విచిత్రం ఏమిటంటే ప్రభుత్వం టీడీపీ ఉంటే జగిత్యాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే మరో పార్టీకి చెందినవారు ఉండేవారు. కాంగ్రెస్ గవర్నమెంట్ ఉంటే ఎమ్మెల్యేగా ఎల్.రమణ, టీడీపీ గవర్నమెంట్ ఉన్నప్పుడు ఎమ్మెల్యేగా జీవన్‌రెడ్డి కొనసాగారు. 2014లో టీఆర్ఎస్ నుంచి డాక్టర్ సంజయ్‌కుమార్ పోటీ చేసినప్పటికీ జీవన్‌రెడ్డినే ప్రజలు గెలిపించారు. 2018లో జరిగిన ఎన్నికల్లో అనూహ్యంగా 60 వేల మెజారిటీతో డాక్టర్ సంజయ్‌కుమార్ గెలుపొందారు.

ఎన్టీఆర్, వైఎస్సార్ మంత్రివర్గాల్లో చోటు

జగిత్యాల నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఘనత జీవన్‌రెడ్డికే దక్కింది. అలాగే మొదటిసారి ఎన్టీ రామారావు మంత్రివర్గంలో ఎక్సైజ్ శాఖ మంత్రిగా, అనంతరం వైఎస్.రాజశేఖరరెడ్డి మంత్రివర్గంలో రోడ్లు భవనాల శాఖ మంత్రిగా అవకాశాలు దక్కాయి. అలాగే, టీడీపీ నుంచి మొదటిసారి గెలిచిన ఎల్.రమణ చంద్రబాబునాయుడు మంత్రివర్గంలో చేనేత, జౌళిశాఖ మంత్రిగా, ఖాదీబోర్డు చైర్మన్‌గానూ పని చేశారు. మొదటిసారి టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన సంజయ్‌కుమార్ ఓటమిపాలవగా, రెండోసారి అత్యధిక మెజారిటీతో జీవన్‌రెడ్డిపై గెలుపొందారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లోనూ గెలుపుపై ధీమాగా ఉండి, ప్రచారంలో దూసుకుపోతున్నారు.

పలు హామీలు పెండింగ్

జగిత్యాల నియోజకవర్గం వ్యవసాయాధారిత ప్రాంతం. రైతులు ఎక్కువగా వరి, మొక్కజొన్న, పత్తి పంటలు పండిస్తుంటారు. ఎస్సారెస్పీ ప్రధాన నీటి వనరు. ఉద్యానవన పరిశోధన కేంద్రం ఏర్పాటు చేస్తామని నాయకులు చెబుతున్నా ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదు. అలాగే, జగిత్యాలలో యావర్ రోడ్ విస్తరణ పెండింగ్ ఉంది. ఇటీవలే ప్రభుత్వం అనుమతించడంతో కదలిక వచ్చి, మార్కింగ్ చేశారు. నియోజకవర్గంలో మామిడి ఉత్పత్తి కూడా ఎక్కువే. మామిడి మార్కెట్ సైతం ఉంది. ఇక్కడి నుంచి విదేశాలకు మామిడికాయలను ఎగుమతి చేస్తున్నారు. ప్రాసెస్ యూనిట్ ఏర్పాటు చేస్తే మామిడి రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. నాయకులు ఏటా హామీ ఇస్తున్నా అమలులో సాధ్యం కావడం లేదు. రాయికల్ మున్సిపాలిటీగా ఆవిర్భవించింది. ఇక్కడ డిగ్రీ కళాశాల, ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. అలాగే, సారంగాపూర్‌లో రూ.135 కోట్లతో రోళ్లవాగు ప్రాజెక్టు పూర్తయింది.

నియోజకవర్గ ఓటర్ల వివరాలు	
పురుషులు:	1,09,300
మహిళలు:	1,17,315
ట్రాన్స్‌జెండర్లు :	20
మొత్తం :	2,26,635

'మన పదాతిదళాలు అత్యుత్తమ సైన్యం'



కరీంనగర్ సిటీ: ప్రపంచ సైనిక దళాల్లోనే మన పదాతిదళాలకు అత్యుత్తమ సైన్యంగా పేరుందని 9 తెలంగాణ ఎన్‌సీసీ బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ డానియల్ లోడ్జిమ్ అన్నారు. శుక్రవారం భారత పదాతిదళ దినోత్సవం సందర్భంగా శాతవాహన లయన్స్ క్లబ్ కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. 27 అక్టోబర్ 1947న పాకిస్థానీ సేనలు, ఉగ్రమూకలు కశ్మీర్‌ను ఆక్రమించే ప్రయత్నం చేయగా మన ఇన్‌ఫాంట్రీ దళాలు దీటుగా ఎదుర్కొని, జేఅండ్‌కే ప్రాంతాన్ని రక్షించాయని తెలిపారు. దీనికి గుర్తుగా ఏటా ఈ రోజున భారత పదాతిదళ దినోత్సవం జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. జిల్లా రెండో ఉప గవర్నర్ లయన్ సింహరాజు కోదండరామ్ మాట్లాడుతూ.. మన దేశం ఎదుర్కొన్న ఐదు యుద్ధాల్లో పదాతిదళాల పాత్ర వెలకట్టలేనిదని అన్నారు. ఎస్ఎం.సాగర్ సింగ్, హవల్దార్ పదమ్‌సింగ్‌లను లయన్స్ క్లబ్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమ సమన్వయకర్త లయన్ కెప్టెన్ డా.బుర్ర మధుసూదన్ రెడ్డి, లయన్ కె.రాజేందర్ రెడ్డి, లయన్ ఎం.సత్యనారాయణరావు, లయన్ మనోహరాచారి, లయన్ మహేందర్, లయన్ లక్ష్మారెడ్డి, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిఘా

- ఇప్పటివరకు 1,100 మంది పైనే బైండోవర్

కరీంనగర్ క్రైం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని రౌడీషీటర్లు, పాత నేరస్తులపై పోలీసులు నిఘా పెట్టారు. ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న వీరి కదలికలపై ప్రత్యేక దృష్టిసారిస్తూ నిబంధనల ప్రకారం ఆర్డీవో, తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేస్తున్నారు. ఇప్పటివరకు 1,100 మందికి పైనే బైండోవర్ చేసినట్లు పోలీసు గణాంకాలు చెబుతున్నాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా ఇలా చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఇప్పటికే లైసెన్స్‌డ్ తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్లుప్తంగా

కర్ణాటక దంపతులకు దత్తత ఉత్తర్వులు



కరీంనగర్‌: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్‌కు చెందిన ఓ బాలుడిని దత్తత తీసుకున్న కర్ణాటక దంపతులకు సంబంధిత ఉత్తర్వుల కాపీని కలెక్టర్‌ బి.గోపి శుక్రవారం అందజేశారు. స్పెషలైజ్డ్‌ అడాప్షన్‌ ఏజెన్సీ కరీంనగర్‌ ఆధ్వర్యంలో గత నెలలో 15 ఏళ్ల బాలుడిని కర్ణాటకకు చెందిన పిల్లలు లేని దంపతులకు దత్తత ఇచ్చారు. ఈ సందర్భంగా వారు కలెక్టర్‌తో మాట్లాడుతూ.. దత్తత తీసుకున్న బాబును సీబీఎస్‌ఈ 9వ తరగతిలో చేర్పించామని తెలిపారు. తాము సంతోషంగా ఉన్నామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, డీసీపీవో శాంత, ఐసీపీఎస్‌ సిబ్బంది తిరుపతి, రాజు, రమేశ్‌ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కరాటే, యోగా పోటీలు



కరీంనగర్‌ స్పోర్ట్స్‌: జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్‌లోని అంబేడ్కర్‌ స్టేడియంలో అండర్‌–14, 17 కరాటే, ప్రాంతీయ క్రీడా పాఠశాలలో అండర్‌–14, 17, 19 జిల్లాస్థాయి యోగా పోటీలు నిర్వహించారు. వివిధ మండలాల నుంచి క్రీడాకారులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. జిల్లాస్థాయిలో రాణించిన వారిని నిర్వాహకులు ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అంతకుముందు ఉదయం స్టేడియంలో డీవైఎస్‌వో కీర్తి రాజవీరు పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో ఎస్జీఎఫ్‌ కార్యదర్శి పి.శ్రీనివాస్‌, ఇన్‌స్ట్రక్టర్లు వసంత్‌కుమార్‌, గౌరు రాజిరెడ్డి, సురభి వేణుగోపాల్‌, ప్రవీణ్‌, శ్రీనివాస్‌, అవినాష్‌, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ప్రజలు తిరస్కరించాలి

- రైతు సంక్షేమం ఆ పార్టీకి గిట్టదు
- మేయర్‌ వై.సునీల్‌రావు



కరీంనగర్‌: ఎన్నికల కోడ్‌ పేరుతో రైతుబంధు పథకాన్ని ఆపాలంటూ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్‌ పార్టీని రాబోయే ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించాలని మేయర్‌ వై.సునీల్‌రావు కోరారు. శుక్రవారం కరీంనగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్‌ రైతుబంధు, రైతుబీమా, ఉచిత కరెంట్‌ అమలు చేస్తూ, ధాన్యం కొనుగోళ్లు చేపడుతుంటే కాంగ్రెస్‌ జీర్ణించుకోలేకపోతోందని మండిపడ్డారు. రైతు సంక్షేమం ఆ పార్టీకి గిట్టదని ఆరోపించారు. రైతుబంధు పథకం కింద ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9.25 లక్షల మంది రైతులకు రూ.7,550 కోట్లు వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. సంక్షేమ పథకాలను ఆపాలని ఫిర్యాదు చేసిన కాంగ్రెస్‌ నేతలు ఎన్నికల్లో ఏ ముఖం పెట్టుకొని ఓట్లడుగుతారని ప్రశ్నించారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మబోరని, బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్పొరేటర్లు గందె మాధవి, గుగ్గిల్ల జయశ్రీ, గంట కల్యాణి, వాల రమణారావు, బండారి వేణు, నేతికుంట యాదయ్య, ఏదుల్ల రాజశేఖర్‌, కాశెట్టి లావణ్య, లెక్కల స్వప్న, కొండపల్లి సరిత, అర్ష కిరణ్మయి, ఎడ్ల సరిత, సల్ల శారద, కోల భాగ్యలక్ష్మి, ప్రశాంత్‌, దిండిగాల మహేశ్‌, కుర్ర తిరుపతి, కోల మాలతి, జంగిలి సాగర్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు పాల్గొన్నారు.

ఏడాది కావొస్తున్నా పట్టింపేదీ?

- దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ ఉత్తర్వులు కాగితాలకే పరిమితమా?
- సిబ్బంది నియామకం, కార్యాలయాల ఏర్పాటుపై సందిగ్ధం



మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యాలయం

కరీంనగర్‌: జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ నుంచి దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖను వేరు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గతేడాది డిసెంబర్‌ 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా జారీ చేసిన ఉత్తర్వులు బుట్టదాఖలయ్యాయి. ఏడాది కావొస్తున్నా మహిళా, శిశు సంక్షేమ శాఖ పర్యవేక్షణలోనే ఉండటం దివ్యాంగులపై చిన్న చిన్న చూపునకు నిదర్శనమని పలువురు ఆరోపిస్తున్నారు. రెండు సంక్షేమ శాఖలను వేరు చేయడంతో సేవలు వేర్వేరుగా అందుతాయని భావించిన వారికి నిరాశే ఎదురైంది. సిబ్బంది, కార్యాలయాల ఏర్పాటుపై ఇంకా స్థిరమైన నిర్ణయానికి రాకపోవడం సరికాదని అంటున్నారు. ఉత్తర్వుల ప్రకారం విభజన జరిగితే మహిళా, శిశు సంక్షేమం ఒక శాఖగా, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం రెండో శాఖగా ఉండనున్నాయి. 2016లో ఈ రెండింటినీ ప్రభుత్వం విలీనం చేసింది. ఈ క్రమంలో కొన్నేళ్లుగా వస్తున్న డిమాండ్‌ మేరకు మళ్లీ రెండు శాఖలను విడదీస్తూ సర్కారు నిర్ణయం తీసుకుంది.

గతంలో ఆందోళనలు..

గతంలో రెండు శాఖల విలీన నిర్ణయాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగులు ఆందోళనలు చేపట్టారు. తమ సమస్యలు పరిష్కరించడానికి అధికారులకు సమయం దొరకదని, రెండింటినీ ఎప్పటిలాగే వేరుగా ఉంచాలని డిమాండ్‌ చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గతేడాది రెండు శాఖలను వేరు చూస్తూ నిర్ణయం తీసుకోవడంతో దివ్యాంగుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. కానీ, సంబంధిత కార్యాలయాల ఏర్పాటు, సిబ్బంది నియామకానికి సంబంధించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఇన్‌చార్జుల పాలనే దిక్కు

కరీంనగర్‌ జిల్లాలో మహిళా, శిశు సంక్షేమ శాఖకు ఐదేళ్లుగా పూర్తిస్థాయి అధికారి లేరు. ఇన్‌చార్జి అధికారులతోనే కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఇప్పుడు రెండు శాఖలు వేరు కావడంతో ఇద్దరు జిల్లాస్థాయి అధికారులను నియమించాల్సి ఉంటుంది. ఉన్నదానికే ఇన్‌చార్జి అధికారి ఉంటే ఇద్దరు పూర్తిస్థాయి అధికారుల నియామకం ఎప్పుడన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

స్పష్టత లేక ముందుకు సాగలేదు



గతేడాది సంక్షేమ శాఖలను విడదీస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతరం వాటికి వేర్వేరు సిబ్బంది, కార్యాలయాల నిర్వహణపై స్పష్టత లేకపోవడంతో విభజన ప్రక్రియ ముందుకు సాగలేదు. సర్కారు నిర్ణయం మేరకే వ్యవహరిస్తాం.

– సరస్వతి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి

అమలు కాకపోవడం బాధాకరం



దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖను వేరు చేయాలని మేము చేసిన పోరాటం ఫలించింది. విభజన ప్రక్రియ ముందుకు నడిపి, దివ్యాంగులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి. ఉత్తర్వులు వెలువడి, ఏడాది కావొస్తున్నా అమలుకు నోచుకోకపోవడం బాధాకరం.

– కట్టా రవీందర్‌, వీహెచ్‌పీఎస్‌ జిల్లా సలహాదారు

గెలిపిస్తే సిద్దిపేట తరహాలో అభివృద్ధి

- ప్రభుత్వ విప్‌, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి
- జమ్మికుంటలో బీఆర్‌ఎస్‌ కార్యాలయం ప్రారంభం



మాట్లాడుతున్న విప్‌ కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట(హుజూరాబాద్‌): రాబోయే ఎన్నికల్లో తనను గెలిపిస్తే హుజూరాబాద్‌ను సిద్దిపేట తరహాలో అభివృద్ధి చేస్తానని ప్రభుత్వ విప్‌, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జమ్మికుంట పట్టణంలో బీఆర్‌ఎస్‌ పార్టీ కార్యాలయాన్ని నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి ఇనుగాల పెద్దిరెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం యువత సమ్మేళన సమావేశంలో మాట్లాడారు. ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి, వివరించాలని కోరారు. రాష్ట్రం ఏర్పాటు మొదలు నేటివరకు సీఎం కేసీఆర్‌ ప్రజల కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. రెండేళ్ల క్రితం జరిగిన ఉప ఎన్నికల్లో గెలిచిన ఈటల రాజేందర్‌ నియోజకవర్గంలో తట్టెడు మట్టి పోయలేదని ఆరోపించారు. కాంగ్రెస్‌ మేనిఫెస్టోను ప్రజలు నమ్మడం లేదని, ఆ హామీలను కర్ణాటకలో అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. హుజూరాబాద్‌లో కౌశిక్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలపించుకుందామని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్‌ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, కేడీసీసీ బ్యాంక్‌ వైస్‌ చైర్మన్‌ పింగిళి రమేశ్‌, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీరాం శ్యామ్‌, ఎస్సీ కార్పొరేషన్‌ మాజీ చైర్మన్‌ బండ శ్రీనివాస్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ పొనగంటి సంపత్‌, పార్టీ పట్టణ అధ్యక్షుడు టంగుటూరి రాజ్‌కుమార్‌, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీకి గడ్డం నాగరాజు రాజీనామా



నాగరాజు

మానకొండూర్‌: బీజేపీ మానకొండూర్‌ నియోజవర్గ ఇన్‌చార్జి గడ్డం నాగరాజు ఆ పార్టీకి శుక్రవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి ఫ్యాక్స్‌ ద్వారా పంపించారు. నాగరాజు 2009 నుంచి మానకొండూర్‌ నియోజవకర్గంలో పార్టీ ఎదుగుదలకు నిరంతరం కృషి చేశారు. అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టారు. పేదలకు బియ్యం పంపిణీ, ఆడబిడ్డల పెళ్లికి పుస్తె, మెట్టెలు, ఆలయాలకు విరాళం, యువతకు క్రీడా సామగ్రి అందిస్తూ గుర్తింపు తెచ్చుకున్నారు. మూడుసార్లు బీజేపీ తరఫున మానకొండూర్‌ నుంచి పోటీ చేసి, ఓటమి చెందారు. అయినా పార్టీని నమ్ముకొని, నియోజకవర్గంలోని కార్యకర్తలను అండగా ఉన్నారు. నాలుగోసారి తనకే టికెట్‌ వస్తుందని నమ్మకంతో ఉన్న ఆయనకు కాకుండా బీఆర్‌ఎస్‌ నుంచి వచ్చిన ఆరెపల్లి మోహన్‌కు కేటాయించడంతో నిరాశ చెందారు. తనకు అన్యాయం జరిగిందంటూ బీజేపీకి గుడ్‌ బై చెప్పారు.

రెండు, మూడు రోజుల్లో బీఆర్‌ఎస్‌లోకి..

గడ్డం నాగరాజు తన అనుచరులతో కలిసి రెండు, మూడు రోజుల్లో బీఆర్‌ఎస్‌లో చేరనున్నారు. ఆయనకు తగిన ప్రాధాన్యం ఇస్తామని పార్టీ అధిష్ఠానం నుంచి భరోసా లభించినట్లు తెలిసింది.

పేదలకు ఉచిత వైద్యం సంతృప్తినిచ్చింది

- 'ఆవో గావ్‌ చలే'ను ఐఎంఏ సామాజిక బాధ్యతగా చేపట్టింది
- ఏడాది పదవీ కాలంలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చా
- ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ బీఎన్‌ రావు



డాక్టర్‌ బీఎన్‌.రావు

కరీంనగర్‌టౌన్‌: రాష్ట్రంలోని ప్రతీ పల్లెలో నిరుపేదలకు ఉచిత వైద్యం అందించడం సంతృప్తినిచ్చిందని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ బీఎన్‌.రావు అన్నారు. 'ఆవో గావ్‌ చలే' కార్యక్రమంలో తమ సంఘం వైద్యులు సామాజిక బాధ్యతగా గ్రామాలను దత్తత తీసుకొని, వైద్య సేవలందించారని తెలిపారు. తన ఏడాది పదవీ కాలంలో ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టాలని, దీనివల్ల వైద్యుల్లో ఐఎంఏపై విశ్వాసం పెరిగిందన్నారు. వైద్య పరంగా తీసుకునే నిర్ణయాల్లో ఐఎంఏను భాగస్వామ్యం చేయాలని కోరగా ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసిందని పేర్కొన్నారు. ఫలితంగా వైద్యులు, ఆస్పత్రులపై దాడులను అరికట్టడంలో విజయం సాధించామన్నారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడిగా పదవీ కాలం శనివారంతో పూర్తవుతున్న సందర్భంగా ఆయన సాధించిన విజయాలపై 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

- రాష్ట్రంలో సుమారు 200 గ్రామాలను ఐఎంఏ తరఫున దత్తత తీసుకొని, ఉచిత వైద్య సేవలందించాం.
- పబ్లిక్‌ హెల్త్‌ కమిటీని నియమించాం.
- సుమారు 20 వేల సభ్యత్వమున్న ఐఎంఏ వైద్యులందరికీ హెల్త్‌ ప్రొఫైల్‌ చేశాం.
- ట్రేడ్‌ లైసెన్స్‌కు వ్యతిరేకంగా కోర్టు ద్వారా స్టే తీసుకువచ్చాం.
- 10 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో చదివే సుమారు 200 మంది నిరుపేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ అందజేశాం.
- కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిని సంప్రదించి 5 వేల మంది తెలంగాణ హౌస్‌ సర్జన్లకు నీట్‌ పీజీ అర్హత సాధించాం.
- ఆర్‌ఎంపీ, పీఎంపీలకు ప్రభుత్వం అందించే శిక్షణను కోర్టు ద్వారా స్టే తెచ్చి, నిలిపివేశాం.
- టీఎస్‌ఎంసీఐ ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసి, సాధించాం.
- డాక్టర్‌ ప్రిస్క్రిప్షన్‌ లేకుండా మందులు అమ్మడాన్ని ఆరోగ్యశాఖ, డ్రగ్స్‌ అథారిటీ అధికారులతో మాట్లాడి గెజిట్‌ వచ్చేలా చేశాం.
- ప్రైవేటు కళాశాలల్లో పనిచేసే హౌస్‌ సర్జన్లు, పీజీ విద్యార్థులకు స్టైఫండ్‌ ఇవ్వాలని యాజమాన్యాలకు విజ్ఞప్తి చేశాం.
- వైద్యులు, ఆస్పత్రులపై దాడులు చేసే వారిని కఠినంగా శిక్షించాలని డీజీపీకి వినతిపత్రం అందజేశాం.

ప్రైవేటు ఆస్పత్రిలో మహిళ మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ
- మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి గంగుల



వివరాలు తెలుసుకుంటున్న మంత్రి గంగుల, డీఎంహెచ్‌వో లలితాదేవి



ఎల్లవ్వ మృతదేహం

కరీంనగర్‌టౌన్‌: నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఓ మహిళ చికిత్స పొందుతూ మృతిచెందింది. వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆమె కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. కొత్తపల్లి మండలంలోని బావుపేటకు చెందిన ఎదురుగట్ల ఎల్లవ్వ(45)కు ఈ నెల 7న కడుపునొప్పి రావడంతో కుటుంబసభ్యులు జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సమీపంలోని వశిష్ట ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు గర్భసంచి, తొలగించాలన్నారు. ఈ నెల 9న ఆపరేషన్‌ చేసి, పంపించారు. వారం రోజుల తర్వాత కుట్లు విప్పారు. మళ్లీ నొప్పి రావడం, రక్తస్రావం కావడంతో ఎల్లవ్వ 25న తిరిగి ఆస్పత్రికి వచ్చింది. చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతిచెందింది. ఆమె మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబసభ్యులు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ ఆస్పత్రికి చేరుకొని, మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు.

త్రిసభ్య కమిటీతో విచారణ

మహిళ మృతిచెందిన ఘటనపై వశిష్ట ఆస్పత్రి యాజమాన్యానికి షోకాజ్‌ నోటీసు జారీ చేశాం. మృతికి గల కారణాలు చెప్పాలని అందులో పేర్కొన్నాం. ప్రోగ్రాం అధికారి డాక్టర్‌ రవీందర్‌ రెడ్డి, జనరల్‌ సర్జన్‌ డాక్టర్‌ కుమారస్వామి, గైనకాలజిస్ట్‌ డాక్టర్‌ ప్రసన్నలతో కూడిన త్రిసభ్య కమిటీ వేసి, విచారణ చేపడుతున్నాం. ఇది పూర్తయ్యేవరకు ఆస్పత్రిలో వైద్యసేవలు నిర్వహించరాదని ఆదేశించాం.

– డాక్టర్‌ లలితాదేవి, డీఎంహెచ్‌వో

మీటర్‌ మార్పిడిపై డీఈ విచారణ

సాక్షి ఎఫెక్ట్‌

కొత్తపల్లి(కరీంనగర్‌): విద్యుత్‌ శాఖలో మీటర్ల దందాపై అధికారులు దృష్టి సారించారు. 'మీటర్‌ ఒక చోట.. అడ్రస్‌ మరోచోట' అనే శీర్షికన ఈ నెల 26న 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించారు. చిగురుమామిడిలో వినియోగదారుడి మీటర్‌ను అతని అనుమతి లేకుండా మార్పిడి చేయడంపై కరీంనగర్‌ రూరల్‌ డీఈ ఎం.తిరుపతి, నుస్తులాపూర్‌ ఏడీఈ ప్రశాంతలు శుక్రవారం విచారణ జరిపారు. వినియోగదారుడు, లైన్‌మెన్‌ నుంచి వేర్వేరుగా స్టేట్‌మెంట్‌ రికార్డు చేశారు. లైన్‌మెన్‌ను మెమోతోనే వదిలేస్తారా? లేదంటే శాఖాపరమైన చర్యలేమైనా తీసుకుంటారా? అనేది తేలాల్సి ఉంది. కాగా, కరీంనగర్‌ నగరంలో మీటర్ల వ్యవహారం బయటపడకుండా, చేసిన తప్పులను సరిదిద్దుకునే పనిలో లైన్‌మెన్లు నిమగ్నమైనట్లు విశ్వసనీయ సమాచారం.

గ్యారంటీ లేని పార్టీ కాంగ్రెస్‌

- మానకొండూర్‌ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌
- రేణికుంటలో ప్రజా ఆశీర్వాద సభ



ఎమ్మెల్యే రసమయిని సత్కరిస్తున్న నాయకులు

తిమ్మాపూర్‌(మానకొండూర్‌): గ్యారంటీ స్కీంలు అంటూ ప్రజల్లోకి వస్తున్న గ్యారంటీ లేని పార్టీ కాంగ్రెస్‌ అని మానకొండూర్‌ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ అన్నారు. రైతు వ్యతిరేక కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో కలపాలని కోరారు. తిమ్మాపూర్‌ మండలంలోని రేణికుంటలో శుక్రవారం రాత్రి ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బతుకమ్మలు, బోనాలతో ఆయనకు స్వాగతం పలికారు. కాంగ్రెస్‌, బీజేపీలకు చెందిన సుమారు 200 మంది బీఆర్‌ఎస్‌లో కండువాలు కప్పి, ఆహ్వానించారు. ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వనివి సైతం అమలు చేసిన ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్‌, బీజేపీలు ఎన్నికల్లో ఓట్ల కోసం హామీలు ఇచ్చి, విస్మరిస్తాయని ఆరోపించారు. కర్ణాటక రైతులు రోడ్డెక్కడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. అన్నదాతల సంక్షేమానికి బీఆర్‌ఎస్‌ పెద్దపీట వేస్తోందని తెలిపారు. ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు అందిస్తున్న తమను ఆదరించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు రావుల రమేశ్‌, ఎంపీపీ కేతిరెడ్డి వనిత, వైస్‌ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి, సర్పంచ్‌ కొమురయ్య, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన మైనారిటీ నాయకులు

తిమ్మాపూర్‌ మండలంలోని బీఆర్‌ఎస్‌ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు రావుల రమేశ్‌ ఆధ్వర్యంలో శుక్రవారం పలువురు మైనారిటీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే రసమయి కండువాలు కప్పి, ఆహ్వానించారు. రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌ రెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, దుంద్ర రాజయ్య, పాశం అశోక్‌ రెడ్డి, పెట్టం రమేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి దసరా ధమాకా

- 15 రోజుల్లో రూ.22.06 కోట్ల ఆదాయం
- కరీంనగర్‌ రీజియన్‌లో గోదావరిఖని డిపోది మొదటి స్థానం



కరీంనగర్‌: ఆర్టీసీకి కాసుల వర్షం కురిసింది. బతుకమ్మ, దసరా పండుగలు కలిసొచ్చాయి. ఈ నెల 12 నుంచి 26వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడుపగా గతంలో ఎన్నడూ లేని విధంగా 15 రోజుల్లోనే రూ.22.06 కోట్ల ఆదాయం వచ్చింది. కరీంనగర్‌ రీజియన్‌ పరిధిలో గోదావరిఖని బస్సు డిపో 3.27 కోట్లతో మొదటి స్థానం, జగిత్యాల డిపో 3.2 కోట్లతో రెండో స్థానం, కరీంనగర్‌–1 డిపో 3.1 కోట్లతో మూడో స్థానంలో, హుస్నాబాద్‌ డిపో 1.11 కోట్లతో చివరి స్థానంలో నిలిచాయి.

11 డిపోలు..

కరీంనగర్‌ రీజియన్‌ పరిధిలోని 11 డిపోలు కరీంనగర్‌–1, 2, వేములవాడ, సిరిసిల్ల, జగిత్యాల, మంథని, గోదావరిఖని, కోరుట్ల, హుజూరాబాద్‌, మెట్‌పల్లి, హుస్నాబాద్‌ ఉన్నాయి. వీటి నుంచి కరీంనగర్‌ మీదుగా హైదరాబాద్‌ జేబీఎస్‌, ఇతర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను 50.47 లక్షల కిలోమీటర్లు తిప్పారు. పండుగల సందర్భంగా ప్రత్యేక చార్జీలు వసూలు చేయబోమని అధికారులు ముందుగానే ప్రకటించారు. దీంతో ప్రయాణికులు ఎక్కువగా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించారు. పాఠశాలలకు ఈ నెల 14 నుంచి 25వ తేదీ వరకు సెలవులు ఇచ్చారు. దీంతో ఇతర ప్రాంతాల్లో ఉద్యోగం, ఉపాధి అవసరాల కోసం దూర ప్రాంతాల్లో ఉన్నవారు సొంతూళ్లకు రావడం ఆర్టీసీకి లాభాలు తీసుకువచ్చింది. మరోవైపు డీజిల్‌, పెట్రోల్‌ ధరలు మండిపోతుండటంతో ప్రయాణికులు ఆర్టీసీనే ఆశ్రయించారు. రద్దీకి అనుగుణంగా ఆయా మార్గాల్లో బస్సులు సమయానికి నడపడంతో ఇబ్బందులు కలగలేదు. కరీంనగర్‌ రీజియన్‌ ఆర్టీసీ అధికారులు హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో మకాం వేసి, బస్సుల రాకపోకలను పర్యవేక్షించారు.

ఈనెల 12 నుంచి 26 వరకు రీజియన్‌ పరిధిలో వచ్చిన ఆదాయం

డిపో	తిప్పిన కి.మీ. (లక్షల్లో)	ఆదాయం (రూ.లక్షల్లో)
గోదావరిఖని	7.34	327.49
హుస్నాబాద్‌	2.67	111.96
హుజూరాబాద్‌	3.22	150.25
కరీంనగర్‌–1	6.39	301.18
కరీంనగర్‌–2	6.16	267.13
మంథని	3.19	136.28
జగిత్యాల	7.16	302.56
కోరుట్ల	3.71	159.76
మెట్‌పల్లి	3.16	132.84
సిరిసిల్ల	3.49	150.99
వేములవాడ	3.99	166.19
రీజియన్‌ మొత్తం	50.47	2206.64

సంతోషంగా ఉంది



బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులతో ఆర్టీసీకి అధిక ఆదాయం రావడం సంతోషంగా ఉంది. సంస్థకు పూర్వ వైభవం తీసుకురావడానికి అన్ని వర్గాల ప్రజలు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని కోరాం. ఇందుకు వారు కూడా సహకరించారు.

– ఎస్‌.సుచరిత, ఆర్టీసీ ఆర్‌ఎం

ఎన్నికల్లో ఒక్క రూపాయి పంచం

- కోరుట్ల సెగ్మెంట్‌ ఎన్నిక ఆదర్శంగా నిలుస్తుంది
- బీజేపీ అభ్యర్థి, ఎంపీ అర్వింద్‌



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్‌

కోరుట్ల: 'ఎన్నికల్లో ఓటర్లకు బీజేపీ తరఫున ఒక్క రూపాయి పంచబోము.. కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గం తెలంగాణలో ఆదర్శ రాజకీయాలకు.. పెనుమార్పులకు వేదిక అవుతోంది' అని కోరుట్ల బీజేపీ అభ్యర్థి, నిజామాబాద్‌ ఎంపీ అర్వింద్‌ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కోరుట్లలో శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. మోదీ కోరుకున్న ఆదర్శపాలనకు కోరుట్ల కేంద్రంగా మారబోతుందన్నారు. సీఎం కేసీఆర్‌ నుంచి కోరుట్ల సెగ్మెంట్‌లోని కల్వకుంట్ల కుటుంబం దాకా..పెరిగిన అహంకారాన్ని వంచుతానన్నారు. కేజీ టు పీజీ ఉచిత విద్య అని కేసీఆర్‌ గొప్పలు చెబుతుంటే రాష్ట్రం అక్షరాస్యతలో 31వ స్థానంలో ఎందుకు ఉందని ప్రశ్నించారు. తెలంగాణ యూనివర్సిటీ షికాగోలా మార్చుతానని చెప్పిన కవిత ఇప్పుడేం సమాధానం చెబుతుందని అడిగారు. మోదీ ప్రభుత్వం వరి, పసుపు, మొక్కజొన్న పంటలకు మద్దతు ధరలు పెంచితే రాష్ట్ర ప్రభుత్వం తరుగు పేరిట రైతులను ఇబ్బందులు పాలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్షల కోట్ల అవినీతి జరిగినందుకే మూడేళ్లకే మేడిగడ్డ వంతెన కుంగిందని.. పూర్తిస్థాయి విచారణ నివేదిక వచ్చిన తరువాత ఒక్కొక్కరి సంగతి చెబుతామన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాగానే కోరుట్ల అసెంబ్లీ సెగ్మెంట్‌ క్లీన్‌ గవర్నమెంట్‌కు ప్రతీకగా మారుతుందన్నారు. కాంట్రాక్టర్లు, పోలీసులు, వ్యాపారులు ఎవరికి అప్పనంగా డబ్బులు ఇవ్వాల్సిన అవసరం ఉండబోదని స్పష్టం చేశారు. ఆరోగ్య తెలంగాణ పేరు చెప్పి కంటి వెలుగు అద్దాల్లో కమీషన్లు దండుకుంటున్న ఘనత కేసీఆర్‌ కుటుంబానికే దక్కుతుందన్నారు. అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఆదుకోవడం లేదన్నారు. కొంత మంది బీఆర్‌ఎస్‌ బ్రోకర్లు నన్ను నాన్‌లోకల్‌ అంటున్నారని.. కేసీఆర్‌ కొడుకు కేటీఆర్‌కు సిరిసిల్ల లోకల్‌ అయితే.. రాష్ట్ర రాజకీయాలను శాసించిన డీఎస్‌ కొడుకు అర్వింద్‌కు కోరుట్ల ఎలా నాన్‌లోకల్‌ అవుతుందని ప్రశ్నించారు. కోరుట్లలో పుట్టిన నాకు కోరుట్ల సొంత సెగ్మెంట్‌గానే ఉంటుందన్నారు. జగిత్యాలలో బోగ శ్రావణిని గెలిపించే బాధ్యత తనదేనన్నారు. రానున్న కాలంలో కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల ఆయన అనుచరులు అవినీతి చిట్టా విప్పుతామన్నారు. బీజేపీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణ, జగిత్యాల బీఆర్‌ఎస్‌ అభ్యర్థి శ్రావణి, నాయకులు సురభి నవీన్‌, జేఎన్‌ వెంకట్‌, డాక్టర్‌ రఘు, రాజశేఖర్‌, సుఖేందర్‌గౌడ్‌ తదితరులున్నారు.

రూరల్‌ ఎక్సైజ్‌ స్టేషన్‌ పరిధిలో 72 కేసులు

కరీంనగర్‌ క్రైం: కరీంనగర్‌ రూరల్‌ ఎక్సైజ్‌ పోలీసుస్టేషన్‌ పరిధిలో ఈ నెల 9 నుంచి 27వ తేదీ వరకు 72 కేసులు నమోదు చేసినట్లు సీఐ తిరుమలత ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 176 మందిని బైండోవర్‌ చేసినట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఆక్యుప్రెజర్ థెరపీతో ఉపశమనం



క్యాంపును ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్: ఆక్యుప్రెజర్ థెరపీ వైద్య విధానం ద్వారా వివిధ రకాల వ్యాధుల నుంచి ఉపశమనం లభిస్తుందని మేయర్ సునీల్‌రావు అన్నారు. శుక్రవారం నగరంలోని 10వ డివిజన్ కట్టారాంపూర్‌లో నేచురల్ హనీ సౌజన్య, మహాశక్తి అలయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపు ప్రారంభించి మాట్లాడారు. ఆక్యుప్రెజర్ థెరపీ ట్రీట్‌మెంట్ ద్వారా సులభతరంగా అధిక బరువు, కీళ్ల నొప్పులు, రక్తపోటు, మధుమేహం, నిద్రలేమి, బ్రాంకియాటిస్, నిద్రలేమి అసిడిటీ లాంటి వ్యాధులకు చికిత్స చేయొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కాసర్ల ఆనంద్, ఇంటర్నేషనల్ అలయన్స్ క్లబ్ ఈద కుమారస్వామి, డిస్ట్రిక్ట్ పీఆర్‌వో విద్యాసాగర్ రెడ్డి, వల్లపురెడ్డి వంశీకృష్ణారెడ్డి, అలయన్స్ మహాశక్తి అధ్యక్షులు రేణుక, ప్రధాన కార్యదర్శి సంజన, కోశాధికారి నజియా తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



బీఆర్‌ఎస్‌లో చేరిన కార్యకర్తలతో మంత్రి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌కు చెందిన బీజేపీ బీసీ సెల్ మండల ఉపాధ్యక్షుడు మూల బలరాంగౌడ్ శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. బలరాంగౌడ్‌కు బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పి.శ్యాంసుందర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు బి.తిరుపతిగౌడ్, జీకే యూత్ మండల అధ్యక్షుడు అజయ్‌గౌడ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రుణాలు అందజేత



చెక్కులు అందజేస్తున్న అధికారులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): చైతన్యపురిలోని ఆడోరేషన్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం 20 మంది దివ్యాంగులకు ఇన్‌కం జనరేషన్ యాక్ట్ కింద ఒక్కొక్కరికీ రూ.15 వేలు చొప్పున రుణాలు అందించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రితా మాట్లాడుతూ సంకల్పం ముందు వైకల్యం అనేది లోపం కాదని, వైకల్యంతో ఉండి విజయాలు సాధించిన వారు ఎందరో ఉన్నారన్నారు.కార్యక్రమంలో తణుకు మహేశ్, దీప్తి, అరుణ, మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్, రూప, స్రవంతి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



కరీంనగర్‌స్పోర్ట్స్: అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియామకమైన ఆర్ఆర్ కరాటే అకాడమీ ఫౌండర్, కరాటే సంఘం రాష్ట్ర బాధ్యులు రాజిరెడ్డిని శుక్రవారం అంబేడ్కర్ స్టేడియంలో డీవైఎస్‌వో కీర్తి రాజవీరు సన్మానించారు. క్రీడారంగానికి విశేష సేవలందిస్తూ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సేవలందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్జీఎఫ్ కార్యదర్శి పోతన శ్రీనివాస్, కరాటే ఇన్‌స్ట్రక్టర్లు వసంత్‌కుమార్, సురభి వేణుగోపాల్, మాడుగుల ప్రవీణ్, పుల్లూరి శ్రీనివాస్, సురభి అవినాష్, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో అన్నదానం



కరీంనగర్‌రూరల్: లయన్స్‌క్లబ్ ఆఫ్ కరీంనగర్ మానేరు సభ్యుడు, ఇరుకుల్ల ఉప సర్పంచ్ ముత్యం శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులతో పాటు బంధువులకు అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు గుండా రాజశేఖర్, జెడ్‌సీ రావికంటి కృష్ణ కిశోర్, వేముల విష్ణుమూర్తి, రమేశ్, కృష్ణ, ఏఎంసీ డైరెక్టర్ మహమూద్ బాషా, మోహన్‌రెడ్డి, వార్డుసభ్యులు సంపత్, సతీశ్, దిలీప్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.







నగరంలో తిరుగుతున్న వివిధ పార్టీల ప్రచార రథాలు

నగరంలో వేడెక్కుతున్న రాజకీయం

- సన్నద్ధమవుతున్న పలు పార్టీల నాయకులు
- అభివృద్ధే నినాదంగా బీఆర్‌ఎస్
- కేంద్ర పథకాల పేరుతో బీజేపీ
- ప్రభుత్వ వ్యతిరేకత, ఆరు గ్యారంటీలతో ప్రజల్లోకి కాంగ్రెస్ నేతలు
- బీఆర్‌ఎస్, ఫార్వర్డ్ బ్లాక్, వైఎస్సార్‌టీపీల ప్రచారం షురూ



నగరంలో ప్రచారం నిర్వహిస్తున్న జీకే యూత్ సభ్యులు

కరీంనగర్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కరీంనగర్ శాసనసభ నియోజక వర్గం పరిధిలో నాయకుల ప్రచారాలు జోరందుకున్నాయి. ఇప్పటికే అన్ని హంగులు సిద్ధం చేసుకున్న అధికార పార్టీ నాయకులు అభివృద్ధే నినాదంతో ముందుకు వెళ్తూ ఇతర పార్టీల నుంచి చేరికల పర్వాన్ని కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయడంతో పాటు మరోదఫా అవకాశం ఇవ్వాలని కోరుతూ ప్రచారం మొదలుపెట్టారు. ఇప్పటికే ప్రచార రథాలు అభ్యర్థులకు మద్దతుగా వారి పార్టీ మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీలను వివరిస్తూ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి అభ్యర్థిగా ఎంపికైన ప్రస్తుత మంత్రి గంగుల కమలాకర్ బీ-ఫాం తీసుకోవడంతో పాటు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్‌తో ఎన్నికల ప్రచార సభ ఘనంగా నిర్వహించి ఎప్పటిలాగా బొమ్మకల్‌లోని రామాలయం నుంచి బుధవారం ప్రచారాన్ని ప్రారంభించారు. బీజేపీ నుంచి ప్రస్తుత కరీంనగర్ ఎంపీ, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌ను బీజేపీ అధిష్టానం ప్రకటించినప్పటికీ ప్రచారాన్ని ప్రారంభించలేదు. కాంగ్రెస్ పార్టీ నుంచి సైతం అభ్యర్థిని ప్రకటించకున్న పార్టీ అధినేత రాహుల్‌గాంధీ కరీంనగర్ పట్టణంలో రోడ్‌షో నిర్వహించి కార్యకర్తల్లో జోష్ పెంచారు. ప్రభుత్వ వ్యతిరేకతను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నాలు మొదలుపెట్టారు. కర్నాటక తరహాలో ఇప్పటికే ఆరు హామీలను ప్రకటించిన వారు అదే నినాదంతో ముందుకు వెళ్లేందుకు అంతా సిద్ధం చేసుకున్నారు. బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు ఎజెండాగా ప్రచారంలోకి వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు. కరీంనగర్ నియోజక వర్గంలో ప్రస్తుతం బీఆర్‌ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థి అంబటి జోజిరెడ్డి, వైఎస్సార్‌టీపీ నుంచి డాక్టర్ నగేశ్‌లకు చెందిన ప్రచార రథాలు నగరంతో పాటు కరీంనగర్‌రూరల్, కొత్తపల్లి మండలాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి.

కాంగ్రెస్ కుటిల రాజకీయాలను ఎండగట్టండి



మాట్లాడుతున్న చల్ల హరిశంకర్

కరీంనగర్: రైతుబంధు, దళితబంధు పథకాలను నిలిపివేయాలని ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేయడం సిగ్గుచేటని, ఆన్ గోయింగ్ పథకాలను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులను ప్రజలు నిలదీయాలని బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ అన్నారు. శుక్రవారం మీసేవా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి అధికార ధ్యాస తప్ప అభివృద్ధి, సంక్షేమ ఫలాలు పట్టదని ఇందుకు నిదర్శనం ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేయడమేనని అన్నారు. తొమ్మిదేళ్లుగా రైతు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ప్రభుత్వ తీరును జీర్ణించుకోలేక కాంగ్రెస్ పార్టీ కుటిల రాజకీయాలకు తెరలేపిందని విమర్శించారు. ఇకనైనా కాంగ్రెస్ పార్టీ నాయకులు బహిరంగ క్షమాపణ చెప్పి ఎన్నికల సంఘానికి రాసిన లేఖను వెనక్కి తీసుకోవాలని అన్నారు. లేకుంటే ప్రజాక్షేత్రంలో రానున్న ఎన్నికల్లో పరాభవం తప్పదని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు ప్రశాంత్‌రెడ్డి, కులదీప్‌వర్మ, షౌకత్ అలీ, నవాజ్, గందె కల్పన, సత్తినేని శ్రీనివాస్, ఆరె రవి, రాము, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

చేతిలో చెయ్యేసి చెప్పు.. నీ ఓటు కారుకే కదా..!

కొత్తపల్లి: చేతిలో చెయ్యేసి చెప్పు..నీ ఓటు కారుకే కదా.. అంటూ రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ సతీమణి గంగుల రజిత ఇంటింటా తిరుగుతూ బొట్టు పెడుతూ ఓట్లు అభ్యర్థించారు. కొత్తపల్లి మండలం కమాన్‌పూర్‌లో శుక్రవారం ఎంపీపీ పిల్లి శ్రీలత మహేశ్, జెడ్పీటీసీ పిట్టల కరుణలతో కలిసి ప్రచారం చేపట్టారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా ఆశీర్వదించిన అదే చేతులతో మరోమారు బలపరిచి నాల్గోసారి కమలాకర్‌ను ఎమ్మెల్యేగా చేయాలని కోరారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందంటే అది మంత్రి చేసిన కృషి ఫలితమేనన్నారు. అదేవిధంగా రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అనేక పథకాలు ప్రవేశపెడుతూ దేశంలోనే అగ్రగామిగా నిలుస్తోందని తెలిపారు. సర్పంచ్ సంపత్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కమాన్‌పూర్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న మంత్రి సతీమణి రజిత, ఎంపీపీ శ్రీలత

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు

కరీంనగర్‌రూరల్: ప్రతీ గ్రామంలో 50 మంది కంటే ఎక్కువగా ఉపాధి కూలీలకు పని కల్పించేందుకు కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తగిన చర్యలు చేపట్టాలని ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు అన్నారు. శుక్రవారం కరీంనగర్ మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధిహామీపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. చనిపోయిన మొక్కలను తొలగించి కొత్త మొక్కలను నాటాలన్నారు. వచ్చే ఏడాదిలో నర్సరీల్లో మొక్కలను పెంచేందుకు నాణ్యమైన మట్టిని సేకరించాలని సూచించారు. నర్సరీలను తరలించే అవకాశముంటే వెంటనే అనువైన స్థలాన్ని గుర్తించాలని తెలిపారు. అనంతరం ఇంటి పన్ను వసూళ్లు, ఎన్నికల కోడ్ అమలుపై పంచాయతీ కార్యదర్శులతో ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి సమీక్షా నిర్వహించారు. గడువులోగా ఇంటిపన్ను బకాయిలు వసూలు చేయాలని, ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని అన్నారు. ఈజీఎస్ ఏపీవో శోభరాణి, ఈసీ పద్మ పాల్గొన్నారు.

పోషణ్ అభియాన్‌లో ఉత్తమ సెక్టార్‌గా దుర్శేడ్



సర్టిఫికెట్లు అందుకుంటున్న అంగన్‌వాడీ టీచర్లు

కరీంనగర్‌రూరల్: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గతనెలలో నిర్వహించిన పోషణ్ అభియాన్ కార్యక్రమంలో కరీంనగర్ అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని దుర్శేడ్ సెక్టార్ ప్రతిభ ప్రదర్శించి ఉత్తమ సెక్టార్‌గా ఎంపికైంది. పోషణ్ మహా డ్యాష్‌బోర్డులో అత్యధికంగా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ఫొటోలను అప్‌లోడ్ చేసిన చెర్లభూత్కూర్, ఇరుకుల్ల, వల్లంపహాడ్ అంగన్‌వాడీ టీచర్లు పద్మ, సుజాత, కనకలక్ష్మిలు ప్రతిభ సర్టిఫికెట్లకు ఎంపికయ్యారు. శుక్రవారం కరీంనగర్‌లో జరిగిన సమావేశంలో అంగన్‌వాడీ టీచర్లకు జిల్లా శిశు, మహిళా సంక్షేమ శాఖ అధికారి సరస్వతి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో ఉమారాణి, సూపర్‌వైజర్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

నేడు ఖండగ్రాస చంద్రగ్రహణం

కరీంనగర్‌కల్చరల్: దేశవ్యాప్తంగా ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమి శనివారం ఖండగ్రాస రాహు గ్రస్త చంద్రగ్రహణం సంభవించనుందని వేద పండితులు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రహణ స్పర్శ కాలం రాత్రి 1.06 గంటల నుంచి ఆదివారం తెల్లవారుజామున 1.44 గంటల మధ్య కాలంలో ఉంటుందన్నారు. మోక్ష కాలం రాత్రి 2–25 గంటలకు ఉంటుందని తెలిపారు. ఈ చంద్రగ్రహణాన్ని ఆసియా, ఆస్ట్రేలియా, ఆఫ్రికా, తూర్పు అమెరికా దేశాల్లో స్పష్టంగా చూడవచ్చని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక పరంగా గ్రహణ నియమాలు పాటించాలని సూచించారు. శ్రాద్ధాది కార్యక్రమాలు, భోజనాలు గ్రహణ వేధ కారణంగా శనివారం సాయంత్రం 4 గంటల వరకే ముగించుకోవాలని తెలిపారు. ఆలయాలను మధ్యాహ్నం 3 గంటల నుంచే మూసేసి ఆదివారం ఉదయం శుద్ధి అనంతరం పూజలు, దర్శనాలు నిర్వహించాలని పేర్కొన్నారు.

‘బేషరతుగా క్షమాపణ చెప్పాలి’



మాట్లాడుతున్న రెడ్డి సంఘం నాయకులు

విద్యానగర్(కరీంనగర్): రాష్ట్ర సాధన కోసం అలుపెరగని పోరాటం చేసిన రాణి రుద్రమపై బీఆర్‌ఎస్ నాయకులు సామాజిక మాధ్యమాల్లో చేసిన అసభ్యకర పోస్టింగ్‌లకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని రెడ్డి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహిళల పట్ల గౌరవం లేకుండా అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు వారి కార్యకర్తలను అదుపులో పెట్టుకోవాలన్నారు. ఈ సమావేశంలో రెడ్డి సంఘాల నాయకులు రేకులపల్లి రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కన్నకుమార్‌రెడ్డి, గుర్రం రాజిరెడ్డి, కంటారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, బోడ భాస్కర్, జితేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ ముఖ్యమంత్రిని చేస్తామనడం హర్షణీయం

కరీంనగర్‌టౌన్: సూర్యాపేటలో శుక్రవారం జరిగిన జనగర్జన సభలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రసంగిస్తూ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించడం హర్షణీయమని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఎన్నం ప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ కార్యకర్తలు పార్టీని అధికారంలోకి తీసుకరావడానికి కృషి చేయాలని కోరారు.

2 నుంచి ఎల్ఎల్ఎం రెండో సెమిస్టర్ పరీక్షలు

కరీంనగర్‌సిటీ: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో ఎల్ఎల్ఎం రెండో సెమిస్టర్ పరీక్షలు నవంబర్ 2, 3వ తేదీల్లో జరుగుతాయని యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే పరీక్షలకు విద్యార్థులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

ఆ మూడు పార్టీలు ఒక్కటే..

కరీంనగర్: కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలన్నీ ఒకే తాను ముక్కలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కరీంనగర్ అసెంబ్లీ అభ్యర్థి అంబటి జోజిరెడ్డి అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లో పలు డివిజన్‌లలో ప్రచారం నిర్వహించిన అనంతరం ఎన్నికల కార్యాలయంలో మాట్లాడారు. లోపాయికారి ఒప్పందాలతో రాజకీయాలు చేస్తున్న ఆ మూడు పార్టీలను ప్రజలు తిరస్కరించాలని అన్నారు. ప్రజాస్వామ్యబద్ధ పాలన కోసం ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థులను బలపర్చాలని కోరారు. పరస్పర అవగాహనతోనే ప్రధాన పార్టీల అభ్యర్థులు బరిలో దిగుతున్నారని వారిని ఓటు అనే వజ్రాయుధంతో వెనక్కి పంపాలని అన్నారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ సింహం గుర్తుపై ఓటేసి నేతాజీ సుభాష్ చంద్రబోస్ కన్నకలలను నెరవేర్చేందుకు, సమసమాజ స్థాపనకు ప్రజలు బాసటగా నిలువాలని కోరారు.

మహ్ఫిల్ గౌసే పాక్ ఆధ్యాత్మిక సదస్సు

కరీంనగర్ కల్చరల్: గ్యార్వీ షరీఫ్ మాసాన్ని పురస్కరించుకొని నగరంలోని 47వ డివిజన్‌లో గల షాసాహెబ్ మొహల్లలో శుక్రవారం రాత్రి మహ్ఫిల్ గౌసే పాక్ ఆధ్యాత్మిక సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా పలువురు ముఖ్యులు హాజరయ్యారు. కార్యక్రమంలో మర్కజీ మిలాద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి యూసుఫ్, మౌలానా ఖాజా అలీముద్దీన్ నిజామీ బియబాని, డాక్టర్ సయ్యద్ ఖమరుద్దీన్ ఖాద్రి, సయ్యద్ షా మోహియుద్దీన్ ఖాద్రి, సయ్యద్ తల్లత్ ఖాద్రి, ముఫ్తి సయ్యద్ ఖాజా బాబా ఖాద్రి, సయ్యద్ రహీముద్దీన్ ఖాద్రి, సయ్యద్ బిలాల్ ఖాద్రి, సైఫ్ ఖాద్రి, జామా మస్జిద్ అధ్యక్షుడు సయ్యద్ షా యూసుఫుద్దీన్ ఖాద్రి రియజ్, అబ్దుల్ కరీం జాహిద్, ఉమర్ ఖాద్రి, ఖాజా రబీయుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ ఆధ్యాత్మిక సదస్సును తొమ్మిదేళ్లుగా ఖాద్రి వంశానికి చెందిన సయ్యద్ షా మొహియుద్దీన్ ఖాద్రి కమాల్ భాయి, సయ్యద్ షా హాశిరొద్దీన్ ఖాద్రిలు నిర్వహిస్తున్నారు.

డ్రైనేజీ లేకుండానే సీసీ రోడ్డు

- అభ్యంతరం చెప్పిన కార్పొరేటర్



సీసీ రోడ్డు వేయకుండానే వెనుదిరుగుతున్న కూలీలు

కరీంనగర్ కార్పొరేషన్: డ్రైనేజీ నిర్మాణం చేయకుండానే సీసీ రోడ్డు వేయడానికి చేసిన ప్రయత్నం నగరంలో వివాదాస్పదమైంది. నగరంలోని 55వ డివిజన్ సరస్వతీనగర్‌లో సీసీ రోడ్డు వేసేందుకు శుక్రవారం సామగ్రితో కాంట్రాక్టర్ వచ్చాడు. అయితే ఆ వీధిలో ముందుగా వాటర్ పైపులైన్‌తో పాటు డ్రైనేజీ నిర్మించాలని, ఆ తర్వాత సీసీ రోడ్డు వేయాలని కార్పొరేటర్ పెద్దపల్లి జితేందర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. అవి నిర్మాణం చేయకుండా సీసీ రోడ్డు వేస్తే ఇబ్బంది అవుతుందని చెప్పారు. ఈ అంశాన్ని నగరపాలకసంస్థ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కాంట్రాక్టర్ సామగ్రి, లేబర్‌తో సహా అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా ముందుగా డ్రైనేజీ నిర్మించి ఆ తర్వాత సీసీ రోడ్డు వేయాలని, ఆ వెంటనే పనులు ప్రారంభించాలని జితేందర్ డిమాండ్ చేశారు.

నేడు 126వ ఎన్నీల ముచ్చట్లు

కరీంనగర్‌కల్చరల్: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో ప్రతినెలా జరిగే ఎన్నీల ముచ్చట్లలో భాగంగా శనివారం పౌర్ణమి సందర్భంగా సాయంత్రం 7 గంటల నుంచి 126వ ఎన్నీల ముచ్చట్లను గేయ రచయిత గొట్టె వాసు ఆతిథ్యంలో నిర్వహిస్తున్నట్లు తెరవె అధ్యక్షుడు సీవీ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కవిత్వ సృజనకారులు తమ కవితలతో సుభాష్‌నగర్, రోడ్ నం.8, ఇంటి నం.10-4-314 నివాసానికి రావాలని కోరారు.

సీఎం అల్పాహారం అమలు

- మండలానికో పాఠశాల ఎంపిక
- విడతల వారీగా పాఠశాలలకు అవకాశం



హిందుపూర్ స్కూల్‌లో అల్పాహారం చేస్తున్న విద్యార్థులు

కరీంనగర్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో సీఎం అల్పాహార పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తొలివిడతలో నియోజకవర్గానికి ఒక పాఠశాల చొప్పున ఎంపిక చేశారు. కరీంనగర్ నియోజకవర్గంలో ఎంపిక చేసిన మొగ్దుంపూర్ జెడ్పీ పాఠశాలలో ఈనెల 6న రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. దసరా సెలవుల అనంతరం రెండో విడతలో మండలానికి ఒక పాఠశాల చొప్పున కరీంనగర్ మండలంలోని బొమ్మకల్ పంచాయతీ పరిధిలోని ప్రియదర్శినీకాలనీ ప్రాథమిక పాఠశాల, కరీంనగర్ కార్పొరేషన్‌లో కొత్త యాస్వాడలోని హిందూపూర్ ప్రభుత్వ పాఠశాల, కొత్తపల్లి మండలంలో మల్కాపూర్ జెడ్పీ పాఠశాలలను ఎంపిక చేశారు. గురువారం నుంచి ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేస్తున్నారు.

విడతల వారీగా పాఠశాలల పెంపు

గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఉదయం వేళ అల్పాహారం తీసుకోకుండా పాఠశాలలకు వస్తుంటారు. దీంతో మధ్యాహ్నం వరకు ఆకలితో విద్యార్థులు అల్లాడుతుండటంతో అనారోగ్య సమస్యలకు దారి తీస్తోంది. ఈనేపథ్యంలో విద్యార్థుల ఆలకి తీర్చేందుకు ప్రభుత్వం సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించింది. ముందుగా నియోజకవర్గంలో ఒక పాఠశాలలో ప్రారంభించగా ప్రస్తుతం మండలానికో పాఠశాలను ఎంపిక చేసి అమలు చేస్తున్నారు. విడతల వారీగా పాఠశాలల సంఖ్యను పెంచేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

మరికొన్ని పాఠశాలల్లో అమలు

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుతం మండలానికో పాఠశాలను ఎంపిక చేసి విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నాం. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం అల్పాహారం అందించేందుకు చర్యలు చేపట్టాం. వారం రోజుల్లో మరికొన్ని పాఠశాలల్లో సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు చేస్తాం.

– ఎం.మధుసూదనచారి, ఎంఈవో, కరీంనగర్‌రూరల్

మట్టిని సేకరించిన యువజన సంఘాలు



సేకరించిన మట్టి కలశాలతో యువజన సంఘాల బాధ్యులు

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఆజాద్ కా అమృత్ మహోత్సవం, మేరా మిట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సెప్టెంబర్ మాసం నుంచి శుక్రవారం వరకు అన్ని మండలాల్లోని గ్రామాల నుంచి యువజన సంఘాల బాధ్యులు మట్టిని సేకరించారు. సేకరించిన మట్టిని సుమారు 33 కలశాల్లో నింపి శుక్రవారం 19 మంది వలంటీర్లు హైదరాబాద్‌కు బయలుదేరారు. అక్టోబర్ 30, 31 తేదీల్లో ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో పాల్గొని మట్టిని అందించనున్నట్లు ఎన్‌వైకే ప్రోగ్రాం అధికారి రవీందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘాల బాధ్యులు, వలంటీర్లు తొర్తి శ్రీనివాస్, ఎం. హరీశ్, ఎస్.సాయిచరణ్, డి.సింధు, జి.శివకుమార్, ఎస్.రాకేశ్, ఎస్.గుణశేఖర్, బి. పవన్‌కళ్యాణ్, బి.రాకేశ్, ఎం.కుమార్, అభినయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పరామర్శ



జిల్లా వైద్యాధికారితో మాట్లాడుతున్న మంత్రి

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్ గ్రామానికి చెందిన ఎల్లవ్వ(45) కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మృతి చెందగా.. ఆ రోగి కుటుంబసభ్యులను శుక్రవారం బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ పరామర్శించారు. రోగి మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని జిల్లా వైద్యాధికారిణిని ఆదేశించారు. మంత్రి వెంట కరీంనగర్ ఏఎంసీ చైర్మన్ రెడ్డవేణి మధు, గ్రామస్తులు ఉన్నారు.

జగన్మాత.. నమోస్తుతే..

- ఆండాళమ్మ అమ్మవారికి ఒడిబియ్యం
- పట్టువస్త్రాలు సమర్పించిన పద్మశాలీ కులస్తులు



ఆండాళమ్మకు ఒడిబియ్యం తీసుకొస్తున్న పద్మశాలి సంఘం సభ్యులు



ఒడిబియ్యం సమర్పిస్తున్న భక్తులు



ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం జగన్మాత ఆండాళమ్మను సుహాసినులు భక్తిప్రపత్తులతో కొలిచారు. ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. తమ ఇంటి ఆడపడుచుగా భావించే పద్మావతి అమ్మవారు, శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి వార్లకు సిరిసిల్ల పద్మశాలీ సమాజం పట్టువస్త్రాలు సమర్పించారు. మార్కండేయ ఆలయం నుంచి ఊరేగింపుగా వచ్చి ఆండాళమ్మకు ఒడిబియ్యం సమర్పించారు. అంతకుముందు శ్రీవారు మాఢవీధుల్లో ఏనుగు వాహనంపై విహరించారు. గోవింద నామస్మరణలతో ఆలయ వీధులు మార్మోగాయి. ఆలయ మాజీ చైర్మన్లు ఉప్పుల విఠల్‌రెడ్డి, చేపూరి నాగరాజు, తీగల శేఖర్‌గౌడ్, ఈవో మారుతిరావు, ఏఈవోలు రవీందర్, ప్రభాకర్, అర్చక స్వాములు కృష్ణమాచారి, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, యూత్ విభాగం అధ్యక్షుడు గుండ్లపెల్లి పూర్ణచందర్, మహిళా అధ్యక్షురాలు కాముని వనిత, కౌన్సిలర్లు గుడ్ల శ్రీనివాస్, పత్తిపాక పద్మ, ప్రముఖులు జిందం చక్రపాణి, గుజ్జె తార, బొల్లి రామ్మోహన్, ఆడెపు రవీందర్, రాజేందర్ పాల్గొన్నారు.

పొన్నరథంపై గోవిందుడు

శుక్రవారం రాత్రి ప్రధాన ఘట్టం పొన్నరథోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నమయ్య కీర్తనలను కళాకారులు ఆలపించారు. వికాస తరంగిణి ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన, భజన సంకీర్తనలు చేశారు. మహిళలు మంగళహారతులతో మొక్కులు చెల్లించుకున్నారు.

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు

- రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ
- భర్త మరణంతో ఒంటరిగా మారిన షాహిదా
- వైద్యమందక తిప్పలు పడుతున్న వైనం



మంచానికి పరిమితమైన షాహిదా బేగం

ఎల్లారెడ్డిపేట: దురదృష్టం ఆ కుటుంబాన్ని వెంటాడింది. కట్టుకున్న భర్త మానసిక స్థితి బాగా లేక కిరోసిన్ పోసుకొని మరణించగా.. ఒంటరి జీవితం అనుభవిస్తున్న ఆ వివాహితకు మరోసారి విధి పరీక్ష పెట్టింది. రోడ్డు ప్రమాదంలో గాయపడగా.. 12 పక్కటెముకలు విరిగాయి. వైద్యం చేయించుకోవడానికి చేతిలో చిల్లిగవ్వ లేక ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తోంది. ఎవరైనా దాతలు కరుణిస్తేనే వైద్యమందే పరిస్థితులున్నాయి. ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లికి చెందిన షేక్ షాహిదా బేగం(45)కు కామారెడ్డి జిల్లాకు చెందిన షాదుల్‌తో 18ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు షేక్ ఆసిఫ్ జన్మించాడు. అనంతరం షాదుల్ మానసిక పరిస్థితి సరిగా లేక ఐదేళ్ల క్రితం నిప్పంటించుకొని మృతిచెందాడు. అప్పటి నుంచి కుమారుడితో కలిసి రాచర్లగొల్లపల్లిలో కిరాయి ఇంట్లో ఉండి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 14న రాత్రి గొల్లపల్లి బస్టాండ్‌లో రోడ్డు దాటుతుండగా.. బైక్ అతివేగంగా వచ్చి షాహిదాను ఢీకొట్టింది. గాయపడ్డ షాహిదాను ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు సీటీ స్కానింగ్ చేసి 12 పక్కటెముకలు విరిగినట్లు చెప్పారు. ఇప్పటి వరకు రూ.లక్ష వరకు ఖర్చు చేయగా.. పూర్తిగా కోలుకోవడానికి మరో రూ.2.50లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. భర్త మరణం, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు, ఆరేళ్ల కుమారుడితో ఉన్న ఆమె ప్రస్తుతం వైద్యం చేయించుకునే పరిస్థితుల్లో లేదు. దాతలు కరుణించి సాయం అందిస్తే తప్ప మరో అవకాశం లేదని, దాతలు ఆదుకోవాలని ఆమె వేడుకుంటోంది.

సాయం చేయాల్సిన ఫోన్‌పే నంబర్
99489 85093

బీఆర్‌ఎస్ అవినీతి పాలనను పాతరేద్దాం

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

పెద్దపల్లిరూరల్: బీఆర్‌ఎస్ అవినీతి పాలనను పాతరేసేందుకు అందరూ సన్నద్ధం కావాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ కోరారు. పెద్దపల్లి మున్సిపల్ ఎనిమిదో వార్డు కౌన్సిలర్ బొంకూరి భాగ్యలక్ష్మి, ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బొంకూరి సురేందర్‌సన్నీ, సుల్తానాబాద్ మాజీ ఎంపీపీ ఐల రమేశ్ శుక్రవారం బీఎస్పీలో చేరారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉషతో కలిసి ఆయన వారికి బీఎస్పీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడారు. బహుజనులు ఏకమై వచ్చే ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో అవినీతి బీఆర్‌ఎస్ సర్కార్‌ను అంతం చేయాలని ప్రవీణ్‌కుమార్ కోరారు. కౌన్సిలర్‌గా ఉన్న తనవార్డులో అభివృద్ధి పనులకు సహకరించకుండా ఇబ్బందులకు గురిచేశారని కౌన్సిలర్ భాగ్యలక్ష్మి ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను ఏకంచేసి బీఎస్పీని గెలిపించుకుందామని ఆమె అన్నారు.

ఎన్టీపీసీలో వేడుకలు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం సంస్థలోని 200 మెగావాట్ల మొదటి యూనిట్ ఉత్పత్తి దశలోకి వచ్చి 40 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా శుక్రవారం వేడుకలను జరుపుకున్నారు. ప్లాంట్‌లోని టర్బయిన్ జనరేటర్‌హాల్‌లో అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేసి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు మాట్లాడారు. పనిస్థలాల్లో రక్షణ చర్యలు పాటించి మెరుగైన విద్యుత్ ఉత్పత్తి సాధించాలని వారు సూచించారు.

ప్రజాగర్జన బహిరంగసభకు తరలిరండి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న గజ్జెల కాంతం

కరీంనగర్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఐక్యతను కోరుతూ నవంబర్ 4న కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజాగర్జన బహిరంగ సభకు బహుజనులంతా తరలిరావాలని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ గజ్జెల కాంతం అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లో వివిధ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించి అనంతరం అంబేడ్కర్ స్టేడియంను సందర్శించి సభ ఏర్పాట్లపై మాట్లాడారు. దశాబ్దాలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను రాజ్యాధికారంలో వాటా ఇవ్వకుండా దగా చేస్తున్న పాలక పార్టీల తీరుపై బహుజనులంతా మేల్కొవాల్సిన అవసరం ఉందని అన్నారు. జనాభాలో సగభాగమైన బీసీలను ప్రభుత్వాలు ఓట్లు వేసే యంత్రాలుగా వాడుకుంటున్నాయే తప్ప రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించడం లేదని ఆరోపించారు. ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో పరిపాలన సాగిస్తున్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని అమలు చేయకుండా మనువాద ఎజెండాను అమలు చేస్తూ రిజర్వేషన్లను దశలవారీగా ఎత్తివేసే కుట్రలను ఎదుర్కొనేందుకు బహుజనులంతా ఏకం కావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా, కుల సంఘాల నాయకులు సముద్రాల అజయ్, జీఎస్ ఆనంద్, కలర్ సత్తెన్న, గోష్కి శంకర్, మీసాల సాయిలు, అయిల్ల ప్రసన్న, సంజీవ్‌నాయక్, రవీందర్‌నాయక్, క్యాదాసి ప్రభాకర్, పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మిక కుటుంబాల ఓటుతో బుద్ధిచెబుతాం

- గల్ఫ్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గుగ్గిళ్ల రవిగౌడ్



ఖతర్‌లో నిర్వహించిన గల్ఫ్ కార్మిక సంఘాల ఆత్మీయ సమ్మేళనంలో రవిగౌడ్ తదితరులు

మల్లాపూర్(కోరుట్ల): గల్ఫ్ వెళ్లిన కార్మికుల కుటుంబాల ఓట్లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన విధంగా బుద్ధి చెబుతామని గల్ఫ్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గుగ్గిళ్ల రవిగౌడ్ హెచ్చరించారు. ఖతర్ దేశంలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన గల్ఫ్ కార్మిక సంఘాల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. దాదాపు 15 లక్షల మంది గల్ఫ్ కార్మికుల వెతలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. పరాయిదేశంలో కార్మికులు అనారోగ్య సమస్యలు, పని ఒత్తిడి, రోడ్డు ప్రమాదాలు, వేతన బాధలతో ఇబ్బందులకు గురవుతున్నారని, వారికి ప్రభుత్వాలు అండగా నిలవాలని కోరారు. గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.5లక్షల పరిహారం అందించడంతోపాటు సంక్షేమ పథకాలల్లో ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ఎన్నికల్లో పోటీకి గల్ఫ్ కార్మికులు, వారి కుటుంబసభ్యులు సిద్ధంగా ఉన్నారని, వారితో సీఎం కేసీఆర్ పోటీ చేయనున్న కామారెడ్డిలో భారీ సంఖ్యలో నామినేషన్లు వేయించాలని నిర్ణయించామని ఆయన వెల్లడించారు. దీంతోపాటు సిరిసిల్ల, వేములవాడ, కోరుట్ల, జగిత్యాల, బాల్కొండ, నిర్మల్ వంటి గల్ఫ్ ప్రభావిత నియోజకవర్గాల్లో కూడా పోటీచేయనున్నట్లు తెలిపారు. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించనున్నట్లు వివరించారు. గల్ఫ్‌దేశాల్లోని కార్మికులందరూ గల్ఫ్ కార్మిక నాయకులకు ఓట్లు వేయించాలని కోరారు. తెలంగాణ ప్రజాసమితి అధ్యక్షుడు చెన్నమనేని తిరుపతియాదవ్, తెలంగాణ గల్ఫ్ అధ్యక్షుడు మధు, తెలంగాణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖాజా నిజామొద్దీన్, ఖతర్ జాగృతి అధ్యక్షురాలు నందిని, బీఆర్‌ఎస్ ఖతర్ అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్, దోహా తెలుగు సమితి అధ్యక్షుడు పంచతి ధర్మరాజ్‌యాదవ్, సుందరగిరి శంకర్‌గౌడ్, తాల్లపెల్లి ఎల్లయ్య, గోలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ప్రీతికి చోటు



తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌తో ప్రీతి

కరీంనగర్ సిటీ: తన చుట్టూ నిత్యం చూస్తున్న ప్రకృతి, జీవరాశులనే తన కలంతో రాస్తూ అద్భుతమైన కవితలు రాస్తున్న కరీంనగర్‌కు చెందిన ప్రీతి తాజాగా తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు అయింది. ఈమేరకు ఈనెల 26న అవార్డు అందుకున్నారు. గతంలో దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇండియన్ నోబెల్ అవార్డుకు ఎంపికైంది. చిన్నప్పటి నుంచి తాను చూస్తున్న ప్రకృతి, జీవరాశులు, ప్రజలు, జీవన విధానాలను నిశితంగా పరిశీలించి పాఠశాలస్థాయి నుంచే కవితలు రాయడం మొదలు పెట్టింది. ఇండియాతో పాటు మలేషియా, సింగపూర్, బంగ్లాదేశ్ కాపీరైట్స్ సంపాదించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా బుక్‌తో పాటు విత్తనాలు పంపి మొక్కలు పెంచేలా ప్రోత్సహించినందుకు తాజాగా తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ప్రీతి పేరు నమోదు చేసుకుంది.

డెంగీ జ్వరంతో ఆర్‌ఎంపీ మృతి



ఆస్పత్రి వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మృతుడి బంధువులు

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ
- మృతదేహంతో బంధువుల ఆందోళన



దానపల్లి రాజమౌళి(ఫైల్)

పాతమంచిర్యాల: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రైవేటు మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో కుమురంభీం జిల్లా తిర్యాణి మండలం గంభీరావుపేటకు చెందిన ఆర్‌ఎంపీ దానపల్లి రాజమౌళి(38) డెంగీ జ్వరానికి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. వైద్యులు సరైన వైద్యం అందించకపోవడం వల్లే మృతిచెందాడని బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజమౌళికి నాలుగు రోజుల క్రితం జ్వరం రావడంతో మంచిర్యాలలోని ప్రైవేటు మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేరాడు. వైద్యులు పరీక్షలు చేసి డెంగీ జ్వరంగా నిర్ధారించారు. ప్లేట్‌లెట్‌లు 87వేలు ఉన్నాయని నాలుగు రోజులు చికిత్స అందించారని, గురువారం అర్ధరాత్రి ప్లేట్‌లెట్లు 11వేలకు తగ్గాయని, కరీంనగర్‌లోని కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించినట్లు బంధువులు తెలిపారు. ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని అన్నారు. రోగి ఆరోగ్య పరిస్థితిని తెలుపకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆస్పత్రి వైద్యులు కారణమని మృతుడి భార్య సుజాత ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆస్పత్రి ఎదుట మృతదేహంతో ఆందోళనకు దిగారు. పట్టణ సీఐ రాజు ఆస్పత్రికి చేరుకుని యాజమాన్యంతో మాట్లాడారు. యాజమాన్యం హామీ మేరకు బాధితులు ఆందోళన విరమించారు. కాగా, రాజమౌళికి ఇద్దరు పిల్లలు సాయిమహేష్, రోహిత ఉన్నారు.

మన ఓటర్లు ఎందరు..?

- లెక్కలు తీస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ!

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అధికార బీఆర్‌ఎస్ పార్టీ తమ ఓటు బ్యాంకు ఎంత అనే లెక్కలు వేసుకుంటోంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిదారులతోపాటు స్థానికంగా ఉన్న ఎమ్మెల్యేలతో మేలు జరిగిన వారు, సర్కారు పథకాలు అందుకున్న వారి వివరాలు సేకరిస్తోంది. పోలింగ్ బూత్‌ల వారీగా ఎంతమంది తమ ఓటర్లు ఉన్నారు? ఎంతమంది ప్రతిపక్షాలకు చెందిన వారు ఉన్నారనే వివరాలను వివిధ మార్గాల్లో సేకరిస్తున్నట్లు సమాచారం. తమ పార్టీ కార్యకర్తలు, నాయకులు ఈ మేరకు ఓటరు ఫోను నంబరు, ఆధార్ కార్డు వివరాలు తీసుకుని నమోదు చేస్తున్నారు. నియోజకవర్గాల్లో తమ అనుకునే ఓటర్లు ఎందరు? కాని వారు ఎందరు? వచ్చే ఎన్నికల్లో ఏ పోలింగ్ స్టేషన్ పరిధిలో ఎన్ని ఓట్లు పడే అవకాశం ఉంది? అనే కోణంలో బీఆర్‌ఎస్ ఓటు బ్యాంకు ఎంత ఉందనే వివరాలు సేకరిస్తున్నారు. అంతేకాక ప్రతిపక్ష పార్టీ వైపు ఎంతమంది ఓటర్లు ఉన్నారనేది కూడా ఓ అంచనా వస్తే, ఎక్కడ పార్టీ బలంగా ఉందో, ఎక్కడ బలహీనంగా ఉందో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు.

రేషన్ డీలర్ల నుంచి..

మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో ఎవరు ఎటువైపు ఉన్నారనే సమాచారాన్ని రేషన్ డీలర్ల నుంచి సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. చెన్నూరు నియోజకవర్గంలో రేషన్ డీలర్ల నుంచి ఓటర్ల సమాచారం ఇవ్వాలని నాయకులు కోరుతున్నట్లు అక్కడి మండలాల్లోని డీలర్లే చెబుతున్నారు. స్థానిక నాయకులు ఒక్కో చౌక ధర దుకాణం పరిధిలో ఉన్న రేషన్‌కార్డు ఉన్న వారి ఓటరు జాబితా ప్రకారం పేర్లు, ఫోన్ నంబర్లు తీసుకుంటున్నారు. కొందరు డీలర్లు తాము అలా వ్యక్తిగత వివరాలు రాజకీయ పార్టీల ప్రయోజనాల కోసం తీసుకోబోమని చెబుతున్నట్లు తెలిసింది. జిల్లా అధికారులకు చెప్పి చేయిస్తామని కొందరు నాయకులు బెదిరిస్తున్నారని చెబుతున్నారు. దీనిపై జిల్లా పౌరసరఫరాల కార్యాలయంలో సంప్రదించగా తమ ఆఫీసు నుంచి అలాంటి సమాచార సేకరణ చేయమని చెప్పలేదని చెబుతున్నారు.

రక్షణలో భాగస్వాములు కావాలి



షీల్డ్ అందుకుంటున్న అధికారులు, నాయకులు

కాసిపేట: సింగరేణి ఉద్యోగులు రక్షణలో భాగస్వాములు కావాలని సేఫ్టీ కమిటీ కన్వీనర్ జీ నాగేశ్వర రావు, అధికారి జయంత్‌కుమార్ సూచించారు. 54వ రక్షణ పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిని సేఫ్టీ కమిటీ బృందం తనిఖీ చేసింది. ఈ సంవత్సరం సంస్థలో రికార్డు స్థాయిలో అతి తక్కువ ప్రమాదాలు నమోదయ్యాయని కమిటీ సభ్యులు తెలిపారు. ఇందుకు కృషి చేసిన కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్యను అభినందించారు. రక్షణ కోసం ఉద్యోగులు ఆధునిక సాంకేతికతతో చేసిన పరికరాలు, పనిముట్లు వాడాలని, రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని సూచించారు. కమ్యూనికేషన్ సెల్ మందమర్రి ఏరియా వారు హెల్మెట్ ప్రాముఖ్యతను వివరిస్తూ ఉద్యోగులకు అర్థమయ్యే రీతిలో నాటకాన్ని ప్రదర్శించారు. గనిలో ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రదర్శన ఇచ్చారు. రెస్క్యూ బృందం సభ్యులు ప్రమాదం జరిగిన తరువాత తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 53వ వార్షిక రక్షణ వారోత్సవాల్లో గెలుపొందినవారికి అధికారులు, యూనియన్ నాయకులు బహుమతి అందించారు. అంతకుముందు సేఫ్టీ బృందానికి ర్యాలీగా స్వాగతం పలికి డప్పుచప్పుళ్లతో వేదిక వద్దకు ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏరియా ఇన్‌చార్జి జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏరియా రక్షణాధికారి రవీందర్, గని మేనేజర్ అల్లావుద్దీన్, రక్షణాధికారి సునీల్, సంక్షేమాధికారి జీఆన్, రక్షణ కమిటీ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్కే 7 గనిపై..

శ్రీరాంపూర్: ఆర్కే 7 గనిపై శుక్రవారం 54వ వార్షిక రక్షణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం గుప్తా ఆధ్వర్యంలో రక్షణ తనిఖీ బృందం సభ్యులు గనిని సందర్శించి రక్షణ ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం శ్రీరాంపూర్ జీఎం బీ సంజీవరెడ్డి మాట్లాడారు. ప్రతీ ఉద్యోగి విధి నిర్వహణలో రక్షణ సూత్రాలు పాటించాలని సూచించారు. ఈ సంవత్సరం రికార్డు స్థాయిలో అతి తక్కువ ప్రమాదాలు నమోదు కావడం అభినందనీయమని తెలిపారు. సేఫ్టీ జీఎం మాట్లాడుతూ.. కార్మికులకు రక్షణపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తే ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చని పేర్కొన్నారు. అనంతరం కళాకారులు రక్షణ ప్రాముఖ్యతను తెలిపే నాటికలు ప్రదర్శించారు. తనిఖీ బృందం కన్వీనర్ డీ లలిత్‌కుమార్, ఏరియా రక్షణాధికారి శ్రీధర్, ఏజెంట్ రాముడు, గని మేనేజర్ సాయిప్రసాద్, గ్రూప్ ఇంజినీర్ రాజారవిచరణ్, రక్షణాధికారి రవిశంకర్, పిట్ ఇంజినీర్ ప్రవీణ్, వెంటిలేషన్ అధికారి జగదీశ్వరరావు, సంక్షేమాధికారి శంతన్ తదితరులు పాల్గొన్నారు.

రూ.వందకు చేరిన ఉల్లి

- కొన్నా.. కోసినా కన్నీళ్లే..



రవీంద్రనగర్‌లో ఉల్లి విక్రయిస్తున్న వ్యాపారి

చింతలమానెపల్లి: మొన్నటివరకు సామాన్యులకు టమాట అందకుండా పోగా.. నేడు ఉల్లి కన్నీళ్లు తెప్పిస్తోంది. స్థానిక రవీంద్రనగర్ మార్కెట్‌లో కిలో ఉల్లి ధర రూ.వంద ఉండగా వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. వారం క్రితం వరకు రూ.30 ఉన్న ధర అమాంతం పెరిగింది. ఎరుపు ఉల్లి రూ.80, తెల్ల ఉల్లి రూ.100కు విక్రయిస్తున్నట్లు చిరువ్యాపారులు తెలిపారు. స్థానికంగా ఉల్లిగడ్డ లభించకపోవడంతో పాటు టోకు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి ఎక్కువ ధరకు విక్రయిస్తుండటంతోనే ఉల్లికి ధర పెరిగినట్లు పేర్కొన్నారు.

వైద్యం వికటించి వివాహిత మృతి

- తల్లి ప్రేమకు దూరమైన ఇద్దరు చిన్నారులు



మృతదేహం వద్ద రోదిస్తున్న భర్త, కుటుంబ సభ్యులు



పుష్పలత(ఫైల్)

చింతలమానెపల్లి(సిర్పూర్): ఓ ఆర్‌ఎంపీ చేసిన వైద్యం వికటించి వివాహిత ప్రాణాలు కోల్పోయింది. దీంతో ఆమె ఇద్దరు చిన్నారులు పసి వయస్సులోనే తల్లి ప్రేమకు దూరమయ్యారు. కుమురం భీం జిల్లాలో చోటుచేసుకున్న ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. చింతలమానెపల్లి మండలం కోర్సిని గ్రామానికి చెందిన ధన్నూరి పుష్పలత(25) రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. ఈ క్రమంలోనే గురువారం గ్రామానికి వచ్చిన ఆర్‌ఎంపీ గుర్లె గణేశ్‌ను బాధిత మహిళ వైద్యం కోసం ఆశ్రయించింది. రక్త నమూనాలు సేకరించిన గణేశ్ రవీంద్రనగర్‌లో పరీక్ష చేయించి టైఫాయిడ్ వచ్చినట్లు తెలిపాడు. గురువారం మధ్యాహ్నం పుష్పలతకు సెలైన్ పెట్టి ఇంజక్షన్(మోనోసెఫ్) ఇచ్చాడు. కొన్ని నిమిషాల్లోనే పుష్పలత తీవ్ర అస్వస్థతకు గురికావడంతో పరిస్థితిని గమనించిన ఆర్‌ఎంపీ అక్కడి నుంచి పరారయ్యాడు. రక్తంతో వాంతులు కావడంతోపాటు అపస్మారక స్థితికి చేరడంతో భర్త ప్రసాద్, కుటుంబసభ్యులు ఆమెను కౌటాలలోని ప్రైవేటు ఆస్పత్రికి అక్కడి నుంచి కాగజ్‌నగర్‌కు తరలించారు. అక్కడి ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యులు పరీక్షించి అప్పటికే పుష్పలత మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం కుటుంబసభ్యులు మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చారు. ఆర్‌ఎంపీ వైద్యంతోనే పుష్పలత మృతి చెందినట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై వెంకటేశ్ గ్రామంలో విచారణ చేపట్టారు. వైద్యానికి వినియోగించిన మందులను స్వాధీనం చేసుకున్నారు. ఆర్‌ఎంపీ గణేశ్ పోలీసుల అదుపులో ఉన్నట్లుగా సమాచారం. పుష్పలత మృతదేహం వద్ద భర్తతోపాటు మూడు నెలల కుమార్తె అక్షిత, రెండేళ్ల కుమార్తె శివాని పరిస్థితిని చూసి గ్రామస్తులు కంటతడి పెట్టుకున్నారు.

సేవ్ నేచర్.. సేవ్ ఎర్త్ పేరిట సైకిల్ యాత్ర



చంద్ర బలి మౌర్య

సర్పాపూర్(జి): ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసి పట్టణానికి చెందిన చంద్రబలి మౌర్య సేవ్‌నేచర్.. సేవ్‌ఎర్త్ పేరిట మహారాష్ట్ర వరకు సైకిల్ యాత్ర చేపట్టాడు. ఈ యాత్ర శుక్రవారం మండలానికి చేరుకుంది. 61వ నంబర్ జాతీయ రహదారిపై నందన్ ఎక్స్ రోడ్డు యాత్రీకుడిని 'సాక్షి' పలకరించింది. నవంబర్ 2021 నుంచి ఇప్పటివరకు 25 వేల కిలోమీటర్లు ప్రయాణం పూర్తి చేసినట్లు పేర్కొన్నాడు. దేశ వ్యాప్తంగా లక్ష కిలోమీటర్లు సైకిల్ యాత్ర పూర్తిచేసేలా లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపాడు. ప్రస్తుత రోజుల్లో మానవులు ప్రకృతి, భూమిని కలుషితం చేస్తున్నారని వాటిని కాపాడుకోవాలని సైకిల్ యాత్ర చేపట్టినట్లు పేర్కొన్నాడు. దాతల సహాయంతో యాత్ర కొనసాగిస్తున్నట్లు వెల్లడించాడు.

తండ్రి కోసం.. తనయుల ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న జోగు ప్రేమేందర్

ఆదిలాబాద్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచిన తన తండ్రి జోగు రామన్నను గెలిపించాలని కోరుతూ ఆయన తనయుడైన మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ పట్టణంలో విస్తృత ప్రచారం చేస్తున్నారు. మంత్రిగా, ఎమ్మెల్యేగా తన తండ్రి చేసిన అభివృద్ధిని వివరిస్తూ గెలిపించాలని ఓటర్లను కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



దహెగాంలో ప్రచారం చేస్తున్న కోనేరు వంశీ

దహెగాం: సిర్పూర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి బరిలో నిలిచిన సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తనయుడు కోనేరు వంశీ ప్రచారం నిర్వహిస్తున్నాడు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు వాడల్లో తిరుగుతూ కారు గుర్తుకు ఓటువేయాలని అభ్యర్థించాడు. అతడి వెంట మండల రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ సంతోష్‌గౌడ్, వైస్ ఎంపీపీ చౌదరి సురేష్, సర్పంచు పుప్పాల లక్ష్మి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు బండ క్రిష్ణమూర్తి, మాజీ ఎంపీపీ వాణి పాల్గొన్నారు.



శశాంక బినేశ్... మంచి వక్త.
సామాజిక కార్యకర్త... ఓ విజేత.
'మీ తరఫున మేము మాట్లాడుతాం' అంటోంది.
'మీ ఆరోగ్యాన్ని మేము పట్టించుకుంటాం' అంటోంది.
'ఉద్యోగినులకు అండగా ఉంటాను' అంటోంది.
'సస్టెయినబుల్ ఫ్యాషన్ కోసం పని చేస్తాను'
... అని ప్రకృతికి భరోసా ఇస్తోంది.

పేదపిల్లల గుండెచప్పుడు

శశాంక బినేశ్ సొంతూరు హైదరాబాద్, చందానగర్. బీఫార్మసీ తర్వాత యూకేకి వెళ్లి 'లండన్ మెట్రోపాలిటన్ యూనివర్సిటీ' నుంచి ఫార్మసీలో పీజీ చేశారామె. ఇండియాకి వచ్చి కొంతకాలం ఉద్యోగం చేసినప్పటికీ అది సంతృప్తినివ్వలేదు. ''సొంతంగా ఏదో ఒకటి చేయాలి, నన్ను నేను నిరూపించుకోవాలనే ఆలోచన చాలా గట్టిగా ఉండేది. ఈ లోపు మరో ఉద్యోగంలో చేరాను. ఆ ఉద్యోగంలో డిజిటల్ మార్కెటింగ్ మీద మంచి పట్టు వచ్చింది. ఇక ఆలస్యం చేయలేదు. ఇంట్లోనే ఒక గదిలో సొంతకంపెనీ 'వి హాంక్' మొదలు పెట్టాను. ఇప్పుడు ప్రతి వ్యాపారమూ బ్రాండింగ్ మీదనే నడుస్తోంది. బ్రాండ్‌కి ప్రమోషన్ కల్పించే పని మేము చేస్తాం. సింపుల్‌గా చెప్పాలంటే... మీ గురించి, మీ వ్యాపారం గురించి మేము హారన్ మోగిస్తామన్నమాట'' అంటూ తన సేవా ప్రయాణాన్ని వివరించే ముందు ఉపాధి కోసం తాను ఎంటర్‌ప్రెన్యూర్‌గా మారిన విషయాన్ని చెప్పారామె. 'సామాజిక కార్యకర్తగా ఈ పనులు ఇప్పుడు కొత్తగా చేస్తున్నవి కావు, మా ఇల్లే నేర్పించింది'' అన్నారు శశాంక బినేశ్.

తాత... నాన్న... నేను!

నా చిన్నప్పుడు చందానగర్ నగరంలో భాగం కాదు, గ్రామం. మా తాత మందగడ్డ రాములు గ్రామానికి ఉప సర్పంచ్, సర్పంచ్‌గా ఊరికి సర్వీస్ చేశారు. పేదవాళ్లు నివసించే శాంతినగర్ కాలనీ వాళ్లకు ఇళ్లు, కరెంటు వంటి సౌకర్యాలు ఆయన హయాంలోనే వచ్చాయి. మా నాన్న విక్రమ్ కుమార్ ఇప్పటికీ శ్రామికుల ప్రయోజనాల కోసం పని చేస్తూనే ఉన్నారు. నా అడుగులు కూడా అటువైపే పడ్డాయి. యూకేలో చదువుకుంటున్నప్పుడు పార్ట్‌టైమ్ జాబ్... షెఫీల్డ్ నగరంలో ఒక వృద్ధాశ్రమంలో. పెద్దవాళ్లకు ఒళ్లు తుడవడం, దుస్తులు మార్చడం, వీల్‌చెయిర్‌లో తీసుకెళ్లడం వంటి పనులు చేశాను. ఆ ఉద్యోగం... జీవితం పట్ల నా దృక్పథాన్ని మార్చేసింది. ఇండియాలో మా నాన్న తన స్నేహితులతో కలిసి 2007లో నాదర్‌గుల్ దగ్గర ఒక ట్రస్ట్ హోమ్ స్థాపించారు. ఆ హోమ్ కోసం పని చేయడం మొదలుపెట్టాను. ఇక డిజిటల్ మార్కెటింగ్ ఉద్యోగం చేస్తున్న సమయంలో సినీనటి సమంత, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ మంజుల అనగానితో పరిచయమైంది. అప్పటినుంచి 'ప్రత్యూష సపోర్ట్' స్వచ్ఛంద సంస్థతో పని చేస్తున్నాను. పేద పిల్లలకు వైద్యసహాయం అందించడం మీద ప్రధానంగా దృష్టి పెట్టాను. ఇప్పటివరకు 650కి పైగా సర్జరీలు చేయించగలిగాను. స్ఫూర్తి ఫౌండేషన్, డిజైర్ సొసైటీతో కలిసి హెచ్‌ఐవీ పిల్లలకు 'విష్ ట్రూ కమ్' ప్రోగ్రామ్, అనాథ పిల్లలకు 'వింగ్స్ ఆఫ్ హోప్' ద్వారా విమాన ప్రయాణాలు చేయించడం వంటి పనులతో సేవాకార్యక్రమాల్లో ఉండే సంతృప్తిని ఆస్వాదించాను.

పేదరికం... అనారోగ్యం... రెండూ శాపాలే!

నా సర్వీస్‌ని ముఖ్యంగా ఆర్థిక వెనుకబాటుతనం, అనారోగ్యాల నిర్మూలనల మీదనే కేంద్రీకరించడానికి బలమైన కారణమే ఉంది. పేదరికమే ఒక శాపమైతే, అనారోగ్యం మరొక విషాదం. ఈ రెండూ కలిస్తే ఆ వ్యక్తి వేదన వర్ణనాతీతం. పిల్లలకు వైద్యం చేయించలేక తల్లిదండ్రులు పడే గుండెకోతను చెప్పడానికి ఏ భాషలోనూ మాటలు దొరకవు. సమాజంలో ఇన్ని సమస్యలుంటే ఇవి చాలవన్నట్లు మనుషులు ఒకరినొకరు కులాల పరంగా దూరం చేసుకోవడం మరొక విషాదం. భారతీయ విద్యాభవన్‌లో చదువుకున్నన్ని రోజులూ నాకు కులాల గురించి తెలియదు. ఇంటర్‌కి మా వాళ్లు ర్యాంకుల ప్రకటనలతో హోరెత్తించే కాలేజ్‌లో చేర్చారు. బీసీ వర్గానికి చెందిన నేను అక్కడ వివక్షను చూశాను, ఎదుర్కొన్నాను కూడా. ప్రపంచం గ్లోబల్ విలేజ్‌గా మారిన ఈ తరంలో కూడా ఇలా ఉంటే మా నానమ్మ, ఇంకా ముందు తరాల వాళ్లు ఎంతటి వివక్షకు లోనయ్యారో కదా అనే ఆలోచన మెదలుతుండేది. మా ట్రస్ట్ హోమ్‌లో కులం లేని సమాజాన్ని సృష్టించగలిగాను. నేను లీగల్ గార్డియన్‌గా 'జములమ్మ' అనే అమ్మాయిని దత్తత చేసుకున్నాను. ఆ అమ్మాయి కులమేంటో చూడలేదు. వైద్యసహాయం అందిస్తున్న వారి కులాలూ చూడం. నేను రక్తదాతల సంఘం సభ్యురాలిని కూడా. రక్తం అవసరమైన పేషెంట్‌లు రక్తదాత కులాన్ని చూడరు.

సమంత చూపిన బాట!

మేము పేషెంట్‌కి వైద్యసహాయం కోసం ఎంపిక చేసుకునేటప్పుడు త్రీ పార్టీ ఫండింగ్ విధానాన్ని అవలంబిస్తుంటాం. మూడింట ఒకవంతు మేము సహాయం అందిస్తాం, ఒక వంతు పేషెంట్ కుటుంబీకులు, ఒక వంతు హాస్పిటల్ వైపు నుంచి బిల్లులో తగ్గింపు ఉండేటట్లు చూస్తాం. సర్వీస్ విషయంలో సమంత ప్రభావం నా మీద ఎంతగా ఉందంటే... ఆమె చేనేతల ప్రమోషన్ కోసం పని చేస్తున్న సమయంలో నా వంతుగా ప్రకృతికి ఉపకరించే పని చేయాలని స్టూడియో బజిల్ హ్యాండ్‌లూమ్ క్లోతింగ్ బిజినెస్ పెట్టాను. ఇన్నేళ్ల నా సర్వీస్‌లో లెక్కకు మించిన పురస్కారాలందుకున్నాను. కానీ వాల్మీకి ఫౌండేషన్ నుంచి ఈ ఏడాది అందుకున్న 'సేవాగురు' గుర్తింపు ఎక్కువ సంతోషాన్నిచ్చింది. మావారు బినేశ్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలేసి 'వి హాంక్' కోసమే పూర్తి సమయం పని చేయడం కూడా నాకు అందివచ్చిన అవకాశం అనే చెప్పాలి. నన్ను నేను మలచుకోవడంలో బినేశ్ నాకు పెద్ద సపోర్ట్'' అన్నారు శశాంక బినేశ్.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు: మోర్ల అనిల్ కుమార్

'పోష్' చైతన్యం

మహిళలు పని చేసే ప్రదేశాల్లో తప్పనిసరిగా సెక్సువల్ హెరాస్‌మెంట్ రిడ్రెసల్ కమిటీ ఉండాలి. ధనలక్ష్మీ బ్యాంకు, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీ సభ్యురాలిని. చాలా మంది మహిళలకు తమ పని ప్రదేశంలో అలాంటి కమిటీ ఉందనే సమాచారమే ఉండడం లేదు. ఇందుకోసం అవగాహన సదస్సుల ద్వారా మహిళలను చైతన్యవంతం చేయడం నాకు చాలా సంతృప్తినిస్తోంది.



గుండె ఆపరేషన్ చేయించిన పాపాయితో...

సమస్య ఎదురైతే గళం విప్పాలనే తెగువ లేకపోవడం కంటే గళం విప్పవచ్చనే చైతన్యం కూడా లేకపోవడం శోచనీయం. నేను ధైర్యంగా ఇవన్నీ చేయడానికి మా నాన్న పెంపకమే కారణం. 'ఆడవాళ్లు మానసికంగా శక్తిమంతులు. ఎన్ని అవాంతరాలెదురైనా అనుకున్న పనిని మధ్యలో వదలరు' అని చెప్పేవారాయన. 'మహిళ ఒకరి మీద ఆధారపడి, ఒకరి సహాయాన్ని అర్థించే స్థితిలో ఉండకూడదు. తన కాళ్లమీద తాను నిలబడి, మరొక మహిళకు సహాయం చేయగలిగిన స్థితిలో ఉండాలి. సమాజం గురించి భయపడి వెనుకడుగు వేయవద్దు. జీవితం పట్ల నీ నిర్ణయం ప్రకారం ముందుకే వెళ్లాలి. నువ్వు విజయవంతమైతే సమాజమే నిన్ను అనుసరిస్తుంది' అని చెప్పేవారు. నేను సాటి మహిళలకు చెప్పే మంచి మాట కూడా అదే.

– శశాంక బినేశ్, సోషల్ యాక్టివిస్ట్



శ్రావ్య నివాళి

లతా ఆరాధన



వారంతా స్త్రీలే. 26 దేశాల మహిళలు కలిసి దుబయ్‌లో 'ఫిర్‌దౌస్ ఆర్కెస్ట్రా'గా ఏర్పడ్డారు. తమ ప్రదర్శనలతో అభిమానులను సంపాదించుకున్నారు. తాజాగా లతా మంగేష్కర్‌కు నివాళిగా ఆమె పాడిన ఐదు పాటలను 'కుహు కుహు' పేరుతో ఆల్బమ్‌గా విడుదల చేశారు. ఏ.ఆర్. రెహమాన్ కుమార్తె ఖతిజా రెహమాన్ ఈ ఐదు పాటలు పాడింది. 'లతా ఒక శక్తి. మేమందరం ఈ ఆల్బమ్ ద్వారా స్త్రీ శక్తిని చాటాం' అని తెలిపింది ఖతిజా. శ్రోతలకు ఇదో శ్రావ్యమైన కానుక.

'ఆర్కెస్ట్రా అనగానే రికార్డింగ్ స్టుడియోలో, స్టేజ్ మీద మగవారు నిండిపోయి ఉంటారు. కండక్టర్‌గా ఎప్పుడూ సూట్ వేసుకున్న మగవాడే కనిపిస్తాడు. ఈ స్టీరియోటైప్ మారాలి. ప్రపంచంలో ఉత్తమమైన మ్యుజీషియన్స్‌గా స్త్రీలు ఉన్నారు. వారంతా తమ ప్రతిభను చూపాలి. మేమంతా అందుకే ఒక వేదిక మీదకు వచ్చి పెర్‌ఫామ్ చేస్తున్నాం' అంటారు దుబయ్‌లోని 'ఫిర్‌దౌస్ ఆర్కెస్ట్రా' సభ్యులు.

26 దేశాల నుంచి 51 మంది మహిళా సంగీతకారులు ఇక్కడ తమ సంగీతాన్ని వినిపిస్తున్నారు. ప్రోగ్రామ్‌లు ఇస్తున్నారు. వీరికి ఇక్కడ రికార్డింగ్ స్టుడియో ఉంది. ఇందులో సినిమాలకూ పని చేస్తున్నారు. ఎమిరేట్స్ మహిళా మంత్రి రీమ్ అల్ హష్మి ఏ.ఆర్.రెహమాన్‌ను మహిళలను ప్రోత్సహించే ఆర్కెస్ట్రాను దుబాయ్‌లో ఏర్పాటు చేయమని కోరారు. రెహమాన్ 'ఫిర్‌దౌస్ ఆర్కెస్ట్రా'ను ఏర్పాటు చేయడంలో సాయపడి పర్యవేక్షిస్తున్నారు. వారితో రికార్డింగ్స్ కూడా చేస్తున్నారు. 'పొన్నియన్ సెల్వమ్ 2' రీ రికార్డింగ్ ఫిర్‌దౌస్ ఆర్కెస్ట్రాలోని మహిళలే చేశారు.

అరెబిక్ సౌందర్యం

ఫిర్‌దౌస్ ఆర్కెస్ట్రాలో వివిధ దేశాల మహిళా సంగీతకారులు పని చేస్తున్నా ఈ ఆర్కెస్ట్రా ముఖ్య ఉద్దేశం అరబిక్ సంగీతాన్ని



పాశ్చాత్య సంగీతంతో మిళితం చేసి కొత్త అందాన్ని తీసుకురావడమే. ఫిర్‌దౌస్ ఆర్కెస్ట్రాలో తమతమ దేశాలకు చెందిన నేటివ్ ఇన్‌స్ట్రుమెంట్స్‌తో పాటు అరేబియాలో ఉపయోగించే సంగీత పరికరాలు కూడా వాడి గొప్ప మిళిత సంగీతాన్ని సృష్టిస్తున్నారు. 'మేమంతా వేరు వేరు జీవితాలు, వేరు వేరు సంగీత ధోరణుల నుంచి వచ్చాం. కాని రికార్డింగ్ థియేటర్‌లో అడుగుపెట్టి ఒక్కటిగా మారి సమష్టిగా సంగీతాన్ని సృష్టిస్తాం. ఈ అనుభూతి అద్భుతంగా ఉంటుంది' అంటారు ఫిర్‌దౌస్ ఆర్కెస్ట్రా సభ్యులు. వీరికి కండెక్టర్‌గా మోనికా ఉమ్‌మెన్ అనే మహిళ పని చేస్తోంది.

లతాకు నివాళి

తండ్రి పర్యవేక్షణలో సాగుతున్న ఫిర్‌దౌస్ ఆర్కెస్ట్రాతో కలిసి పని చేయడానికి ముందుకొచ్చింది ఖతిజా రెహమాన్. 'నేను వారితో పని చేసినప్పుడు వారు చూపిన ప్రేమ చాలా నచ్చింది' అంటుందామె. గాయని అయిన ఖతిజా ఇటీవల తమిళ సినిమాలకు సంగీతం కూడా అందిస్తోంది. లతా మంగేష్కర్‌కు నివాళిగా ఫిర్‌దౌస్ ఆర్కెస్ట్రాతో కలిసి 'కుహు కుహు' ఆల్బమ్ తయారు చేసింది. 'మేమందరం లతా పాటలను పునః సృష్టించాలనుకున్నాం' అంది ఖతీజా.

లతా పాడిన ఐదు పాటలను ఎంపిక చేసుకుని ఖతీజా ఈ ఆల్బమ్‌లో పాడింది. అవి

1. పియా తోసే నైనా లాగేరే (గైడ్),
2. ఆప్ కీ నజరోనే సంఝా (అన్‌పడ్),
3. ఓ సజీనా బర్‌ఖా బహార్ ఆయీ (పరఖ్),
4. కుహు కుహు బోలే కోయలియా (సువర్ణ సుందరి),
5. బేకస్ పె కరమ్ కీజియే (మొఘల్ ఏ ఆజమ్).

ఈ ఐదు పాటలకు ఫిర్‌దౌస్ ఆర్కెస్ట్రాలోని మహిళలు సంగీతం అందించారు. బాణీలు యథాతథంగా ఉన్నా ఆర్కెస్ట్రయిజేషన్‌లో తమ సృజనను ప్రదర్శించారు. సాధారణంగా పాత పాటలు కొత్త తరహాగా పాడితే నచ్చవు. కాని ఖతీజా గళం, ఫిర్‌దౌస్ సంగీతం శ్రోతలకు శ్రావ్యమైన అనుభూతిని ఇచ్చాయి. గొప్ప గాయని లతా మంగేష్కర్‌కు ఇది ఒక మంచి నివాళిగా నిలిచిపోతుంది. ●

స్ఫూర్తి

అమ్మ చూపిన దారిలో అపూర్వ విజయాలతో...

అమ్మ నుంచి చందమామ కథలే కాదు స్ఫూర్తిదాయక విజయాలు ఎన్నో విన్నది ప్రియా నాయర్.

మేనేజ్‌మెంట్ ట్రైనీగా దిగ్గజ కంపెనీలోకి అడుగు పెట్టిన ప్రియా నాయర్ తన కృషితో ఉన్నతస్థాయికి ఎదిగింది,

కార్పొరేట్ ప్రపంచంలో విశేషమైన పేరు తెచ్చుకుంది.

తాజాగా...

బ్రిటిష్ మల్టీనేషనల్ కంపెనీ యూనిలీవర్‌లోని టాప్ టీమ్ యూనిలీవర్ లీడర్‌షిప్ ఎగ్జిక్యూటివ్ (యుఎల్‌ఈ)లో ఒకరిగా, ప్రెసిడెంట్ ఆఫ్ 'బ్యూటీ అండ్ వెల్‌బీయింగ్'గా ప్రియా నాయర్ నియామకం జరిగింది.



ప్రియా నాయర్

'మీ రోల్ మోడల్ ఎవరు?' అంటే మరో మాటకు తావు లేకుండా ప్రియా నాయర్ టక్కున చెప్పే మాట...'మా అమ్మ'

డెబ్బై ఏడేళ్ల వయసులోనూ ముంబైలో వైద్యవృత్తిలో బిజీ బిజీగా ఉండేది. అట్టడుగు వర్గాల ప్రజలకు ఉచితవైద్యం అందించేది. ఇక కోవిడ్ సమయంలో ఆమె చేసిన వైద్యసేవలు అపారం. దురదృష్టవశాత్తు ఆమె కోవిడ్ బారిన పడింది. అదృష్టవశాత్తు అందులో నుంచి బయటపడింది. 'పవర్ ఆఫ్ పర్పస్' అంటే ఏమిటో తల్లి నుంచే నేర్చుకుంది ప్రియ.

'మన ఉద్దేశం స్వచ్ఛమైనది అయితే అస్థిరత, అనిశ్చితిని అధిగమించే శక్తి దరి చేరుతుందని, ఆశావాదం మనతోనే ఉంటుందని అమ్మ నుంచి నేర్చుకున్నాను. కార్పొరేట్ జీవితంలో ఇది నాకు ఎంతగానో ఉపయోగపడింది' అంటుంది ప్రియ.

తల్లి నుంచి ఆమె నేర్చుకున్న మరో పాఠం... నిరంతరం నేర్చుకోవడం. ప్రియ తల్లి ఎప్పుడూ ఏదో ఒక సెమినార్‌కు హాజరవుతూ ఉండేది. పుస్తకాలు చదువుతూ ఉండేది. వైద్యరంగంలో వస్తున్న సాంకేతికత గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ నోట్స్ రాసుకుంటూ ఉండేది.

'క్షణం తీరిక లేని ఈ ఉరుకుల, పరుగుల కాలంలో నిరంతరం నేర్చుకోవడం అనేది కుదిరేది కాదు అనే అభిప్రాయాన్ని అమ్మ మార్చేసింది. వృత్తిరీత్యా ఎంత బిజీగా ఉన్నప్పటికీ ఎప్పుడూ ఏదో కొత్త విషయం నేర్చుకుంటూ ఉండేది' అంటుంది ప్రియ.

తల్లి నుంచి స్ఫూర్తి పొందిన ప్రియా నాయర్ హార్వర్డ్ ఎగ్జిక్యూటివ్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్‌కు హాజరైంది. తనకు తిరిగి స్కూల్‌కు వెళ్లినట్లుగా అనిపించింది. 'కార్పొరేట్ రంగంలో పాతిక సంవత్సరాల అనుభవం ఉన్న నాకు ఇది అవసరం లేదు' అని అనుకోలేదు ప్రియా నాయర్. అక్కడ నేర్చుకున్న పాఠాలు ఆ తరువాత కాలంలో తనకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేసినప్పుడు వినియోగదారుల ఆలోచనలపై దృష్టి పెట్టి మార్కెటింగ్ వ్యూహాలను ఎప్పటికప్పుడూ మారుస్తూ వచ్చింది. ఫలానా ప్రాడక్ట్‌కు మార్కెట్ లేదు... అనుకున్న చోట కూడా తన వ్యూహాలతో మార్కెట్‌ను సృష్టించేది. ప్రచారంలో కూడా ప్రత్యేకత కనిపించడానికి ప్రాధాన్యత ఇస్తుంది. అందులో సామాజిక సందేశం కూడా కనిపిస్తుంది.

మనకు ఓటమి అంటే భయం, చిరాకు, కోపం. పిల్లల ఓటమిని తల్లిదండ్రులు తట్టుకోలేరు. పిల్లలకు విజయం అనేది అతి పెద్ద సవాలు.

'నువ్వు ఓడిపోతే ప్రళయం ఏమీ రాదు. గెలుపులాగే ఓటమి అనేది సహజమైనది. ఓటమి నుంచి నేర్చుకునే పాఠాలు విలువైనవి' అనే భావనతో సంస్థ తరపున క్యాంపెయిన్‌ను నిర్వహించింది ప్రియ.

కోవిడ్ సమయంలో హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ (హెచ్‌యుఎల్)లో పెద్ద విభాగమైన 'బ్యూటీ అండ్ పర్సనల్ కేర్' బాధ్యతల్లోకి వచ్చింది ప్రియ. కేవలం 30 రోజుల్లోనే తమ హైజీన్ బ్రాండ్‌లో కొత్తగా పదిహేను వేరియేషన్స్ తీసుకువచ్చింది. అందులో ఒకటైన హ్యాండ్ శానిటైజర్ మన దేశంలోని 'లార్జెస్ట్ సెల్లింగ్ హ్యాండ్ శానిటైజర్ బ్రాండ్'గా నిలిచింది. మేనేజ్‌మెంట్ ట్రైనీగా 'హెచ్‌యుఎల్'లోకి అడుగుపెట్టిన ప్రియా నాయర్ అడుగడుగునా పాఠాలు నేర్చుకుంది. ఎన్నో హోదాల్లో పనిచేసింది. ప్రతి హోదాలో తనదైన ప్రత్యేకత నిలుపుకుంది.

'ఏ పని అయినా సరే యాంత్రికంగా ఎప్పుడూ చేయవద్దు. మనసు పెట్టి చేయాలి' అని తన చిన్నప్పుడు ఎప్పుడో ప్రియకు అమ్మ చెప్పింది.

అందుకే ప్రియా నాయర్ ఏ హోదాలో పని చేసినా మనసు పెట్టి చేసింది. చేసే పనికి ఎప్పటికప్పుడు సృజనాత్మకమైన ఆలోచనలు జోడించింది. ఫలితం వృథా పోలేదని ఆమె విజయప్రస్థానం నిరూపించింది.

పచ్చదనం.. పచ్చధనం

పచ్చదనంతో కళకళలాడే పల్లెలు దేశానికి పట్టుకొమ్మలు అంటారు. చాలామంది చిన్నతనమంతా పల్లెల్లోనే గడుస్తుంది. ఇప్పటి పిల్లలకు ఆ అవకాశం లేదు. పల్లెటూళ్లంటే పండగలు, పబ్బాలు, సెలవలు గడపడానికి వెళ్లే పర్యాటక స్థలాలుగా భావిస్తున్నారు. అరవైపదుల వయసు వారు మాత్రం పల్లెల మట్టివాసనలు, పచ్చదనం పరిమళాలను ఇప్పటికీ కోరుకుంటూనే ఉన్నారు. ఈ కోవకు చెందిన నీలిమా దింగ్రా... తన చిన్ననాటి పచ్చదనాన్ని ఆస్వాదించేందుకు ఏకంగా డబుల్ డెక్కర్ గార్డెన్‌నే పెంచేస్తోంది. తనలాగా పచ్చదనాన్ని ఆస్వాదించాలనుకునేవారికీ సలహాలు సూచనలు ఇస్తూ వారితో మొక్కలు నాటిస్తోంది. అరవై ఏళ్ల వయసులో ఇవన్నీ చేస్తూ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తోంది నీలిమా దింగ్రా.

ఢిల్లీకి చెందిన నీలిమా దింగ్రా స్టాండర్డ్ సెక్యూరిటీస్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ఇంటర్ లిమిటెడ్‌కు మేనేజింగ్ డైరెక్టర్. దీని విలువ కోట్లలోనే ఉంటుంది. వ్యాపార భాగస్వామితో కలిసి, రూ.75 లక్షల పెట్టుబడితో నీలిమ దీనిని ప్రారంభించింది. కొద్దిసంవత్సరాల్లోనే కంపెనీని లాభాల బాట పట్టించింది. ఢిల్లీలో ప్రధాన కార్యాలయంతోపాటు, ముంబైలో మరో రెండు కార్యాలయాలు నిర్వహిస్తూ సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణిస్తోంది. ఇంతపెద్ద వ్యాపారం చూసుకునేవారికి ఏమాత్రం తీరిక దొరికినా.. వయసు రీత్యా కాస్త విశ్రాంతి తీసుకుంటారు. కానీ నీలిమ మాత్రం ఇంట్లో డబుల్ డెక్కర్ గార్డెన్‌ను పెంచుతూ అబ్బురపరుస్తోంది.





చిన్నప్పటిలా ఉండాలని...

నీలిమ చిన్నప్పుడు హర్యాణాలోని రోహ్తక్‌లో పెరిగింది. అక్కడ ఎటుచూసినా పచ్చదనమే కనిపించేది. స్కూలు నుంచి రాగానే జామ చెట్టు కింద కూర్చుని అన్నం, స్నాక్స్ వంటివి తినేది. ఆకుపచ్చని పరిసరాల్లో పెరగడం వల్ల మొక్కల పైన ఎనలేని మక్కువ ఏర్పడింది. పెద్దయ్యి చదువులు, పెళ్లితో పెద్దపట్టణంలో స్థిరపడింది. అభివృద్ధి పేరుతో ఎక్కడ చూసిన కాంక్రీట్ నిర్మాణాలే కనిపిస్తున్నాయి. అక్కడక్కడ షో కోసం పెంచుతున్న ఒకటి రెండు మొక్కలు మాత్రమే కనిపిస్తున్నాయి. అందరికీ ప్రాణవాయువు ఇచ్చేంత పచ్చదనం మచ్చుకైనా కనిపించడంలేదు. పచ్చదనాన్ని ఇష్టపడే నీలిమ ఏ మాత్రం సమయం దొరికినా దగ్గర్లోని పార్క్‌కు వెళ్లేది. చల్లని సాయంత్రాల్లో పార్క్‌లో నడుస్తుంటే ఎంతో ఆహ్లాదంగా ఉండేది తనకు. అయితే కొద్దిరోజులకు మోకాళ్ల నొప్పులు మొదలయ్యాయి. దీంతో 2015 నుంచి పార్క్‌కు వెళ్లడం మానేసింది. పార్క్‌లో నడిచే సమయాన్నీ ఇంట్లో మొక్కలు నాటడానికి కేటాయించింది. ఇంట్లో ఒక మూలన కొద్దిపాటి స్థలంలో విత్తనాలు వేసింది. అవి చక్కగా మొలకెత్తడంతో ఆమె గార్డెన్‌ను విస్తరించడం మొదలు పెట్టింది. ఇలా విస్తరిస్తూ రెండు అంతస్తుల్లో పచ్చటి గార్డెన్‌ను అభివృద్ధిచేసింది. ఈ డబుల్ డెక్కర్ టెర్రస్ గార్డెన్‌ను పూర్తిగా సేంద్రియ పద్ధతిలో నిర్వహించడం విశేషం. ప్రారంభంలో కొన్ని సమస్యలు ఎదురైనప్పటికీ సమయం కేటాయిస్తూ ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ అందమైన టెర్రస్ గార్డెన్‌ను నిర్వహిస్తోంది.

పెంచుతూ పంచుతోంది..

తన డబుల్ డెక్కర్ గార్డెన్ పచ్చదనంతో కళకళలాడుతుండడం నీలిమకు ఎంతో సంతోషాన్నిచ్చింది. ఈ సంతోషంతో మొక్కలను ఇతరులకు ఉచితంగా అందించేది. తన గార్డెన్‌లో పెరిగిన మొక్కల పిలకలు, అంటుకట్టడం ద్వారా వచ్చిన కొత్త మొక్కలను తెలిసినవారికి, గుళ్లకు ఇస్తోంది. ఇలా ఇప్పటి దాకా వెయ్యికి పైగా మొక్కలను పంచింది. నీలిమ గార్డెన్ చూసిన వారంతా మొక్కలు చక్కగా పెరగాలంటే ఏంచేయాలంటూ అని అడిగి మరీ నీలిమ దగ్గర సలహాలు, సూచనలు తీసుకుంటున్నారు.

ఆసక్తితో శాంతి...

ఇతరులు చిట్కాలు, సూచనలు తీసుకోవడం గమనించిన నీలిమ గార్డెనింగ్ జ్ఞానాన్నీ మరింత మందికి పంచాలన్న ఉద్దేశంతో 'శాంతి క్రియేషన్స్' పేరిట యూ ట్యూబ్ ఛానల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ తెరిచి గార్డెనింగ్ చిట్కాలు చెబుతోంది. నెటిజన్లు అడిగే సందేహాలను నివృత్తి చేస్తోంది. ఎక్కువ స్థలం లేనివారు వర్టికల్ గార్డెన్‌ను ఎలా ఏర్పాటు చేసుకోవాలి, చీడపీడల నుంచి మొక్కలను ఎలా కాపాడుకోవాలి. తక్కువ ఖర్చులో అందమైన గార్డెన్‌ను ఎలా పెంచుకోవాలి, వంటి సందేహాలకు చక్కని సలహాలు ఇస్తోంది. ఆరుపదుల వయసులో పచ్చదనంతో బిజీగా ఉంటూ నేటియువతరానికి ఆదర్శంగా నిలుస్తోంది.



టీవ్రంగా మరిగించొద్దు

పొద్దున లేవగానే ఓ కప్పు గరం చాయ్ గొంతు దిగందే పనిలో దిగరు చాలా మంది. అది గ్రీన్ టీ అయినా లెమన్ టీ అయినా సరే ఏదో ఒక టీ గొంతులో పడాల్సిందే. పనిలో అలసి పోయినా, కాస్త సేదదీరాలన్నా ''టీ తాగొద్దాం పద'' అంటారు స్నేహితులు. ఇలా టీ అనేది దిన చర్యలో భాగమైపోయింది.

టీని ఫ్రెష్‌గా కాచి తాగితేనే మంచిది. పైగా ఫ్రెష్ టీ ఫ్లేవరు, రుచే వేరు. చాలామంది ఒకేసారి టీ పెట్టేసు కుని ఫ్లాస్కులో పోసుకుని ఆరారగా తాగుతుంటారు. ఇంకొంతమంది టీ కాచి దాన్ని అలాగే ఉంచి వేడి చేసు కుని తాగుతుంటారు. కానీ అలా టీని మళ్లీ మళ్లీ వేడి చేసుకుని తాగటం మంచిది కాదట.. నాలుగు గంటల కంటే ఎక్కువసేపు ఉంచిన తర్వాత టీని మళ్లీ వేడి చేయడం ఆరోగ్యానికి హాని కలిగిస్తుందని చెబుతున్నారు నిపుణులు.

కాచి అలా ఉంచేసిన టీలో ఫంగస్ ఏర్పడుతుంది. బ్యాక్టీరియా కూడా డెవలప్ అవుతుంది. దీంతో రుచి కూడా మారిపోతుంది. కానీ టేస్ట్ మారింది ఏంటో అను కుంటాం గానీ కారణం మాత్రం ఇదే. కాబట్టి టీని వేడి చేసి తాగటం మంచిది కాదు.

అదే హెర్బల్ టీని అయితే మరోసారి వేడి చేసి తాగ కూడదు. అలా వేడి చేచడం వల్ల దాంట్లో ఉండే పోష కాలు, ఖనిజాలు నశించిపోతాయి. అది తాగినా తాగక పోయినా ఒక్కటే. గ్రీన్ టీ అయితే వేడి చేసి తాగటం ఏమాత్రం మంచిది కాదు.

టీని ఎక్కువసేపు నిల్వ ఉంచితే టానిన్ అధికంగా విడుదల అవుతుంది. ఇది టీని చేదుగా మార్చేస్తుంది. దీంతో అలా వేడి చేసిన టీ తాగితే కడుపు నొప్పి వచ్చే అవకాశాలు న్నాయి. అంతేకాదు అతిసారానికి దాని తీయవచ్చు. కడుపు ఉబ్బరం, వికారం వంటి జీర్ణ సమస్యలు వస్తాయి. అంతేకాదు ఇలా టీని మళ్లీ మళ్లీ వేడి చేసి తాగితే మనకు తెలి యకుండానే అనారోగ్య సమస్యలు వస్తాయి.

కాబట్టి టీ తాగాలనుకుంటే ఎప్పటికప్పుడు తయారు చేసుకుని తాగితే మంచిది. రుచికి రుచి ఉంటుంది. ఆరోగ్యానికి ఆరోగ్యమూ బాగుంటుంది.

ఆరోగ్యం కోసమో ఉల్లాసం కోసమో టీ తాగాలనుకున్నప్పుడు మరిగి పోయి ఉన్న టీ తాగడం వల్ల ఉత్సాహం మాటెలా ఉన్నా, ఉన్న ఆరోగ్యం దెబ్బ తినడం ఖాయం. అటువంటి చెడు ఫలితాలు పడకుండా ఉండాలంటే ఫ్రెష్ టీ తాగడం మేలు.

మీ బుజ్జాయికి జలుబా? ఇలా తగ్గించుకోండి



అప్పటివరకూ ఎక్కడ ఉంటుందో తెలియదు కాని సీజన్ మారగానే ఒక్కసారిగా వచ్చి పట్టేస్తుంది జలుబు. పెద్ద వాళ్లయితే ఏదో విధంగా తట్టు కుంటారు కాని పిల్లలు నీరసిం చిపోతారు. ఒకరి నుంచి ఒకరికి వెంటనే వ్యాపించే ఈ జలుబు, దగ్గు, గొంతు ఇన్ఫెక్షన్ నివారణకు చిట్కాలు.

● జలుబు, జ్వరం లక్షణాలు కనిపించ గానే ఎక్కువ హానికరం కాని పారాసిట మాల్ టాబ్లెట్‌లు వాడవచ్చు. జలుబు పూర్తిగా దారికి వచ్చే వరకు రోజుకు మూడుసార్లు వేడి నీళ్లలో ఉప్పు వేసుకొని పుక్కిటపట్టించాలి..

● రోజులో కనీసం మూడుసార్లయినా పసుపు లేదా, అదుబాటులో ఉండే జండూ బామ్ వేసుకుని ఆవిరి పడితే జలుబు త్వరగా తగ్గడంతో పాటు ఉపశమనం కలుగు తుంది.

● ఈ సీజన్‌లో నీళ్ల నుంచి అనేక జబ్బులు వ్యాపిస్తాయి. కాబట్టి పిల్లలు, పెద్దల దాకా అందరూ కాచి, చల్లార్చి వడపోసిన నీళ్లు మాత్రమే తాగితే మంచిది.

● జలుబు లక్షణాలను త్వరగా తగ్గించే వాటిలో ముఖ్యమైనది నిమ్మ పండు.. గోరువెచ్చటి నీళ్లలో నిమ్మరసం, కాస్త తేనె కలు పుకొని రోజుకు రెండుసార్లు తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జలుబు నుంచి త్వరగా ఉపశమనం పొందుతారు.

● మిరియాలు, వెల్లుల్లి, అల్లం వంటివి ముక్కు దిబ్బడను తగ్గించడంతో పాటు, జలుబు చేసిన సమయంలో రిలీఫ్‌గా ఉండేందుకు తోడ్పడతాయి.

● జలుబు తీవ్రంగా ఉన్నప్పుడు ఆవ నూనెకు వెల్లుల్లి కలిపి చిన్నారి ఛాతీపైనా, మెడ, వీపు భాగాల్లోనూ మసాజ్ చేయాలి.

● పిల్లలు జలుబుతో బాధపడుతున్న ప్పుడు వారికి ఆరారగా మంచినీరు తాగిస్తుండటం వల్ల కోల్పోయిన నీటి శాతం భర్తీ అయి శరీరానికి వ్యాధితో సమర్థంగా పోరాడగల శక్తి వస్తుంది.



ఇంటిని చక్కదిద్దుకోవడం మొదలుకొని పిల్లలకు చక్కని భవిష్యత్ నిర్మాణం వరకు ఇంటి ఇల్లాలు పడే తపన అంతా ఇంతా కాదు. ఈ క్రమంలో ఎంతో ఒత్తిడికి గురై, మానసికంగా, శారీరకంగా బలహీనంగా మారుతుంటారు మహిళలు. ఇల్లాలి బాధ్యతలను చక్కగా నెరవేరుస్తూనే కొన్ని అలవాట్లను దైనందిన జీవితంలో భాగం చేసుకుంటే శరీరం ఆరోగ్యంగా... మనసుకు ఉల్లాసంగా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

అభిరుచులతో ఉత్సాహంగా ఉల్లాసంగా



దైనందిన జీవితంలో ఎదురయ్యే అనేక ఆందోళనలను దూరం చేసి మన సుకు సాంత్వన నిచ్చేది మన అభి రుచులే. రోజులో కొంతసమయాన్ని ఎంతో ఇష్టమైన పనిమీద కేంద్రీకరిం చడం వల్ల మానసిక ఆరోగ్యం మెరుగుప డుతుంది. భావోద్వేగాలు, ఒత్తిళ్లు, నిరా శలు తగ్గుముఖం పడతాయి.



యోగా...

ప్రపంచంలోనే పాపులర్ వ్యాయామం యోగా. మహిళలు అల వర్చుకోవాల్సిన అభిరు చిలో ఇది ప్రధానమై నది. యోగా చేయడం వల్ల ఫిట్‌గా, బలంగా తయా రవడంతోపాటు ఒత్తిడి తగ్గి, సంతో షంగా ఉంటారు. శరీరంతో పాటు మానసిక పరిస్థితి మెరుగుపడి ప్రతికూల పరిస్థితులను తట్టుకుని నిల బడేందుకు అనువుగా మనసు మారుతుంది. జ్ఞాప కశక్తి పెరుగుతుంది.



సిరామిక్స్ తయారీ...

ఒత్తిడిని తగ్గించడంలో సిరామిక్స్ తయారీ ప్రముఖ పాత్ర పోషిస్తుంది. రకరకాల పాత్రల తయారీ నేర్చుకోవడంపై దృష్టి పెట్టడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది. స్వయంగా అందమైన పాత్రలు రూపొం దించి బహుమతిగా ఇవ్వడానికి లేదా ఇంట్లో వాడుకోవచ్చు. క్రోకరీ తయారీ సమయంలో దృష్టిమొత్తం పాత్రపై ఉండడం వల్ల మెడిటేషన్ చేసినట్లవుతుంది.



ఫొటోగ్రఫీ...

మంచి అలవాట్లలో ఫొటో గ్రఫీ కూడ ఒకటి. మనం ఎక్క డున్నా, ఏం చేస్తున్నా ఫోటోలు తీయ వచ్చు. ఇప్పుడు ఖరీదైన కెమేరాలు కూడా అవసరం లేదు. ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్లు ఉంటున్నాయి. మీ అభి రుచికి తగ్గట్టుగా క్లిక్‌మనిపించాలి. తీసిన ఫోటోలను క్రియేటివ్‌గా తయారు చేసి వివిధ రకాల ప్లాట్‌ఫామ్‌లపై పెట్టుకుంటే ఆ జ్ఞాపకాలు ఎప్పటికీ నిలిచి ఉంటాయి. ఈ ఫోటోగ్రఫీ వల్ల ఒత్తిడి, ఆందోళన తగ్గి మనసు ఉత్సాహంతో నిండు తుంది.

స్విమ్మింగ్

ఈత కొట్టడం వల్ల చాలారకాల ఆరోగ్య ప్రయోజనాలు చేకూ రతాయి. ఎండార్ఫిన్స్ విడు దలవుతాయి. రోగ నిరోధక శక్తి పెరు గుతుంది. స్విమ్మింగ్ కోసం బయటకు వెళ్లడం వల్ల శారీరక, మాన సిక ఆరోగ్యాలతో పాటు కొత్త పరిచ యాలతో ఉత్సాహం కలుగు తుంది.

డ్యాన్సింగ్...

నాలుగు స్టెప్పులు వేసా రంటే హుషారు దానంతట అదే పరిగె త్తుకుంటూ వస్తుంది. మ్యూజిక్‌కు తగ్గట్టుగా శరీరాన్ని కదిలిస్తే ఆనందం రెట్టింపు అవు తుంది. డ్యాన్స్‌తో అధిక బరువు తగ్గి, కండరాలు బలంగా మారతాయి. మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుంది.

ఆభరణాల తయారీ

జ్యువెలరీ తయారీ అలవాటు చాలా మంచిది. దృష్టిమొత్తం డిజైన్ మీద ఉంటుంది. మనలోని సృజనాత్మకతను వెలికి తీసి సరికొత్త అభరణాలు తయారు చేసి ఎవరికైనా గిఫ్ట్‌గా ఇవ్వొచ్చు. దీనిలో మంచి నైపుణ్యం సాధిస్తే ఆదాయం కూడా వస్తుంది. ఆన్‌లైన్ లో కూడా నేర్చుకోవచ్చు.

కుట్లు... అల్లికలు

ప్రస్తుత కాలంలో మహిళలు ధరించే డ్రెస్సులు దాదాపు అన్నీ ఎంబ్రాయిడరీతోనే ఉంటున్నాయి. వీటి రేటు కూడా ఎక్కువే. స్వయంగా మీ డ్రెస్ మీద మీరే ఎంబ్రాయిడరీ చేస్తే ఖర్చు ఉండదు. స్వయంగా డిజైన్ చేశా మన్న సంతృప్తి కలుగుతుంది. సులభంగా వేయగలిగే ప్యాట్రన్ లేదా ఫ్లోరల్ డిజైన్‌తో మొదలు పెట్టి మెల్లగా ఎంబ్రా యిడరీలోని మెలకువలు నేర్చుకోవాలి. ఇందుకు ఏకాగ్రత తోపాటు ఓపిక కూడా కావాలి. మీరు ఎంబ్రాయిడరీ చేసిన డిజైన్ లేదా అల్లిన వస్తువు ఇతరులకు నచ్చిన ప్పుడు మీలో ఆత్మవిశ్వాసం పెరిగి సంతోషంతో పాటు, ఆదాయమూ వస్తుంది.



కుకింగ్, బేకింగ్... సరికొత్త కలెక్షన్..

దాదాపు మహిళలంతా వంటచేస్తుంటారు. అయితే రోజూ చేసే వంట కాకుండా... కొంచం కొత్తగా చేసి ఇంట్లోవాళ్లకు రుచులను వడ్డించండి. తిన్న వారు 'ఎంత బావుందో' అని చెప్పేమాట మీ కడుపుని నింపేస్తుంది. ఇంట్లో చేసినవి ఏవైనా ఆరోగ్యమే! అందుకే రక రకాల వంటకాలను తయారు చేయడానికి ప్రయత్నించాలి.

గార్డెనింగ్... బొకేల తయారీ

గార్డెనింగ్‌ను అలవాటు చేసుకుంటే.. ఒత్తిడి మీ దరిదాపు ల్లోకి రాదు. సేంద్రియ కూరగాయలు, పండ్లు పండించడంతో పాటు, సువాసనలు వెదజల్లే పూలపరిమళాలు ఇంటి ఆవర ణలో మీతోపాటు మీ కుటుంబానికీ ఉల్లాసాన్ని కలిగిస్తాయి. ఇక పూలను బొకేలుగా మార్చితే మీ నైపుణ్యాలు మెరుగుపడి నట్టే. పూలను ఒకదానికి ఒకటి జత చేసే క్రమంలో మనలోని సృజనా త్మకత వెలికి వస్తుంది. మనసు ఆహ్లాదంగా మారుతుంది.



అందంగా... ఆరోగ్యంగా

ఒత్తిడి వల్ల ముఖ సౌందర్యాన్ని గాలికి వదిలే స్తుంటారు. అద్దంలో ముఖం చూసుకున్నప్పుడు మరింత నిస్సత్తువగా అనిపి స్తుంది. అందువల్ల మీ ముఖాన్ని మరింత కాంతిమంతంగా మార్చుకునేందుకు ఇంట్లోనే ఫేషియల్ తయారు చేసుకోవాలి. చర్మ సంరక్షణకు ఎటువంటి క్రీమ్‌లు, ఫేషియల్స్‌లు చేసుకోవాలో నేర్చుకుని చర్మసౌందర్యాన్ని పెంచుకోవాలి. వీటికి ఫేషియల్ యోగాను జతచేస్తే అందమూ ఆరోగ్యం మీ సొంతమైనట్టే.

వీటిలో కనీసం కొన్నింటిని అలవరచుకున్నా మీలో పేరు కుపోయిన ఒత్తిడి, నిస్సత్తువలు నియంత్రణలోకి వచ్చి ఆనం దంగా జీవించ గలుగుతారు.

సినిమా

సూర్యకాంతం శతజయంతి ప్రత్యేకం



● సూర్యకాంతం

కోడలిని ఎన్ని రకాలుగా హింస పెట్టాలి? భర్త నోరు ఎలా మూయించాలి? కూతుర్ని అల్లారు ముద్దుగా ఎలా పెంచుకోవాలి? ఇంటి అల్లుణ్ణి ఎలా ఆడుకోవాలి?... ఇవన్నీ తెలుసుకోవాలంటే సూర్యకాంతం చేసిన పాత్రలు చూస్తే చాలు. ఇంతకు మించి ఎవరూ గయ్యాళితనాన్ని చూపించలేరేమో అన్నంతగా నటించారామె. అందుకే తమ కూతుళ్లకు ఆమె పేరు పెట్టే సాహసం చేయరు తల్లి దండ్రులు. కానీ వ్యక్తిగతంగా ఆమె మనసు సున్నితం. తనది కాని స్వభావాన్ని వెండితెరపై అద్భుతంగా అభినయించిన ఈ అద్భుత నటి శత జయంతి నేడు (అక్టోబర్ 28) ఆరంభం. ఈ సందర్భంగా సూర్యకాంతంని గుర్తు చేసుకుందాం...

గయ్యాళితనం... సున్నితం

''ఒకరి బాధతో నాకు సంతోషం దక్కుతుం దంటే ఆ సంతోషమే నాకు వద్దు''... వెండితె రపై గయ్యాళి అత్తగా విజృంభించిన సూర్యకాంతం నోటి నుంచి వచ్చిన మాటలివి. నటిగా గయ్యాళితనాన్ని కనబర్చిన ఆమె వ్యక్తిగా కాస్త సున్నిత మనస్కురాలే. నిజానికి కథానాయికగా వెండితెరపై అందంగా, సున్నితంగా కనిపించా లన్నది సూర్యకాంతం కల. ఆ కల నెరవేర్చుకునే చాన్స్ వచ్చినప్పటికీ, ఒక హీరోయిన్ చేజారిన అవకాశాన్ని తాను అంది పుచ్చుకుని ఆనందపడటా నికి ఇష్టపడక... ''ఒకరి బాధతో నాకు సంతోషం దక్కుతుందంటే ఆ సంతోషమే నాకు వద్దు'' అని తిరస్కరించారు. అది హిందీ సినిమా. అయినా వదులుకున్నారంటే వ్యక్తిగతంగా సూర్యకాంతానిది ఎంత మంచి మనసో అర్థం చేసుకోవచ్చు. ఇక వెండితెరపై ఎడమ చేయి ఆడిస్తూ, విసురుగా ఆమె డైలాగ్ చెప్పే తీరులో కనిపించిన గయ్యాళితనాన్ని ప్రేక్షకులు ఎంజాయ్ చేశారు. ఇలా ఎడమ చేయి తిప్పే అలవాటు సూర్యకాంతానికి చిన్నప్పుడే ఉంది. చిన్నారి సూర్యకాంతం బాల్యంలోకి వెళితే ఆ విషయాలు తెలుసుకోవచ్చు.

సూర్యం... భలే చలాకీ

తూర్పు గోదావరి జిల్లా కాకినాడ దగ్గరున్న వెంకట కృష్ణరాయపురంలో 1924 అక్టోబర్ 28న పొన్నాడ అనంత రామయ్య, వెంకటరత్నమ్మలకు జన్మించారు సూర్య కాంతం. మగపిల్లాడి దుస్తులు వేసుకుని, బెత్తం పట్టుకుని భలే చలాకీగా ఉండేదట చిన్నారి సూర్యకాంతం. తల్లి దండ్రులు సూర్యం అని పిలిచేవారట. 'సూర్యం అటు వెళ్లకు.. బూచీ ఉంది' అంటే... ఎడమ చేయి ఊపుతూ 'బూచీ లేదు.. ఏమీ లేదు' అనేదట సూర్యం. ఆ చేయి కదలిక, మాట తీరు అందర్నీ నవ్వించేవట. ఇక సినిమాల్లోకి వచ్చాక ఎడమ చేయి తిప్పుతూ సూర్యకాంతం డైలాగులు పలికిన తీరు ఆకట్టుకున్నాయి. ఎడమ చేయి తిప్పడం అనేది చిన్న వయసులోనే ఆమెకు అలవాటైంది. ఆర్నేళ్ల వయసులోనే పాటలు పాడటం, డ్యాన్స్ నేర్చుకుంది సూర్యం. ఈ చిన్నదాన్ని హిందీ సినిమా పోస్టర్లు ఆకర్షించాయి. కాగా సూర్యంకి ఎనిమి దేళ్ల వయసప్పుడు ఆమె తండ్రి చని పోయారు. అప్పటికే ఆమె తోబుట్టువులకు పెళ్లయి, అత్తవారిం టికి వెళ్లిపోయారు. సూర్యం, ఆమె తల్లి మాత్రమే ఉండేవారు. అప్పట్లో కాకినాడలో అందరూ అమ్మాయిలే ఉన్న ఓ డ్రామా కంపెనీని నిర్వహించేవారు బాలాంత్రపు ప్రభాకర రావు. నటించాలనే ఆసక్తి ఉన్నా అవకాశం అడగడానికి సూర్యం ఇష్టపడలేదు. అయితే ఓ అమ్మాయి రాకపోవడంతో ఆ పాత్రకు చలాకీ సూర్యంని తీసుకున్నారు ప్రభాకర రావు. తల్లి వెంకటరత్నం కూడా కూతురి ప్రతిభకు అడ్డుకట్ట వేయదలచుకో లేదు. అలా 'సతీ సక్కుబాయి' నాటకంలో మగపిల్లవాడి వేషం వేసింది సూర్యం. ఆ తర్వాత కూడా అబ్బాయి పాత్రలు చాలానే చేసి, రంగ స్థలంపై నిరూపించు కుంది. హనుమాన్ డ్రామా కంపెనీలోని నాటకాల్లోనూ నటించింది. ఆ డ్రామా కంపెనీ మద్రాసులోనూ నాటకాలు వేస్తుండటంతో కూతురితో సహా సూర్యం తల్లి చెన్నపట్నం చేరుకున్నారు. అప్పటికి సూర్యం వయసు 20. ఇక సినిమాల్లో నటిస్తానంటే తల్లి ఓకే చెప్పేశారు.

హిట్ గయ్యాళి

జెమినీ స్టూడియో ఓ సినిమాలో సూర్యకాంతంకి సైడ్ డ్యాన్సర్‌గా అవకాశం ఇచ్చి, నెలకు రూ. 60 జీతం అంటే ఒప్పుకోలేదామె. దాంతో రూ. 75 ఇవ్వడానికి అంగీకరించారు. అయితే కొంత కాలం తర్వాత జెమినీ స్టూడియో నుంచి ఆమె బయటకు వచ్చేశారు. నటిగా సూర్యకాంతం తొలి చిత్రం 'నారద నారది' (1946). ఆ తర్వాత చిన్నా చితకా పాత్రలు చేస్తూ వచ్చిన సూర్యకాంతంకి 'సౌదామిని' చిత్రంలో హీరోయిన్‌గా అవకాశం వచ్చింది. అయితే కారు ప్రమాదం వల్ల ముఖానికి గాయం కావడంతో ఆ అవకాశం చేజారింది. కాస్త కోలుకున్నాక 'సంసారం' (1950) చిత్రంలో గయ్యాళి అత్త పాత్రకు అవకాశం వస్తే, కాదనుకుండా ఒప్పుకున్నారు సూర్యకాంతం. గయ్యాళి అత్త అంటే సూర్యకాంతమే అన్నంతగా నటించడంతో ఆ తర్వాత కెరీర్‌లో వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం లేకుండా పోయింది. 40 ఏళ్ల పాటు దాదాపు 700 చిత్రాల్లో నటించారామె.

టైటిల్ రోల్‌లో...

సూర్యకాంతం కెరీర్‌లో చెప్పుకోదగ్గ చిత్రాల్లో 'గుండమ్మ కథ' (1962) ముందు ఉంటుంది. ఆ చిత్రంలో ఎన్టీఆర్, ఏయన్నార్ వంటి హీరోలు ఉన్న ప్పటికీ సూర్యకాంతం వీళ్లై నంత గయ్యాళితనం ప్రదర్శిస్తా రనే నమ్మకంతో ఆమె పాత్ర పేరు వచ్చేట్లు 'గుండమ్మ కథ' టైటిల్ పెట్టారు ఆ చిత్ర దర్శకుడు కమలాకర కామేశ్వరరావు. ఆ నమ్మకాన్ని నిజం చేశారు సూర్యకాంతం. ఇంకా ఆమె చేసిన చిత్రాల్లో 'చక్రపాణి, దొంగ రాముడు, చిరంజీవులు, తోడికో డళ్లు, అత్తా ఒకింటి కోడలే, ఇల్లరికం, కులగోత్రాలు, దాగుడు మూతలు, ఉమ్మడి కుటుంబం, అత్త గారు–కొత్తకోడలు, దసరా బుల్లోడు, వియ్యాలవారి కయ్యాలు' వంటివి ఉన్నాయి. 'మాయాబజార్'లోని హిడింబి పాత్ర ఒకటి.

వంటల పుస్తక రచయిత

అప్పట్లో సినిమా స్టార్ కనబడితే ఆటోగ్రాఫ్ కోసం ఎగబడేవారు. కానీ, నటిగా గయ్యాళి ముద్రపడ్డ సూర్య కాంతం కనబడితే దగ్గరికి వెళ్ల డానికి భయపడేవారట. ఇక షూటింగ్‌కి వెళ్లేటప్పుడు తనతో పాటు తినుబండారాలు తీసుకు వెళ్లి, యూనిట్‌లో అందరికీ పెట్టడం, లొకేషన్‌లోనే వండటం చేసేవారట సూర్యకాంతం. ఓ వంటల పుస్తకం కూడా వెలువరించారామె.

నమ్మినవాళ్లే...

సూర్యకాంతం ఆర్థిక లావాదేవీల విషయంలో నిక్కచ్చిగా ఉండేవారట. అలాగే సులువుగా ఎవర్నీ నమ్మేవారు కాదట. చివరికి కారు పాడైతే, మెకానిక్ ఇంటికి వచ్చి తన కళ్ల ముందే బాగు చేయాలట. సెకండ్ హ్యాండ్ కార్లు కొని అమ్మేవారట. ఎంత తెలివిగలవాళ్లయినా ఎక్కడో చోట బోల్తా పడతారన్నట్లు.. నమ్మినవాళ్లే ఆమెను మోసం చేశారట. సూర్యకాంతం మరణానికి ఆ మానసిక వేదన ఓ కారణం అంటుం టారు. నటిగా తన కాంతిని ప్రేక్షకులకు వదిలి వెళ్లారామె. వెండి తెరపై ఆమెను రీప్లేస్ చేసే మరో గయ్యాళి అత్త రాలేదు... ఎప్ప టికీ రాదు కూడా.

గయ్యాళి అత్తగా తొలి చిత్రం 'సంసారం' (1950) ఒప్పుకున్న ఏడాదే మద్రాసు హైకోర్టు జడ్జి పెద్దిభొట్ల చలపతి రావుతో సూర్యకాంతం పెళ్లి జరిగింది. వీరికి సంతానం లేరు. అక్క కొడుకు అనంత పద్మనాభ మూర్తిని దత్తత తీసుకున్నారు సూర్యకాంతం. 1978లో చలపతిరావు చనిపోయారు. 1994 డిసెంబర్ 18న సూర్యకాంతం చెన్నైలో కన్నుమూశారు. అయితే ఆమె భౌతికకాయాన్ని సందర్శించడానికి ఓ పది మంది సినీ ప్రముఖులు కూడా వెళ్లలేదు.

సూర్యకాంతం సేవా కార్యక్రమాలు చేశారు. కాకినాడ, హైదరాబాద్‌తో పాటు మరికొన్ని నగరాల్లో సత్రాలు ఏర్పాటు చేసి, అనాథలను చేరదీశారట. అలాగే పలువురు వితంతువులకు ఒకే వేదికపై పునర్వివాహాలు చేశారు. ఒంటరి మహిళలకు ఆర్థిక సహాయం చేసేవారు.

'గుండమ్మ కథ' కథారచయిత డీవీ నరసరాజు స్క్రిప్ట్ రాసే టప్పుడు సవితి కూతురు సావిత్రిని గుండమ్మ బాధలు పెట్టాలి కాబట్టి.. 'గుండమ్మ గయ్యాళితనాన్ని ఎస్టాబ్లిష్ చేసే సీన్లు రాయనా?' అని నిర్మాత చక్రపాణిని అడిగారు. 'గుండమ్మగా వేస్తున్నది సూర్యకాంతం... సూర్యకాంతం అంటేనే గయ్యాళి. ఎస్టా బ్లిష్ చేయడం ఎందుకు. ఫిల్మ్ వేస్టు' అన్నారాయన. పని గట్టుకుని సీన్లు రాయకపోయినా గయ్యాళిత నాన్ని పండించారు సూర్యకాంతం.

'మంచి మనసులు'లో లాయర్ ఎస్వీ రంగారా వుకు సూర్యకాంతం భార్య. అక్కి నేని తనకు పెళ్లయ్యిందని అబద్ధం చెప్పి ఆ ఇంట్లో అద్దెకు దిగుతాడు. ఆ ఇంటి ఆడపిల్ల సావిత్రి ఇది కనిపెట్టి అక్కినేని భార్యకు కొడుకు పుట్టాడని దొంగ టెలిగ్రాము వచ్చేలా చేస్తుంది. దాంతో సూర్యకాంతం శుభవార్తే కదా అని గుప్పిట్లో చక్కెర పట్టుకుని భర్తతో 'ఏదీ.. ఒకసారి నోరు తెరవండీ' అంటుంది. దానికి ఆయన 'నీ ముందు నేనె ప్పుడైనా నోరు తెరిచాననే' అంటాడు. ఆజా నుబాహుడు ఎస్వీఆర్ సైతం తెరపై సూర్యకాంతం ముందు నోరు తెరవ లేదు.

'శాంతి నివాసం'లో ఇల్లరికం అల్లుడు నర సింహాలు (రేలంగి)ని 'గొడ్డు సింహాలు' అంటూ అవమానిస్తుంటుంది అత్త (సూర్యకాంతం). అప్పుడు మామగారి (చిత్తూరు నాగయ్య) దగ్గరికెళ్లి, 'చూశారా మావగారు.. అత్త నన్ను గొడ్డు సింహాలు అంటోంది' అని మొరపెట్టుకుం టాడు నరసింహాలు. దానికి మామగారు 'అంతా ఆ భగవంతుని లీల. నాతో చెప్పుకుంటా వేమి నాయనా' అని జారుకుం టాడు. భార్యంటే ఆ భర్తకు అంత భయం.



● 'గుండమ్మ కథ'లో...

అది నా అదృష్టం



● శ్రీకాంత్

చిరంజీవి హీరోగా, శ్రీకాంత్ కీలక పాత్రలో జయంత్ సి. పరాన్జీ దర్శకత్వంలో రూపొందిన హిట్ ఫిల్మ్ 'శంకర్ దాదా ఎంబీబీఎస్'. ఈ సినిమా నవంబరు 4న థియేటర్స్‌లో రీ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో నాగబాబు, శ్రీకాంత్ రీ రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేశారు. అనంతరం శ్రీకాంత్ మాట్లాడుతూ– ''హిందీ చిత్రం 'మున్నాభాయ్ ఎంబీబీఎస్' తెలుగు రీమేక్ గురించి వినగానే, హీరో పక్కన ఉండే పాత్ర నాకే రావాలనుకున్నాను. అలాగే వచ్చింది. ఇప్పటికీ నన్ను 'ఏటీఎం' (శ్రీకాంత్ పాత్ర పేరు) అని పిలుస్తుంటారు. అన్నయ్య (చిరంజీవి)తో కలిసి నటించే అవకాశం రావడం నా అదృష్టం'' అన్నారు.

టిల్లు డేట్ ఫిక్స్



● సిద్ధు జొన్నలగడ్డ

సిద్ధు జొన్నలగడ్డ హీరోగా మల్లిక్ రామ్ దర్శకత్వంలో రూపొందు తున్న సినిమా 'టిల్లు స్క్వేర్'. ఇందులో అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్న ఈ సినిమాను వచ్చే ఏడాది ఫిబ్రవరి 9న రిలీజ్ చేయను న్నట్లు వెల్లడించారు. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటించిన 'డీజే టిల్లు'కు సీక్వెల్‌గా తెరకెక్కుతోన్న 'టిల్లు స్క్వేర్'కి సహనిర్మాత: సాయి సౌజన్య.

చిత్రం చూడర...



● వరుణ్ సందేశ్

వరుణ్ సందేశ్, శీతల్ భట్ హీరో హీరోయిన్లుగా, 'నేనింతే' ఫేమ్ అదితీ గౌతమ్ ఓ ప్రత్యేక పాత్రలో నటించిన సినిమా 'చిత్రం చూడర..'. ఆర్‌ఎన్ హర్షవర్ధన్ దర్శకత్వంలో శేషు మారంరెడ్డి, బోయపాటి భాగ్యలక్ష్మీ నిర్మిస్తున్న ఈ చిత్రం టీజర్‌ను నిర్మాత టీజీ విశ్వప్రసాద్ విడుదల చేశారు. యాక్షన్ అండ్ సస్పెన్స్ అంశాలతో సినిమా కథనం ఉంటుందని టీజర్ స్పష్టం చేస్తోంది. ఈ సినిమాకు సంగీతం: రధన్, కెమెరా: జవహర్ రెడ్డి, సహనిర్మాత: ధన తుమ్మల.

కొత్త లోకంలోకి వెళ్తారు

– 'సత్యం' రాజేశ్



● సత్యం రాజేశ్, కామాక్షి

'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్ల జంటగా అనిల్ విశ్వనాథ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మా ఊరి పొలిమేర 2'. 'మా ఊరి పొలిమేర'కు సీక్వెల్‌గా ఈ చిత్రం తెరకెక్కింది. గౌరు గణబాబు సమర్పణలో గౌరికృష్ణ నిర్మిం చిన ఈ సినిమా హక్కులను సొంతం చేసుకున్న పంపిణీదారుడు వంశీ నందిపాటి నవంబరు 3న రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా 'సత్యం' రాజేశ్ మాట్లాడుతూ– ''కొత్త కాన్సెప్ట్‌తో రూపొందిన 'మా ఊరి పొలిమేర 2' చిత్రం ప్రేక్షకులను కొత్త లోకానికి తీసుకుని వెళ్తుంది'' అన్నారు. ''తొలి భాగానికి 20 రెట్లు మలి భాగం బాగుంటుంది. త్వరలోనే 'పొలిమేర 3'ని కూడా ఆరంభిస్తాం'' అన్నారు అనిల్ విశ్వనాథ్. ''సినిమా విజయంపై పూర్తి నమ్మకం ఉంది'' అన్నారు నిర్మాతలు. ''ప్రేక్షకులు ఓ థ్రిల్లింగ్ చిత్రాన్ని చూడబోతున్నారు'' అన్నారు వంశీ.

సాక్షి
బిజినెస్
శనివారం
28-10-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
635	202
63,783	19,060

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ			
నాస్‌డాక్	12,631	▲	38
డోజోన్స్	32,486	▼	298
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,291	▼	63
డాక్స్	14,687	▼	44
షాంఘై	3,018	▲	29
నికాయ్	30,992	▲	390

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	60,825	▼	159
బంగారం (99.5 స్వచ్ఛత)	60,740	▼	159
వెండి (కేజీ)	70,906	▼	654

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	[illegible]	82.48	84.15
£	బ్రిటన్ పౌండ్	[illegible]	99.46	102.77
€	యూరో	[illegible]	86.51	89.56
¥	జపాన్ ఎన్ (100)	[illegible]	54.63	56.32
AU$	ఆస్ట్రేలియా డాలర్	[illegible]	51.75	54.04
S$	సింగపూర్ డాలర్	[illegible]	59.91	61.84
SAR	సౌదీ రియాల్	[illegible]	21.24	22.87
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.77	23.56
¥	చైనా యువాన్	[illegible]	10.25	12.33

జీఆర్‌టీ జ్యువెలర్స్ కొత్త షోరూమ్



హైదరాబాద్: జీఆర్‌టీ జ్యువెలర్స్ తన 59వ షోరూమ్‌ను సికింద్రాబాద్‌లోని డాక్టర్ ఎ.ఎస్.రావు నగర్‌లో శుక్రవారం ప్రారంభించింది. ఈ సందర్భంగా ఆఫర్లు ప్రకటించింది. బంగారు నగలు కొనుగోలు చేసే కస్టమర్లు అంతే సమానమైన బరువులో వెండి ఉచితంగా పొందవచ్చు. స్వర్ణాభరణాల మార్పిడిపై గ్రాముకు రూ.50 అదనంగా అందుకోవచ్చు. వజ్రాలపై క్యారెట్‌కు 25 గ్రాముల వెండి ఉచితం. వెండి వస్తువుల తయారీ చార్జీలపై 25%, వెండి ఆభరణాల గరిష్ట విక్రయ ధర(ఎంఆర్‌పీ)పై 10% తగ్గింపు ఇస్తుంది. కొత్త షోరూం ప్రారంభం ద్వారా సికింద్రాబాద్‌లోని కస్టమర్లకు అసమానమైన ఆభరణాల షాపింగ్ అనుభవాన్ని అందించాలనే తమ లక్ష్యమని సంస్థ ఎండీ ఆనంద్ అనంత్ పద్మనాభన్ తెలిపారు.

ఐఫోన్ల తయారీలోకి టాటా గ్రూప్

విస్ట్రన్ ఇన్ఫోకామ్ కొనుగోలు ● ఆమోదం తెలిపిన విస్ట్రన్ కార్ప్



న్యూఢిల్లీ: ఐఫోన్ల తయారీలోకి టాటా గ్రూప్ ఎంట్రీ ఇస్తోంది. తద్వారా ఈ ఘనత సాధించిన తొలి భారతీయ కంపెనీగా టాటా నిలవనుంది. ఐఫోన్ల తయారీలో ఉన్న విస్ట్రన్ ఇన్ఫోకామ్ మాన్యుఫాక్చరింగ్‌ను (ఇండియా) టాటా గ్రూప్‌నకు విక్రయించేందుకు తైవాన్‌కు చెందిన విస్ట్రన్ కార్ప్ బోర్డ్ శుక్రవారం ఆమోదం తెలిపింది. ఈ డీల్ విలువ రూ.1,040 కోట్లు. ఈ మేరకు టాటా ఎలక్ట్రానిక్స్‌తో విస్ట్రన్ కార్ప్ అనుబంధ కంపెనీలైన ఎస్ఎంఎస్ ఇన్ఫోకామ్ (సింగపూర్), విస్ట్రన్ హాంగ్ కాంగ్ మధ్య వాటాల విక్రయ ఒప్పందం కుదిరింది. విస్ట్రన్ ఇన్ఫోకామ్ మాన్యుఫాక్చరింగ్‌కు బెంగళూరు సమీపంలో అసెంబ్లింగ్ ప్లాంట్ ఉంది. 10,000 పైచిలుకు సిబ్బంది ఇక్కడ పనిచేస్తున్నారు. ఈ కేంద్రంలో ఐఫోన్ 14 సైతం తయారవుతోంది.

డాక్టర్ రెడ్డీస్ లాభం జూమ్



న్యూఢిల్లీ: హెల్త్‌కేర్ రంగ దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ రెండో త్రైమాసికంలో మంచి ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం 33 శాతం జంప్‌చేసి రూ. 1,482 కోట్లను అధిగమించింది. యూఎస్ జనరిక్స్ మార్కెట్ ఇందుకు సహకరించింది. 2022-23 ఇదే కాలంలో రూ. 1,114 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 9 శాతం ఎగసి రూ. 6,903 కోట్లకు చేరింది. అయితే మొత్తం వ్యయాలు 11 శాతం పెరిగి రూ.5,305 కోట్లను తాకాయి. కాగా.. మొత్తం టర్నోవర్ 13 శాతం పుంజుకుని రూ. 7,218 కోట్లకు చేరింది. ఒక త్రైమాసికానికి కంపెనీ చరిత్రలోనే అత్యధిక ఆదాయం, నికర లాభాలు ఆర్జించినట్లు కంపెనీ సహచైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ పేర్కొన్నారు.

డాక్టర్ రెడ్డీస్ షేరు బీఎస్‌ఈలో 0.7 శాతం నీరసించి రూ. 5,386 వద్ద ముగిసింది.

ఆరు రోజుల నష్టాలకు బ్రేక్

కనిష్ట స్థాయిల వద్ద కొనుగోళ్లు ● ఒక శాతం పెరిగిన సూచీలు



ముంబై: స్టాక్ సూచీల ఆరు రోజుల వరుస నష్టాలకు అడ్డుకట్ట పడింది. ఇటీవల పతనంలో భాగంగా కనిష్టాలకు దిగివచ్చిన ఆటో, ఐటీ, ఫైనాన్స్, ఇంధన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల రికవరీ నుంచి సానుకూల సంకేతాలు అందాయి. ఫలితంగా శుక్రవారం సెన్సెక్స్ 635 పాయింట్లు పెరిగి 63,783 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 202 పాయింట్లు బలపడి 19,060 వద్ద నిలిచింది. భారీ లాభాలతో మొదలైన సూచీలు రోజంతా అదే జోరు కనబరిచాయి. ఒక దశలో సెన్సెక్స్ 765 పాయింట్లు బలపడి 63,913, నిఫ్టీ 219 పాయింట్లు బలపడి 19,076 ఇంట్రాడే గరిష్టాలను చూశాయి.

- దీపావళి నాడు గంట పాటు జరిగే 'మూహరత్ ట్రేడింగ్' నవంబర్ 12న నిర్వహిస్తున్నట్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలు తెలిపాయి. సాయంత్రం 6:15 గంటల నుంచి 7.15 గంటల వరకు ఈ ప్రత్యేక ట్రేడింగ్ జరుగుతుందన్నాయి. ఈ ఘడియల్లో షేర్లు కొనుగోలు చేస్తే మంచి లాభాలు గడిస్తామని మార్కెట్ వర్గాల నమ్మకం. అలాగే బలప్రతిపాద సందర్భంగా నవంబర్ 14న ఎక్స్ఛేంజీలు పనిచేయవు.
- సెన్సెక్స్ ఒక శాతం ర్యాలీతో బీఎస్ఈలో రూ.4.41 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగి రూ. 310 లక్షల కోట్లకు చేరింది.

ఆర్ఐఎల్ భేష్

క్యూ2 నికర లాభం రూ. 17,394 కోట్లు ● పెట్టుబడి వ్యయాలు రూ. 38,815 కోట్లు



> అన్ని విభాగాల పటిష్ట నిర్వహణ, ఆర్థిక పనితీరు కారణంగా తాజా త్రైమాసికంలోనూ రిలయన్స్ ఇండస్ట్రీస్ భారీ వృద్ధిని సాధించింది. జియోఎయిర్‌ఫైబర్, జియోభారత్ ఫోన్ ద్వారా డిజిటల్ ఇండియా విజన్‌కు రిలయన్స్ జియో కట్టుబడి ఉంది. విభిన్న ప్రొడక్టులు, ఆఫరింగ్స్ ద్వారా రిలయన్స్ రిటైల్ అటు ఆఫ్‌లైన్, ఇటు ఆన్‌లైన్ విభాగాల్లో వేగంగా విస్తరిస్తోంది.
>
> - ముకేశ్ అంబానీ, చైర్మన్, ఎండీ, రిలయన్స్ ఇండస్ట్రీస్

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) రెండో త్రైమాసికంలో రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్ఐఎల్) ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన నికర లాభం 27 శాతం జంప్‌చేసి రూ. 17,394 కోట్లను తాకింది. చమురు, గ్యాస్ బిజినెస్ తిరిగి పుంజుకోవడం, ఫ్యాషన్, గ్రోసరీ కారణంగా రిటైల్ ఆదాయం బలపడటం దీనికి కారణం. 2022-23 ఇదే కాలంలో రూ. 13,656 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం దాదాపు యథాతథంగా రూ. 2.55 లక్షల కోట్లుగా నమోదైంది. అధిక వడ్డీ రేట్లు, లోన్ బ్యాలన్స్ కారణంగా ఫైనాన్స్ వ్యయాలు 26% పెరిగి రూ. 5,731 కోట్లకు చేరాయి. తరుగుదల, అమార్టైజేషన్ తదితర వ్యయాలు 30% అధికమై రూ. 12,585 కోట్లను తాకాయి. అన్ని బిజినెస్ ఆస్తులనూ విస్తరించడం, డిజిటల్ సర్వీసుల బిజినెస్‌కు హైయర్ నెట్‌వర్క్ వినియోగం ప్రభావం చూపాయి. అయితే నిర్వహణ లాభం(ఇబిటా) 30% ఎగసి రూ. 44,867 కోట్లయ్యింది. దీనిలో చమురు శుద్ధి, పెట్రోకెమికల్ ఇబిటా 36% వృద్ధితో రూ. 16,281 కోట్లను తాకింది. కేజీ డీ6 బ్లాకులో గ్యాస్ ఉత్పత్తి పెరిగిన నేపథ్యంలో ఆయిల్, గ్యాస్ ఇబిటా 50% జంప్‌చేసి రూ. 4,766 కోట్లను తాకింది. సెప్టెంబర్‌కల్లా రుణ భారం రూ. 3.18 లక్షల కోట్ల నుంచి రూ. 2.95 లక్షల కోట్లకు తగ్గినట్లు కంపెనీ వెల్లడించింది. ఈ కాలంలో దేశవ్యాప్త 5జీ సేవలు ప్రారంభించిన నేపథ్యంలో రూ. 38,815 కోట్ల పెట్టుబడులు వెచ్చించింది.

ఫలితాల నేపథ్యంలో ఆర్ఐఎల్ షేరు బీఎస్ఈలో 2% ఎగసి రూ. 2,265 వద్ద ముగిసింది.

జియో ఇన్ఫోకామ్ జోరు

ఈ ఏడాది క్యూ2లో ఆర్ఐఎల్ డిజిటల్ సర్వీసుల విభాగం జియో ఇన్ఫోకామ్ నికర లాభం 12 శాతం మెరుగుపడి రూ. 5,297 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం 11 శాతం పుంజుకుని రూ. 26,785 కోట్లకు చేరింది. రిలయన్స్ జియో మాతృ సంస్థ జియో ప్లాట్‌ఫామ్స్ వినియోగదారుల సంఖ్య 7.5 శాతం(1.11 కోట్లు) పెరిగి 45.97 కోట్లను తాకింది. ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం(ఏఆర్‌పీయూ) 2.5 శాతం మెరుగై రూ. 181.7కు చేరింది.

రిలయన్స్ రిటైల్ భళా..

ఆర్ఐఎల్ రిటైల్ విభాగం.. రిలయన్స్ రిటైల్ వెంచర్ క్యూ2లో నికర లాభం 21 శాతం ఎగసి రూ. 2,790 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం 20 శాతం వృద్ధితో రూ. 68,937 కోట్లకు చేరింది. కొత్త స్టోర్ల ప్రారంభం, సందర్శకులు పెరగడం, వివిధ విభాగాలలో పుంజుకున్న వినియోగం ఇందుకు దోహదపడ్డాయి. వెరసి స్థూల టర్నోవర్ 19% పెరిగి రూ. 77,148 కోట్లయ్యింది. ఈ కాలంలో 471 కొత్త స్టోర్లను జత చేసుకుంది. మొత్తం స్టోర్ల సంఖ్య 18,650కు చేరింది.

ముకేశ్ వారసులకు గ్రీన్‌సిగ్నల్



దిగ్గజ పారిశ్రామికవేత్త ముకేశ్ అంబానీ వారసులు రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో పదవులు చేపట్టేందుకు వాటాదారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. బోర్డులో సభ్యులయ్యేందుకు కవలలు ఆకాశ్, ఈషా 98 శాతానికిమించి ఓట్లను పొందగా.. అనంత్‌కు 92.7 శాతం మద్దతు లభించింది. 28ఏళ్ల అనంత్‌పట్ల ప్రాగ్జీ అడ్వయిజరీ సంస్థల వ్యతిరేకత కొంత ప్రభావం చూపినట్లు ఆర్ఐఎల్ పేర్కొంది. ఆగస్ట్‌లో కంపెనీ చైర్మన్ ముకేశ్ అంబానీ ఆర్ఐఎల్ బోర్డులో తన వారసులకు చోటు కల్పిస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా మరో ఐదేళ్లపాటు చైర్మన్, సీఈవోగా కొనసాగనున్నట్లు తెలియజేశారు. తద్వారా తదుపరి తరం యువనేతలకు మార్గదర్శకత్వం వహించనున్నట్లు తెలియజేశారు. ఆపై కంపెనీ పోస్టల్ బ్యాలట్ ద్వారా ఇందుకు వాటాదారుల అనుమతిని కోరింది. ఆకాశ్, ఈషాకు 98 శాతానికిపైగా ఓట్లు లభించగా.. చిన్న వయసు కారణంగా అనంత్‌కు 7.24 శాతం(41.58 కోట్ల ఓట్లు) వ్యతిరేకంగా రావడంతో 92.75 శాతం మద్దతు లభించినట్లు కంపెనీ వివరించింది.

మారుతీ లాభాల రికార్డ్

క్యూ2లో రూ. 3,717 కోట్లు ● వాహన అమ్మకాలు సైతం దూకుడు



ముంబై: కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) రెండో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై-సెప్టెంబర్‌లో నికర లాభం 80 శాతం దూసుకెళ్లి రూ. 3,717 కోట్లకు చేరింది. ఒక త్రైమాసికంలో ఇది కంపెనీ చరిత్రలోనే అత్యధికం కాగా.. ఇందుకు ఊపందుకున్న అమ్మకాలు, కమోడిటీ ధరలు క్షీణత, వ్యయ నియంత్రణలు, ఇతర ఆదాయంలో వృద్ధి సహకరించాయి. 2022-23 ఇదే కాలంలో రూ. 2,062 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 28,544 కోట్ల నుంచి రూ. 35,535 కోట్లకు జంప్ చేసింది. వాహన అమ్మకాల విక్రయాలు 5,17,395 యూనిట్ల నుంచి 5,52,055 యూనిట్లకు ఎగశాయి. వీటిలో 6 శాతం వృద్ధితో దేశీయంగా 4,82,731 యూనిట్లను విక్రయించింది. వెరసి అమ్మకాలలోనూ కొత్త రికార్డు నెలకొల్పింది. ఈ బాటలో 10 శాతం అధికంగా 69,324 వాహనాలను ఎగుమతి చేసింది.



మళ్లీ చిన్న కార్ల జోరు

> జోరులో ఉన్న ఆర్థిక వ్యవస్థ, పెరుగుతున్న ఆదాయాల నేపథ్యంలో ప్రస్తుత వృద్ధి నమోదవుతోంది. దీని ప్రకారం చౌక ధరల అంశం వెనుకబడినట్లే. ఇందువల్లనే చిన్న కార్ల అమ్మకాలు తగ్గుతున్నాయ్. అయితే రెండు, మూడేళ్ల తదుపరి తిరిగి మార్కెట్లు చౌక ధరలు, చిన్న కార్లవైపు దృష్టి సారించే అవకాశముంది.
>
> – ఆర్‌సీ భార్గవ, చైర్మన్, మారుతీ సుజుకీ ఇండియా

ఫలితాల నేపథ్యంలో మారుతీ షేరు ఎన్ఎస్ఈలో 1.2 శాతం బలపడి రూ. 10,553 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

28-10-2023	
విశాఖ	540-00
చిత్తూరు	573-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	531-00
విజయవాడ	531-00
రిటైల్ ధర (డజను)	72.00
27-10-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	518-00
వరంగల్	520-00
రిటైల్ ధర	5.80

సాక్షి
స్పోర్ట్స్



రితిక 'పసిడి' పట్టు

ప్రపంచ అండర్-23 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించిన తొలి భారతీయ మహిళా రెజ్లర్‌గా రితిక హుడా చరిత్ర సృష్టించింది. అల్బేనియాలో జరుగుతున్న ఈ టోర్నీలో హరియాణాకు చెందిన 21 ఏళ్ల రితిక మహిళల 76 కేజీల విభాగం ఫైనల్లో 9-2 పాయింట్లతో కెన్నడీ అలెక్సిస్ బ్లేడ్స్ (అమెరికా)పై గెలిచింది. 72 కేజీల విభాగంలో జ్యోతి ఫైనల్‌కు అర్హత సాధించింది.

భారత్, పాక్ హాకీ మ్యాచ్ 'డ్రా'

సుల్తాన్ ఆఫ్ జొహోర్ కప్ జూనియర్ పురుషుల హాకీ టోర్నమెంట్‌ను డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు 'డ్రా'తో ప్రారంభించింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్ జట్టుతో మలేసియాలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌ను భారత జట్టు 3-3 గోల్స్‌తో 'డ్రా'గా ముగించింది. భారత్ తరఫున అమన్‌దీప్ (30వ ని.లో), ఆదిత్య (56వ ని.లో), ఉత్తమ్ సింగ్ (59వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. పాకిస్తాన్ జట్టు తరఫున అర్బాజ్ (31వ, 58వ ని.లో) రెండు గోల్స్, అబ్దుల్ (49వ ని.లో) ఒక గోల్ సాధించారు.

ఉత్కంఠను దాటి...



షమ్సీ, కేశవ్ మహరాజ్ గెలుపు సంబరం

పాకిస్తాన్‌పై ఒక వికెట్ తేడాతో గట్టెక్కిన దక్షిణాఫ్రికా

హోరాహోరీగా సాగిన పోరు ● సఫారీని గెలిపించిన షమ్సీ, మార్క్‌రమ్

చెన్నై: ఒక్కో బంతి, ఒక్కో పరుగుకు గుండెచప్పుడు పెరుగుతుంటే... మరోసారి 'చోకర్స్' అనిపించుకోరాదని దక్షిణాఫ్రికా ఒకవైపు... ఈ అవకాశం పోతే వన్డే వరల్డ్‌కప్‌లో తమ ఖేల్ ఖతమ్ అని తెలుసు కాబట్టి ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో పాకిస్తాన్ మరోవైపు... వరల్డ్ కప్ 26వ మ్యాచ్ అభిమానులకు అత్యంత ఉత్కంఠను పెంచి ఆసక్తికరంగా ముగిసింది. విజయానికి చేరువైన దశలో 10 పరుగుల వ్యవధిలో 3 వికెట్లు కోల్పోవడం సఫారీ టీమ్‌లో ఆందోళన పెంచగా... ఆఖరి వికెట్ తీసేందుకు 11 బంతులు పోరాడిన పాక్ చివరకు తలవంచింది. 17 బంతుల్లో 4 పరుగులు కావాల్సి ఉండగా ఒత్తిడిని అధిగమించి కేశవ్ మహరాజ్ కొట్టిన బౌండరీతో ఆట ముగిసింది. శుక్రవారం హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ఒక వికెట్ తేడాతో పాకిస్తాన్‌ను ఓడించింది. ముందుగా పాక్ 46.4 ఓవర్లలో 270 పరుగులకు ఆలౌటైంది. సౌద్ షకీల్ (52 బంతుల్లో 52; 7 ఫోర్లు), బాబర్ ఆజమ్ (65 బంతుల్లో 50; 4 ఫోర్లు, 1 సిక్స్), షాదాబ్ ఖాన్ (36 బంతుల్లో 43; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ప్రదర్శన చేశారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' తబ్రేజ్ షమ్సీకి 4 వికెట్లు దక్కాయి. అనంతరం దక్షిణాఫ్రికా 47.2 ఓవర్లలో 9 వికెట్లకు 271 పరుగులు చేసి గెలిచింది. మార్క్‌రమ్ (93 బంతుల్లో 91; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈ ఓటమితో పాకిస్తాన్ సెమీఫైనల్ చేరే అవకాశాలను దాదాపుగా కోల్పోయింది.

కీలక భాగస్వామ్యం...

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్తాన్‌కు మరోసారి సరైన ఆరంభం లభించలేదు. ఓపెనర్లు అబ్దుల్లా (9), ఇమామ్ (12) సమష్టిగా విఫలమయ్యారు. తొలి బంతికే జాన్సెన్ రిటర్న్ క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన రిజ్వాన్ (27 బంతుల్లో 31; 4 ఫోర్లు, 1 సిక్స్) కొన్ని చక్కటి షాట్లు ఆడాడు. అయితే రిజ్వాన్, ఇఫ్తికార్ (21)లను తక్కువ వ్యవధిలో అవుట్ చేసి దక్షిణాఫ్రికా పైచేయి సాధించింది. మరోవైపు తడబడుతూనే ఆడిన బాబర్ 64 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకొని అదే స్కోరు వద్ద వెనుదిరిగాడు. 141/5 స్కోరుతో పాక్ కుప్పకూలడం ఖాయమనిపించింది. ఈ దశలో షాదాబ్, షకీల్ కలిసి జట్టును ఆదుకున్నారు. చక్కటి సమన్వయంతో పాటు వీరిద్దరు ధాటిగా బ్యాటింగ్ చేశారు. ఆరో వికెట్‌కు షకీల్‌తో కలిసి 84 పరుగులు (71 బంతుల్లో) జోడించిన అనంతరం షాదాబ్ పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత 50 బంతుల్లో షకీల్ హాఫ్ సెంచరీ పూర్తయింది. కానీ అతను అవుటైన తర్వాత పరుగులు జోడించడంలో పాక్ విఫలమైంది. 30 పరుగుల వ్యవధిలో జట్టు చివరి 4 వికెట్లు కోల్పోగా మరో 20 బంతులు మిగిలి ఉండగానే ఇన్నింగ్స్ ముగిసింది.



నిరాశలో పాకిస్తాన్ కెప్టెన్ బాబర్ ఆజమ్



మార్క్‌రమ్

రాణించిన మార్క్‌రమ్...

ఛేదనను దక్షిణాఫ్రికా దూకుడుగా మొదలు పెట్టింది. షాహిన్ వేసిన రెండో ఓవర్లో డికాక్ (14 బంతుల్లో 24; 5 ఫోర్లు) నాలుగు ఫోర్లు బాదగా, బవుమా (27 బంతుల్లో 28; 4 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. వీరిద్దరితో పాటు వివాదాస్పద డీఆర్‌ఎస్ నిర్ణయానికి డసెన్ (21), ఫామ్‌లో ఉన్న క్లాసెన్ (12) కూడా వెనుదిరగడంతో పాక్ జట్టులో ఆశలు రేగాయి. అయితే మార్క్‌రమ్, మిల్లర్ (29) కలిసి పరిస్థితిని చక్కదిద్దారు. తమ సహజశైలిలో వీరు ధాటిగా ఆడటంతో సఫారీ జట్టు గెలుపు దిశగా దూసుకుపోయింది. వీరిద్దరు ఐదో వికెట్‌కు 70 పరుగులు జత చేశారు. అయితే లక్ష్యానికి చేరువవుతున్న దశలో పాక్ బౌలర్లు చెలరేగడంతో టీమ్ తక్కువ వ్యవధిలో వరుస వికెట్లు కోల్పోయింది. 59 బంతుల్లో కేవలం 21 పరుగులు చేయాల్సిన దశలో మార్క్‌రమ్ అవుట్ కావడంతో మ్యాచ్ ఉత్కంఠభరిత ముగింపు వైపు సాగింది. ఫీల్డింగ్‌లో తలకు గాయం కావడంతో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ 15వ ఓవర్లో పాక్ బౌలర్ షాదాబ్ మైదానం వీడగా... 'కన్‌కషన్ సబ్‌స్టిట్యూట్'గా ఉసామా మీర్ బరిలోకి దిగాడు. వరల్డ్ కప్‌లో ఇదే తొలి 'కన్‌కషన్ సబ్‌స్టిట్యూట్' ఘటన కావడం విశేషం.

స్కోరు వివరాలు

పాకిస్తాన్ ఇన్నింగ్స్: అబ్దుల్లా (సి) ఎన్‌గిడి (బి) జాన్సెన్ 9; ఇమామ్ (సి) క్లాసెన్ (బి) జాన్సెన్ 12; బాబర్ (సి) డికాక్ (బి) షమ్సీ 50; రిజ్వాన్ (సి) డికాక్ (బి) కొయెట్జి 31; ఇఫ్తికార్ (సి) క్లాసెన్ (బి) షమ్సీ 21; షకీల్ (సి) డికాక్ (బి) షమ్సీ 52; షాదాబ్ (సి) మహరాజ్ (బి) కోయెట్జి 43; నవాజ్ (సి) మిల్లర్ (బి) జాన్సెన్ 24; షాహిన్ (సి) మహరాజ్ (బి) షమ్సీ 2; వసీమ్ (సి) డికాక్ (బి) ఎన్‌గిడి 7; రవూఫ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (46.4 ఓవర్లలో ఆలౌట్) 270. వికెట్ల పతనం:** 1-20, 2-38, 3-86, 4-129, 5-141, 6-225, 7-240, 8-259, 9-268, 10-270. **బౌలింగ్:** జాన్సెన్ 9-1-43-3, ఎన్‌గిడి 7.4-0-45-1, మార్క్ రమ్ 4-0-20-0, మహరాజ్ 9-0-56-0, కోయెట్జి 7-0-42-2, షమ్సీ 10-0-60-4.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: బవుమా (సి) షకీల్ (బి) వసీమ్ 28; డికాక్ (సి) వసీమ్ (బి) షాహిన్ 24; డసెన్ (ఎల్బీ) (బి) ఉసామా 21; మార్క్‌రమ్ (సి) బాబర్ (బి) ఉసామా 91; క్లాసెన్ (సి) ఉసామా (బి) వసీమ్ 12; మిల్లర్ (సి) రిజ్వాన్ (బి) షాహిన్ 29; జాన్సెన్ (సి) బాబర్ (బి) రవూఫ్ 20; కోయెట్జి (సి) రిజ్వాన్ (బి) షాహిన్ 10; మహరాజ్ (నాటౌట్) 7; ఎన్‌గిడి (సి) అండ్ (బి) రవూఫ్ 4; షమ్సీ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 21; **మొత్తం (47.2 ఓవర్లలో 9 వికెట్లకు) 271. వికెట్ల పతనం:** 1-34, 2-67, 3-121, 4-136, 5-206, 6-235, 7-250, 8-250, 9-260. **బౌలింగ్:** ఇఫ్తికార్ 3-0-23-0, షాహిన్ అఫ్రిది 10-0-45-3, నవాజ్ 6.2-0-40-0, రవూఫ్ 10-0-62-2, వసీమ్ 10-1-50-2, ఉసామా 8-0-45-2.

ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా X న్యూజిలాండ్
వేదిక: ధర్మశాల
ఉదయం గం. 10:30 నుంచి

బంగ్లాదేశ్ X నెదర్లాండ్స్
వేదిక: కోల్‌కతా

మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
దక్షిణాఫ్రికా	6	5	1	10	2.032
భారత్	5	5	0	10	1.353
న్యూజిలాండ్	5	4	1	8	1.481
ఆస్ట్రేలియా	5	3	2	6	1.193
శ్రీలంక	5	2	3	4	-0.025
పాకిస్తాన్	6	2	4	4	-0.387
అఫ్గానిస్తాన్	5	2	3	4	-0.969
బంగ్లాదేశ్	5	1	4	2	-1.253
ఇంగ్లండ్	5	1	4	2	-1.634
నెదర్లాండ్స్	5	1	4	2	-1.902

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

శీతల్ డబుల్ ధమాకా

- రెండు చేతుల్లేకపోయినా రెండు స్వర్ణాలు నెగ్గిన భారత ఆర్చర్
- ఆసియా పారా క్రీడల్లో భారత్‌కు 99 పతకాలు



హాంగ్జౌ: తన వైకల్యమే కుంగిపోయేలా... ఆత్మవిశ్వాసానికి నిలువుటద్దంలా భారత క్రీడాకారిణి శీతల్ దేవి ఆసియా పారా క్రీడల్లో పతకాల 'హ్యాట్రిక్' సాధించింది. కశ్మీర్‌కు చెందిన 16 ఏళ్ల ఈ టీనేజ్ ఆర్చర్‌కు రెండు చేతులు భుజాల నుంచే లేవు. మరి రెండు చేతులు తప్పక కావాల్సిన విలువిద్యలో ఆమె పతకాలపై గురిపెట్టడం ఏంటని ఆశ్చర్యం కలుగకమానదు. శీతల్ కాళ్లతో విల్లును నిటారుగా నిలబెట్టి, నోటితో బాణాన్ని లాగిపట్టి... లక్ష్యంపై గురిపెట్టే ఆమె ప్రావీణ్యానికి జేజేలు పలకాల్సిందే! ఆమె ప్రదర్శన ముందు వైకల్యం పూర్తిగా ఓడిపోయింది. ఈ ఆసియా పారా క్రీడల్లో రెండు స్వర్ణాలు, ఒక రజతంతో ఆమె 'హ్యాట్రిక్' సాధించింది. ఇంతకుముందు మహిళల కాంపౌండ్ టీమ్ విభాగంలో రజతం నెగ్గిన ఆమె రాకేశ్ కుమార్‌తో కలిసి గురువారం మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో స్వర్ణం సాధించింది. శుక్రవారం జరిగిన వ్యక్తిగత విభాగం ఫైనల్లో శీతల్ దేవి 144-142తో అలీమ్ నూర్ సియాదా (సింగపూర్)పై గెలిచింది. తద్వారా ఒకే ఆసియా పారా ఈవెంట్‌లో రెండు బంగారు పతకాలు గెలిచిన తొలి భారత మహిళా అథ్లెట్‌గా రికార్డుల్లోకెక్కింది. ఇదే ఈవెంట్‌లో అంకుర్ రెండు స్వర్ణాలతో పురుష అథ్లెట్‌గా నిలిచాడు. శుక్రవారం పారాలింపిక్ చాంపియన్ అయిన షట్లర్ ప్రమోద్ భగత్, మహిళల్లో తులసిమతి మురుగేశన్, పురుషుల డబుల్స్‌లో నితేశ్-తరుణ్ జోడీ బంగారు పతకాలు సాధించారు. ఒక్క బ్యాడ్మింటన్‌లోనే భారత్ ఖాతాలో తొమ్మిది పతకాలు చేరడం విశేషం. ప్రస్తుతం భారత్ 25 స్వర్ణాలు, 29 రజతాలు, 45 కాంస్యాలతో కలిపి మొత్తం 99 పతకాలతో ఆరో స్థానంలో ఉంది. నేటితో ముగియనున్న ఈ క్రీడల్లో భారత్ అధికారికంగా 100 పతకాల మైలురాయిని తొలిసారి దాటనుంది.

భారీ విజయంతో భారత్ శుభారంభం



సంగీత

రాంచీ: ఆసియా మహిళల హాకీ చాంపియన్స్ ట్రోఫీ టోర్నమెంట్‌లో భారత జట్టు భారీ విజయంతో బోణీ కొట్టింది. థాయ్‌లాండ్ జట్టుతో శుక్రవారం జరిగిన తమ తొలి లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 7-1తో నెగ్గింది. భారత్ తరఫున సంగీత కుమారి (29వ, 45వ, 45వ ని.లో) మూడు గోల్స్ చేయగా... మోనిక (7వ ని.లో), లాల్‌రెమ్‌సియామి (52వ ని.లో), సలీమా టెటె (15వ ని.లో), దీపిక (40వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు.

భారత షూటర్ల జోరు

రెండు ఒలింపిక్ బెర్త్‌లు సాధించిన అర్జున్, తిలోత్తమ



చాంగ్వాన్ (కొరియా): ఆసియా చాంపియన్‌షిప్‌లో భారత రైఫిల్ షూటర్లు అర్జున్ బబుతా, తిలోత్తమ సేన్ రజత పతకాలు సాధించారు. ఈ ప్రదర్శనతో భారత్‌కు రెండు ఒలింపిక్స్ కోటా బెర్త్‌లు దక్కాయి. ఇప్పటికే భారత షూటర్లు 8 బెర్తులు పొందారు. దీంతో వచ్చే ఏడాది పారిస్‌కు పయనమయ్యే షూటర్ల సంఖ్య పదికి చేరింది. శుక్రవారం జరిగిన పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్లో 24 ఏళ్ల అర్జున్ 251.2 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. మహిళల 10 మీటర్ల ఎయిర్‌రైఫిల్ ఫైనల్లో 15 ఏళ్ల తిలోత్తమ (252.3 పాయింట్లు) త్రుటిలో స్వర్ణం కోల్పోయింది. కొరియన్ షూటర్ కోన్ ఎంజీ (252.4) 0.1 తేడాతో బంగారం గెలుచుకుంది. ఇదే విభాగంలో టీమ్ ఈవెంట్‌లో అర్జున్, దివ్యాన్ష్, హృదయ్ హజారికా (1892.4 పాయింట్లు) త్రయం బంగారు పతకం గెలిచింది. తిలోత్తమ, శ్రీయాంక, రమితలతో కూడిన మహిళల బృందం కాంస్యంతో సంతృప్తి చెందింది. సీనియర్ స్కీట్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో అనంత్‌జీత్ సింగ్, దర్శన రాథోడ్ జోడీ 139 పాయింట్లతో స్వర్ణం గెలిచింది.

క్లుప్తంగా...



తిరుమల వెంకటేశ్వరుడిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి జస్టిస్ నగేష్ భీమపాక

నేడు యాదాద్రి ఆలయం మూసివేత

యాదగిరిగుట్ట: చంద్రగ్రహణం సందర్భంగా శనివారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రాన్ని మూసివేయనున్నట్లు ఆచార్యులు శుక్రవారం వెల్లడించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు భక్తులకు శ్రీస్వామివారి దర్శనం కల్పించడంతో పాటు తిరువారాధన, నివేదన, శయనోత్సవ కార్యక్రమాలు ముగించి ఆలయాన్ని ద్వారబంధనం చేయనున్నట్లు వెల్లడించారు. తిరిగి ఆదివారం వేకువజామున యథావిధిగా ఆలయాన్ని తెరుస్తామన్నారు. పుష్కరణ శుద్ధితో పాటు ఆలయాన్ని సంప్రోక్షణ చేసిన అనంతరం సుప్రభాతం, అభిషేకం, అర్చన, శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్య కల్యాణం వంటి పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ తర్వాత భక్తులను దర్శనానికి అనుమతించనున్నారు. ఆన్‌లైన్ టికెట్లు నిలుపుదల చేయాలని సంబంధిత విభాగాలను ఆదేశించినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. వీటితో పాటు సత్యనారాయణస్వామి వ్రత మండపం, కల్యాణ కట్టను సాయంత్రం 4 గంటల నుంచి మూసివేస్తామన్నారు.

సెల్‌ఫోన్ల రికవరీలో తెలంగాణ టాప్

ఆరు నెలల్లో 10,018 మొబైల్ ఫోన్లు యజమానులకు అప్పగింత



సాక్షి, హైదరాబాద్: పోగొట్టుకున్న, చోరీకి గురైన మొబైల్ ఫోన్ల రికవరీలో దేశవ్యాప్తంగా తెలంగాణ నంబర్‌వన్ స్థానంలో నిలిచినట్టు సీఐడీ అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 20 నుంచి అక్టోబర్ 26 వరకు 10,018 మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) సాంకేతికతతో గుర్తించి, వాటిని తిరిగి యజమానులకు అందజేసినట్టు పేర్కొన్నారు. ఈ సీఈఐఆర్ టెక్నాలజీ వాడటంతో 39 శాతం మొబైల్ ఫోన్లు రికవరీ చేశామని, మరో 86,395 మొబైల్ ఫోన్లు సీఈఐఆర్ పోర్టల్‌లో బ్లాక్ చేశామని తెలిపారు. మొబైల్ ఫోన్ల రికవరీకి చర్యలు తీసుకుంటున్న సీఐడీ సైబర్ క్రైం ఎస్పీ డాక్టర్ లావణ్య, ఇతర అధికారులను డీజీపీ అంజనీకుమార్, అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ అభినందించారు.

నేడు పాస్‌పోర్టు స్పెషల్ డ్రైవ్

రాంగోపాల్‌పేట్ (హైదరాబాద్): పాస్‌పోర్టు అపాయింట్‌మెంట్ల కోసం సుదీర్ఘకాలం వేచి చూడకుండా ఈ నెల 28న ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయ పరిధిలోని 5 పాస్‌పోర్టు సేవా కేంద్రాలు, 7 పోస్టాఫీస్ పాస్‌పోర్టు సేవా కేంద్రాల్లో స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని తెలిపారు. 3,348 అపాయింట్‌మెంట్లను విడుదల చేయగా, 3,296 అపాయింట్‌మెంట్లను దరఖాస్తుదారులు బుక్ చేసుకున్నట్లు వివరించారు.

రికార్డుల్లోకి నటుడు మోహన్‌బాబు స్మార్ట్ కిచెన్

సాక్షి, హైదరాబాద్: నటుడు ఎం.మోహన్‌బాబు సారథ్యంలోని విశ్వవిద్యాలయం విద్యాసంస్థలో ఏర్పాటు చేసిన స్మార్ట్ కిచెన్ రికార్డుల్లో కెక్కింది. అతిపెద్ద వంట సౌకర్యం కలిగిన ఆటోమేటెడ్ కిచెన్‌గా గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించింది. ఈ విషయాన్ని వర్సిటీ నగర ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. ఈ కిచెన్.. 15 వేలకు పైగా విద్యార్థులు, 900 మందికిపైగా అధ్యాపకులు, సిబ్బందికి సేవలు అందించేలా రూపుదిద్దుకుందని వివరించారు. 10 నిమిషాల్లోపే 1,000 కిలోల రైస్‌ని సిద్ధం చేయవచ్చని తెలిపారు.

హంద్రీనీవా రెండో దశను అడ్డుకోండి

సాక్షి, హైదరాబాద్: హంద్రీనీవా సుజల స్రవంతి రెండో దశలో భాగంగా ఎత్తిపోతల ద్వారా 58 చెరువులను నింపడానికి ఏపీ ప్రభుత్వం టెండర్లు పిలిచిందని, అక్కడ పనులు చేపట్టకుండా అడ్డుకోవాలని తెలంగాణ ప్రభుత్వం కృష్ణా బోర్డుకు లేఖ రాసింది. ఈ మేరకు బోర్డు చైర్మన్ శివ్‌నందన్‌కుమార్‌కు తెలంగాణ ఈఎన్‌సీ (సాధారణ) మురళీధర్ లేఖ రాశారు. అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గంలోని గుమ్మఘట్ట రాయదుర్గం, డీ.హీరేలాల్, కనేకల్ మండలాల్లో 4,100 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు ఎలాంటి అనుమతులు లేకుండా ఏపీ ప్రభుత్వం టెండర్లు పిలిచిందని పేర్కొన్నారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం కొత్తగా ఏ ప్రాజెక్టు చేపట్టాలన్నా సీడబ్ల్యూసీతోపాటు కేఆర్ఎంబీ, అపెక్స్ కౌన్సిల్ అనుమతి అవసరమని గుర్తుచేశారు.

పేదల హక్కులు కాపాడండి

నూతన చట్టాలు, రాజ్యాంగ స్ఫూర్తితో విధులు చేపట్టండి

- సాంకేతికంగా మరింత పట్టు సాధించండి
- యువ ఐపీఎస్‌ల పాసింగ్ అవుట్ పరేడ్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా



యువ ఐపీఎస్‌ల గౌరవ వందనం స్వీకరిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా

సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగం కల్పించిన హక్కులు, అధికారాలను దేశంలోని ప్రతి పేదకు దక్కేలా చట్టాన్ని అమలు చేయాలని యువ ఐపీఎస్ అధికారులకు కేంద్ర హోంమంత్రి దిశానిర్దేశం చేశారు. బ్రిటిష్ చట్టాలను మార్చి ప్రజల రక్షణే ధ్యేయంగా నూతన ఆశయాలు, విశ్వాసాలతో ఐపీసీ, సీఆర్పీసీ, ఎవిడెన్స్ యాక్ట్‌లలో కీలక మార్పులు తెస్తున్నట్లు చెప్పారు. అతిత్వరలో రానున్న ఈ నూతన చట్టాలను రాజ్యాంగ స్ఫూర్తితో అమలు చేయాల్సిన బాధ్యత యువ అధికారులపై ఉందన్నారు. బాధ్యతాయుత పోలీసింగ్ నుంచి ఒక అడుగు ముందుకేసి సానుకూల పోలీసింగ్ వైపు అడుగులు వేయాలని సూచించారు. స్థానిక భాష, ఆచార వ్యవహారాలను తెలుసుకుంటేనే యువ ఐపీఎస్‌లు సుదీర్ఘ సర్వీస్‌లో ప్రజలకు మరింత దగ్గర అవుతారని అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీలో నిర్వహించిన 75వ రెగ్యులర్ రిక్రూటీ ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన 155 మంది ఐపీఎస్‌లు, రాయల్ భూటాన్, మాల్దీవులు, మారిషస్, నేపాల్‌కు చెందిన 20 మంది విదేశీ కేడెట్ల దీక్షాంత్ పరేడ్‌కు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. యువ ఐపీఎస్‌ల నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం వారిని ఉద్దేశించి ప్రసంగించారు.

వచ్చే 25 ఏళ్లలో భారత్‌ను నంబర్ వన్‌గా నిలపాలి

'మరో 25 ఏళ్లలో భారత్ వందేళ్ల స్వాతంత్య్ర ఉత్సవాలు జరుపుకోనుంది. అప్పటికి 25 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకొని మీరు ఉన్నత స్థానాల్లో ఉండటమే కాదు.. ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాల్లో భారత్‌ను నంబర్ వన్‌గా నిలపడంలోనూ మీ శ్రమ తప్పక ఉంటుందని విశ్వసిస్తున్నా. దేశ అంతర్గత భద్రత, దేశ ప్రగతిలోనూ మీరు కీలకపాత్ర పోషించాలని ఆశిస్తున్నా' అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆకాంక్షించారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ ఆశయాలకు అనుగుణంగా గత 75 ఏళ్లలో సుశిక్షితులైన ఎందరో ఐపీఎస్‌లు దేశ భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేశారన్నారు. 75వ రెగ్యులర్ బ్యాచ్‌లోని 155 మంది ఐపీఎస్‌లలో 32 మంది మహిళా ఐపీఎస్‌లు ఉండటం మహిళా సాధికారతకు అద్దం పడుతోందని.. ఇది శుభసూచకమని అమిత్ షా చెప్పారు.

ఆరోగ్యంతోనే అన్నీ..

ఫిట్‌రైజ్ 75 ప్రారంభంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా

శారీరకంగా ఆరోగ్యంగా ఉంటేనే మానసికంగా ఉల్లాసంగా ఉంటామని, పూర్తి శక్తిసామర్థ్యాలతో పనిచేయగలుగుతామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పారు. ఫిట్‌నెస్ సాధించేందుకు తాను నిరంతరం శ్రమిస్తానని పేర్కొన్నారు. దీక్షాంత్ పరేడ్ అనంతరం ఎన్‌పీఏ ఆవరణలో ఫిట్‌రైజ్-75ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. యోగా, ధ్యానం, శారీరక శ్రమ మానసిక ధృఢత్వాన్ని, ఆలోచన శక్తిని పెంచుతుందన్నారు. ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటే దేశం ప్రగతి మార్గంలో పయనిస్తుందన్నారు.

కొత్త సవాళ్లకు సిద్ధం కావాలి..

ఇటీవల కాలంలో పెరిగిన సైబర్ నేరాలు, అంతర్గత భద్రత ముప్పు, అంతర్జాతీయ ఆర్థిక నేరాలు, హవాలా, క్రిప్టోకరెన్సీతో దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడం, డ్రగ్స్ రవాణా వంటి నూతన సవాళ్లను ఎదుర్కొనేందుకు ఐపీఎస్‌లు మరింత సిద్ధం కావాలని అమిత్ షా సూచించారు. సైబర్ నేరాల కట్టడికి పోలీసులు ఎప్పుడూ రెండు అడుగులు ముందే ఉండేలా సాంకేతికంగా పోలీసింగ్ బలోపేతం కావాలని అభిప్రాయపడ్డారు. అకాడమీ డైరెక్టర్ అమిత్ గార్గ్ మాట్లాడుతూ యువ ఐపీఎస్‌లు చట్టాన్ని నిష్పాక్షికంగా అమలు చేయడంతోపాటు మానవతా విలువలతో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేలా శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విజేతలకు ట్రోఫీలు బహూకరించారు. కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, హోం శాఖ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లా, సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్, ఐబీ డైరెక్టర్ తపన్ డేకా, రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్, హైదరాబాద్ సీపీ సందీప్ శాండిల్య ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వాహనాల ఆర్సీలకు మళ్లీ చిప్‌లు

ఏడాది తర్వాత పునరుద్ధరణ

- చిప్ లేని లైసెన్సులు, ఆర్సీ కార్డులపై చెక్‌పోస్టుల వద్ద అనుమానాలు
- తెలంగాణ వాహనదారులకు మహారాష్ట్ర అభ్యంతరాలు
- తిరిగి చిప్‌లతో స్మార్ట్ కార్డుల జారీ ప్రారంభించిన రవాణాశాఖ



సాక్షి, హైదరాబాద్: దాదాపు ఏడాది విరామం తర్వాత రాష్ట్రంలో మళ్లీ వాహనాల లైసెన్సులు, ఆర్సీ స్మార్ట్ కార్డులకు చిప్‌ల ఏర్పాటు ప్రారంభమైంది. విదేశాల నుంచి తీసుకువస్తున్న ఈ చిప్‌లకు కొరత ఏర్పడి దిగుమతి నిలిచిపోవటంతో చిప్‌లు లేకుండానే కార్డులను జారీ చేస్తూ వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా మళ్లీ చిప్, క్యూఆర్ కోడ్‌లతో కూడిన స్మార్ట్ కార్డుల జారీని రవాణాశాఖ ప్రారంభించింది. గురువారం నుంచి వాటి బట్వాడా మొదలైంది.

ఉక్రెయిన్ యుద్ధం.. తైవాన్‌లో కొరత పేరుతో..

రాష్ట్రంలో దాదాపు ఏడాది కిందట వరకు వాహనాల లైసెన్సులు, ఆర్సీ స్మార్ట్ కార్డులకు చిప్‌లను బిగించేవారు. ఆ చిప్ ముందు చిప్ రీడర్‌ను ఉంచగానే.. వాహనానికి సంబంధించిన పూర్తి సమాచారం తెలిసిపోతుంది. టెండర్ల ప్రక్రియ ద్వారా ప్రైవేటు కంపెనీకి ఈ స్మార్ట్ కార్డుల తయారీ బాధ్యత అప్పగించారు. ఆ సంస్థనే చిప్‌ల వ్యవహారం కూడా చూస్తుంది. అయితే చిప్‌లకు కొరత ఏర్పడిందన్న పేరుతో స్మార్ట్ కార్డుల తయారీ, జారీ నిలిపేశారు. ఉక్రెయిన్, తైవాన్, చైనాల నుంచి ఆ చిప్స్ దిగుమతి అవుతాయని, చైనాతో సత్సంబంధాలు లేక వాటి దిగుమతిని కేంద్రం ఆపేసిందని చెప్పుకొచ్చారు. ఉక్రెయిన్ యుద్ధం వల్ల ఆ దేశం నుంచి కూడా ఆగిపోయాయని, ఇక స్థానికంగా డిమాండ్ పెరిగి చిప్‌ల ఎగుమతిని తైవాన్ తాత్కాలికంగా నిలిపివేసిందని అధికారులు అప్పట్లో పేర్కొన్నారు. చివరకు చిప్‌లు లేకుండానే కార్డుల జారీకి అనుమతించారు.

మహారాష్ట్ర అధికారుల అభ్యంతరంతో..

ఆరు నెలల క్రితం తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులో తెలంగాణ వాహనాలను తనిఖీ చేసినప్పుడు చిప్ లేకుండా ఉన్న కార్డులపై ఆ రాష్ట్ర అధికారులు అనుమానాలు వ్యక్తం చేసినట్టు తెలిసింది. అవి అసలైనవో, నకిలీవో గుర్తించటం ఎలా అంటూ వాహనదారులను ప్రశ్నించారు. దీంతో పాటు రవాణాశాఖకు కూడా ఫిర్యాదులు పెరుగుతూ వచ్చాయి. వీటిన్నింటిని దృష్టిలో పెట్టుకుని తిరిగి చిప్‌లను ఏర్పాటు చేయాలని రవాణాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు కాంట్రాక్టు సంస్థను ఆదేశించింది. దాంతో ఆ సంస్థ చిప్‌లను సమకూర్చుకుని స్మార్ట్ కార్డుల తయారీని సిద్ధం చేసింది. గురువారం నుంచి చిప్‌లతో కూడిన స్మార్ట్ కార్డుల జారీని రవాణాశాఖ అధికారులు ప్రారంభించారు. స్మార్ట్ కార్డు ముందు వైపు చిప్ ఉంటుండగా, వెనక వైపు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో సగటున నిత్యం 3,500 లైసెన్సులు, 5,500 ఆర్సీ కార్డులు జారీ అవుతున్నాయి.

ఇప్పుడు ఆ కొరతను ఎలా అధిగమించారో?

అప్పట్లో చిప్‌లకు కొరత ఎందుకు వచ్చిందో, ఇప్పుడు చిప్‌లు ఎలా సమకూర్చుకుంటున్నారో అధికారులు స్పష్టం చేయాలని తెలంగాణ ఆటోమోటార్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దయానంద్ డిమాండ్ చేశారు.

లోకాయుక్తకు ఆ పరిధి లేదు: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం అందజేసిన పరిహారం అర్హత కలిగిన వ్యక్తులకు కాకుండా ఇతరులకు అందిందనే కారణంతో సదరు పరిహారాన్ని రికవరీ చేయాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీచేసే అధికారం లోకాయుక్తకు లేదని హైకోర్టు స్పష్టం చేసింది. పరిహారం పంపిణీలో తప్పు జరిగితే రికవరీకి ఇతర మార్గాలున్నాయని తెలియజేసింది. భూసేకరణ పరిహారం తిరిగి డిపాజిట్ చేయాలని పేర్కొంటూ సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం దాచారం గ్రామానికి చెందిన ఎస్.కనకయ్య, మల్లయ్య, భూమయ్య, నర్సయ్య తదితరులకు హుస్నాబాద్ డివిజన్ ఆర్డీవో నోటీసులు జారీచేశారు. లోకాయుక్త రికవరీ ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో నోటీసులు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నోటీసులను సవాల్ చేస్తూ వారు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రవణ్ కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. తెలంగాణ లోకాయుక్త చట్టం-1983 ప్రకారం రికవరీ చేయాలని ఆదేశాలిచ్చే అధికారం లోకాయుక్తకు లేదంటూ.. ఆ ఆదేశాలను కొట్టేస్తున్నట్లు పేర్కొంది.

డిసెంబర్ 15న విచారణకు హాజరవ్వండి

ఐఎంఎస్ స్కామ్‌లో నిందితులకు నాంపల్లి కోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఆగస్టులో దాఖలు చేసిన చార్జిషీట్‌ను విచారణ స్వీకరించిన నాంపల్లి కోర్టు డిసెంబర్ 15న విచారణకు హాజరుకావాలని బీమా వైద్య సేవలు(ఐఎంఎస్) స్కామ్‌లోని నిందితులను ఆదేశించింది. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ చట్టం(పీఎంఎల్ఏ) కింద విచారణ జరిపిన ఈడీ ఆగస్టులో చార్జిషీట్ దాఖలు చేయడం తెలిసిందే. నాటి డైరెక్టర్ దేవికారాణి, జాయింట్ డైరెక్టర్ కె.పద్మతోపాటు మరో 15 మందికి కోర్టు నోటీసులు జారీ చేసింది. గతంలో నిందితులకు చెందిన రూ.143.15 కోట్ల ఆస్తులను ఈడీ జప్తు చేసింది. వైద్యం చేయకుండానే చేసినట్లు, మందులు కొనకుండానే కొన్నట్లు చూపడంతోపాటు తక్కువ ధరకు కొనుగోలు చేసి లెక్కల్లో మాత్రం ఎక్కువ చూపడం ద్వారా కొందరు ఐఎంఎస్ అధికారులు భారీ స్కామ్‌కు పాల్పడినట్లు 2019లో ఏసీబీ కేసు నమోదు చేసింది. దాదాపు రూ.300 కోట్ల వరకు అవినీతి జరిగినట్లు అప్పట్లో ఏసీబీ నిగ్గుతేల్చింది.

బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటుకు వినతి



కృష్ణ చైతన్య

పంజగుట్ట (హైదరాబాద్): బ్రాహ్మణులకు బ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్ల నిధులు మంజూరు చేయాలని తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు జి.కృష్ణ చైతన్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పౌరోహిత్యం బ్రాహ్మణుల కులవృత్తిగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బ్రాహ్మణ పరిషత్ ప్రధాన కార్యదర్శి పి.రమణారావు, కోశాధికారి బి.ప్రశాంత్, ఉపాధ్యక్షులు శ్రీష్, శైలజలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. బ్రాహ్మణుల సమస్యలపై తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో అనేక పోరాటాలుచేస్తే.. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఏర్పాటుచేసి రూ.వంద కోట్లు మంజూరు చేశారని తెలిపారు. నిధులు ఎప్పుడు విడుదల చేశారో, ఎక్కడ ఖర్చు చేశారో ఎవరికీ తెలియదన్నారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌ను ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు.

1 నుంచి ఓయూ పీజీ తరగతులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌తో పాటు అనుబంధ, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో నవంబరు 1 నుంచి పీజీ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభం కానున్నట్లు అధికారులు తెలిపారు.

ఆన్‌లైన్‌లోకి ఇంజనీరింగ్ యాజమాన్య కోటా!

బీ-కేటగిరీ సీట్ల అడ్డగోలు అమ్మకాలకు త్వరలో ముకుతాడు

- మెరిట్ ఉన్న విద్యార్థులకే సీట్లు లభించేలా విద్యాశాఖ కసరత్తు
- ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలతో ఇటీవల కీలక భేటీ



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ యాజమాన్య కోటా సీట్ల బేరానికి చెక్ పడబోతోంది. దీనిపై నియంత్రణాధికారాన్ని ఉన్నత విద్యామండలి పరిధిలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందుకు సంబంధించి ఇటీవల విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ నేతృత్వంలో మండలి ఉన్నతాధికారులు, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాల మధ్య కీలక భేటీ జరిగింది. వచ్చే విద్యాసంవత్సరం నుంచి దీన్ని అమల్లోకి తేవాలనే యోచనలో అధికారులున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1.10 లక్షల ఇంజనీరింగ్ సీట్లలో 70 శాతం కన్వీనర్ కోటా కింద, మిగిలిన 30 శాతం సీట్లలో 15 శాతం 'బీ' కేటగిరీ కింద భర్తీ చేస్తున్నారు. మరో 15 శాతం సీట్లను ఎన్ఆర్ఐ కోటా కింద నింపుతున్నారు. నిబంధనల ప్రకారం బీ-కేటగిరీ కింద జేఈఈ ర్యాంకర్లకు ముందుగా సీటివ్వాలి. ఆ తర్వాత ఎంసెట్ ర్యాంకులను ప్రాతిపదికగా తీసుకోవాలి. ఇంకా సీట్లు ఉంటే ఇంటర్ మార్కులు ఎక్కువగా వచ్చిన వారికి సీట్లివ్వాలి. ఈ కేటగిరీ సీట్లకు ప్రభుత్వం నిర్ణయించిన వార్షిక ఫీజు వర్తిస్తుంది.

నిబంధనలకు యాజమాన్యాల తిలోదకాలు...

అయితే ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు ర్యాంకులు, మార్కుల ప్రామాణికత పాటించకుండా, ఎక్కువ డబ్బులిచ్చిన వారికే సీట్లు ఇస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఏడాది కూడా ఇలాంటి ఫిర్యాదులు 40 వరకూ వచ్చాయి. ఒక్కో సీటునూ రూ. 18 లక్షల వరకూ కాలేజీలు అమ్ముకుంటున్నాయని ఆరోపిస్తూ విద్యార్థి సంఘాలు ఆందోళనలు సైతం చేశాయి. బీ-కేటగిరీ కింద దరఖాస్తు చేశామని చెప్పుకొనే ఆధారాలు లేకపోవడంతో మండలి అధికారులూ చర్యలు తీసుకోలేకపోతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని నీట్ తరహాలో బీ-కేటగిరీ సీట్లనూ ఆన్‌లైన్ పరిధిలోకి తేవడం ద్వారా మెరిట్ ఉన్నవారికే సీట్లు వచ్చే వీలుందని భావిస్తున్నారు. అయితే ఎన్ఆర్ఐ కోటా సీట్లపై ఇంతవరకూ ఎలాంటి చర్చ జరగలేదు.

ఫీజులపైనే పేచీ...

ఇటీవల జరిగిన సమావేశంలో ప్రైవేటు కాలేజీలు ఫీజుల అంశాన్ని తెరమీదకు తెచ్చాయి. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుకన్నా మూడు రెట్లు అదనంగా వసూలు చేసుకొనేందుకు అనుమతించాలని, అప్పుడే ఆన్‌లైన్ విధానానికి అనుమతిస్తామని పట్టుబట్టాయి. ఒక కాలేజీలో కన్వీనర్ కోటా సీటు రూ. లక్ష ఉంటే బీ-కేటగిరీ సీటుకు ఏటా రూ. 3 లక్షలు చెల్లించాల్సి వస్తోంది.

ఎస్ఐసీ కొత్త డిమాండ్

ఇంజనీరింగ్ కన్వీనర్ కోటా సీట్ల భర్తీ వ్యవహారానికి సాంకేతిక నిర్వహణ నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ చూస్తుంది. దీనికోసం ఏటా రూ. 60 లక్షలు చెల్లిస్తున్నారు. ఇప్పుడు బీ-కేటగిరీ సీట్ల విషయంలో అవసరమైన సాఫ్ట్‌వేర్ రూపొందించడంపై అధికారులు ఎస్ఐసీ సహకారం కోరారు. కేవలం ఇదొక్కటే చేయలేమని, దోస్త్ ద్వారా నిర్వహించే డిగ్రీ సీట్ల భర్తీని కూడా తమ పరిధిలోకి తేవాలని ఎస్ఐసీ మండలి ముందు కొత్త డిమాండ్ పెట్టింది.

తలనొప్పి తగ్గుతుంది



యాజమాన్య కోటా సీట్ల భర్తీ ఆన్‌లైన్‌లో చేపట్టడం వల్ల కాలేజీలు సీట్లు అమ్ముకుంటున్నాయనే ఆరోపణలను దూరం చేయవచ్చు. పారదర్శకత కూడా పెరుగుతుంది. దీనిపై కాలేజీలను ఒప్పించేందుకు కృషి చేస్తున్నాం. – ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, చైర్మన్, ఉన్నత విద్యామండలి

ఎన్ఆర్ఐ కోటానూ చేర్చాలి..



ఎన్ఆర్ఐ కోటా సీట్ల భర్తీని కూడా ఆన్‌లైన్ ద్వారా చేపడితే బాగుంటుంది. మూడు రెట్లు ఫీజులుంటే సీట్లు మిగిలిపోయే అవకాశం కూడా ఉండొచ్చు. అందువల్ల దీనిపైనా స్పష్టత ఇస్తేనే ఆన్‌లైన్ విధానం సంక్రమంగా ఉంటుంది.

– ఎస్‌జీఎస్ మూర్తి, ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్

సమరయోధుల వారసత్వాన్ని కొనసాగిద్దాం

యువతకు గవర్నర్ తమిళిసై పిలుపు



ఉత్సవాల్లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గవర్నర్ తమిళిసై

సాక్షి, హైదరాబాద్: దేశానికి స్వాతంత్య్రం సముపార్జించిన సమరయోధుల వారసత్వాన్ని కొనసాగించాల్సిన బాధ్యత యువతపై ఉందని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వ్యాఖ్యానించారు. కేంద్ర యువజన సర్వీసులు, క్రీడల శాఖ, నెహ్రూ యువకేంద్ర సంఘటన్, సెంట్రల్ రిజర్వ్‌డ్ పోలీస్ ఫోర్స్ సంయుక్తంగా శుక్రవారం రాజ్‌భవన్‌లో నిర్వహించిన 'మేరీ మాటీ-మేరా దేశ్'ఉత్సవాల్లో గవర్నర్ తమిళిసై పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వాతంత్య్ర సమరయోధుల చిత్రపటాలకు నివాళులు అర్పించారు. గవర్నర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్య్రం కోసం ఎందరో యోధులు ప్రాణాలను త్యజించారని కొనియాడారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వాలంటీర్లు తీసుకువచ్చిన మట్టి నమూనాలను గవర్నర్ పరిశీలించారు. కార్యక్రమంలో సౌత్‌జోన్ సీఆర్పీఎఫ్ ఏడీజీ రవిదీప్ సింగ్ షాహి, ఐజీ చారూసిన్హా, డీఐజీపీ ఉదయ్‌భాస్కర్, ఎన్‌వైకేఎస్ రాష్ట్ర సంచాలకులు ఏఆర్ విజయ్‌రావు, కుష్బు గుప్తా పాల్గొన్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.